
సత్యమేవ జయతే

సాక్షి



'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 152

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



50వేల మెట్రిక్ టన్నుల యూరియా

త్వరలో తెలంగాణకు 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేస్తామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు.

- వివరాలు 14లో ▶



31 అర్ధరాత్రి నుంచి ఆరోగ్యశ్రీ బంద్

పది రోజుల్లో బకాయిలు చెల్లించకుంటే ఈ నెల 31 అర్ధరాత్రి నుంచి ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేయాలని 'తన్హా' నిర్ణయించింది.

- వివరాలు 8లో ▶

'కాళేశ్వరం'పై నివేదిక

ఎందుకు బయటపెట్టారు?

జస్టిస్ ఘోష్ కమిషన్ రిపోర్టుపై సర్కార్‌ను ప్రశ్నించిన హైకోర్టు

- అసెంబ్లీలో చర్చించాలని నిర్ణయించినప్పుడు మీడియా భేటీ ఎందుకు?
- మీడియాకు అధికారికంగా నివేదిక విడుదల చేశారా?
- నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటారా? అని అడిగిన ధర్మాసనం
- అధికారికంగా విడుదల చేయలేదు, అసెంబ్లీలో చర్చించలేదన్న ఏజీ
- అసెంబ్లీలో చర్చ తర్వాతే ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకుంటుందని వెల్లడి
- పూర్తి వివరాలతో కౌంటర్ వేసేందుకు సమయం కావాలని విజ్ఞప్తి
- కమిషన్ నిబంధనలు పాటించలేదన్న పిటిషనర్ల తరఫు న్యాయవాదులు
- నివేదికపై సీఎం మీడియాకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారని వెల్లడి
- పరువుకు నష్టం కలిగేలా వ్యాఖ్యలు చేస్తున్నారంటూ హైకోర్టు దృష్టికి..
- నివేదిక రద్దు చేయాలంటూ విజ్ఞప్తి.. తదుపరి విచారణ నేటికి వాయిదా

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరిపిన జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టి చర్చించాలని నిర్ణయించినప్పుడు మీడియా భేటీలో ఎందుకు బహిర్గతం



చేశారని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. అధికారికంగా నివేదికను మీడియాకు అందజేశారా?, మీరు విడుదల చేయకుంటే మీడియాకు కాపీ ఎలా వచ్చింది? అసెంబ్లీలో చర్చించారా?.. నివేదిక ఆధారంగా చర్యలు తీసుకునే ఉద్దేశం ఉందా?.. అని అడిగింది. కమిషన్ నివేదికను అధికారికంగా విడుదల చేయలేదని, అసెంబ్లీలో ఇంకా చర్చించలేదని అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి

మిగతా 2వ పేజీలో ▶

సినీ కార్మికుల
సమ్మెకు తెర

22.5% వేతనం పెంపునకు నిర్మాతలు ఓకే... నేటి నుంచి చిత్రీకరణలు షురూ

5లో





విపక్ష ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా గురువారం నామినేషన్ దాఖలు చేస్తున్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి. చిత్రంలో రాహుల్, మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, శరద్‌పవార్, ప్రియాంకాగాంధీ తదితరులు

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నామినేషన్

ఉప రాష్ట్రపతిగా ఎన్నికైతే ప్రజాస్వామ్య పరిరక్షకుడిగా పనిచేస్తానని ప్రతిజ్ఞ

2లో





చరిత్ర చెప్పకుండా.. పరువు కాపాడుతూ...

అప్పుడూ.. ఇప్పుడూ.. మనమంతా నెట్టింట్లో ముందు తట్టే తలుపు గూగుల్‌దే. అంతలా అన్నింట్లోనూ తనదైన ముద్ర వేస్తోంది. ఎప్పటికప్పుడు సరికొత్త ఫీచర్లను పరిచయం చేస్తోంది. ఈ నేపథ్యంలో కొత్తగా మరికొన్ని ఫీచర్లను పరిచయం చేసింది.

- సాక్షి, స్పెషల్ డెస్క్



సరికొత్త ఫీచర్లను పరిచయం చేసిన గూగుల్

- న్యూడ్ కంటెంట్ వస్తే చాలు, 'బ్లర్' చేసేస్తుంది
- మీ జెమినీ చాటింగ్‌ని ఎవ్వరూ చూడలేరు
- టూర్ బెస్ట్ డీల్స్ కోసం వినూత్న ఏఐ టూల్

ఆ మెసేజెస్ 'బ్లర్'!

వాట్సాప్‌లో లేని సేఫ్టీ ఫీచర్ గూగుల్ మెసేజుల్లో ఒకటుంది. తరచూ వాట్సాప్ లేదా మరేదైనా మెసేజింగ్ యాప్‌లలో తెలియని నంబర్ నుంచి మెసేజులు, ఫొటోలు, వీడియోలు వస్తుంటాయ్. వాటిలో అశ్లీల చిత్రాలు, వీడియోలు ఉండొచ్చు. అనుకోకుండా వాటిని ఓపెన్ చేసి షాక్ అవుతాం. చుట్టుపక్కల ఎవరైనా ఉంటే.. పరువు పోయినట్టే! అలాంటి ఇబ్బందులు రాకుండా.. అద్భుతమైన ఫీచర్‌ను 'గూగుల్ మెసేజెస్' తీసుకొచ్చింది. అదే ఆటోమేటిక్ 'బ్లర్' ఫీచర్. ఇది 'న్యూడ్' మెసేజ్‌లను ఓపెన్ చేస్తే ఆటోమేటిగ్గా బ్లర్ చేస్తుంది. సెండర్‌ని కూడా వెంటనే బ్లాక్ చేస్తుంది. కావాలంటే.. అశ్లీల చిత్రాలు కనిపించకుండా చేసి, సంభాషణ కొనసాగించొచ్చు. అంతేకాదు.. మీరు పొరపాటున అశ్లీలమైన కంటెంట్‌ను పంపితే అలర్ట్ చేస్తుంది. ఇంట్లో పిల్లలు కూడా ఫోన్లు వాడుతున్న నేపథ్యంలో ఈ ఫీచర్ చాలా ఉపయోగపడుతుంది. మైనర్లు వాడే ఫోన్లలో ఇది ఆన్ చేసి ఉంటుంది. అయితే, వాళ్లు దాన్ని ఆఫ్ చేసేందుకు వీలుంది. అందుకే పేరెంటల్ కంట్రోల్స్ పెట్టాలి. అప్పుడు తల్లిదండ్రుల పర్మిషన్ లేకుండా దాన్ని ఆఫ్ చేయడం కుదరదు. అందుకు ఫ్యామిలీ లింక్ యాప్ ని వాడొచ్చు. దీన్ని మీ ఫోన్లో ఎనేబుల్ చేసేందుకు గూగుల్ మెసేజెస్ యాప్ ని ఓపెన్ చేయండి. ఈ పాత్ ని ఫాలో అవ్వండి.
Messages Settings > Protection & Safety > Manage sensitive content warnings > Warnings in Google Messages.

'జెమినై'లో ప్రైవసీ అప్‌డేట్

ఏఐ పోటీ రోజురోజుకీ పెరుగుతోంది. ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్స్ వచ్చేస్తున్నాయి. ఈ క్రమంలో చాట్‌జీపీటీ కంటే ముందే గూగుల్ జెమినై.. ఇన్‌కాగ్నిటో మోడ్ పరిచయం చేసింది. ఏఐ యూజర్ల ప్రైవసీకి ఇదో చక్కని పరిష్కారం. ఇకపై జెమినితో చేసే చాటింగ్, వ్యక్తిగత సమాచారం ఎవరి కంటా పడవు. ఎందుకంటే.. గూగుల్ కొత్త 'టెంపరరీ చాట్స్' ఫీచర్‌తో ముందుకొచ్చింది. ఇది మనం బ్రౌజింగ్‌లో వాడే ఇన్‌కాగ్నిటో మోడ్‌లా పని చేస్తుంది. దీన్ని వాడుకుని జెమినితో మనం చేసే సంభాషణలు సేవ్ కాకుండా చూడొచ్చు. మీ కమాండ్ ప్రాంప్ట్‌ని ఇకపై ఎవరూ కాపీ కొట్టలేరు. ఏఐ వాడకంలో ప్రైవసీని కోరుకునే వారికి ఇదో చక్కని ఫీచర్. ఇంకా చెప్పాలంటే.. 'గూగుల్ కీప్' సర్వీసులో ఫొటోలు,వీడియోలను జెమిని మీ అనుమతితోనే యాక్సెస్ చేసేలా చేయొచ్చు. ఒకవేళ 'కీప్' డేటా యాక్సెస్ ఇవ్వాలంటే ఎప్పుడైనా ఎనేబుల్ చేసుకోవచ్చు. అలాగే, జెమినై లైవ్ సర్వీసులోనూ ప్రైవసీని కట్టుదిట్టంగా అమలు చేస్తోంది. ఈ సర్వీసుని వాడే క్రమంలో మీ ప్రమేయం లేకుండా చూపించే ఆడియో, వీడియో సేకరించకుండా చేయొచ్చు.

టూర్ ప్లాన్ చెప్తే చాలు..

ఏ పని చేయాలన్నా ప్లానింగ్ అవసరం. పర్యటనల విషయంలో మరీనూ. ఈ విమాన ప్రయాణం కోసం సరైన ఫ్లైట్లు వెతకడం పెద్ద తలనొప్పి. ఏ వెబ్‌సైట్‌లో వెతకాలి? ఏ యాప్‌లో చూస్తే తక్కువ ధరకి టికెట్లు బుక్ చేసుకోవచ్చు? ఏమేం బెటర్ ఆఫర్లు ఉన్నాయి? ఇలాంటి ప్రశ్నలతోనే గూగుల్ సెర్చ్ హిస్టరీ మొత్తం నిండిపోతుంది. ఇకపై అంత కష్టపడక్కర్లేదు. ఇందు కోసం గూగుల్ ఒక సూపర్ టూల్‌తో ముందుకొచ్చింది. అదే "Google Flights'లోని కొత్త ఏఐ టూల్. ఇది మనతో మాట్లాడుతుంది. మీరు చేయాల్సిందల్లా ట్రిప్ గురించి ఏఐకి చెప్పాలంతే. 'పదిరోజులు కేరళ ట్రిప్‌కి వెళ్లాలి. మంచి రిసార్టులో ఉండాలి. కాస్త బడ్జెట్‌లో ట్రిప్‌ని ప్లాన్ చేయమని అడిగితే చాలు. టూల్ అన్ని ఎయిర్ లైన్స్‌నీ వెతుకుతుంది. బుకింగ్ వెబ్‌సైట్లలోని డేటాని క్షణాల్లో జల్లెడ పడుతుంది. అలాగే, ఉండేందుకు తగిన హోటళ్లను కూడా సూచిస్తుంది. బడ్జెట్ ప్లానింగ్‌కి తగిన బెస్ట్ డీల్స్ చూపిస్తుంది. ప్రస్తుతానికి ఇది బీటా వెర్షన్‌గా అందుబాటులో ఉంది. గూగుల్ ఫ్లైట్స్ వెబ్‌సైట్ https://www.google.com/travel/flights లేదా యాప్ ద్వారా ఈ సేవలు పొందొచ్చు.

చంద్రబాబు కృతజ్ఞత చాటుకోవాలి

- ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఊహించని ఫలితాలుంటాయి
- తెలుగు ఎంపీలంతా జస్టిస్ సుదర్శన్ రెడ్డికే మద్దతు ఇవ్వాలి
- తెలంగాణ ఎంపీల ఫోరమ్ కన్వీనర్ మల్లు రవి



సాక్షి, న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థి బి.సుదర్శన్‌రెడ్డిపట్ల ఏపీ సీఎం చంద్రబాబు కృతజ్ఞత చూపించాల్సిన సమయం వచ్చిందని తెలంగాణ ఎంపీల ఫోరం కన్వీనర్, కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. త్వరలో జరగబోయే ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఊహించని ఫలితాలు ఉంటాయని పేర్కొన్నారు. గురువారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మల్లు రవి విలేకరులతో మాట్లాడారు. 'ఎన్టీఆర్–చంద్రబాబు మధ్య పార్టీ గుర్తు కోసం కేసు నడిచిన సమయంలో సుదర్శన్ రెడ్డి సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా ఉన్నారు. ఆయన ఇచ్చిన తీర్పువల్లే చంద్రబాబు సీఎం అయ్యారు. ఇప్పుడు చంద్రబాబు కృతజ్ఞత చాటుకోవాల్సిన సమయం వచ్చింది. తెలుగు రాష్ట్రాల ఎంపీలు సుదర్శన్‌రెడ్డి విజయం కోసం కృషిచేయాలి. ఆయనకు మద్దతు ఇవ్వాలి' అని అన్నారు. ఈ ఎన్నికల్లో విప్ ఉండదు కాబట్టి ఎంపీలు స్వేచ్ఛగా ఓటు వేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ఎంపీలు సుదర్శన్ రెడ్డి గెలుపు కోసం వినియోగించుకుంటారని ఆశిస్తున్నామన్నారు. పార్లమెంట్‌ను నిర్వహించడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు.

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నామినేషన్

- హాజరైన రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ తదితరులు
- తన అభ్యర్థిత్వం విశాల ప్రజాస్వామ్య దృక్పథాన్ని సూచిస్తుందన్న సుదర్శన్‌రెడ్డి
- ఉప రాష్ట్రపతిగా ఎన్నికైతే ప్రజాస్వామ్య పరిరక్షకుడిగా పనిచేస్తానని ప్రతిజ్ఞ



ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్‌ను కలిసి మద్దతు కోరిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో విపక్ష ఇండియా కూటమి అభ్యర్థిగా, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేత, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, పార్టీ నేత ప్రియాంకా గాంధీల సమక్షంలో నామినేషన్ పత్రాలను రాజ్యసభ సెక్రెటరీ జనరల్, రిటర్నింగ్ అధికారి పీసీ మోదీకి అందజేశారు. శరద్‌పవార్ (ఎన్సీపీ (ఎస్పీ), రామ్‌గోపాల్ యాదవ్(ఎస్పీ), తిరుచ్చి శివ(డీఎంకే), సంజయ్ రౌత్ (శివసేన (యూబీటీ)తో పాటు కూటమికి చెందిన పలువురు నాయకులు హాజరయ్యారు. సుమారు 160 మంది ఎంపీలు నామినేషన్ పత్రాలపై సంతకాలు చేసినట్లు సమాచారం.

ఇవి ఒక వ్యక్తి గురించిన ఎన్నికలు కాదు..

నామినేషన్ దాఖలు సందర్భంగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. 'అత్యంత వినయభావం, బాధ్యతతో, రాజ్యాంగంలో పొందుపరిచిన విలువల పట్ల అచంచలమైన నిబద్ధతతో నామినేషన్ దాఖలు చేశా. భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా, న్యాయ విద్యార్థిగా, గణతంత్ర ప్రజాస్వామ్య సంప్రదాయాలతో పాతుకుపోయిన పౌరుడిగా నా ప్రజా జీవితం సాగిపోయింది. దేశం నిజమైన బలం ప్రతి వ్యక్తి గౌరవం, రాజ్యాంగ నైతిక రక్షణ, భిన్నత్వంలో ఏకత్వంపై ఆధారపడి ఉందని నేను విశ్వసిస్తున్నా. ఈ ఎన్నికలు కేవలం ఒక వ్యక్తి గురించి కాదు. నా అభ్యర్థిత్వం విశాల ప్రజాస్వామ్య దృక్పథాన్ని సూచించింది. దేశ నిర్మాతలు ఊహించిన భారతదేశం ఆలోచనలను పునరుద్ధాటించడంతో పాటు సమగ్రతతో పనిచేసే పార్లమెంటు, అసమ్మతిని గౌరవించే, న్యాయంగా ప్రజలకు సేవ చేసే దేశం కోసం మాత్రమే ఈ ఎన్నికలు. నేను ఈ పదవికి ఎన్నికైతే రాజ్యసభ చైర్మన్‌గా పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అత్యున్నత సంప్రదాయాలను పరిరక్షించే బాధ్యతను నిర్వర్తిస్తాను. ఉప రాష్ట్రపతిగా ఎన్నికైతే ఆ పాత్రను నిష్పాక్షికంగా, గౌరవంగా, స్థిరమైన నిబద్ధతతో నిర్వర్తిస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నా..' అని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఆ ప్రకటనలో పేర్కొన్నారు. తనను బలపరిచిన కూటమి సభ్యులకు, ప్రజలకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. 'నాపై నమ్మకం ఉంచినందుకు ప్రతిపక్ష నాయకులకు, న్యాయం, సమానత్వం, సామరస్యాన్ని ప్రేరేపిస్తున్న అనంత ప్రజానీకానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. మన రాజ్యాంగంపై నమ్మకంతో, ప్రజలపై ఆశతో ఈ ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నా. మన ప్రజాస్వామ్య స్ఫూర్తి ప్రజలందరికీ మార్గనిర్దేశం చేస్తూనే ఉండాలని కోరుకుంటున్నా..' అని పేర్కొన్నారు.

ఆయన అవసరం చాలా ఉంది: ఖర్గే

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో ఇండియా బ్లాక్ సభ్యులను ఉద్దేశించి మల్లికార్జున ఖర్గే మాట్లాడారు. ఇండియా కూటమి అభ్యర్థిగా సుదర్శన్‌రెడ్డి నామినేషన్.. ప్రజాస్వామ్య విలువలపై ప్రతిపక్షాల నిబద్ధతను ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. 'పార్లమెంటులో ప్రతిపక్షాల గొంతులను అణచివేసే ధోరణి పెరుగుతోంది. సభలో కీలకమైన ప్రజా సమస్యల గురించి ప్రస్తావించే అవకాశాన్ని నిరాకరించే ధోరణి ఎక్కువవుతోంది. పార్లమెంటులో ఈ తరహా అతిక్రమణలను ప్రతిఘటించడానికి, నిర్ణయాత్మకంగా వ్యవహరించడానికి, ఆదర్శప్రాయమైన, నిష్పాక్షిక న్యాయమూర్తి అయిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అవసరం ఎంతైనా ఉంది. ఆయన నామినేషన్ భారతదేశాన్ని నిర్వచించే ప్రజాస్వామ్య ఆదర్శాలను రక్షించడానికి, వాటిని నిలబెట్టడానికి మన సమష్టి సంకల్పాన్ని సూచిస్తుంది..' అని ఖర్గే చెప్పారు.

జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ఆప్ మద్దతు: కేజ్రీవాల్

ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్‌తో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి భేటీ అయ్యారు. నామినేషన్ దాఖలు అనంతరం కేజ్రీవాల్ నివాసానికి వెళ్లి ఆయనతో సమావేశమయ్యారు. ఉప రాష్ట్రపతి పదవికి ఇండియా కూటమి తరఫున పోటీ చేస్తున్న సుప్రీం మాజీ న్యాయమూర్తికి తమ పార్టీ మద్దతు ఇస్తుందని ఈ సందర్భంగా కేజ్రీవాల్ చెప్పారు. సుదర్శన్‌రెడ్డిని స్ఫూర్తిదాయకమైన వ్యక్తిగా అభివర్ణించిన కేజ్రీవాల్..నిష్పాక్షికతతో కూడిన ఆయన రికార్డు రాజ్యాంగబద్ధమైన ఉన్నత పదవికి సరితూగుతుందని పేర్కొన్నారు.

రాష్ట్రానికి మరిన్ని నిధులు ఇవ్వండి

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు పీఆర్ మంత్రి సీతక్క విజ్ఞప్తి



వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి సీతక్క. చిత్రంలో పీఆర్ ముఖ్య కార్యదర్శి శ్రీధర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో చేపడుతున్న గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలకు మరిన్ని నిధులు మంజూరు చేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో వివిధ పథకాల అమలు సజావుగా సాగుతున్నందున కేంద్రం నుంచి మరింత సహకారం అవసరమని ఆమె కోరారు. మంత్రి సీతక్క విజ్ఞప్తిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. వచ్చేనెల 4, 5 తేదీల్లో రాజస్తాన్‌లోని ఉదయపూర్‌లో జరగనున్న గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రుల 'చింతన్ శివిర్'లో పాల్గొని రాష్ట్ర అవసరా లపై ప్రజెంటేషన్ ఇవ్వాలని చౌహాన్ సూచించారు. తెలంగాణలో అమల వుతున్న వినూత్న పథకాలను గురించి ఆ వేదికపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించాలని చెప్పారు. అదేవిధంగా గ్రామీణ మహిళల ఆర్థిక బలోపేతానికి కేంద్రం నుంచి పూర్తిస్థాయి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. గురువారం కేంద్ర మంత్రి ఢిల్లీ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర సచివాలయం నుంచి మంత్రి సీతక్క, పీఆర్ ముఖ్యకార్యదర్శి ఎన్.శ్రీధర్, పీఆర్‌ఆర్‌డీ డైరెక్టర్ జి.సృజన పాల్గొన్నారు.

రహదారుల విస్తరణకు రూ.6,622 కోట్లు

లోక్‌సభలో బీజేపీ ఎంపీ డీకే అరుణ ప్రశ్నకు కేంద్రం వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం భారీ నిధులు కేటాయించింది. ఖమ్మం, మహబూబాబాద్, ఎన్టీఆర్ జిల్లాలు, అలాగే కరీంనగర్–హన్మకొండ మార్గాల విస్తరణకు కలిపి రూ.6,622.19 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి తోఖన్ సాహూ లోక్‌సభలో బీజేపీ ఎంపీ డీకే అరుణ అడిగిన ప్రశ్నకు ఇచ్చిన సమాధానంలో వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం తెలిపిన వివరాల ప్రకారం, నాగ్‌పూర్–విజయవాడ కారిడార్‌లో భాగంగా ఖమ్మం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ హైవే విస్తరణ, మహబూబాబాద్–ఖమ్మం మార్గం నాలుగు లేన్లుగా అభివృద్ధి, కరీంనగర్–వరంగల్ విభాగం విస్తరణ వంటి ఐదు ప్రధాన ప్రాజెక్టులు ఆమోదం పొందాయి. మొత్తం 188 కిలోమీటర్ల రహదారుల అభివృద్ధికి రూ.6,622.19 కోట్లు కేటాయించారని మంత్రి వివరించారు.


పెద్దపల్లిలో ఇర్రాడియేషన్ సౌకర్యం..

పెద్దపల్లి జిల్లాలో పండ్లు, కూరగాయలు, పాలు, గుడ్ల వంటి వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత, నిల్వకాలం పెంచేందుకు ఇర్రాడియేషన్ సౌకర్యం ఏర్పాటుపై కేంద్రం స్పందించింది. గురువారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ వంశీ కృష్ణ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ కేంద్ర ఆహార ప్రాసెసింగ్ మంత్రిత్వశాఖ సహాయ మంత్రి రవనీత్ సింగ్ వివరాలు వెల్లడించారు. ప్రధాన మంత్రి కిసాన్ సంపద యోజనలో భాగంగా ఉన్న కోల్డ్ చైన్ స్కీమ్ కిందే ఇలాంటి సౌకర్యాలకు ఆర్థిక సహాయం అందిస్తామని కేంద్ర మంత్రి తెలిపారు. ఈ పథకం డిమాండ్ ఆధారితంగా నడుస్తుండటంతో రాష్ట్రం లేదా జిల్లా వారీగా ప్రత్యేక నిధుల కేటాయింపు లేదన్నారు. కేంద్రం స్వయంగా కోల్డ్ స్టోరేజీలు లేదా రిఫ్రిజిరేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ సదుపాయాలు ఏర్పాటు చేయదని, అయితే కోల్డ్ చైన్ ప్రాజెక్టుల్లో భాగంగా ఉంటే వాటికి కూడా సబ్సిడీ లభిస్తుందని మంత్రి తెలిపారు.

ప్రజల వెన్ను విరిచే కొత్త మద్యం పాలసీ: ప్రభాకర్

సాక్షి, హైదరాబాద్: కొత్త మద్యం విధానం ప్రజల వెన్ను విరిచే నిర్ణయంగా ఉందని బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ తీరు చూస్తుంటే 'ఇంటికి బీరు–ఊరికో బార్' విధానంగా ఉందని విమర్శించారు. ప్రభుత్వ ఖజానాను నింపుకోవడానికి ప్రజల ప్రాణాలను పణంగా పెడతారా? అని ప్రశ్నించారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. 2014లో రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో మద్యం ఆదాయం రూ.10 వేల కోట్లుగా ఉందన్నారు. దాన్ని 2024 బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.40 వేల కోట్ల వరకు చూపించడమే కాకుండా.. లక్ష్య సాధనలో పురోగతి సాధించామని గొప్పగా చెబుతోందన్నారు. రాబోయే రోజుల్లో మద్యం నియంత్రణకు బీజేపీ పెద్ద ఉద్యమం ప్రారంభించబోతోందని ప్రభాకర్ వెల్లడించారు.

నిలకడగా గోదారి వరద



భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం ఇలా..

భద్రాచలం వద్ద 51.90 అడుగులకు చేరిన నీటిమట్టం

- వారం తర్వాత మళ్లీ వరద పెరిగే అవకాశం!
- కృష్ణాకు కొనసాగుతున్న వరద... శ్రీశైలం 10 గేట్లు, సాగర్ 26 గేట్ల ద్వారా నీటి విడుదల

భద్రాచలంఅర్బన్/అచ్చంపేట/నాగార్జునసాగర్: భద్రాచలం వద్ద గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. బుధవారం ఒక్కరోజే మొదటి, రెండో ప్రమాద హెచ్చరికలు జారీ కాగా, ఆ తర్వాత కూడా నెమ్మదిగా పెరిగింది. గురువారం తెల్లవారుజామున 5 గంటలకు 50 అడుగులు ఉండగా, సాయంత్రం 4 గంటల వరకు 51.90 అడుగులకు చేరింది. అప్పటి నుంచి నిలకడగా ఉండడంతో ప్రజలు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, సబ్‌కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ పరిస్థితిని పరిశీలించారు. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు వరద నెమ్మదిగా, ఉదయం 9గంటల తర్వాత వేగంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అయితే ఇటీవల మహారాష్ట్రలో వర్షాలు కురవగా.. అక్కడి నుంచి ప్రవాహం భద్రాచలం వద్ద గోదావరిలోకి చేరేందుకు వారం పడుతుందని, అప్పుడు మళ్లీ వరద వచ్చే ప్రమాదం ఉందని తెలుస్తోంది. కాగా, రెండు రోజులలో వచ్చిన వరదలతో భద్రాచలం రెవెన్యూ డివిజన్‌లో సుమారు మూడు వేల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. పలు మార్గాల్లో రహదారులపైకి నీరు చేరడంతో రాకపోకలు స్తంభించాయి.

- గురువారం ఉదయం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు మూసివేసిన అధికారులు రాత్రి గోదావరికి వరద పెరగడంతో మళ్లీ 24 గేట్లను ఎత్తి నీటిని విడుదల చేశారు.
- గురువారం రాత్రి 7 గంటల సమయంలో శ్రీశైలం ప్రాజెక్టుకు 5,21,601 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా.. ప్రాజెక్టు 10 క్రస్ట్ గేట్లు 18 అడుగుల మేర ఎత్తి 4,20,370 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ వద్ద 8 క్రస్ట్‌గేట్లు 13 అడుగులు, 18 గేట్లు 10 అడుగులు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తంగా 4,13,945 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణానదిలోకి వెళుతోంది.

గోదావరి జలాల్లో 'డ్యుటీరియం' వెలికితీత

- తెలంగాణలో కొనసాగుతున్న కీలక పరిశోధన
- కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి ప్రశ్నకు కేంద్రం సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: గోదావరి నదీ జలాలో లభ్యమయ్యే డ్యుటీరియం(హైడ్రోజన్ స్థిర ఐసోటోప్) వెలికితీత, వినియోగంపై ప్రభుత్వం అధ్యయనం చేపట్టిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. భవిష్యత్తులో ఫ్యూజన్ ఎనర్జీ పరిశోధనలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని గురువారం రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ రేణుకాచౌదరి అడిగిన ప్రశ్నకు కేంద్ర శాస్త్ర, సాంకేతిక, భూ విజ్ఞాన శాస్త్రాల సహాయ మంత్రి డా. జితేంద్ర సింగ్ ఇచ్చిన సమాధానంలో తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరులో గోదావరి నదీ జలాల నుంచి డ్యుటీరియంను వెలికితీసేందుకు హెచ్2ఎస్–హెచ్2ఓ బైథర్మల్ కెమికల్ ఎక్స్చేంజ్ టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు కేంద్రమంత్రి తెలిపారు.

భవిష్యత్తు పరిశోధనలకు వినియోగం..

గోదావరి జలాల్లో డ్యుటీరియం లభ్యతపై ప్రభుత్వ సంస్థలు, పరిశోధనా సంస్థలు అధ్యయనాలు నిర్వహించాయని, అయితే ఫ్యూజన్ ఎనర్జీ కోసం దీనిని వినియోగించేందుకు ప్రస్తుతానికి ఎటువంటి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టలేదని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. అయినప్పటికీ, దేశంలో అణుశక్తి ప్రయోజనాల కోసం సహజ జలాల నుంచి డ్యుటీరియంను వెలికితీసే ప్రక్రియను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణలోని గోదావరి నది ప్రాంతం దేశ అణుశక్తి పరిశోధనల్లో ఒక కీలక పాత్ర పోషిస్తోందని... మణుగూరులోని హెవీ వాటర్ ప్లాంట్ ఈ దిశగా చేపడుతున్న కార్యకలాపాలు రాష్ట్రానికి ఒక ప్రత్యేక గుర్తింపును తీసుకొస్తున్నాయని కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు.



యుద్ధాల విషయంలో స్వర్గప్రాప్తి ఏమోగానీ సుంకాలు వేసినందుకు మాత్రం కచ్చితంగా నరకానికే పోతారేమోననిపిస్తుంది సార్!

'కాళేశ్వరం'పై నివేదిక ఎందుకు బయటపెట్టారు?

▶ మొదటి పేజీ తరువాయి

బదులిచ్చారు. ప్రధాన న్యాయమూర్తి అడిగిన వివరాలతో పూర్తిస్థాయి కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం కావాలని కోరారు. దీంతో ధర్మాసనం తదుపరి విచారణ శుక్రవారానికి వాయిదా వేసింది. జస్టిస్ ఘోష్ నివేదికను రద్దు చేయాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు, మాజీ నీటిపారుదల శాఖా మంత్రి హరీశ్‌రావు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. నివేదికపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా, అమలు చేయకుండా ఉత్తర్వులు జారీ చేయాలని వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సుప్రీంకోర్టు న్యాయవాదులు ఆర్యమ సుందరం, దామ శేషాద్రినాయుడు, ప్రభుత్వం తరఫున ఏజీ, కమిషన్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు.

రాజకీయ కక్షతో కమిషన్ ఏర్పాటు

కేసీఆర్, హరీశ్‌రావు తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. 'మేడిగడ్డ బరాజ్‌కు సంబంధించిన ప్రతిదీ కేబినెట్, ఇంజనీర్ల సూచనలు, ఆమోదంతోనే జరిగింది. దురదృష్టవశాత్తు అసాధారణ వర్షాలతో ఓ పిల్లర్ కుంగింది. దీనికి డిజైనింగ్, ఇంజనీరింగ్‌తో ఎలాంటి సంబంధం లేదు. అయినా ప్రభుత్వం రాజకీయ కక్షతో జస్టిస్ ఘోష్ కమిషన్ ఏర్పాటు చేసింది. కమిషన్ చట్ట నిబంధనలు పాటించలేదు. చట్టంలోని నిబంధనలనే కాకుండా, చట్టబద్ధతను, ప్రాథమిక సూత్రాలను ఉల్లంఘించింది. మమ్మల్ని ముద్దాయిలుగా చిత్రీకరిస్తూ, నివేదిక కాపీ ఇవ్వాలని కోరినా ఇప్పటివరకు ఇవ్వకుండా.. పదేపదే మీడియా ముందు మా ప్రతిష్టను దిగజార్చేలా మంత్రులు ఆరోపణలు చేస్తున్నారు. ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం. నివేదికకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దానిపై అసెంబ్లీలో చర్చించాలని తీర్మానించారు. అసెంబ్లీలో చర్చించకుండానే ప్రభుత్వం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో నివేదికలోని వివరాలు మీడియాకు తెలియజేసింది. సాక్షాత్తూ ముఖ్యమంత్రే మీడియా సమావేశంలో నివేదికను బహిర్గతం చేశారు. నివేదికపై త్రిసభ్య కమిటీ ఇచ్చిన సారాంశాన్ని వందలాది అధికారిక, అనధికారిక వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేశారు.

దురుద్దేశంతో వ్యవహరిస్తున్నారు

సీఎం, మంత్రులు పదే పదే ప్రెస్‌మీట్లలో బీఆర్ఎస్ పార్టీ, పిటిషనర్ల పరువుకు నష్టం కలిగించేలా వ్యాఖ్యలు చేశారు. పబ్లిసిటీ కోసం పాకులాడుతూ దురుద్దేశంతో వ్యవహరిస్తున్నారు. ప్రజల్లో అప్రతిష్టపాలు చేసేందుకు, రాజకీయంగా దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారు. పిటిషనర్లకు నోటీసులు సైతం సరైన విధానంలో ఇవ్వలేదు. చట్టంలోని సెక్షన్ 8బీ, 8సీ కింద సమన్లు జారీ చేయలేదు. కేవలం సాక్షిగానే నోటీసులిచ్చారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం సాక్షులు ఇచ్చిన వివరాలపై క్రాస్ ఎగ్జామినేషన్ చేయాలనుకుంటే 8బీ, 8సీ కింద నోటీసులు ఇవ్వాలి. నివేదికపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా కోర్టు ఉత్తర్వులు జారీ చేయాలి. ముందస్తు ప్రణాళిక ప్రకారం మా ప్రతిష్టను దెబ్బతీసేలా పక్షపాతంతో, చట్టవిరుద్ధంగా సమర్పించిన నివేదికను రద్దు చేయాలి..' అని కోరారు. ఈ సందర్భంగా కిరణ్‌బేడీ, ఎల్‌కే అద్వానీపై కమిషన్లను కొట్టివేసిన కేసులకు సంబంధించిన వివరాలు ధర్మాసనానికి అందజేశారు.

ఇద్దరూ శాసనసభ్యులే.. అందుకే అసెంబ్లీలో చర్చ

ప్రభుత్వం, కమిషన్ తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. 'నివేదికపై అసెంబ్లీలో చర్చించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది. నివేదిక నేరుగా అసెంబ్లీలో బహిర్గతం చేస్తాం. పిటిషనర్లు ఇద్దరూ ఎమ్మెల్యేలు. ప్రజాప్రయోజనంతో ముడిపడి ఉన్నందున ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. వేల కోట్ల రూపాయల ప్రజాధనం వెచ్చించి ప్రాజెక్టు నిర్మించారు' అని చెప్పారు. ఈ సందర్భంగా సీజే జోక్యం చేసుకున్నారు. అసెంబ్లీలో చర్చించాలని భావించినప్పుడు నివేదికను మీడియాకు ఎందుకు విడుదల చేశారని ఏజీని ప్రశ్నించారు. 'నివేదిక ప్రతిని పబ్లిక్ డొమైన్‌లో పెట్టారా?, పిటిషనర్లకు 8బీ కింద నోటీసులిచ్చారా? నివేదిక ప్రస్తుత స్థితి ఏంటీ? అసెంబ్లీలో ప్రవేశపెట్టారా?' అని అడిగారు.

మీడియాకు ఇవ్వలేదు.. పబ్లిక్ డొమైన్‌లో పెట్టలేదు

మీడియాకు ఎలాంటి నివేదిక ఇవ్వలేదని, పబ్లిక్ డొమైన్‌లోనూ పెట్టలేదని ఏజీ బదులిచ్చారు. నివేదికకు కేబినెట్ ఆమోదం తర్వాత రూపొందించిన 60 పేజీల త్రిసభ్య కమిటీ నివేదికలోని వివరాలను మీడియాకు ఇచ్చామని చెప్పారు. 8బీ కిందే పిటిషనర్లకు నోటీసులిచ్చామని తెలిపారు. అసెంబ్లీలో పూర్తి స్థాయిలో చర్చ జరిగిన తర్వాతే ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. కిరణ్‌బేడీ, ఎల్‌కే అద్వాణీ కేసు తీర్పులు ఇక్కడ వర్తించవన్నారు. కాగా, తనకు సమర్పించిన నివేదిక ప్రతి సరిగా కనిపించడం లేదంటూ కొన్ని పాయింట్లు హైలైట్ చేసి ఉండటంపై సీజే అభ్యంతరం తెలిపారు. విచారణను నిలిపివేద్దాం అని అన్నారు. పిటిషనర్ల తరఫు న్యాయవాదుల విజ్ఞప్తితో విచారణ కొనసాగించారు. వివరాలు స్పష్టంగా ఉన్న కాపీ ఇవ్వాలని వారికి సూచించారు. ప్రభుత్వం నిర్ణయాన్ని తెలుసుకుని చెప్పాలని ఏజీకి సూచిస్తూ తదుపరి విచారణను వాయిదా వేశారు.

ఇంజనీరింగ్ ఫీజులు.. మళ్లీ మొదటికి

ఆడిట్ నివేదికలు.. కాలేజీ డాక్యుమెంట్లు పునఃపరిశీలించాలని ఉత్తర్వులు

నాణ్యతా ప్రమాణాల్లో పురోగతి ఆధారంగా ఫీజుల పెంపు

ప్రభుత్వ ఉత్తర్వుల నేపథ్యంలో తాజా షెడ్యూల్ విడుదల చేసిన ఎఫ్ఆర్సీ

కాలేజీలతో మరోసారి కసరత్తు చేయాలని ఎఫ్ఆర్సీకి ప్రభుత్వం సూచన

ఇంజనీరింగ్ ఫీజుల వ్యవహారం మళ్లీ మొదటికొచ్చింది. ఫీజులపై మరోసారి కసరత్తు చేయాలని రాష్ట్ర ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ కమిటీ (టీజీఎఫ్ఆర్సీ)కి ప్రభుత్వం సూచించింది. విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం నియమించిన ప్రత్యేక కమిటీ సిఫార్సులను ఉత్తర్వులో పేర్కొన్నారు. రాష్ట్రంలోని 160 కాలేజీలతో ఎఫ్ఆర్సీ తిరిగి సంప్రదింపులు జరపాలని ప్రభుత్వం సూచించింది. కాలేజీలు గతంలో సమర్పించిన పత్రాలు, ఖాతా పుస్తకాలను మళ్లీ పరిశీలించాలని పేర్కొంది. ఎఫ్ఆర్సీకి సమర్పించే వివరాలన్నీ నిజమైనవేనని కాలేజీల నుంచి నోటరీ అఫిడవిట్ తీసుకోవాలని.. ఒకవేళ ఏ విషయమైనా నిజం కాదని తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని జీవోలో ఆదేశించింది. ఫీజుల నిర్ధారణలో ఎఫ్ఆర్సీకి పూర్తి స్వేచ్ఛ ఉందని.. కాలేజీ నాణ్యతను నిర్ణయించి ఫీజులు ఖరారు చేసే అధికారం ఇస్తున్నట్లు జీవోలో ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ దిశగా కొన్ని మార్గదర్శకాలను పొందుపరిచింది. కాగా, ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడగానే టీజీఎఫ్ఆర్సీ సమావేశమై 2025–2028 బ్లాక్ పీరియడ్‌కు ఫీజుల ఖరారు మార్గదర్శకాలపై చర్చించింది. అనంతరం కాలేజీలతో సంప్రదింపులు, పత్రాల పరిశీలనకు షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ ప్రక్రియ ఈ నెల 25 నుంచి మొదలై సెప్టెంబర్ 3తో ముగియనుంది.

సాక్షి, హైదరాబాద్

ఫీజుల పెంపునకు ఇవే ప్రామాణికం



- ఫీజుల నిర్ధారణకు ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి నేతృత్వంలోని కమిటీ కొన్ని సూచనలు చేసింది. వాటిని పరిగణలోనికి తీసుకున్న ప్రభుత్వం ప్రధానంగా ఆరు మార్గదర్శకాలను సూచించింది.
- కాలేజీలో నాణ్యతాపరమైన విద్యను ఫీజు పెంపునకు కొలమానంగా తీసుకోవాలి. నాణ్యత కల్పించే భరోసా కాలేజీలో ఏ మేరకు ఉందో గుర్తించాలి. ఫ్యాకల్టీ, సరికొత్త మార్పులు, విద్యార్థి విజ్ఞానాన్ని పెంచేందుకు తీసుకొనే చర్యలను ప్రామాణికంగా తీసుకోవాలి.
- కాలేజీలో చదివే విద్యార్థుల పురోగతి ఎలా ఉంది? విద్యార్థులకు ఏ స్థాయిలో ప్రేరణ కల్పిస్తున్నారు? వారి హాజరు శాతం ఏ విధంగా ఉంది? ప్రతి విద్యాసంవత్సరంలో విద్యార్థుల పురోగతిలో మార్పు, ఎంత మందికి ఉద్యోగాలు వస్తున్నాయి? ఏ స్థాయి ఉద్యోగాలు వస్తున్నాయనే అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.
- ముఖ ఆధారిత గుర్తింపు హాజరు విధానం, ఆధార్ అనుసంధాన చెల్లింపు పద్ధతుల్లాంటి ఆధునిక విధానాలను ఫీజుల పెంపునకు ప్రామాణికంగా తీసుకోవాలి. జమా ఖర్చులు సహా అన్ని విషయాల్లో పారదర్శకత, జవాబుదారీతనంలో కాలేజీ తీరును ఫీజు పెంపునకు ఒక అర్హతగా నిర్ణయించారు.
- నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్), నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) వంటి జాతీయ సంస్థలతోపాటు అంతర్జాతీయ సంస్థల నుంచి ర్యాంకులు పొందిన సంస్థలను ఫీజుల పెంపునకు కొలమానంగా తీసుకోవాలి.
- ప్రభుత్వం అందించే సాంకేతిక విద్యను ఏ మేరకు అనుసరిస్తున్నారు? దీన్ని ఆధారంగా చేసుకొని ఉన్నత ప్రమాణాలతో బోధన అందించే విధానాలను పరిశీలించాలి.

ఈ ఏడాది పెంపు లేనట్టే!

ఇంజనీరింగ్ సీట్ల భర్తీ ఇప్పటికే పూర్తవగా అంతర్గత స్లైడింగ్, అన్ని కాలేజీల్లో ఓరియంటేషన్ సైతం ముగిసింది. క్లాసులు కూడా పూర్తిస్థాయిలో మొదలవనున్నాయి. 2025–26 విద్యాసంవత్సరంలో చేరిన విద్యార్థులు పాత బ్లాక్ పీరియడ్‌లో ఉన్న ఫీజులే చెల్లించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఎఫ్ఆర్సీ 160 కాలేజీల డాక్యుమెంట్లు, ఆడిట్ నివేదికలను పునఃపరిశీలించాలి. ఆ తర్వాత ఫీజులపై ఓ నిర్ణయానికి వచ్చి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలి. అయితే ఆ నివేదికను ఆమోదిస్తూ ప్రభుత్వం ఫీజులు పెంచినా ఈ ఏడాదికి మాత్రం అవి అమలయ్యే అవకాశం కనిపించడంలేదు. ఫీజులపై ఆరు వారాల్లో తేల్చాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలోనే ఫీజులపై పునఃపరిశీలన చేపడుతున్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి.

నేడు 486 మందికి ఉద్యోగ నియామకాలు

పత్రాలు అందజేయనున్న డిప్యూటీ సీఎం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ (టీజీజెన్‌కో)లో వివిధ కేటగిరీలకు చెందిన 486 మందికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం నియామక పత్రాలు అందజేస్తారు. ప్రజాభవన్‌లో జరిగే ఈ కార్యక్రమానికి విద్యుత్ ఉన్నతాధికారులు పలువురు హాజరవుతారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ పరిధిలో భూనిర్వాసితులు, కారుణ్య నియామకాలకు సంబంధించిన పలువురు ఉద్యోగ నియామక పత్రాలు అందుకోనున్నారు.

సర్పంచుల సంఘం జేఏసీ నిరసన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఆర్థిక సంఘం (ఎస్ఎఫ్సీ) నుంచి గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ ఆరోపించింది. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి 18 నెలలు దాటినా.. పెండింగ్ బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం వాయిదా వేస్తోందని మండిపడింది. వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలనే డిమాండ్‌తో.. గురువారం లంగర్‌హౌస్ బాపూఘాట్ మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపింది. కార్యక్రమంలో సుర్వి యాదయ్యగౌడ్ పాల్గొన్నారు.

టీచర్ల ప్రమోషన్ల ప్రక్రియ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: పాఠశాల విద్య పరిధిలో ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియను తిరిగి ప్రారంభిస్తున్నట్టు పాఠశాల విద్య డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. ఆ షెడ్యూల్‌ను ఆయన గురువారం విడుదల చేశారు. ప్రమోషన్లపై కొంతమంది హైకోర్టును ఆశ్రయించగా, గత నెల ఈ ప్రక్రియ ఆగిపోయింది. దీనికి కోర్టు ఆమోదం తెలపడంతో తిరిగి మొదలు పెడుతున్నారు. స్కూల్ అసిస్టెంట్ల ఖాళీలను ఈ నెల 22 నుంచి 24 వరకూ వెల్లడిస్తారు. సీనియారిటీ జాబితాను ప్రకటిస్తారు. ఇదే క్రమంలో ఎస్ జీ టీల సీనియారిటీ లిస్టును వెల్లడిస్తారు. 25వ తేదీన టీచర్లు వెబ్ ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. 26వ తేదీన స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందే వారి జాబితాను ప్రకటిస్తారు. ప్రమోషన్ల ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చేస్తారు.

ప్రభుత్వానికి ఉద్యోగ జేఏసీ నోటీసు

- అక్టోబర్ 12 నుంచి జిల్లాల వారీ బస్సు యాత్ర
- సీపీఎస్ విద్రోహ దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



మహేశ్ దత్ ఎక్కాకు నోటీసు ఇస్తున్న జేఏసీ నేతలు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఉద్యోగ జేఏసీ అక్టోబర్12 నుంచి బస్సుయాత్ర చేపట్టనున్న విషయం తెలిసిందే. ఈ యాత్రకు సంబంధించిన సమాచారంతో కూడిన నోటీసును గురువారం ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు ప్రతినిధి బృందం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి బెనహర్ మహేశ్ దత్ ఎక్కాకు సమర్పించింది. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహదినంగా పరిగణిస్తూ నిరసన కార్యక్రమాలను చేపట్టనుంది. ఈ మేరకు గురువారం సాయంత్రం సచివాలయంలో పెన్షన్ విద్రోహదినం పోస్టర్‌ను ఉద్యోగ జేఏసీ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు సచివాలయంలోని మీడియాపాయింట్ వద్ద మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డితో సహా ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర మంత్రులను నేరుగా కలిసి పలుమార్లు వినతులు, విన్నపాలు చేసినట్టు వివరించారు. మంత్రివర్గ ఉపసంఘంతోపాటు, అధికారుల కమిటీలను ఏర్పాటు చేసినా, కాలయాపన తప్ప ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం లభించలేదన్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటై 20నెలలు గడిచినా ఇప్పటికీ 63 రకాల సమస్యలు పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్నాయని, వీటి పరిష్కారంలో భాగంగా ఆందోళన చేపట్టాలని క్షేత్రస్థాయి నుంచి ఉద్యోగుల ఒత్తిడి మేరకు నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆరోగ్యశాఖలో త్వరలో 1,623 మంది స్పెషలిస్టు డాక్టర్లు

భర్తీకి మెడికల్ బోర్డుకు మంత్రి దామోదర ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఆరోగ్యశాఖలో ఇటీవల చేపట్టిన నియామకాల ప్రక్రియలో భాగంగా కొత్తగా మరో 1,623 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులు భర్తీ కానున్నాయి. తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లోని ఆస్పత్రుల్లో నెలకొన్న స్పెషలిస్ట్ డాక్టర్ల కొరతను తీర్చేందుకు సివిల్ అసిస్టెంట్ సర్జన్ (సీఏఎస్) పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేయాలని మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డును ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గురువారం ఆదేశించారు. ఒకట్రెండు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల కానున్నట్లు ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. ఈ నియామకంతో తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లోని ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ డాక్టర్ల సంఖ్య భారీగా పెరగనుంది. పల్లెలకు స్పెషాలిటీ వైద్య సేవలు అందనున్నాయి. తద్వారా జిల్లా, ఏరియా హాస్పిటళ్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వైద్య సేవలు మరింత మెరుగు కానున్నాయని ఆరోగ్యశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈ నిర్ణయంపై తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ నరహరి, సెక్రెటరీ జనరల్ లల్లూ ప్రసాద్ రాథోడ్ హర్షం వ్యక్తం చేశారు.

రెవెన్యూ శాఖలో కొత్తగా 217 పోస్టులు

- 15 కొత్త మండలాల్లో 189 పోస్టులు
- రెండు డివిజన్లకు మరో 28.. మంజూరు చేస్తూ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రెవెన్యూ శాఖలో 217 పోస్టులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. భూ పరిపాలన విభాగానికి ఈ పోస్టులను కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొత్తగా ఏర్పాటు చేసిన 15 రెవెన్యూ మండలాల్లో 189 పోస్టులు, రెండు రెవెన్యూ డివిజన్ల కోసం మరో 28 పోస్టులు మంజూరు చేస్తూ గురువారం జీవో విడుదల చేసింది. ఒక్కొక్క మండలానికి తహసీల్దార్, ఆర్ఐ సహా 12, ఆర్డీవోకు 14 పోస్టులను మంజూరు చేశారు. గద్వాల, నల్లగొండ, వికారాబాద్, ఆదిలాబాద్, కామారెడ్డి, వనపర్తి, మహబూబ్‌నగర్ జిలాల్లో ఈ పోస్టుల భర్తీకి త్వరలో ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయనుంది.

ఏఐపై ఇంటర్ అధికారులకు శిక్షణ



మాట్లాడుతున్న యోగితారాణా. చిత్రంలో కృష్ణఆదిత్య, జయప్రద తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ విద్యా మండలి కార్యాలయంలో ఆర్టిఫిషియల్ చాంపియన్స్, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారులకు ఏఐపై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇంటర్ కాలేజీల్లో ఏఐ సాంకేతికతను విస్తృతంగా వినియోగించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు అధికారులు తెలిపారు. కాలేజీల్లో ఫేషియల్ రికగ్నిషన్ విధానం అమలుపై దృష్టి పెట్టాలని సూచించారు. దీనివల్ల హాజరు విధానాన్ని పర్యవేక్షిస్తారు. ఈ సందర్భంగా విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా మాట్లాడుతూ, ఏఐ టెక్నాలజీ ద్వారా విద్యార్థుల నాణ్యతను మెరుగుపరచాలని సూచించారు. జెమినై, చాట్ జీపీటీ, మెటా, గూగుల్, ఎల్ఎల్ఎం వంటి ఏఐ టూల్స్ విద్యాభ్యాసంలో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఇంటర్ బోర్డ్ కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరీక్షల విభాగం ఉన్నతాధికారి జయప్రదాబాయ్ తదితరులు పాల్గొన్నారు.

> మీరు వడ్డీగా ఇచ్చే ధనం, అల్లాహ్ దృష్టిలో ఏ మాత్రం వృద్ధి పొందదు. అల్లాహ్ ప్రసన్నతను పొందే ఉద్దేశంతో ఏదైనా దానం చేస్తే అలాంటి వారి సంపద ఎన్నో రెట్లు అధికమవుతుంది.
> – ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 22 ఆగస్టు 2025

సమాఖ్య వ్యవస్థకు తూట్లు!

రాజకీయ అవినీతిని అంతం చేయటానికి, దేశంలో రాజ్యాంగ నైతికతను నెలకొల్పటానికి అని చెబుతూ లోక్సభలో బుధవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 130వ రాజ్యాంగ సవరణ బిల్లు, అందుకు సంబంధించిన మరో రెండు బిల్లులపై దేశవ్యాప్తంగా సకారణంగానే నిరసనలు వ్యక్తమవుతున్నాయి. లోక్సభలో అయితే తీవ్ర వాగ్వివాదాలు, పరస్పర ఆరోపణలు వెల్లువెత్తాయి. బిల్లు ప్రవేశపెట్టిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా తొలి వరస నుంచి మూడో వరసకు వెళ్లి ప్రసంగించాల్సి వచ్చిందంటే... ఆయనకు రక్షణ వలయంగా పార్లమెంటరీ భద్రత సేవలో ఉండే 12 మంది గార్డులు మోహరించాల్సి వచ్చిందంటే... బిల్లు ప్రతులు చించి పడేశారంటే... సభలో ఆగ్రహావేశాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ప్రధాని మొదలుకొని ముఖ్యమంత్రులూ, మంత్రులూ అవినీతి ఆరోపణలపై అరెస్టయి, 30 రోజుల్లోగా బెయిల్పై విడుదల కాని పక్షంలో వెనువెంటనే పదవుల నుంచి తప్పించేందుకు ఉద్దేశించామని చెబుతున్న ఈ బిల్లులు చట్టాలైతే ప్రకటిత లక్ష్యాలను నిజంగా నెరవేరుస్తాయా అన్నది ప్రశ్నార్థకం. ఏ వ్యవస్థలోనైనా నేర న్యాయచట్టాలు పాలకుల అధికారాన్నీ, వారి రాజకీయ స్వప్రయోజనాలనూ ప్రతిఫలించినంతగా... న్యాయాన్ని ప్రతిబింబించవు. ఆచరణ సంగతి చెప్పనవసరమే లేదు. ఎక్కడి దాకానో ఎందుకు, ఆంధ్రప్రదేశ్లో తమ ఎన్డీయే కూటమి పాలన ప్రత్యర్థుల్ని వెంటాడి వేటాడి వేధిస్తున్న వైనం, తప్పుడు కేసులు బనాయిస్తున్న తీరు తెలియదా? కేవలం నిందగా, రుజువుకాని నేరంగా, ఒక ఆరోపణగా మాత్రమే ఉన్న దశలో బెయిల్ రాలేదన్న కారణంగా పదవులకు అనర్హులవుతారని చెప్పడం అంటే ప్రజల దృష్టిలో వారిని శాశ్వతంగా నేరం చేసిన వారుగా ముద్ర వేయటమే అవుతుంది. నేరం చేశారో లేదో తేలకుండా, శిక్షేమీ పడకుండా... విచారణ ప్రక్రియ దానికదే శిక్షగా మారటం మన దేశంలో కళ్లముందు కనబడుతున్న సత్యం. ఈ విషయంలో సీబీఐ, ఈడీ సంస్థలు అనేకసార్లు న్యాయస్థానాలతో చీవాట్లు తింటున్న వైనం తెలియంది కాదు. అలాంటపుడు ఈ సవరణ ద్వారా రాజ్యాంగాన్నే ఆయుధంగా మార్చాలని చూడటం ఎవరి ప్రయోజనాల కోసం?

ఈ బిల్లులు కొందరంటున్నట్టు త్వరలో జరగబోయే బిహార్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇప్పుడున్న 'వోట్ చోరీ' నినాదాన్ని వెనక్కినెట్టి 'అవినీతి నిర్మూలన' ఎజెండాను అగ్రభాగాన నిలబెట్టి తాము మాత్రమే సచ్ఛీలురమనీ, ప్రత్యర్థులంతా అవినీతిపరులనీ ముద్రేయటానికా? నిజమే కావొచ్చు. ఆ మాటెలావున్నా ఇది దేశ ఫెడరల్ వ్యవస్థ అమరికను తీవ్రంగా దెబ్బ తీస్తుంది. రాష్ట్రాల్లో ఎన్డీఏ యేతర పక్షాల ప్రభుత్వాలను ఎన్నికల ముందు పడగొట్టడానికి ఈ చట్టాలను ఎడాపెడా దుర్వినియోగం చేసే వీలుంది. న్యాయసమీక్షకు అవకాశం ఉందనేది అర్థరహిత తర్కం. పెండింగ్ కేసులతో సతమతమవుతున్న న్యాయస్థానాల్లో కేసుల విచారణ పూర్తికావటానికి ఎంత సమయం పడుతున్నదో అందరికీ తెలుసు. సారాంశంలో నేరం రుజువయ్యేవరకూ ప్రతి ఒక్కరినీ నిర్దోషిగా పరిగణించాలన్న న్యాయశాస్త్ర సిద్ధాంతానికి ఇది తూట్లు పొడుస్తోంది.

అవినీతి ప్రక్షాళనకు తొలి అడుగు వేయదల్చుకుంటే ముందు సీబీఐ, ఈడీ వంటి సంస్థలకు స్వతంత్ర ప్రతిపత్తినీయాలి. ఆ సంస్థల విశ్వసనీయతను పెంచాలి. అందుకోసం ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం చేసిందేమిటి? యూపీఏ హయాంలో సీబీఐకి 'కాంగ్రెస్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్' అనే ముద్రపడింది. సాక్షాత్తూ సర్వోన్నత న్యాయస్థానమే 'పంజరంలో చిలుక'గా సంస్థను అభివర్ణించింది. గత పదకొండేళ్ల పాలనలో ఈ అపప్రథను తొలగించటానికి తీసుకున్న చర్యలేమిటో ఎన్డీఏ చెప్పగలదా? మొన్న మే నెలలో తమిళనాడు స్టేట్ మార్కెటింగ్ కార్పొరేషన్పై ఈడీ దాడి చేసిన కేసులో ఆ సంస్థ అన్ని హద్దుల్నీ ఉల్లంఘించిందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ కటువుగా వ్యాఖ్యానించారు. నాలుగు నెలల క్రితం కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌధరి రాజ్యసభలో వెల్లడించిన గణాంకాలు దిగ్భ్రాంతిపరుస్తాయి. గత పదేళ్లలో ఈడీ 193 మంది రాజకీయ నాయకులపై కేసులు నమోదు చేయగా, వారిలో కేవలం ఇద్దరికి శిక్ష పడింది. ఆప్ సర్కారులో మంత్రిగా ఉండి అరెస్టయిన సత్యేంద్ర జైన్పై సీబీఐ నాలుగేళ్లు దర్యాప్తు జరిపి చివరకు అంతా సవ్యంగానే ఉన్నట్టు తేల్చి కేసును మూసేస్తున్నట్టు న్యాయస్థానానికి తెలిపింది. కానీ ఈలోగా ఆయన ఏడాదిన్నరపాటు జైల్లో మగ్గాల్సి వచ్చింది. అవినీతిని వ్యతిరేకించటమూ, ఈ బిల్లుల్ని సమర్థించటమూ ఒకటి కాదు. పార్లమెంటులో మూడింట రెండొంతుల మెజారిటీ లేకుండా ఈ బిల్లులు తీసుకురావటం గమనిస్తే ఇది కేవలం విపక్షాలను అవినీతిపరులుగా ముద్రేయటానికే అని అర్థమవుతుంది. పాలకులెవరైనా దుర్వినియోగానికి విస్తృతంగా అవకాశమున్న ఈ బిల్లుల్ని సంయుక్త పార్లమెంటరీ సంఘానికి (జేపీసీకి) పంపటం కాదు... పూర్తిగా వెనక్కి తీసుకోవాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, **తిథి:** బ.చతుర్దశి ప.11.54 వరకు, తదుపరి అమావాస్య, **నక్షత్రం:** ఆశ్లేష రా.1.10 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** ప.1.59 నుండి 3.35 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.17 నుండి 9.07 వరకు, తదుపరి ప.12.30 నుండి 1.20 వరకు, **అమృత ఘడియలు:** రా.11.40 నుండి 1.15 వరకు.

సూర్యోదయం : 5.47
సూర్యాస్తమయం: 6.20
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

సోషల్ టాక్

రాజకీయ మాయ



జూలై 21 నుంచి మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ఖడ్ ఎక్కడున్నారు? ఉపరాష్ట్రపతి నివాసంలోనే ఉన్నారని తెలిసింది. ఆయన మళ్లీ ప్రజల్లో ఎప్పుడు ప్రత్యక్షం అవుతారు? హఠాత్తుగా ఆయన 'మాయం' కావడం మన కాలపు గొప్ప రాజకీయ ప్రహేళికల్లో ఒకటి.

– రాజ్దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

దిద్దుబాటు



కొన్నిసార్లు మన చుట్టూ ఉన్న సమస్యలకు పరిష్కారం కంటే, ఆ సమస్యల పట్ల మన వైఖరిని దిద్దుకోవటం అవసరం అవుతుంది. వైఖరిలో మార్పు అడ్డంకులను అవకాశాలుగా, ఎదురు దెబ్బలను మెట్ల రాళ్లుగా మారుస్తుంది.

– అశ్విని దేశ్వాల్, లైఫ్ కోచ్

డిజిటల్ కేరళమ్



1991లో దేశంలో తొలిసంపూర్ణ అక్షరాస్యత సాధించింది కేరళ. ఈ ఆగస్ట్ 21న సంపూర్ణ డిజిటల్ అక్షరాస్యతను సాధించిన తొలి రాష్ట్రంగానూ నిలిచింది. దీనికిగానూ ముందుగా 83 లక్షల కుటుంబాలను సర్వే చేసి, 21 లక్షల మందికి డిజిటల్ అక్షరాస్యత లేదని గుర్తించారు. వీరిలో ఇప్పుడు 99.98 శాతం డిజిటల్ శిక్షణ పూర్తి చేసుకున్నారు.

– అద్వైద్, క్రానికలర్

చేతులు కలపాలి



అవసరం అయినప్పుడు కఠినమైన నిర్ణయాలను తీసుకోవటానికి చట్టసభల్లోని అధికార, ప్రతిపక్ష సభ్యులు కలిసికట్టుగా స్పందించాలి. ముఖ్యంగా – వాక్ స్వాతంత్ర్యం ప్రజల భద్రతకు ముప్పుగా మారినప్పుడు రెండు పక్షాలూ తక్షణం చర్యలు చేపట్టటానికి చేతులు కలపాలి.

– తులిప్ సిద్దిక్, యూకే ఎంపీ

నైపుణ్యం



కెరీర్లు ఇకపై నిచ్చెనలు కావు. ఇప్పుడవి పిల్లల పార్క్లో కనిపించే జంగిల్ జిమ్లు. ముందుకీ వెనక్కీ కాని పక్క నడకలు, విరామాలు, కొత్త దారుల వెదకులాటలు. ఉన్నచోట పదోన్నతుల కోసం ఎదురు చూడటం కాదు. అంతటా మీ నైపుణ్యాలను చాటుకోవాలి.

– ఎం. మునీర్, స్టార్టప్ ఇన్వెస్టర్

బలాలు



నేను ప్రతి ఉదయం నా కూతురిని, "నీ దేహంలో ముఖ్యమైన ఆర్గాన్స్ ఏవి?" అని అడుగుతాను. తను, "నా మెదడు, నా హృదయం" అని చెబుతుంది. అలా నేర్పించాను తనకి. జీవితంలో మిమ్మల్ని ముందుకు నడిపించేది ఈ రెండే... వ్యక్తిత్వ బలం, ఆత్మ బలం.

– వయోలా డేవిస్ (60), ఆస్కార్ విజేత

బంగ్లాదేశ్ ఇప్పుడొక టైమ్ బాంబ్!

విశ్లేషణ



బ్రహ్మ చెలానీ

'ఉక్కు మహిళ' షేక్ హసీనా నిరంకుశ పాలనకు తెరపడినా, బంగ్లాదేశ్లో ప్రజాస్వామ్య ద్వారాలు తెరుచుకోలేదు. విద్యార్థుల తిరుగుబాటుకు వెనుక ఉండి మద్దతు ఇచ్చిన సైన్యం హసీనా నిష్క్రమణతో నేరుగా రంగంలోకి దిగింది. తమ ఆటలు సాగనివ్వని హసీనాపై సైనిక అధికారులు పగ తీర్చుకున్నారు. చివరకు ఆమె దేశం విడిచి పారిపోవలసి వచ్చింది. సైన్యంతో పాటు విద్యార్థుల తిరుగుబాటుకు అన్ని రకాలుగా తోడ్పాటు అందించిన ఇస్లామిస్ట్ శక్తులు ఇప్పుడు బలం పుంజుకున్నాయి. సెక్యులర్ పాలనలో కుక్కిన పేనుల్లా పడి ఉన్న ఈ శక్తులు ఇదే అదనుగా వీధుల్లోకి వచ్చాయి.

యూనస్ దేనికి వారధి?

తను స్థాపించిన గ్రామీణ్ బ్యాంక్ ద్వారా బీదాబిక్కీకి రుణ సాయం అందిస్తూ వారి పాలిట దేవుడిగా కీర్తించబడి 2006లో నోబెల్ శాంతి బహుమతి పొందిన మహమ్మద్ యూనస్ను గద్దె ఎక్కించడంతో బంగ్లాదేశీయుల ప్రజాస్వామ్య ఆశలు మరింత బలపడ్డాయి. అయితే అవి వమ్ము కావడానికి ఎంతో కాలం పట్టలేదు.

నోబెల్ కమిటీ యూనస్ను ఎంపిక చేయడానికి గ్రామీణ్ బ్యాంకు ద్వారా ఆయన సేవలు అందించారనడం అనేది పైకి కనిపించే కారణం మాత్రమే! భౌగోళిక రాజకీయాలు ఇందులో కీలక పాత్ర పోషించాయి. ఇస్లాముకూ, పశ్చిమ దేశాల ప్రజలకూ నడుమ యూనస్ ఒక వారధి లాంటి వాడని కమిటీ అధ్యక్షుడు ఆయనకు అవార్డు ప్రకటిస్తూ అభివర్ణించారు. 2001 సెప్టెంబర్ 11న యూఎస్ మీద జరిగిన టెర్రరిస్టు దాడుల నేపథ్యంలో 'ఇస్లామును ఒక భూతంగా చూసే విస్తృత ధోరణి'ని ఎదుర్కోవడానికి యూనస్ ఎంపిక తోడ్పడుతుందని ఆయన పేర్కొన్నారు. యూనస్ తరఫున అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్ లాబీయింగ్ చేయడం వెనుక అసలు కారణం ఇదే!

దేశంలో సమూల సంస్కరణలు ప్రవేశపెడతాననీ, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహిస్తాననీ బంగ్లాదేశ్ మధ్యంతర ప్రభుత్వ అధినేతగా సైన్యం వెన్నుదన్నుతో పగ్గాలు చేతబట్టిన యూనస్ దేశ ప్రజలకు వాగ్దానం చేశారు. అయితే ఎన్నికలు పదే పదే వాయిదా పడుతున్నాయి. ఇలా ఉండగా, రాజ్యాంగ బద్ధత లేనప్పటికీ, మధ్యంతర ప్రభుత్వం అనేక స్వతంత్ర సంస్థల్లో పెనుమార్పులు ప్రకటిస్తోంది. వీటిలో భాగంగా, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తినీ, సీనియారిటీ పరంగా ఆయన తర్వాతి స్థానాల్లో ఉండే అయిదుగురు న్యాయమూర్తులనూ పదవుల నుంచి తొలగించింది. హసీనా పార్టీ అవామీ లీగ్ను నిషేధించింది. దేశంలోనే అతి పెద్దదైన ఈ రాజకీయ పార్టీ నాయకత్వంలోనే బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఆవిర్భవించింది.



◆ ప్రధాన మంత్రి షేక్ హసీనా ప్రభుత్వాన్ని కూలదోసి ఏడాది గడచిపోయినా, బంగ్లాదేశ్లో పరిస్థితి కుదుటపడలేదు. ఆర్థిక వ్యవస్థ విలవిలాడుతోంది. ర్యాడికల్ ఇస్లామిస్ట్ శక్తులు వేళ్లూనుకుంటున్నాయి. దేశాన్ని అశాంతి కబళిస్తోంది. మైనారిటీలు, ఇతర జాతులు ప్రాణాలు అరచేత పట్టుకుని రోజులు గడుపుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, అక్కడ అరాచకత్వం రాజ్యమేలుతోంది. బంగ్లాదేశ్ భవిష్యత్తు అంధకారంగా మారింది.

వీధుల్లో బీభత్స కాండ

మానవ హక్కులను కాపాడవలసిన ప్రభుత్వమే వాటిని ఉల్లంఘిస్తోంది. నిరసనలను అణచివేస్తోంది. న్యాయవాదులు, విద్యావేత్తలు, పాత్రికేయులు, ప్రతిపక్ష నేతలను, హసీనా మద్దతుదారులను మూకుమ్మడిగా జైళ్లకు పంపిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి అనేక వేల మందిని నిర్బంధంలోకి తీసుకుంది. హత్యలు వంటి అభియోగాలు మోపి జర్నలిస్టులపై తప్పుడు కేసులు పెడుతోంది. వారిపై పెరిగిపోయిన దాడుల పట్ల అంతర్జాతీయ మీడియా పరిశీలక సంస్థలు ఆందోళన ప్రకటిస్తున్నాయి. దేశంలో కస్టడీ హత్యలు, చిత్రహింసలు మామూలు అయ్యాయి.

ఇస్లామిస్టు ఉగ్రవాదులకు పునరావాసం కల్పించే కొత్త పరిణామం మరింత ఆందోళన కలిగిస్తోంది. యూనస్ నాయకత్వంలోని మిలిటరీ–ముల్లా ప్రభుత్వం జిహాదీ గ్రూపుల మీద నిషేధాలు ఎత్తివేసింది. కరడు గట్టిన ఉగ్రవాద నాయకులకు స్వేచ్ఛ ప్రసాదించింది. అంతకంటే ఘోరంగా, అనేక మంది ఉగ్రవాదులు మంత్రి పదవులు, ఉన్నత ప్రభుత్వోద్యోగాలు పొందారు. వారి అనుచర గణాలు ప్రత్యర్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి.

బౌద్ధులు, క్రైస్తవులు, హిందువులు, గిరిజన తెగల మీద దాడులు చేస్తున్నారు. 'ఇతర' ఇస్లామిక తెగలనూ వారు విడిచి పెట్టడం లేదు. ఈ దాడులను నేరాలుగా పరిగణించక పోవడం విశేషం. స్త్రీలు ధరించే దుస్తులను సాకుగా చూపి, వారి మీదా దాడులకు తెగబడుతున్నారు. తాలిబన్ శైలిలో 'మోరల్ పోలీసింగ్' సంస్కృతి వ్యాప్తి చెందుతోంది. పరిస్థితి ఎంత దుర్మార్గంగా తయారైందంటే, ఆఖరుకు అవామీ లీగ్ పార్టీకి బద్ధ వ్యతిరేకమైన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ సైతం ఈ మౌలిక హక్కుల హననాన్ని, 'మతం పేరిట రేగిన ఉన్మాదం'గా, 'వీధుల్లో బీభత్స కాండ'గా అభివర్ణిస్తోంది.

పతనమవుతున్న ఆర్థిక వ్యవస్థ ఈ సమస్యలను మరింత తీవ్రతరం చేస్తోంది. జీడీపీ వృద్ధి కుప్పకూలింది. విదేశీ రుణం పెరిగిపోయింది. ద్రవ్యోల్బణం 12 ఏళ్ల గరిష్ఠ స్థాయికి చేరింది. ఇన్వెస్టర్ల విశ్వాసం క్షీణించడంతో, స్టాక్ మార్కెట్ అయిదేళ్ల కనిష్ఠ స్థాయికి పతనమైంది. ఉద్యోగాలు పోతున్నాయి. ఉపాధి దొరకడం లేదు. జీవన ప్రమాణాలు తిరోగమిస్తున్నాయి. ఇలాంటి ఆర్థిక వ్యవస్థ ఉగ్రవాద వ్యాప్తికీ, సామాజిక అశాంతికీ దారి తీస్తుంది.

ఇండియాకూ గట్టి దెబ్బ

ముస్లిం మెజారిటీ దేశంలో లౌకిక ప్రజాస్వామ్యానికి బంగ్లాదేశ్ ఒకప్పుడు చిరునామాగా ఉండేది. కోవిడ్–19 మహమ్మారి ముంచుకొచ్చే వరకు ఆర్థిక అభివృద్ధి, సామాజిక స్థిరత్వం దిశగా పురోగమించింది. ఏ దేశం నుంచి విడిపోయేందుకు విముక్తి ఉద్యమం చేసిందో ఆ దేశం బాటలోనే ప్రయాణించే దుఃస్థితి నేడు బంగ్లాదేశ్కు పట్టింది.

బంగ్లాదేశ్ దుష్పరిణామాల ప్రభావం ఈ ప్రాంతం అంతటా పడుతుంది. బంగ్లాదేశ్కు మూడు వైపులా సరిహద్దుగా ఉన్న ఇండియాలోకి అక్కడి నుంచి పెద్ద సంఖ్యలో శరణార్థులు ప్రవేశించారు. హసీనా హయాంలో ఉగ్రవాద నిరోధకత, ప్రాంతీయ సంధాయకత అంశాల్లో ఇండియాకు బంగ్లాదేశ్ అత్యంత సన్నిహిత భాగస్వామిగా ఉండేది. ఆమె ప్రభుత్వం కూలిపోవడం... వ్యూహాత్మక ప్రయోజనాల పరంగా ఇండియాకు గట్టి దెబ్బ. ఇప్పుడు ఆ వైపున కూడా సరిహద్దు భద్రత పెంచడం అనివార్యం అయ్యింది. లేదంటే, బంగ్లాదేశ్ నుంచి కూడా ఉగ్రవాదులు దేశంలోకి చొరబడే ప్రమాదం పొంచివుంది.

హసీనా పదవీచ్యుతి వల్ల ఎదురు కానున్న ప్రమాదాలను ఇండియా తక్షణం గుర్తించినప్పటికీ, అమెరికా అందుకు విరుద్ధంగా ఆ మార్పును స్వాగతించింది. అయితే, బంగ్లాదేశ్ ఇదే పంథాను కొనసాగిస్తే ఇండో–పసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛ సుస్థిరత సౌభాగ్యాల కోసం యూఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న కృషి కొరగాకుండా పోతుంది. సుదూర దేశాలను సైతం ముగ్గులోకి దించే మరో అంతర్జాతీయ స్థాయి ఉద్రిక్త కేంద్రంగా బంగ్లాదేశ్ అవతరిస్తుందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.

ప్రజాస్వామ్య విలువలు, మత స్వేచ్ఛ, ప్రాంతీయ సుస్థిరతలను పరిరక్షించాల్సిన తక్షణ అవసరాన్ని అంతర్జాతీయ సమాజం సీరియస్గా తీసుకోవాలి, బంగ్లాదేశ్ అధః పతనాన్ని ఇక ఎంత మాత్రం ఉపేక్షించకూడదు.

వ్యాసకర్త న్యూఢిల్లీలోని 'సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్' ఎమిరెటస్ ప్రొఫెసర్ ('ప్రాజెక్ట్ సిండికేట్' సౌజన్యంతో)

అప్పుడే... ఏఐకి సార్థకత



కృత్రిమ మేధ, డీప్ టెక్, క్వాంటమ్ కంప్యూటింగ్, గ్రీన్ హైడ్రోజన్, డిజిటల్ ఇండియా వంటి వాటి గురించి తరచూ మన రాజకీయ నాయకులూ, ప్రభుత్వ పెద్దలూ ప్రస్తావిస్తూ ఉంటారు. కానీ ఆ యా టెక్నాలజీలను భారత్ ఇంకా పూర్తి స్థాయిలో వినియోగించుకోవడంలో వెనుకబడే ఉందన్నది గమనించాలి.

అలా అని ప్రభుత్వం ఏమీ చేయడం లేదని అర్థం కాదు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఏఐ మిషన్ కోసం పదివేల కోట్లనూ, జాతీయ క్వాంటమ్ మిషన్ కోసం ఆరు వేల కోట్లనూ కేటాయించింది. మౌలిక సదుపాయాలకు, డేటా వేదికల రూపకల్పనకు, నైపుణ్య శిక్షణా తరగతుల నిర్వహణకు, ఇతర సాధనాలను అందుబాటులోకి తేవటానికి సన్నాహాలు చేస్తోంది. అయితే కేవలం అధునాతన టెక్నాలజీలను సమాజానికి పరిచయం చేయటం, పైపై మెరుగుల కోసం, అవసరాల కోసం వీటిని వాడుకోవటం వల్ల ఎటువంటి ప్రయోజనమూ ఉండదు. ఆధునిక సాంకేతికతలను ఉపయోగించి సామాన్య మానవుని జీవనాన్ని సులభతరం చేయడంతో పాటు, అనేక రంగాల్లో సమూల మార్పులు చేసినప్పుడు మాత్రమే ఈ సాంకేతికతలను సరిగా ఉపయోగించుకున్నట్లు లెక్క. ఎన్నికల అవకతవకలపై ఎన్నో ఆరోపణలూ, విమర్శలూ వినిపిస్తున్నాయి.

◆ మన దగ్గర అనితర సాధ్యమైన మేధా సంపత్తి ఉంది. ఆ మేధను కృత్రిమ మేధ వైపు మళ్ళించి వ్యవస్థలను పునఃరూపకల్పన చెయ్యటానికి ప్రణాళికలను రచించినప్పుడే టెక్నాలజీ దన్నుతో దేశం అభివృద్ధి చెందుతుంది.

వీటికి తావు లేకుండా చేయాలంటే ప్రతి ఓటునూ ఆధార్ కార్డ్తో అనుసంధానం చెయ్యడమే కాక, ఫేక్ ఓటర్లను గుర్తు పట్టడానికి డీప్ టెక్ను వినియోగించుకోవాలి. అపుడు అత్యంత పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించవచ్చు.

అమెరికా, చైనా వంటి దేశాలు తమ వ్యవస్థలను కృత్రిమ మేధ వినియోగించి పునః రూపకల్పన చేస్తున్నాయి. విద్య, వైద్యం, వ్యవసాయం, భద్రతా రంగాలను కృత్రిమ మేధతో అనుసంధానం చేస్తున్నాయి. స్మార్ట్ నగరాల రూపకల్పన, డిజిటల్ పరిపాలన, వ్యవసాయ ప్రణాళికలు, సామాజిక మౌలిక వసతులు వంటి రంగాలకు చైనా కృత్రిమ మేధను అనుసంధానం చేస్తోంది. కేవలం ఏఐ ఆధారిత ఉపకరణాలను వినియోగించుకుంటూ వివిధ వ్యవస్థల పని తీరును సమూలంగా పునర్నిర్వచిస్తున్నాయి.

మనదేశంలో ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, బ్లాక్ చైన్ వంటి ఆధునిక అంశాలను పాఠ్యాంశాలుగా విద్యార్థుల నెత్తిమీద రుద్దుతున్నారు తప్ప, ప్రతి విద్యార్థికీ తాను కోరుకున్నట్టు చదువుకోవడానికి కావలసిన స్వీయ అభ్యాసనా వాతావరణాన్ని అందుబాటులోకి తేవడానికి ప్రయత్నం చెయ్యడం లేదు. ఏఐ ఉపకరణాలు ఉపయోగించి ప్రతి విద్యార్థి పురోగతినీ అంచనా వేసి, వారి స్వీయ అభ్యసనా సామర్థ్యాలకు అనుగుణంగా బోధనా పద్ధతులను మార్పు చేయవచ్చు.

అదే విధంగా వ్యవసాయంలో రైతులకు, స్వర/వాక్ ఆధారిత ఏఐ ద్వారా, ఆ యా ప్రాంతాలకు అనుకూలమైన వ్యవసాయ పద్ధతుల గురించి, పంటల గురించి సలహాలను అందించవచ్చు. గిట్టుబాటు ధరలు, మార్కెట్ పరిస్థితులు, ప్రభుత్వ రుణాలు వంటి వాటి గురించి ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందిస్తూ రైతులు నష్టపోకుండా చూడవచ్చు.

మన దగ్గర అనితర సాధ్యమైన మేధా సంపత్తి ఉంది. కానీ ఆ మేధను కృత్రిమ మేధ, డీప్టెక్ తదితర రంగాల వైపు మళ్ళించి దేశీయ వ్యవస్థలను పునః రూపకల్పన చెయ్యటానికి పటిష్ఠమైన ప్రణాళికలు రచించడం లేదు. ఈ పని జరిగినప్పుడే ఆధునిక టెక్నాలజీ దన్నుతో దేశం అభివృద్ధి పథంలోకి దూసుకుపోగలదు.

– శ్రీవిద్య శ్రీనివాస్ । కృత్రిమ మేధ నిపుణులు

ప్రజల మనిషి

ఇన్ బాక్స్

మహోన్నత స్వాతంత్ర్యోద్యమ నాయకుల్లో తెలుగు బిడ్డ, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు (1872–1957) ఒకరు. పదవుల కోసం ఆయన ఎన్నడూ పాకులాడలేదు. పదవులే ఆయనను వరించాయి. ఆయన దేనిని నమ్మారో దానినే త్రికరణ శుద్ధిగా ఆచరించారు. లక్షలాది రూపాయలు సంపాదించి, అంతా ప్రజల కోసమే ఖర్చు చేశారు. తన కోసం ఆయన పైసా కూడా మిగుల్చుకోలేదు. నాటి లోక్సభ స్పీకర్ అనంతశయనం అయ్యంగార్ ఆయన ధైర్యాన్నీ, నిస్వార్థపరత్వాన్నీ కొనియాడిన విధానాన్ని చూస్తే ప్రకాశం వ్యక్తిత్వం అర్థమవుతుంది– 'మనం 1928లో సైమన్ కమిషన్ను బాయికాట్ చేసిన సమయంలో చెన్నపట్నంలో గల ఇతర నాయకులు సైమన్ రాకను ఎదిరించలేక చెన్నపట్నం వదిలి వెళ్ళిపోయారు. ప్రకాశంగారు మాత్రం మిలిటరీ పోలీసులు అడ్డుకోబోయినప్పుడు చొక్కా విప్పి కాల్చమని తన ఛాతీని చూపించిన సాహసి అయ్యారు. ఆయన తన సర్వస్వం దేశ స్వాతంత్ర్య సమరంలో త్యాగం చేసిన మహావ్యక్తి, మరణించే నాటికి ఒక రాగి పాత్ర అయినా మిగుల్చుకోలేదు'.



టంగుటూరి ప్రకాశం పంతులు

ప్రకాశం మరణించినప్పుడు మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఆయన విశిష్టతను ఇలా ప్రశంసించారు: 'స్వాతంత్ర్య జ్యోతిని సాహసంతో వెలిగించిన దేశభక్తుల్లో అగ్రశ్రేణికి చెందిన వారు ప్రకాశంగారు. ముందువెనుకలు చూడని ధైర్యం, దాతృత్వం వలన ఆయన ఒక పురాణ పురుషులయ్యారు. ఆయన ఉత్తేజం వల్లనే వందలాది అనుయాయులు దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేశారు. నవ్యాంధ్రప్రదేశ్ జనకుడే కాదు, ఆయన భారత జాతీయోద్యమ నాయక శ్రేణిలో అగ్రశ్రేణికి చెందిన నాయకుడు'.

నాటి ప్రధానమంత్రి పండిత్ జవహర్లాల్ నెహ్రూ... 'నాకు జ్ఞాపకం ఉన్నంత వరకు 1920 సంవత్సరం నుండి 1935 వరకు పంతులు గారితో నాకు పరిచయం, సాహచర్యం ఉన్నాయి. ఒకప్పుడు సంపూర్ణంగా మేమిద్దరం ఏకీభవించకపోయినా ఆయన గుణసంపత్తిని నేను ఎప్పుడూ ప్రశంసా భావంతోనే చూసేవాడిన'ని అన్నారు. ఈనాటి రాజకీయ నాయకులు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి.

– డా॥ పి. మోహన్ రావు
చైర్మన్, ప్రకాశం ఇన్స్టిట్యూట్ ఆఫ్ డెవలప్మెంట్
(రేపు టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి)

సాక్షి ఎడిటోరియల్ పేజీ ఈ–మెయిల్: editpage@sakshi.com

డేటా పాయింట్

నాలుగింట ఒకటి నిరుపయోగంలో...

దేశంలో ఈ ఏడాది జూలై 31 నాటికి 56,03,84,490 జన్ధన్ ఖాతాలున్నాయి. వీటిలో 13,04,52,845 ఖాతాలు నిరుపయోగంలో ఉన్నాయి. మొత్తం ఖాతాల్లో ఇవి 23.27 శాతం. అత్యధిక ఖాతాలూ, అత్యధిక నిరుపయోగ ఖాతాలూ ఉన్న రాష్ట్రం ఉత్తర ప్రదేశే.

ఈ విషయంలో టాప్–3 రాష్ట్రాలు, తెలుగు రాష్ట్రాల వివరాలు:

రాష్ట్రాల వారీగా (అంకెలు కోట్లలో)

రాష్ట్రం	మొత్తం జన్ధన్ ఖాతాలు	నిరుపయోగంలో ఉన్నవి
ఉత్తరప్రదేశ్	9.98	2.75
బిహార్	6.47	1.39
పశ్చిమ బెంగాల్	5.42	0.88
ఆంధ్రప్రదేశ్	1.61	0.43
తెలంగాణ	1.28	0.41

ఆధారం: లోక్సభలో కేంద్ర ప్రభుత్వం

భక్త స్వరూపం

జ్యోతిర్మయం

నిర్మల మనస్కుడైన భక్తుడు భగవంతునితో ఎలా మమేకం కావాలో నారాయణ భట్టాత్రి 'శ్రీమన్నారాయణీయం'లో చెబుతున్నారు. గురువాయూరు శ్రీకృష్ణుని ప్రార్థిస్తూ 'నాపై నీ కరుణ ప్రసరించే వరకూ శోకిస్తూ నీ పాదాల వద్దే నా రోజులు గడుపుతాను. నీ ఘనతను ప్రశంసిస్తూ నీ సేవలోనే జీవితం గడుపుతాను' అంటాడు కవి. 'నిన్ను వ్యతిరేకించే వారంతా సుఖంగా జీవితాన్ని గడుపుతుంటే నీ భక్తుడనైన నేను నానా బాధలు పొందుతున్నానెందుకు? ఇది నీకు కీర్తినిస్తుందా' అంటాడు. ఇది చాలా సహజమైన ప్రశ్న. కవిదే కాదు, మనందరి ప్రశ్న కూడా!

కష్టాలలో, సమస్యలలో నిండా కూరుకుపోయి ఉన్న భక్త జనులు, భగవంతునిపై నమ్మిక లేని వారు సుఖంగా ఉంటే తమకెందుకు ఈ బాధలు అనుకుంటారు. అయితే, వారి సుఖం తాత్కాలికం. క్షణికం. కష్టాల భారం మోసే కొద్దీ భగవంతునిపై భక్తి, విశ్వాసాలు బలపడి, ఆత్మలో భగవానుని దర్శన మయ్యాక ఆ ఆనందం వర్ణనాతీతమని పెద్దలు చెబుతారు. ఈ పడుతున్న కష్టాలు, బాధలు అల్పంగా అనిపిస్తాయి.

కవి! తన వ్యాధి బాధ తగ్గించమని ప్రార్థించటం సుఖ జీవనం గడపటానికి కాదు. భగవంతుణ్ణి ఉపాసన చేయటానికి. 'స్థిరమైన ధ్యానం కుదరటానికి పవిత్రమైన ఓంకారాన్ని ఎడతెగక జపిస్తూనే ఉంటాను. శ్వాసను బంధిస్తూ ప్రాణాయామం పాటిస్తాను. ప్రయత్నపూర్వకంగా నా బుద్ధిని పదే పదే నీ శారీరక ఆకృతిపై, నీ పాద పద్మాలపై నిలపటానికి ప్రయత్నిస్తాను' అంటాడు. అలా తదేక దృష్టి దేవునిపై నిలిపినపుడు అన్య విషయాలపైకి బుద్ధి వెళ్లక, భక్తిరస పానంచే తన్మయత్వం కలిగి మనసులో ఆర్ద్ర భావం కలుగుతుంది. క్రమంగా లౌకిక విషయాలపై ఆసక్తి తరిగి, భగవంతునిపై దృష్టి నిలుస్తుంది.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి




వాగు వద్ద నిర్మిస్తే.. వరదలో మునగదా..

చెరువులు, వాగులు, కాలువల సమీపంతోపాటు బఫర్ జోన్లలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని ప్రభుత్వం పదేపదే చెబుతోంది. వాటి పక్కన ఇళ్లు నిర్మించుకుంటే ఎదురయ్యే అనర్థాలకు ఈ చిత్రమే నిదర్శనం. కొంతమంది బఫర్ జోన్, వాగుల్లో ఇళ్లను నిర్మించుకుని ఇబ్బందుల పాలవుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి ఆదిలాబాద్ సుభాష్‌నగర్‌లో వాగు సమీపంలో నిర్మించిన ఇంట్లో వరదనీరు చేరింది. దీంతో ఆ కుటుంబం పైఅంతస్తు ఎక్కి తలదాచుకుంది. డీడీఆర్ఎఫ్ సహాయక సిబ్బంది వారిని వరద నుంచి కాపాడింది. పట్టణంలో ఇలాంటివి అనేక నిర్మాణాలు ఉన్నాయని అంటున్నారు. వాగు ప్రవాహం ఎక్కడివరకు ఉందో గూగుల్ శాటిలైట్ మ్యాప్ తెలియజేస్తోంది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

రివ్యూకు కారణాలు కనిపించలేదు

- జేఎన్‌జే హౌజింగ్ సొసైటీ సహా పలు సొసైటీల రివ్యూ పిటిషన్లను కొట్టివేసిన సుప్రీంకోర్టు
- సొసైటీలకు భూకేటాయింపుల రద్దుపై దాఖలైన పిటిషన్లు

సాక్షి, న్యూఢిల్లీ: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో హౌజింగ్ సొసైటీలకు భూ కేటాయింపుల విషయంలో దేశ అత్యున్నత న్యాయస్థానంలో మరోసారి చుక్కెదురైంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు, జర్నలిస్టులకు చెందిన సొసైటీలకు ప్రభుత్వం చేసిన భూకేటాయింపులను రద్దు చేస్తూ గత నవంబర్ 25న అప్పటి సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. దీంతో ఆ తీర్పును సవాలు చేస్తూ జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ (జేఎన్‌జే) హౌజింగ్ సొసైటీతో పాటు పలు హౌజింగ్ సొసైటీలు రివ్యూ పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ రివ్యూ పిటిషన్లు గురువారం జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎంజీ మసీహ్‌తో కూడిన ధర్మాసనం ముందు విచారణకు వచ్చాయి. హౌజింగ్ సొసైటీల తరపున సీనియర్ న్యాయవాదులు సీఎస్ వైద్యనాథన్, అనితా షెనాయ్, సిద్ధార్థ లూథ్రా, దామా శేషాద్రి నాయుడు తదితరులు వాదనలు వినిపించారు.

జర్నలిస్టులు ప్రివిలేజ్డ్ క్లాస్ కాదు..

హౌజింగ్ సొసైటీల తరపున న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. 2008లో భూకేటాయింపులు జరిగాయని, అప్పటి నుంచి నిర్మాణాలు జరిగాయని, ఇప్పుడు ఈ భూములను కోల్పోతే వేరే చోటుకు వెళ్లే పరిస్థితి లేదన్నారు. జర్నలిస్టుల విషయానికి వస్తే వారిని ప్రివిలేజ్డ్ క్లాస్‌గా పరిగణించడం తప్పు అని, కానీ వారిని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఐఏఎస్ అధికారుల సరసన ఉంచారని సీనియర్ న్యాయవాది అనితా షెనాయ్ వాదించారు. సాధారణంగా జర్నలిస్టుల జీతాలు నెలకు రూ.8 వేల నుంచి రూ.30 వేల వరకు మాత్రమే ఉంటాయని, పెన్షన్ సదుపాయం లేదని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ, 'భూములను కేటాయించిన బేసిక్ రేటు కూడా తప్పు అనిపిస్తే, దానిని మార్కెట్ విలువకు సర్దుబాటు చేయొచ్చు' అని తెలిపారు. ఏపీఎస్పీ పోలీస్ కానిస్టేబుళ్ల హౌసింగ్ సొసైటీ తరపున న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ, తాము బేసిక్ విలువ కంటే 12 రెట్లు అధికంగా చెల్లించి భూములను కొనుగోలు చేశామని చెప్పారు. వాదనల అనంతరం రివ్యూ పిటిషన్లను కొట్టివేస్తూ జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించేందుకు తగిన కారణాలు కనిపించడం లేదని, భూముల కేటాయింపులో బేసిక్ రేటు కాకుండా మార్కెట్ రేటు వర్తిస్తుందని స్పష్టం చేసింది. అలాగే ఇతర సొసైటీల తరపున కూడా న్యాయవాదులు, ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను అంగీకరించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

పబ్జీ ఆడొద్దన్నారని ఉరేసుకున్నాడు..

భైంసాటౌన్: సెల్‌ఫోన్‌లో పబ్జీ గేమ్ ఆడొద్దని తల్లిదండ్రులు మందలించినందుకు ఓ విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో జరిగింది. పోలీసులు, కుటుంబీకుల కథనం ప్రకారం.. హైదరాబాద్ లోని మౌలాలీకి చెందిన భేతి సంతోష్– సాయిప్రద దంపతులు కొంతకాలంగా భైంసాలో ఉంటున్నారు. వీరి కుమారుడు రిశేంద్ర (15) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 9వ తరగతి వరకు చదివాడు. వేసవి సెలవుల్లో ఇంటికి వచ్చి సెల్‌ఫోన్‌లో పబ్జీ గేమ్‌కు అలవాటు పడ్డాడు. పదోతరగతి కోసం స్కూల్‌కు వెళ్లకుండా ఇంటివద్దే ఉంటూ గేమ్ ఆడుతున్నాడు. తల్లిదండ్రులు నచ్చజెప్పినా వినకపోవడంతో రెండు, మూడురోజులుగా గేమ్ ఆడకుండా నియంత్రించారు. దీంతో మనస్తాపం చెందిన రిశేంద్ర బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. బయటకు వెళ్లిన కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చేసరికి రిశేంద్ర విగత జీవిగా కనిపించాడు. ఒక్కగానొక్క కొడుకు మృతితో తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసుల తనిఖీ నుంచి తప్పించుకోబోయి..

- బస్సు చక్రాల కింద పడి వ్యక్తి మృతి
- మృతదేహంతో ఆందోళనకు దిగిన బంధువులు


గోవింద్‌నాయక్

బాన్సువాడ రూరల్: పోలీసుల వాహన తనిఖీల నుంచి తప్పించుకోబోయి ఓవ్యక్తి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సుకింద పడి మృతి చెందిన ఘటన కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం బోర్లం క్యాంపు వద్ద చోటు చేసుకుంది. సోమ్లానాయక్ తండాకు చెందిన సోదరులు గోవింద్ నాయక్, రాములు నాయక్ టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తుండగా.. బోర్లం క్యాంపు వద్ద మూల మలుపులో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు కనిపించారు. దీంతో తనిఖీల నుంచి తప్పించుకుని వేరేమార్గంలో వెళ్లాలనే అత్రుతలో ఎదురుగా వస్తున్న బస్సును గుర్తించలేదు. ఆర్టీసీ బస్సు ఓ ద్విచక్రవాహనాన్ని తప్పించే క్రమంలో టీవీఎస్ ఎక్సెల్‌ను ఢీకొట్టింది. దీంతో గోవింద్ నాయక్ (55) ఘటనా స్థలంలోనే మృతి చెందగా రాములు నాయక్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. ఇదే సమయంలో మరో ద్విచక్రవాహనంపై వస్తున్న ఇద్దరు వ్యక్తులు కూడా అదుపుతప్పి కిందపడగా వారికి గాయాలయ్యాయి. స్థానికులు రాములు నాయక్‌తో పాటు ఆ ఇద్దరిని బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తర్వాత రాములు నాయక్‌ను మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు బాన్సువాడ పోలీస్‌స్టేషన్ ఎదుట మృత దేహంతో ఆందోళన చేపట్టారు.

వచ్చే నెలలో చేనేత రుణమాఫీ

- రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్

భూదాన్‌పోచంపల్లి: లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తికాగానే వచ్చే నెలలో కార్మికుల ఖాతాల్లో చేనేత రుణమాఫీ డబ్బులు జమ అవుతాయని రాష్ట్ర చేనేత జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ వెల్లడించారు. భూదాన్‌పోచంపల్లిలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో మాస్టర్ వీవర్, నేషనల్ మెరిట్ అవార్డు గ్రహీత తడక రమేశ్ ఏర్పాటు చేసిన పోచంపల్లి ప్రొడ్యూసర్ కంపెనీ షోరూంను.. వీవర్స్ సర్వీస్ సెంటర్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్‌తో కలిసి ఆమె గురువారం ప్రారంభించారు. అనంతరం శైలజా రామయ్యర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం చేనేత రుణమాఫీ లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందని చెప్పారు.

సినీ కార్మికుల సమ్మెకు తెర

- 22.5 శాతం వేతనాల పెంపునకు నిర్మాతల అంగీకారం
- నేటి నుంచి యథావిధిగా చిత్రీకరణలు
- సీఎం రేవంత్‌కు ధన్యవాదాలు: 'దిల్' రాజు


మీడియా సమావేశంలో దిల్ రాజు తదితరులు

సాక్షి, హైదరాబాద్: తెలుగు చలనచిత్ర పరిశ్రమలో కార్మికుల సమ్మెకు ఎట్టకేలకు తెరపడింది. కార్మికుల వేతనాలు 30 శాతం పెంచాలంటూ తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి కార్మికులు సమ్మె చేస్తుండటం తెలిసిందే. కార్మికశాఖ కార్యాలయంలో కార్మికశాఖ అదనపు కమిషనర్ గంగాధర్ ఆధ్వర్యంలో గురువారం ఫిల్మ్ చాంబర్, నిర్మాతలు, ఫెడరేషన్ నాయకులతో సుదీర్ఘంగా జరిగిన చర్చలు ఫలించాయి. కార్మికులు 30 శాతం వేతనాల పెంపు కోసం డిమాండ్ చేయగా 22.5 శాతం వేతనం పెంపునకు నిర్మాతలు ఓకే అన్నారు. దీంతో 18 రోజులుగా జరుగుతున్న సమ్మెకు ఫుల్‌స్టాప్ పడింది. దీంతో శుక్రవారం నుంచి యథావిధిగా చిత్రీకరణలు జరగనున్నాయి.

సీఎం సూచనతో పరిష్కారం చూపాం: 'దిల్'రాజు

చర్చల అనంతరం తెలంగాణ రాష్ట్ర చలన చిత్రాభివృద్ధి సంస్థ చైర్మన్, నిర్మాత 'దిల్' రాజుతోపాటు పలువురు సినీ ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు. 'నిర్మాతలకు, ఫెడరేషన్‌కు మధ్య నెలకొన్న సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశంతో గురువారం ఫెడరేషన్, ఫిల్మ్ చాంబర్, ఎఫ్‌డీసీ ద్వారా పరిష్కారం చూపాం. ఇందుకుగాను చిత్ర పరిశ్రమ తరపున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, కార్మికశాఖ అదనపు కమిషనర్ గంగాధర్‌కు సినీ పరిశ్రమ, ఫెడరేషన్ తరపున ధన్యవాదాలు. సినీ పరిశ్రమలో ఎప్పుడూ ఆరోగ్యకరమైన వాతావరణం ఉండాలి. భారతీయ చిత్రాలన్నీ హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుపుకునేలా ఉండాలనేది ముఖ్యమంత్రి ఫ్యూచర్ విజన్. తెలుగు సినిమాలతో పాటు అన్ని భాషల సినిమాలూ హైదరాబాద్‌లో చిత్రీకరణలు జరుపుకునేలా చేయడం మనందరి బాధ్యత. హైదరాబాద్‌ను ఫిల్మ్ హబ్‌గా తయారు చేద్దాం' అని 'దిల్'రాజు పేర్కొన్నారు.

రోజుకు రూ. 2 వేలలోపు ఉంటే తొలి ఏడాది 15 శాతం పెంపు

సినీ కార్మికులకు 22.5 శాతం వేతనాలు పెంచేందుకు నిర్మాతలు ముందుకురాగా ఫెడరేషన్ ప్రతినిధులు అందుకు ఒప్పుకున్నారని కార్మికశాఖ అదనపు కమిషనర్ గంగాధర్ తెలిపారు. రోజుకు రూ. 2 వేలలోపు వేతనాలు ఉన్న వారికి తొలి ఏడాది 15 శాతం, రెండో ఏడాది 2.5 శాతం, మూడో ఏడాది 5 శాతం పెంచనున్నారని చెప్పారు. అలాగే రూ. 2 వేల నుంచి రూ. 5 వేలు ఉన్నవారికి తొలి ఏడాది 7.5 శాతం, రెండో ఏడాది 5 శాతం, మూడో ఏడాది 5 శాతం వేతనాలు పెంచుతారని వివరించారు. ఇతర విషయాలపై చర్చించేందుకు ప్రిన్సిపల్ సెక్రటరీ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. మరోవైపు ఇప్పటివరకు ఆదివారాలు షూటింగ్ చేస్తే డబుల్ కాల్‌షీట్ లెక్కన వేతనాలు చెల్లిస్తుండగా ఇకపై పెద్ద సినిమాలకు ఒకటిన్నర కాల్‌షీట్, చిన్న సినిమాలకు మాత్రం రెండు, నాలుగో ఆదివారాలకే ఒకటిన్నర కాల్‌షీట్ ఉంటుందని గంగాధర్ తెలిపారు. చిన్న సినిమాల నిర్మాతలు సమస్యలపైనా చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

లేబర్ కమిషనర్ ఆధ్వర్యంలో పరిష్కారం: వల్లభనేని అనిల్‌కుమార్

'వేతనాల పెంపుపై లేబర్ కమిషనర్ ఆధ్వర్యంలో పరిష్కారం కుదిరింది. 30 శాతం వేతనాల పెంపు కోసం మేం అడగ్గా నిర్మాతలు 22.5 శాతానికి ఒప్పుకున్నారు. ప్రొడక్షన్ అసిస్టెంట్ యూనియన్, మహిళా వర్కర్స్, స్టూడియో వర్కర్స్, లైట్‌మెన్ యూనియన్ల కార్మికులకు ఎక్కువ వేతనం కావాలని అడిగాం. దీనిపై ఒక కమిటీ వేసి చర్చిస్తామని చెప్పారు. అంతిమంగా ఫైటర్లకు 7.5 శాతం, డ్యాన్సర్లకు 5.5 శాతం పెంచేందుకు ఒప్పుకున్నారు' అని తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్ తెలిపారు.

కలిసిమెలిసి ముందుకు సాగాలి

'ఎంతో జటిలమైన ఇండస్ట్రీ సమస్యను సామరస్యంగా, సమన్యాయం జరిగే విధంగా పరిష్కరించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. తెలుగు చిత్రసీమ అభివృద్ధికి ఆయన తీసుకుంటున్న చర్యలు అభినందనీయం. హైదరాబాద్‌ను దేశానికే కాదు, ప్రపంచ చలన చిత్ర రంగానికే ఓ హబ్‌గా మార్చాలన్న ఆయన ఆలోచనలు, అందుకు చేస్తున్న కృషి హర్షించదగినవి. తెలుగు చిత్రసీమ ఎప్పుడూ ఇలానే కలిసి మెలిసి ముందుకు సాగాలి. ప్రభుత్వం కూడా అన్ని రకాలుగా అండదండలు అందిస్తుందని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా' – చిరంజీవి

'పరిహారం' కోసం పోతే.. ప్రాణమే పోయింది

- సిద్దిపేట కలెక్టరేట్ ప్రాంగణంలో గుండెపోటుతో రైతు మృతి


కిష్టయ్య

సిద్దిపేటరూరల్: భూ పరిహారం ఓ రైతు ప్రాణం తీసింది. సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన బాలకిష్టయ్య (55)కు చెందిన రెండున్నర ఎకరాల భూమిని ప్రభుత్వం మల్లన్నసాగర్ కాల్వ నిర్మాణం కోసం 2019లో సేకరించింది. నష్టపరిహారంగా ఎకరాకు రూ.14.50 లక్షల చొప్పున సుమారు రూ.35 లక్షలు ఇచ్చేందుకు హామీ ఇచ్చింది. అతడి భార్య రాణి పేరిట తడ్కపల్లిలో ఉన్న 0.21 గుంటల భూమికి కూడా పరిహారం రావాల్సి ఉంది. పరిహారం డబ్బు కోసం తడ్కపల్లి, వెంకటాపూర్ రైతులతోపాటు బాలకిష్టయ్య కూడా బుధవారం ఉదయం కలెక్టరేట్‌కు చేరుకుని సాయంత్రం 4 గంటల వరకు కలెక్టర్ కోసం వేచి ఉన్నారు. ఆ సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు కలెక్టరేట్ ప్రాంగణం పక్కనే ఉన్న పార్కింగ్ వద్దకు వెళ్లిన బాలకిష్టయ్య గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. స్థానికులు 108కు సమాచారం అందించి సీపీఆర్ చేశారు. అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది ఆయనను పరిశీలించి మరణించినట్టు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న త్రీటౌన్ పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య చనిపోగా.. కుమారుడు, కోడలు ఉన్నారు.

54.79 లక్షల ఎకరాల్లో వరి

- గతేడాదికన్నా 23 లక్షల ఎకరాల్లో అదనంగా సాగు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఈ నెల మొదటి వారంలో 30 లక్షల ఎకరాల విస్తీర్ణంలో మాత్రమే వరి సాగు జరగ్గా మూడో వారానికల్లా అది 54 లక్షల ఎకరాలకు పెరిగింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు వివిధ ప్రాజెక్టుల నుంచి నీరు విడుదల కావడం, చెరువులు నిండటంతో రైతులు పెద్ద ఎత్తున వరిసాగు చేశారు. ఈ సీజన్‌లో వరిసాగు విస్తీర్ణం 62,47,868 ఎకరాలుగా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇప్పటివరకు 36.69 లక్షల ఎకరాల మేర సాధారణ వరి సాగు విస్తీర్ణం ఉంటుందని లెక్కగట్టింది. అయితే అనూహ్యంగా అంచనాలకు మించి ఏకంగా 54,79,517 ఎకరాల్లో వరి సాగు జరగడం విశేషం. గతేడాది ఇదే సమయానికి 31.60 లక్షల ఎకరాల్లోనే వరి సాగైనట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. మరోవైపు రాష్ట్రంలో ఈ సీజన్‌లో 1.32 కోట్ల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని అంచనా వేయగా అందులో ఇప్పటివరకు 1.18 కోట్ల ఎకరాల్లో అన్ని రకాల పంటలు సాగయ్యాయి. అంటే వ్యవసాయ శాఖ అంచనాల్లో 89.62 శాతం విస్తీర్ణం సాగులోకి వచ్చినట్లయింది. ఇందులో వరి తర్వాత అధికంగా పత్తి 44.91 లక్షల ఎకరాల్లో సాగైంది. అలాగే మొక్కజొన్న 6.13 లక్షల ఎకరాలు, కందులు 4.72 లక్షల ఎకరాలు, సోయాబీన్ 3.59 లక్షల ఎకరాల్లో సాగ య్యాయి. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల్లో ఒకప్పుడు భారీగా పండించిన వేరుశనగ పంట ఇప్పుడు కనుమరుగయ్యే స్థితికి చేరుకుంది. 27,547 ఎకరాల్లో వేరుశనగ సాగవుతుందని అంచనా వేయగా కేవలం 6 వేల ఎకరాలకే సాగు పరిమితమైంది. పొద్దు తిరుగుడు పువ్వు పంటను సిరిసిల్ల జిల్లాకు చెందిన ఓ రైతు కేవలం ఎకరం విస్తీర్ణంలో సాగు చేయడం గమనార్హం. ఈ నెలాఖరు నాటికి మరో 10 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ తెలిపింది.

3 నెలల్లోగా విచారణ ముగించాలి

- ఉద్యోగులపై క్రమశిక్షణ కేసుల విషయంలో సర్కారు ఉత్తర్వులు
- గడువు తప్పితే విచారణ అధికారులపై చర్యలుంటాయని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులపై చేపట్టే శాఖాపరమైన విచారణల్లో జాప్యాన్ని నివారించేలా నిర్దేశిత గడువులను రాష్ట్ర ప్రభుత్వం విధించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం ఆరోపణలు ఎదుర్కొనే ఉద్యోగులపై తెలంగాణ సివిల్ సర్వీసెస్ (క్లాసిఫికేషన్, కంట్రోల్, అప్పీల్) రూల్స్–1991 కింద, రిటైర్డ్ ఉద్యోగులపై తెలంగాణ రివైజ్డ్ పెన్షన్ రూల్స్–1980 కింద విచారణ నిర్వహిస్తారు. అవసరమైతే వారిపై కోర్టుల్లో అభియోగాలు నమోదు చేసి క్రిమినల్ చర్యలూ తీసుకుంటారు. సాధారణ కేసుల్లో శాఖాపరమైన అధికారి లేదా కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీల ఆధ్వర్యంలో 3 నెలల్లో విచారణ పూర్తి చేయాలని ప్రభుత్వం తాజాగా ఆదేశించింది. సంక్లిష్టమైన కేసుల్లో 5–6 నెలల్లో విచారణ పూర్తి చేయాలని స్పష్టం చేసింది. విచారణ అధికారి లేదా క్రమశిక్షణ అధికారిని నియమించిన తర్వాత ఈ కింది పేర్కొన్న గడువుల్లోగా ఆయా విచారణ ప్రక్రియలను పూర్తి చేయాలని ప్రభుత్వం తాజాగా గడువులు విధించింది.

గడువు తప్పితే విచారణ అధికారులపై చర్యలు..

నిర్దేశిత గడువుల్లోగా విచారణ పూర్తిచేయని పక్షంలో విచారణాధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేసింది. భారీ సంఖ్యలో సాక్షుల విచారణ, పత్రాల పరిశీలన అవసరమైతే ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని కోరింది.

పార్లమెంట్ సమావేశాల్లో బీసీలకు నిరాశే

- జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆవేదన



సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో బీసీలకు నిరాశే మిగిలిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై పార్లమెంట్‌లో కనీసం చర్చ జరగకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం సచివాలయ మీడియా పాయింట్ వద్ద జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లపై చర్చించాలని కాంగ్రెస్ అడగలేదని, బీసీ రిజర్వేషన్లపై చర్యలు తీసుకోవాల్సిన బీజేపీ ఏమీ చేయలేదని విమర్శించారు. ఇండియా, ఎన్డీయే రెండు కూటములు బీసీలను నిండాముంచాయని ఆరోపించారు. నెల రోజుల సమావేశాల్లో ఒక్కరోజు కూడా పార్లమెంట్లో రాహుల్ గాంధీ బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడకపోవడం దురదృష్టకరమన్నారు. బిహార్ అంశం తప్ప ఇండియా కూటమి నేతలకు బీసీ రిజర్వేషన్ల అంశం పట్టినట్టు లేదని ఎద్దేవా చేశారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు.

చెన్నూర్ ఎస్‌బీఐలో కుంభకోణం

- భారీగా బంగారు ఆభరణాలు, నగదు మాయం
- పరారీలో క్యాషియర్..


విచారణ జరుపుతున్న సీపీ అంబర్ కిషోర్

చెన్నూర్: మంచిర్యాల జిల్లా చెన్నూర్ ఎస్‌బీఐ బ్రాంచ్‌లో కుంభకోణం జరిగింది. నగదుతోపాటు ఖాతాదారులు తనఖా పెట్టిన బంగారునగలు మాయం కావడం జిల్లాలో సంచలనం సృష్టించింది. క్యాషియర్ పెద్దఎత్తున బంగారం, నగదు మాయం చేసినట్టు తెలుస్తోంది. బ్యాంకు మేనేజర్ మనోహర్‌రెడ్డి రెండురోజుల సెలవు తర్వాత మంగళవారం విధుల్లో చేరారు. బ్యాంకులోని డబ్బు, ఖాతాదారులు తనఖా పెట్టిన నగల్లో అవకతవకలు జరిగినట్టు గుర్తించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. దీంతో బ్యాంకు అధికారులు ఆడిటింగ్ నిర్వహించారు. సుమారు 330 మంది ఖాతాదారులు తనఖా పెట్టిన రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు విలువైన బంగారు ఆభరణాలు, రూ.80 లక్షల నగదు లావాదేవీల్లో తేడా వచ్చినట్టు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. జైపూర్ మండలం షెట్‌పల్లి గ్రామానికి చెందిన క్యాషియర్ రెండ్రోజులుగా బ్యాంకుకు రాకపోవడం, ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉండడంతోపాటు బంగారం మాయంలో కీలక పాత్ర ఉన్నట్టు పోలీసులు ప్రాథమిక విచారణలో గుర్తించినట్టు తెలిసింది. ఆడిటింగ్ శుక్రవారం పూర్తయ్యే అవకాశాలు ఉన్నట్టు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. బ్యాంక్‌ను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గురువారం పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

ఇద్దరు మావోయిస్టుల లొంగుబాటు

- సునీత మావోయిస్టు పార్టీ సీనియర్ స్టేట్ కమిటీ సభ్యురాలు
- హరీశ్ ఏరియా కమిటీ సభ్యుడు


సునీత, చెన్నూరి హరీశ్

సాక్షి, హైదరాబాద్: ఇద్దరు మావోయిస్టులు గురువారం రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఎదుట లొంగిపోయారు. వనస్థలిపురంలోని విజయపురి కాలనీకి చెందిన సునీత..1985లో రాజమండ్రిలో ఇంటర్ చదివే రోజుల్లో రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) భావాలకు ఆకర్షితులయ్యారు. ఆమె తండ్రి కాకరాల సత్యనారాయణ విరసంలో సభ్యుడు కావడంతో వారి ఇంటికి తరచూ వరవరరావు, గద్దర్ వస్తుండేవారు. దీంతో చిన్నతనం నుంచే ఆమె విప్లవభావాలకు ఆకర్షితులయ్యారు. 1986లో ఆమె పీపుల్స్‌వార్‌లో చేరి అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది. 1986 నుంచి 1990 వరకూ విజయవాడలో సెంట్రల్ ఆర్గనైజేషన్ (సీఓ)లో కీలకంగా పనిచేసింది. ఈ క్రమంలోనే టీఎల్ఎస్ చలం అలియాస్ గౌతంతో పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత ఇద్దరూ వివాహం చేసుకున్నారు. 1992 వరకూ గుంటూరులోని సీఓలో పనిచేసిన ఆమె.. ఆపై నల్లమల అడవుల్లోకి వెళ్లి, ఫారెస్ట్ డివిజనల్ కమిటీలో పనిచేసింది. ఈ సమయంలోనే వెలిగొండ, భైరవకొండ ఎన్‌కౌంటర్లలో పాల్గొంది. 2001 వరకూ అక్కడే పనిచేసిన సునీత.. 2001లో డివిజనల్ కమిటీ మెంబర్ (డీవీసీఎం)గా పదోన్నతి పొంది.. ఆమె భర్తతోపాటు ఆంధ్రా–ఒడిశా సరిహద్దు (ఏఓబీ) రీజియన్‌కు బదిలీ అయ్యింది. ఈ సమయంలోనే పూజారిగూడ ఎన్‌కౌంటర్‌లో పాల్గొంది. 2006లో భర్త చలంతోపాటు దండకారణ్యానికి బదిలీ అయ్యింది. ఈ ఏడాది జూన్ 5న సునీత ఆమె భర్త చలం నేషనల్ పార్క్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో మృతి చెందాడు. కాకరాల సునీత బద్రీ/లక్ష్మీ/గురుస్మృతి/సరోజ్ తదితర పేర్లతో మావోయిస్టు ఉద్యమంలో పనిచేసింది.

చదువుకునే రోజుల్లో ఆకర్షితుడై...

భూపాల్‌పల్లి జిల్లాకు చెందిన చెన్నూరి హరీశ్ అలియాస్ రామన్న.. ఏటూరునాగారంలో 10వ తరగతి చదువుతున్న క్రమంలో 2006లో మావోయిస్టు పార్టీ సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరయ్యాడు. ఈ క్రమంలోనే పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితుడై 2017లో పార్టీలో చేరాడు. 2020లో బడే చొక్కారావు అలియాస్ దామోదర్ బృందం టీఎస్‌సీఎంలో పనిచేశాడు. అక్కడ్నుంచి చర్ల ఎల్ఓఎస్ (లోకల్ ఆర్గనైజింగ్ స్క్వాడ్), నేషనల్ పార్క్ ఏరియా, మంగి–ఇంద్రవెల్లి ఏరియా దళంలో కొంతకాలం పనిచేశాడు. 2022 డిసెంబర్‌లో నేషనల్ పార్క్ ఏరియాలో జరిగిన పోలీసుల ఎదురుకాల్పుల్లో మావోయిస్టులు అనిత, అశోక్‌లు మృతి చెందగా.. హరీశ్ కుడి కాలులో బుల్లెట్ గాయమైంది. గతేడాది మేలో ఏరియా కమిటీ మెంబర్‌గా పదోన్నతి పొందాడు.

మన గడ్డపై నుంచి మన రాకెట్‌లో అంతరిక్షంలోకి...

త్వరలోనే అది సాకారం కావడం తథ్యం ● వ్యోమగామి శుభాంశు శుక్లా ధీమా

న్యూఢిల్లీ: అంతరిక్ష ప్రయోగాల్లో భారత్ మరింత వేగంతో దూసుకెళ్లడం ఖాయమని భారత వ్యోమగామి, భారత వైమానిక దళం గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా ఉద్ఘాటించారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి(ఐఎస్ఎస్) వెళ్లి, విజయవంతంగా తిరిగి వచ్చిన శుక్లా ఇటీవల స్వదేశానికి చేరుకున్న సంగతి తెలిసిందే. ఆయన గురువారం ఢిల్లీలో మీడియా సమావేశంలో మాట్లాడారు. మన వ్యోమగామి మన గడ్డపై నుంచి మన సొంత రాకెట్, మన సొంత క్యాప్సూల్‌లో అంతరిక్షంలోకి వెళ్లడం తథ్యమని, త్వరలోనే అది సాకారమవుతుందని పేర్కొన్నారు. ఐఎస్ఎస్ మిషన్ ద్వారా వెలకట్టలేని అనుభవం సొంతం చేసుకున్నానని తెలిపారు. శిక్షణ ద్వారా నేర్చుకున్నదాని కంటే ఇది ఎంతో మెరుగైనదని అన్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి మన దేశం అద్భుతంగా కనిపించిందని, సారే జహాసే అచ్ఛా అని వ్యాఖ్యానించారు. యాక్సియోమ్–4 మిషన్ ద్వారా గడించిన అనుభవం మన గగన్‌యాన్ మిషన్‌కు ఎంతగానో తోడ్పడుతుందని శుభాంశు శుక్లా పేర్కొన్నారు. ఐఎస్ఎస్ యాత్రలో భాగంగా గత ఏడాది కాలంలో ఎన్నో విషయాలు నేర్చుకున్నానని తెలిపారు. శుక్లా ఇంకా ఏం చెప్పారంటే...

ఈ విజయం భారతీయులదే

''ఎంత శిక్షణ పొందామన్నది ముఖ్యం కాదు. రాకెట్‌లో కూర్చున్న తర్వాత ఇంజన్‌ను మండించాక విభిన్నమైన అనుభూతి కలుగుతుంది. శిక్షణలో అలాంటిది పొందలేం. ఐఎస్ఎస్ యాత్రలో నేను పొందిన అనుభూతిని, అనుభవాన్ని మాటల్లో చెప్పలేను. రాకెట్ ఐఎస్ఎస్ వైపు దూసుకెళ్లడం మొదలయ్యాక.. కొన్ని సెకండ్లపాటు ఆ రాకెట్ వెనుక నేను పరుగెడుతున్నట్లు భావించా. నేను నిజంగా రాకెట్‌లో ప్రయాణిస్తున్నట్లు తెలియడానికి కొంత సమయం పట్టింది. నమ్మశక్యం కాని అనుభవం సొంతమైంది. నాకు అన్ని విధాలుగా మద్దతు ఇచ్చిన మన ప్రభుత్వానికి, ఇస్రోకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. ఐఎస్ఎస్ యాత్ర సఫలం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. తామే స్వయంగా ఈ యాత్రలో పాల్గొంటున్నట్లు భారతీయులంతా భావించారు. నాకు అన్ని వేళలా అండగా నిలిచారు. నేను క్షేమంగా తిరిగిరావాలని ప్రార్థించారు. నా విజయం ప్రజలందరికీ చెందుతుంది'' అని శుభాంశు శుక్లా స్పష్టంచేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లొచ్చిన మొట్టమొదటి భారతీయుడిగా శుక్లా చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే.



శుక్లాకు నేను లక్ష్మణుడిని: ప్రశాంత్

శుభాంశు శుక్లా రాముడైతే తాను లక్ష్మణుడిని అని గగన్‌యాన్ మిషన్‌లో భాగస్వామి అయిన గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ నాయర్ చెప్పారు. మీడియా సమావేశంలో ఆయన కూడా మాట్లాడారు. శుక్లా వయసులో తన కంటే చిన్నవాడైనప్పటికీ తనకు అన్నగానే భావిస్తానని అన్నారు. ఈ రాముడికి లక్ష్మణుడిగా ఉండడం తనకు ఇష్టమని తెలిపారు. రామలక్ష్మణులకు మొత్తం వానరసేన అండగా నిలిచిందని గుర్తుచేశారు. ఇస్రోలో తామంతా ఒక బృందంగా కలిసి పనిచేస్తున్నామని వివరించారు. అది ఫెంటాస్టిక్ టీమ్ అన్నారు. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. ఇస్రోను 1969లో స్థాపించారని, గత పదేళ్లుగా ఎన్నో విజయాలు సాధిస్తున్నామని చెప్పారు. గతంలో అంతరిక్ష ప్రయోగాల్లో మూసధోరణి ఉండేదని, దాన్ని బద్ధలు కొట్టామని పేర్కొన్నారు. ఇప్పుడు మనమే ప్రపంచ దేశాలకు మార్గదర్శిగా మారామని తెలిపారు.

రాజ్‌నాథ్ సింగ్‌తో శుక్లా భేటీ

వ్యోమగామి శుభాంశు శుక్లా గురువారం రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశమయ్యారు. తన అంతరిక్ష ప్రయాణం గురించి శుక్లా వివరించారు. శుక్లా ప్రస్థానం యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఆయన విజయాలు మనకు గర్వకారణమని వివరించారు.



పుతిన్‌తో జైశంకర్ భేటీ

మాస్కో: భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ గురువారం రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశమయ్యారు. రాజధాని మాస్కోలో జరిగిన ఈ సమావేశంలో భారత్–రష్యా సంబంధాలపై వారు చర్చించుకున్నట్లు సమాచారం. రష్యా నుంచి చమురు కొంటున్నందుకు ప్రతీకారంగా భారత ఉత్పత్తులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50 శాతం టారిఫ్‌లు విధించిన నేపథ్యంలో పుతిన్‌తో జైశంకర్ సమావేశమై చర్చించడం ప్రాధాన్యం సంతరించుకుంది. పుతిన్‌తో భేటీ అనంతరం జైశంకర్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఉక్రెయిన్ విషయంలో తాజా పరిణామాలను తనతో పంచుకున్నందుకు పుతిన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ తరఫున ఆయనకు శుభాకాంక్షలు తెలిపానని చెప్పారు. రష్యా ఫస్ట్ డిప్యూటీ ప్రైమ్ మినిస్టర్ డెనిస్ మంతురోవ్, విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్‌తో తన భేటీ వివరాలను పుతిన్‌కు వివరించానని స్పష్టంచేశారు.

పెట్టుబడులతో రండి!

భారత్‌తో వ్యాపార అభివృద్ధికి అద్భుతమైన అవకాశాలున్నాయి

- రష్యా పారిశ్రామికవేత్తలకు విదేశాంగ మంత్రి జైశంకర్ పిలుపు
- రష్యా ఫస్ట్ డిప్యూటీ ప్రైమ్‌మినిస్టర్ మంతురోవ్‌తో భేటీ


మంతురోవ్‌తో జైశంకర్

మాస్కో: సంక్లిష్టమైన భౌగోళిక సవాళ్లు ఎదుర్కోవడానికి భారత్–రష్యా కలిసికట్టుగా పనిచేయాలని, ఇందుకోసం సృజనాత్మక, నూతన మార్గాలు అన్వేషించాలని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ పిలుపునిచ్చారు. రెండు దేశాలు పరస్పర సహకార ఎజెండాను మరింత విస్తృతపర్చుకోవాలని, వైవిధ్య భరితంగా మార్చుకోవాలని చెప్పారు. మరిన్ని ఉమ్మడి కార్యక్రమాల ద్వారా ద్వైపాక్షిక వాణిజ్యంలో వైవిధ్యం కృషి చేయాలని అన్నారు. భారత్–రష్యా సంబంధాలను మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లడం, విభిన్నమైన వాణిజ్య సంబంధాలు నెలకొల్పడం మనం ఆశయం కావాలని స్పష్టం చేశారు. జైశంకర్ బుధవారం మాస్కోలో రష్యా ఫస్ట్ డిప్యూటీ ప్రైమ్‌మినిస్టర్ డెనిస్ మంతురోవ్‌తో సమావేశమయ్యారు. భారత్–రష్యా సంబంధాలు, తాజా పరిణామలపై చర్చించారు. ఇండియా–రష్యా ఇంటర్–గవర్నమెంటల్ కమిషన్ ఫర్ ట్రేడ్, ఎకనామిక్, సైంటిఫిక్, టెక్నాలాజికల్, కల్చరల్ కో–ఆపరేషన్(ఐఆర్ఐజీసీ–టీఈసీ) ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా ఈ చర్చలు జరిగాయి. భారత్‌పై అమెరికా ప్రభుత్వం భారీగా టారిఫ్‌లు విధించిన నేపథ్యంలో భారత్–రష్యా సంబంధాల ఆవశ్యకతను జైశంకర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రధానంగా ఇరుదేశాల నడుమ ఆర్థిక బంధం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

పూర్తి సామర్థ్యం మేరకు కలిసి పనిచేద్దాం

భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని రష్యా పారిశ్రామికవేత్తలకు జైశంకర్ విజ్ఞప్తి చేశారు. వ్యాపార అభివృద్ధికి భారత్‌లో అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని, వీటిని ఉపయోగించుకోవాలని చెప్పారు. నూతన రంగాల్లోనూ స్నేహ సంబంధాలను విస్తరింపజేసుకోవాలని సూచించారు. వ్యాపార, పెట్టుబడుల సంబంధాల్లో పూర్తి సామర్థ్యం మేరకు కలిసి పని చేద్దామని కోరారు. ఇందుకోసం కొన్ని లక్ష్యాలు, గడువులు నిర్దేశించుకుంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. సమున్నత లక్ష్య సాధన కోసం మనకు మనమే సవాలు విసురుకోవాలని వ్యాఖ్యానించారు. చేతులు కలిపి ఉమ్మడిగా పనిచేస్తే నిర్దేశించుకున్న లక్ష్యానికి మించి సాధించవచ్చని స్పష్టంచేశారు. ఐఆర్ఐజీసీకి సంబంధించిన వేర్వేరు వర్కింగ్ గ్రూప్‌లు, బిజినెస్ ఫోరమ్ మధ్య సహకారం కోసం ఒక యంత్రాంగం ఏర్పాటు చేసుకుందామని ప్రతిపాదించారు. ఒకరి ఆలోచనలను మరొకరితో పంచుకోవాలన్నారు. ఇండియా, రష్యాలోని వ్యాపార, వాణిజ్యవేత్తలకు ఐఆర్ఐజీసీ తోడ్పడుతుందని తెలిపారు. నైపుణ్యం కలిగిన ఉద్యోగులు, కార్మికులను రష్యాకు పంపించబోతున్నట్లు జైశంకర్ చెప్పారు.

సెర్గీ లావ్‌రోవ్‌తో సమావేశం

ద్వైపాక్షిక వాణిజ్యాన్ని సమతుల, స్థిరమైన విధానంలో విస్తరింపజేసుకోవాలని భారత్, రష్యా నిర్ణయించుకున్నాయి. వాణిజ్యం విషయంలో నియంత్రణలు, అవరోధాలను వేగంగా పరిష్కరించుకోవాలని జైశంకర్ చెప్పారు. ఆయన రష్యా విదేశాంగ మంత్రి లావ్‌రోవ్‌తో భేటీ అయ్యారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచంలో స్థిరంగా కొనసాగుతున్న అతిపెద్ద సంబంధాల్లో భారత్–రష్యా సంబంధాలు కూడా ఉన్నాయని తెలిపారు. వాణిజ్య సంబంధాలను పెంపొందించుకోవాలని జైశంకర్, లావ్‌రోవ్ నిర్ణయానికొచ్చారు.

రాజ్యాంగవ్యవస్థలు పనిచేయకుంటే ఆ పని కోర్టులే చేస్తాయి

న్యూఢిల్లీ: రాష్ట్రాల బిల్లులకు ఆమోదం తెలపడంపై గవర్నర్లకు, తనకు గడువు నిర్దేశిస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సుప్రీంకోర్టు అభిప్రాయం కోరిన అంశంపై గురువారం సైతం రాజ్యాంగ ధర్మాసనం విచారణ కొనసాగింది. ఈ సందర్భంగా కేంద్రప్రభుత్వానుద్దేశిస్తూ పలు వ్యాఖ్యలు చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్ సేథ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఏఎస్ చందూర్కర్‌ల రాజ్యాంగ ధర్మాసనం ఈ అంశంపై వాదనలను ఆలకిస్తూ ఈ వ్యాఖ్యలుచేసింది. ''రాజ్యాంగబద్ధ సంస్థలు తమ విధులను నిర్వర్తించకుండా నిర్లక్ష్యవహించినా, రాష్ట్రాల శాసనసభలు ఆమోదించి పంపిన బిల్లులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా గవర్నర్ నిష్క్రియాపరత్వం చూపినా సరే తాము చేతులు కట్టుకుని కూర్చోవాలా?'' అని కేంద్ర తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను సూటిగా ప్రశ్నించింది. దీనిపై మెహతా బదులిచ్చారు. ''అసెంబ్లీలు ఆమోదించి పంపిన బిల్లులపై ఎటూ తేల్చకుండా గవర్నర్ వాటిని అలాగే తనవద్దే అట్టిపెట్టుకుంటే అలాంటి సందర్భాల్లో రాష్ట్రాలే రాజకీయ పరిష్కారాలను వెతకాలి. అంతేగానీ న్యాయస్థానాల నుంచి పరిష్కారాలను ఆశించకూడదు. సమస్య పరిష్కారానికి సంప్రతింపుల మార్గంలో వెళ్లాలి. చర్చలకే తొలి ప్రాధాన్యత దక్కాలి'' అని అన్నారు. దీనిపై జస్టిస్ సూర్యకాంత్ జోక్యం చేసుకున్నారు. '' మీరన్నట్లు చర్చలకు సిద్ధపడకుండా ఏదైనా రాష్ట్రంలో ప్రభుత్వం మా వద్దకొస్తే మేమేం చేయాలి?'' అని ప్రశ్నించారు. దీనికి బదులుగా మెహతా.. '' ఇలాంటి సందర్భాల్లో ప్రతి ఒక్క ముఖ్యమంత్రి కోర్టులను ఆశ్రయిస్తారని నేను అనుకోవట్లేను. సీఎం తొలుత ఆ గవర్నర్‌తో భేటీ కావాలి. అప్పుడా గవర్నర్ ప్రధానమంత్రిని, రాష్ట్రపతిని కలిసి వారి సలహాలు, సూచనలతో పరిష్కారాలు వెతుకుతారు. కొన్ని సార్లు టెలిఫోన్ సంభాషణలు కూడా సమస్యలను సద్దుమణిగేలా చేశాయి'' అని అన్నారు. '' సమస్యల పరిష్కారానికి కొన్ని దశాబ్దాలుగా ఇదే విధానాన్ని అవలంభిస్తున్నారు. ఇది కూడా సాధ్యంకాకపోతే తొలుత ప్రతినిధి బృందం రంగంలోకి దిగి గవర్నర్, రాష్ట్రపతితో చర్చలు జరుపుతుంది. కొన్ని సార్లు మధ్యవర్తిత్వం కూడా పనిచేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాలు, గవర్నర్ మధ్య సఖ్యత కోసం రాజనీతిజ్ఞత అనేది బాగా అక్కరకొస్తుంది'' అని మెహతా వాదించారు. దీనిపై సీజేఐ గవాయ్ స్పందించారు. '' ఈ ప్రక్రియలో ఏదైనా తప్పు జరిగితే ప్రత్యామ్నాయంఉండాలి కదా. రాజ్యాంగానికి పరిరక్షకులుగా కోర్టులున్నాయి. అందుకే ఇలాంటి ప్రత్యామ్నాయాన్ని సైతం రాజ్యాంగానికి ఆపాదించేలా ఉండాలి'' అని ఆయన అన్నారు. దీనిపై మెహతా మాట్లాడారు. '' ఏదైనా అంశాన్ని మనకు అనుగుణంగా ఆపాదించుకోవడం వేరు. రాజ్యాంగానికి సరిపోయేలా చూడడం వేరు. రాజ్యాంగబద్ధ సంస్థలతో ఏదైనా అంశాన్ని పరిష్కరించుకోవాలన్న సందర్భాల్లో కొంత వెసులుబాట్లు కల్పించాలి'' అని అన్నారు.

లోక్‌సభలో 12 రాజ్యసభలో 14

పలు బిల్లులకు పార్లమెంట్ ఆమోదం

- కళంకిత నేతల బిల్లు మొదలు, ఎస్ఐఆర్‌దాకా పలు అంశాలపై చర్చలతో అట్టుడుకిన పార్లమెంట్
- ఉభయసభలు నిరవధిక వాయిదా


గురువారం లోక్‌సభలో ప్రధాని మోదీ, అమిత్ షా, రాజ్‌నాథ్, నితిన్ గడ్కరీ తదితరులు

న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఆరంభమైంది మొదలు ఉభయసభలు ప్రతిరోజూ మాటల మంటలతో రగిలిపోయి గురువారం నిరవధికంగా వాయిదాపడ్డాయి. బిహార్‌లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) అంశంతో తొలిరోజు నుంచే విపక్షసభ్యుల నుంచి తీవ్ర ఆందోళనలు, అభ్యంతరాలు వెల్లువెత్తినాసరే అధికార పార్టీ ఎట్టకేలకు ఈ వర్షాకాల సెషన్‌లో లోక్‌సభలో 12 బిల్లులు, రాజ్యసభలో 14 బిల్లులకు మోక్షం ప్రసాదించింది. ఐదేళ్లకు మించి శిక్షపడే స్థాయి నేరారోపణలు ఎదుర్కొంటున్న ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్రమంత్రులను పదవుల నుంచి తొలగించే మూడు బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టినప్పుడు ఈ సెషన్ మొత్తంలోనే ఉధృతస్థాయిలో విపక్షనేతల నుంచి ప్రతిఘటన ఎదురైంది. మొత్తం సెషన్ ఆద్యంతం వాగ్వాదాలు, వాయిదాలు, వాకౌట్‌లతో కొనసాగింది. లోక్‌సభలో ఆమోదం పొందిన బిల్లుల్లో ఆన్‌లైన్ గేమింగ్ ప్రచారం, నియంత్రణ బిల్లు–2025, ఆదాయపన్ను బిల్లు– 2025, జాతీయ క్రీడల నిర్వహణ బిల్లు–2025, జాతీయ డోపింగ్ నిరోధక (సవరణ), బిల్లు–2025, పన్నుల చట్టాల(సవరణ) బిల్లు–2025, ఇండియన్ పోర్ట్స్ బిల్లు, ఐఐఎం(సవరణ) బిల్లు వంటి కీలక బిల్లులు ఉన్నాయి. ల్యాండింగ్ బిల్లు–2025, సముద్రమార్గంలో సరకు రవాణా బిల్లు–2025, తీరప్రాంతంలో రవాణా బిల్లు–2025 14 బిల్లులు రాజ్యసభలో ఆమోదం పొందాయి.

విలువైన కాలాన్ని కోల్పోయిన లోక్‌సభ

మొత్తం సెషన్‌లో లోక్‌సభ పలుమార్లు వాయిదా పడిన కారణంగా మొత్తంగా 84 గంటల పనిగంటలను కోల్పోయింది. 18వ లోక్‌సభలో ఇన్ని గంటలను వృథాగా కోల్పోవడం ఇదే తొలిసారి. జూలై 21న మొదలైన లోక్‌సభ మొత్తంగా 21 రోజులు సమావేశమైంది. కేవలం 37 గంటల 7 నిమిషాలు మాత్రమే లోక్‌సభ సజావుగా సాగిందని లోక్‌సభ సెక్రటేరియట్ వెల్లడించింది.

ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు తర్వాత..

ఆన్‌లైన్ గేమింగ్ బిల్లును ఆమోదించాక రాజ్యసభ సైతం నిరవధికంగా వాయిదాపడింది. విపక్ష సభ్యులు పదేపదే అడ్డుతగలడంతో మొత్తం సెషన్‌లో విలువైన కాలం వృథా అయిందని రాజ్యసభ డెప్యూటీ ఛైర్మన్ హరివంశ్ ఆవేదన వ్యక్తంచేశారు. ''రాజ్యసభ కేవలం 41 గంటల 15 నిమిషాలు మాత్రమే సజావుగా సాగిందని చెప్పారు. బిహార్ ఓటర్ల జాబితా, ఆప రేషన్ సిందూర్, నేరారోపణలు ఎదుర్కొంటున్న పీఎం, సీఎం, మంత్రుల ఉద్వాసన బిల్లులపై విపక్షాలు నిరసనలతో ఉభయసభలో హోరెత్తాయి. జగదీప్‌ధన్‌ఖడ్ అనూహ్యంగా తన ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేయడం సైతం సభను కుదిపేసింది.

ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు రాజ్యసభ ఆమోదం

న్యూఢిల్లీ: అన్ని రకాల ఆన్‌లైన్ మనీ గేమ్‌లను నిషేధిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రమోషన్, రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు–2025కి రాజ్యసభ ఆమోదముద్ర వేసింది. ఇప్పటికే లోక్‌సభలో ఆమోదం పొందిన ఈ బిల్లును కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఆన్‌లైన్ గేమ్‌ల వల్ల మధ్య తరగతి యువత తీవ్రంగా నష్టపోతోందని, ఆత్మహత్యలు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. ఈ గేమ్‌లు వ్యసనంగా మారుతున్నాయని, మన దేశంలో ప్రతిఏటా 45 కోట్ల మంది రూ.20,000 కోట్లకుపైగా పోగొట్టుకుంటున్నారని గుర్తుచేశారు. కుటుంబాలు కష్టపడి కూడబెట్టుకుంటున్న డబ్బు ఆన్‌లైన్ గేమ్‌లతో హరించుకుపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ గేమింగ్ అనేది అత్యంత ప్రమాదకరమైన వ్యాధిగా ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ధారించినట్లు ఆయన వెల్లడించారు. ఇంటర్నేషనల్ క్లాసిఫికేషన్ ఆఫ్ డిసీజెస్(ఐసీడీ) సైతం గేమింగ్‌ను వ్యాధిగా తేల్చిందన్నారు. ఆన్‌లైన్ గేమ్‌ల బారినపడిన వారిలో మానసిక సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. వారి హింసా ప్రవృత్తి పెరుగుతోందని అన్నారు. పలు ఆత్మహత్య కేసులను మంత్రి ప్రస్తావించారు. తల్లి క్యాన్సర్ చికిత్స కోసం దాచిపెట్టిన డబ్బును ఓ యువకుడు ఆన్‌లైన్ గేమ్‌లో పోగొట్టుకొని, మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడని వెల్లడించారు. మాదక ద్రవ్యాలతో ఎలాంటి సమస్యలు వస్తున్నాయో ఆన్‌లైన్ ఆటలతోనూ అలాంటి సమస్యలే వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

ఆసియాకు డబుల్ ఇంజిన్లు భారత్, చైనా!

చైనా రాయబారి జు ఫెయింగ్ హాంగ్

న్యూఢిల్లీ: స్వేచ్ఛావాణిజ్యంతో ఇన్నాళ్లా లాభపడిన అమెరికా ఇప్పుడు టారిఫ్‌ల పేరుతో బేరాలాడుతూ భారత్‌పై వేధింపులకు దిగుతోందని చైనా రాయబారి జు ఫెయింగ్‌హాంగ్ విమర్శించారు. భారత్‌పై అమెరికా ప్రభుత్వం 50 శాతం టారిఫ్‌లు విధించడాన్ని తమ దేశం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని చెప్పారు. మౌనంగా ఉంటే అమెరికా వేధింపుల్ని మరింతగా పెంచుతుందన్న ఆయన.. ఈ విషయంలో భారత్ పక్షాన చైనా గట్టిగా నిలబడుతుందని వెల్లడించారు. భారత ఉత్పత్తులకు చైనా మార్కెట్లను తెరవడంపై ఫెయింగ్ హాంగ్ స్పందిస్తూ... ఒకరి ఉత్పత్తులకు మరొకరు అవకాశమివ్వడం ద్వారా రెండు దేశాల అభివృద్ధికి ఎంతగానో అవకాశముందని చెప్పారు. ఆసియాకు రెండు దేశాలు డబుల్ ఇంజన్ల వంటివని అభివర్ణించారు. పోటీపరంగా చూస్తే ఐటీ, సాఫ్ట్‌వేర్, బయోమెడిసిన్ ఉత్పత్తుల్లో భారత్ మెరుగ్గా, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, నిర్మాణరంగం, నూతన ఇంధన రంగాల్లో చైనాది పైచేయిగా ఉందని వివరించారు. రెండు ప్రధాన మార్కెట్లు అనుసంధానమైతే ఆ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుందని వివరించారు.

ప్రధాని మోదీకి మేక్రాన్ ఫోన్

ఉక్రెయిన్, పశ్చిమాసియా సంక్షోభాలపై చర్చ

న్యూఢిల్లీ: ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మేక్రాన్ గురువారం ప్రధానమంత్రి నరేంద్రమోదీతో ఫోన్‌లో మాట్లాడారు. ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్ హమాస్ సంక్షోభాలకు శాంతియుత పరిష్కారం కోసం జరిగే ప్రయత్నాలపై ఇరువురు నేతలు చర్చించుకున్నారు. ఇటీవల వైట్ హౌస్‌లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశమైన యూరప్ దేశాల నేతల్లో మేక్రాన్ ఉన్నారు. రష్యాతో యుద్ధం ముగిశాక ఉక్రెయిన్‌కు భద్రతాపరమైన హామీ ఇచ్చిన నేతల్లో ఈయనొకరు. యూరప్ నేతలు, అమెరికా, ఉక్రెయిన్ అధ్యక్షులతో వాషింగ్టన్‌లో జరిగిన చర్చల వివరాలను మేక్రాన్ తెలిపారని అనంతరం మోదీ వెల్లడించారు. భారత్–ఫ్రాన్స్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు కట్టుబడి ఉన్నామని ఆయన ఎక్స్‌లో తెలిపారు. మేక్రాన్‌తో చర్చలు ఫలప్రదంగా సాగాయన్నారు.

టిబెట్‌లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్

టిబెట్ అటానమస్ రీజియన్ 60వ ఆవిర్భావ ఉత్సవాలకు హాజరు


జిన్‌పింగ్

బీజింగ్: టిబెట్ అటానమస్ రీజియన్(టీఏఆర్) 60వ ఆవిర్భావ ఉత్సవాలకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ హాజరయ్యారు. రాజధాని లాసాలోని ప్రముఖ పొటాలా ప్యాలెస్ స్క్వేర్‌లో బుధవారం జరిగిన వేడుకల్లో వివిధ వర్గాల ప్రతినిధులు, అధికారులు సహా 20 వేల మంది పాలుపంచుకున్నట్లు అధికార వార్తా సంస్థ జిన్హువా తెలిపింది. 2012లో జిన్‌పింగ్ అధికారంలోకి వచ్చాక లాసా రావడం ఇది రెండోసారి. టిబెట్‌ను రెండుసార్లు సందర్శించిన చైనా అధ్యక్షుడు కూడా ఈయనే. టిబెట్‌కు సంబంధించిన అన్ని అంశాల్లోనూ అధికార కమ్యూనిస్ట్ పార్టీ నాయకత్వమే పైచేయిగా ఉండాలని అధికారులకు పిలుపునిచ్చారు. టిబెటన్ బౌద్ధమతం సోషలిస్ట్ సమాజానికి అనుగుణంగా మార్పు చెందడానికి టిబెట్, చైనాలోని ఇతర ప్రాంతాల మధ్య సంబంధాలను మరింతగా పెంచాల్సిన అవసరముందని చెప్పారు. బౌద్ధం, ఇస్లాం సహా అన్ని మతాలను చైనాలోని హన్ సంస్కృతి, సంప్రదాయాలను అలవర్చుకునేలా కమ్యూనిస్ట్ పార్టీ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తుండటం తెల్సిందే. టిబెట్, అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దుల్లో బ్రహ్మపుత్ర నదిపై ప్రపంచంలోనే అతిపెద్ద జలాశయాన్ని నిర్మిస్తోంది. అదేవిధంగా, చైనాలోని మిగతా ప్రాంతాలను కలుపుతూ టిబెట్‌లోని భారత సరిహద్దు వాస్తవాధీన రేఖ(ఎల్ఏసీ)వరకు భారీ రైలు మార్గాన్ని నిర్మిస్తోంది. కాగా, లాసాలోని పొటాలా ప్యాలెస్ టిబెటన్ బౌద్ధ గురువులైన దలైలామాల నివాసంగా ఉండేది. శతాబ్దాలపాటు రాజకీయ, సాంస్కృతిక కేంద్రంగా పొటాలా కొనసాగింది. 1965లో చైనా ఆక్రమించుకోవడం, దలై లామా భారత్ సారథ్యంలోని టిబెటన్లు భారత్‌లో ఆశ్రయం పొందడం తెల్సిందే.

కాంగ్రెస్‌లో ప్రతిభావంతులతో రాహుల్‌లో అభద్రతాభావం

ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్య

న్యూఢిల్లీ: ప్రతిపక్షంలో ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో పలువురు ప్రతిభావంతులైన యువ నాయకులు ఉన్నారుగానీ వారికి పార్లమెంట్‌లో మాట్లాడే అవకాశం రావడం లేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఓ కుటుంబం కారణంగానే వారికి ప్రాధాన్యత దక్కడం లేదని పరోక్షంగా సోనియా గాంధీ కుటుంబాన్ని ప్రస్తావించారు. మోదీ గురువారం ఎన్డీయే నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్‌లో ప్రతిభ కలిగిన యువతను చూసి ఆ పార్టీ నేత రాహుల్ అభద్రతా భావానికి లోనవుతున్నారని, కరవరపాటు చెందుతున్నారని పేర్కొన్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఆమోదించిన బిల్లులపై మోదీ స్పందించారు. ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు ఆమోదం పొందడం పట్ల హర్షం వ్యక్తంచేశారు. ఇదొక కీలక సంస్కరణ అని చెప్పారు. ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. ఈ బిల్లుపై పార్లమెంట్‌లో జరిగిన చర్చలో ప్రతిపక్షాలు పాల్గొనకపోవడాన్ని తప్పు పట్టారు. సభలో అంతరాయం సృష్టించడం తప్ప వారికి ఇంకేమీ అక్కర్లేదని విపక్ష ఎంపీలపై మండిపడ్డారు.

సింహం ఎప్పుడూ సింహమే

- బీజేపీ, డీఎంకేలతో పొత్తు ప్రశ్నే లేదు
- నటుడు, టీవీకే చీఫ్ విజయ్ వ్యాఖ్య
- సీఎం స్టాలిన్‌కు పలు ప్రశ్నలు
- మదురైలో జరిగిన సభకు భారీగా జనం


సభలో మాట్లాడుతున్న విజయ్

సాక్షి, చెన్నై: సింహం ఎప్పటికీ సింహంగానే ఉంటుందని నటుడు, తమిళగ వెట్రి కళగం పార్టీ చీఫ్ విజయ్ స్పష్టం చేశారు. బీజేపీ, డీఎంకేలతో ఎన్నికల పొత్తు పెట్టుకోబోమని, ఆ రెండు పార్టీలు తమకు బద్ధ శత్రువులని విమర్శించారు. ఆత్మగౌరవంతోనే ముందుకు సాగుతామన్నారు. తమిళనాడులోని మదురైలో గురువారం జరిగిన పార్టీ రెండో మహాసభకు పెద్ద ఎత్తున జనం హాజరయ్యారు. 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు మద్దతు కూడగట్టుకోవడమే లక్ష్యంగా ఏర్పాటైన ఈ సభలో ఆయన ప్రసంగించారు. తమ రాజకీయ శత్రువు డీఎంకే కాగా, సైద్ధాంతిక శత్రువు బీజేపీ అని పేర్కొన్నారు. టీవీకే ఎవరికీ భయపడదు, మాఫియా వ్యాపారాలు చేయదు అని వ్యాఖ్యానించారు. తమిళనాడు బలం మొత్తం మనతోనే ఉంది. ఫాసిస్ట్ బీజేపీ, విషపూరిత డీఎంకేకి వ్యతిరేకంగా పోరాడుదాం అంటూ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. 'సింహం ఎప్పుడూ ప్రత్యేకమే. దాని గర్జన 8 కిలోమీటర్ల మేర ప్రతిధ్వనిస్తుంది. వేటకు మాత్రమే బయటకు వస్తుంది. అడవిలో నక్కలు చాలానే ఉంటాయి. సింహం మాత్రం ఒక్కటే. అదే అడవికి రాజు. ఇదే మా స్పష్టమైన ప్రకటన'అని విజయ్ పేర్కొన్నారు.

మిస్టర్ పీఎం మోదీజీ.. సీఎం స్టాలిన్ అంకుల్!

మిస్టర్ నరేంద్ర దామోదర దాస్ మోదీ జీ అంటూ అని సంబోధించిన విజయ్..తమిళనాడు ప్రజల ఆకాంక్షలను బీజేపీ పట్టించుకోవడం లేదన్నారు. అరెస్టయిన తమిళ జాలర్లను విడిపించాలి..కచ్చతీవును తిరిగి స్వాధీనం చేసుకోవాలి, నీట్‌ను రద్దు చేయాలని ఆయన డిమాండ్లు వినిపించారు. బీజేపీది బానిసల కూటమి అని విమర్శలు ఎక్కుబెట్టారు. ఆర్ఎస్ఎస్‌కు బీజేపీ బానిస అని, బీజేపీకి అనేక రాష్ట్ర పార్టీలు బానిసలుగా మారి మైనారిటీ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఆ బానిసలలో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ టీవీకే ఉండబోదని స్పష్టం చేశారు. అదేవిధంగా, మైడియర్ అంకుల్ అంటూ సీఎం స్టాలిన్‌ను ఉద్దేశించి విమర్శలను ఎక్కుపెట్టారు. మహిళలకు నెలకు రూ.వెయ్యి ఇస్తే సరిపోతుందా? వాళ్ల రోదనలు వినిపించడం లేదా? పరందూర్ ఎయిర్‌పోర్టుతో భూములు కోల్పోయిన రైతులు, మత్స్యకారుల ఆవేదన ఆలకించారా? మనస్సాక్షి ఉంటే సమాధానం ఇవ్వండని సవాల్ విసిరారు. మైడియర్ అంకుల్ వినిపిస్తుందా ప్రజా గళం? త్వరలో ప్రజల్లోకి వెళ్తున్నా. మనస్సు విప్పి మాట్లాడుతా..ఇక తమరికి నిద్ర కరువైనట్టే అని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలోని మొత్తం 234 స్థానాలలో తానే అభ్యర్థి అని, తనను ఆదరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మార్వాడీలపై దుష్ప్రచారాన్ని అరికట్టండి

డీజీపీకి తెలంగాణ అగర్వాల్ సమాజ్ సంఘం వినతి

సాక్షి, హైదరాబాద్: మార్వాడీ సమాజంపై ఆమనగల్‌లో జరుగుతున్న విద్వేష ప్రసంగాలు, రెచ్చగొట్టే చర్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీజీపీ జితేందర్‌ను తెలంగాణ అగర్వాల్ సమాజ్ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు అగర్వాల్ సమాజ్ తెలంగాణ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం డీజీపీ జితేందర్‌ను శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేసింది. రాష్ట్రంలోని అగర్వాల్, మార్వాడీ సమాజానికి ప్రాతినిధ్యం వహిస్తున్న అపెక్స్ బాడీ అగర్వాల్ సమాజ్ తెలంగాణ తరఫున ఈ వినతిపత్రం అందజేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఇటీవల తమ సమాజం సభ్యులను లక్ష్యంగా చేసుకుని విద్వేషపూరిత నినాదాలు, బెదిరింపు సంఘటనలు జరిగాయని వివరించారు. సికింద్రాబాద్ మోండా మార్కెట్ సంఘటనలో.. కొందరు వ్యక్తులు మార్కెట్ ప్రాంగణంలో బహిరంగంగా 'మార్వాడీ కల్చర్ గో బ్యాక్'.. అంటూ రెచ్చగొట్టే నినాదాలు చేశారని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్‌లో మార్వాడీ సమాజానికి వ్యతిరేకంగా ఇలాంటి విద్వేషపూరిత సంఘటనలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. ఈ సంఘటనల వీడియోలను ఉద్దేశపూర్వకంగా రికార్డ్ చేసి, విద్వేషాల వ్యాప్తికి.. యూట్యూబ్‌తో సహా సోషల్ మీడియా వేదికల్లో వైరల్ చేస్తున్నారని ఆరోపించారు. మార్వాడీ, అగర్వాల్ సమాజం శతాబ్దానికి పైగా తెలంగాణ సమాజంలో అంతర్భాగంగా ఉందని స్పష్టం చేశారు. తాము బయటి వ్యక్తులం కామని, రాష్ట్ర పురోగతిలో గర్వించదగిన భాగస్వాములమని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు.

జెన్‌కోలో రిజర్వేషన్లపై ఎస్సీ, ఎస్టీ కమిషన్ సమీక్ష



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ టీజీ జెన్‌కోలో రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ పాయింట్స్, బ్యాక్‌లాగ్ ఖాళీలపై సమీక్ష చేపట్టింది. కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య, సభ్యులు కుర్సం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణికుంట్ల ప్రవీణ్, చరణ్‌దాస్ ఈ సమీక్ష చేపట్టారు. జెన్‌కో సీఎండీ డాక్టర్ ఎస్.హరీశ్, పలువురు డైరెక్టర్లు జెన్‌కోలో అమలుచేస్తున్న రిజర్వేషన్ వివరాలను కమి షన్‌కు వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరిస్తామని జెన్‌కో ఎండీ కమిషన్‌కు హామీ ఇచ్చారు. కాగా, ఎస్సీ వర్గీకరణ తీసుకొచ్చిన నేపథ్యంలో విద్యుత్ శాఖల్లోని ఎస్సీ ఉద్యోగులకు తగిన విధంగా పదోన్నతులు కల్పించాలని మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ కోరింది. కమిషన్‌ను ఫెడరేషన్ అధ్యక్షుడు మంద దేవేందర్ ప్రసాద్ తదితరులు కలిసి వినతిపత్రం అందించారు.

బాబు సర్కార్‌దే ఈ పాపం..

హోం మంత్రి అనిత ఒత్తిడితోనే శ్రీకాంత్‌కు పెరోల్

తొలుత తిరస్కరించిన హోం శాఖ జాయింట్ సెక్రటరీ

- అయినా పెరోల్ కావాల్సిందేనని పట్టుపట్టిన టీడీపీ ఎమ్మెల్యేలు
- శ్రీకాంత్ సన్నిహితురాలు అరుణతో హోం మంత్రికి డీల్ కుదిర్చిన వైనం
- డీల్ ఓకే కావడంతో స్వయంగా నోట్‌ఫైల్‌పై సంతకం చేసిన అనిత
- తప్పని పరిస్థితిలో పెరోల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన హోం సెక్రటరీ
- ఈ మేరకు సీఎం కార్యాలయానికి ఇంటెలిజెన్స్ వర్గాల నివేదిక



జీవిత ఖైదీ శ్రీకాంత్‌కు పెరోల్ తిరస్కరిస్తూ హోం శాఖ జాయింట్ సెక్రటరీ జూలై 16న ఇచ్చిన ఉత్తర్వులు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

భారతీయ బ్యాంకులకు కస్టమర్ల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దేశంలో అతిపెద్ద బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఫిర్యాదులు అందుకోవడంలోనూ ముందుంది. ఈ విషయంలో ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో యాక్సిస్ బ్యాంక్ మొదటి స్థానంలో నిలిచింది. సేవల విషయంలో కొన్ని బ్యాంకులు స్వల్ప మెరుగుదలను చూపించినప్పటికీ మొత్తం ఫిర్యాదుల సంఖ్య గణనీయంగా ఉంది. ఖాతాదారుల తమ సమస్యలను నివేదించేందుకు బ్యాంకులు అందుబాటులోకి తెచ్చిన వేదికలపైనే కాదు.. సేవల్లో విఫలమైతే సామాజిక మాధ్యమాల్లోనూ బ్యాంకులను ఎండగట్టేందుకు వెనకాడటం లేదు.



బ్యాంకులపై.. భారీగా ఫిర్యాదులు!

- సేవల్లో వైఫల్యంపై పెరుగుతున్న కంప్లెయింట్లు
- సామాజిక మాధ్యమాల్లోనూ కస్టమర్ల ఏకరువు
- అంబుడ్స్‌మన్‌కూ వెల్లువెత్తుతున్న విన్నపాలు

డిజిటల్ ఎకానమీ మారుమూల పల్లెలకూ విస్తరిస్తుండడంతో బ్యాంకింగ్ సామాన్యులకూ చేరువైంది. బ్యాంకింగ్ విస్తృతితోపాటు అదే స్థాయిలో కస్టమర్లు సమస్యలనూ ఎదుర్కొంటున్నారు. దీంతో బ్యాంకులకు అందుతున్న ఫిర్యాదులూ పెరుగుతున్నాయి. 2024–25 సంవత్సరానికిగాను బ్యాంకుల బిజినెస్ రెస్పాన్సిబిలిటీ, సస్టేనబిలిటీ రిపోర్ట్స్ (బీఆర్ఎస్ఆర్) ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

- సాక్షి, స్పెషల్ డెస్క్

ఎస్‌బీఐలో 29.8 లక్షలు

అనధికారిక ఎలక్ట్రానిక్ డెబిట్ లావాదేవీలకు సంబంధించి వినియోగదారుల నుంచి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకి 6.87 లక్షలకు పైగా ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో మార్చి చివరి నాటికి 1.05 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. ఖాతాదారుడి అనుమతి లేకుండా మోసపూరితంగా బ్యాంక్ ఖాతా, డెబిట్/క్రెడిట్ కార్డు నుండి డబ్బు తీసుకోవడం, ఆన్‌లైన్ కొనుగోళ్లు, ఇతర అనుమానాస్పద కార్యకలాపాలను అనధికార ఎలక్ట్రానిక్ డెబిట్ లావాదేవీలుగా పరిగణిస్తారు. ఇక రుణాల మంజూరుతో సహా ముఖ్యమైన సేవలను అందించడంలో జాప్యంపై 12,502; సైబర్ భద్రత, ముఖ్యమైన సేవల పంపిణీ మినహా ఇతర ఫిర్యాదుల విభాగం కింద 21.50 లక్షల కంప్లెయింట్లను బ్యాంకు అందుకుంది. అంత క్రితం ఏడాదిలో 'ఇతర' విభాగం కింద బ్యాంకుకి 24.02 లక్షల ఫిర్యాదులు వచ్చాయి. మొత్తంగా అన్ని విభాగాల్లో కలిపి 29.8 లక్షల కంప్లెయింట్లు వస్తే పెండింగులో 1.2 లక్షలు ఉన్నాయి. పంజాబ్ నేషనల్ బ్యాంకుకి 11.39 లక్షలు, బ్యాంక్ ఆఫ్ బరోడాకు 5.34 లక్షల ఫిర్యాదులు వచ్చాయి.



ప్రైవేటు బ్యాంకుల్లోనూ..

2024-25లో యాక్సిస్ బ్యాంకు 5.90 లక్షల ఫిర్యాదులను అందుకుంది. వీటిలో మార్చి చివరి నాటికి 11,143 పెండింగ్‌లో ఉన్నాయి. 'ఇతర' విభాగంలో 76,111, ప్రకటనలకు సంబంధించి 12,744, అన్యాయమైన వాణిజ్య పద్ధతులను అవలంబించిందన్న ఆరోపణలపై 4,438 కంప్లెయింట్లు అందాయి.

- ఐసీఐసీఐ బ్యాంకుకి మొత్తం 5.34 లక్షల కంప్లెయింట్లు వచ్చాయి. వీటిలో మార్చి చివరి నాటికి 45,151 పరిష్కారానికి నోచుకోవాల్సి ఉంది. అంత క్రితం ఏడాది 3.46 లక్షల ఫిర్యాదులు వచ్చాయి. అన్ని మార్గాలలో కస్టమర్ ఫిర్యాదులను స్వీకరించే విధానం మెరుగుపడిందని, ఫలితంగా సంఖ్య పెరిగిందని బ్యాంకు తెలిపింది.
- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు 4.57 లక్షల ఫిర్యాదులను స్వీకరించింది. వీటిలో 16,306 పెండింగ్‌లో ఉన్నాయి. ఏడాది క్రితం 4.85 లక్షల కంప్లెయింట్లు వచ్చాయి.

అంబుడ్స్‌మన్‌కూ..

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు (ఆర్‌బీఐ) చెందిన అంబుడ్స్‌మన్ కార్యాలయాలకు 2024-25లో వివిధ బ్యాంకుల ఖాతాదారుల నుంచి 2.96 లక్షల ఫిర్యాదులు వచ్చాయి. అంత క్రితం ఆర్థిక సంవత్సరంలో వీటి సంఖ్య 2.93 లక్షలు. రుణాలు, అడ్వాన్సులు, డిజిటల్ బ్యాంకింగ్ ఉత్పత్తులకు సంబంధించిన కస్టమర్లు లేవనెత్తిన సాధారణ సమస్యలు వీటిలో ప్రధానంగా ఉన్నాయి. ఈ కంప్లెయింట్లలో ఎక్కువ భాగం బ్యాంకులపైనే ఉన్నాయి. ఆ తరువాతి స్థానంలో బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీలు), నాన్–బ్యాంక్ సిస్టమ్ పార్టిసిపెంట్స్, క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరోలు ఉన్నాయి.



సోషల్ మీడియాలో చురుగ్గా..

సామాజిక మధ్యమాల్లో కస్టమర్ ఫిర్యాదులు, ప్రశ్నలకు పరిష్కారం, స్పందించడంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అత్యంత చురుగ్గా ఉన్నాయని సోషల్ మీడియా రిసెర్చ్ సంస్థ 'సింప్లిఫై360' ఇటీవలి నివేదిక వెల్లడించింది. జూన్ 13–28 మధ్య తొమ్మిది ప్రముఖ బ్యాంకుల సోషల్ మీడియా పోస్టుల ఆధారంగా ఈ నివేదికను రూపొందించింది.

- ఫేస్‌బుక్‌లో రోజుకు 3 పోస్టులతో ఎస్‌బీఐ అత్యంత చురుకైన బ్యాంకుగా నిలిచిందని ఈ నివేదిక వివరించింది.
- ఫేస్‌బుక్, ఎక్స్ (గతంలో ట్విట్టర్) వేదికగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 45 శాతం, ఎస్‌బీఐ 41 శాతం ప్రశ్నలకు సమాధానం ఇచ్చాయి.
- యాక్సిస్, ఐసీఐసీఐ, స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్ 80 శాతం ప్రశ్నలను పరిష్కరించడంలో విఫలమయ్యాయి.
- ఫేస్‌బుక్‌లో ఐసీఐసీఐ, యాక్సిస్ బ్యాంకులు ఉత్తమ ప్రదర్శన కనబరిచాయి. కానీ ఇవి ఎక్స్‌లో పెద్దగా రాణించలేదు.
- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎక్స్‌లో చాలా చురుకుగా ఉన్నప్పటికీ బ్యాంక్ తన ప్రయత్నాలకు పెద్దగా గుర్తింపు పొందలేదని నివేదిక వివరించింది.

రామంతాపూర్‌కు చెందిన ఆంజనేయులు ఇంటికి వెళ్లేందుకు ఆదివారం రాత్రి 8.30 గంటలకు బంజారాహిల్స్ నుంచి బయలుదేరి 9 గంటలకు లక్డీకాపూల్ చేరుకున్నారు. రాత్రి 10.30 వరకు ఎదురుచూసినా రామంతాపూర్ బస్సు రాలేదు. అప్పటికే అక్కడ 30 మంది వరకు ప్రయాణికులు జమయ్యారు. ఓవైపు బోరున వర్షం కురుస్తుండటం, ఇటు బస్సు రాకపోవటంతో వారి అవస్థలు వర్ణనాతీతం. రెండుగంటలపాటు ఎదురుచూస్తే గానీ బస్సు రాలేదు. ఇది ఒక్క ఆంజనేయులుకు ఎదురైన పరిస్థితే కాదు.. ఆదివారం సాయంత్రం నుంచి నగరవ్యాప్తంగా వేలాదిమంది ప్రయాణికులు ఎదుర్కొన్న దుస్థితి. వర్షం కురిసే సమయం ...సెలవు రోజుల్లో ఇదే పరిస్థితి ఎదురుకానుంది.



సెలవొస్తే.. సిటీబస్సు ట్రిప్పులకూ బ్రేక్!

సాక్షి, హైదరాబాద్: ఆదాయం పెంపుపై దృష్టి సారిస్తున్న ఆర్టీసీ.. మరోవైపు ఖర్చులను కూడా నియంత్రించుకునే పనిలో నిమగ్నమైంది. ఇప్పుడు ఈ ఆలోచన నగరవాసులపై పెద్ద ప్రభావమే చూపబోతోంది. వానలు కురిసిన సమయంలో, పండుగల వేళ రద్దీ అంతంత మాత్రమే ఉంటోందని భావిస్తున్న ఆర్టీసీ, ఆయా సమయాల్లో బస్సులను పరిమితంగానే నడపాలని యోచిస్తోంది. ఇటీవల వర్షం కురిసిన ఓ రోజు కొన్ని ప్రాంతాల్లో తక్కువ రద్దీతో బస్సులు తిరగటాన్ని గుర్తించిన ఆర్టీసీ ఉన్నతాధికారులు, ఆ సమయంలో ప్రయాణికుల రద్దీ తక్కువగా ఉంటుందని, అలాంటి సమయాల్లో బస్సుల సంఖ్య తగ్గించి తిప్పాలని డిపో మేనేజర్లను మౌఖికంగా ఆదేశించారు. శనివారం మరోసారి పరిశీలించిన అధికారులు, రద్దీ తక్కువగా ఉన్నా.. ఎక్కువ బస్సులు ఎందుకు తిప్పుతున్నారంటూ సిటీ అధికారులను ప్రశ్నించారు. దీంతో సంబంధిత అధికారులు అందరు డిపో మేనేజర్లకు మరోసారి సీరియస్‌గా మౌఖికంగానే ఆదేశాలిచ్చారు. ఆదివారం నుంచి బస్సుల సంఖ్య తగ్గించాలని పేర్కొన్నారు. దీంతో డిపో మేనేజర్లు ఆదివారం దాదాపు 20 శాతం బస్సు ట్రిప్పులను తగ్గించేశారు. రాత్రి పూట ఎక్కువ బస్సులను రద్దు చేశారు. రాత్రి 9 తర్వాత సింహభాగం బస్సులను డిపోలకే పరిమితం చేసి అతి పరిమితంగా నడిపారు. దీంతో ఆ సమయంలో రోడ్లపై మిగిలిపోయిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వచ్చింది.

2019లోనూ ఇదే తరహాలో...

2019లో దీర్ఘకాల సమ్మె తర్వాత ప్రభుత్వం ఆర్టీసీ తీరుపై సమీక్షించిన సమయంలోనూ ఇదే తరహా నిర్ణయం జరిగింది. నగరంలో రద్దీ లేని సమయాల్లో కూడా ఎక్కువ సంఖ్యలో బస్సులు తిప్పుతున్నారని, ఇది డీజిల్ దుబారాకు కారణమవుతోందని పేర్కొన్న ప్రభుత్వం, నగరంలో 2 వేల బస్సులు తగ్గించాలని ఆదేశాలిచ్చింది. అప్పుడు అంతమేర బస్సులను రద్దు చేసిన ప్రభావం ఇప్పటికీ కొనసాగుతోంది. నగరంలో కేవలం 3 వేల బస్సులు మాత్రమే ఉండగా, హైదరాబాద్ నగర జనాభాతో సమంగా ఉన్న బెంగళూరులో ప్రస్తుతం 8,900 సిటీ బస్సులు తిరుగుతున్నాయి. అసలే తక్కువ బస్సులున్న తరుణంలో ఒకేసారి 2 వేల బస్సులు తగ్గించటంతో ఏర్పడిన కొరత ఇప్పటికీ కొనసాగుతోంది. ఈ తరుణంలో రద్దీ తక్కువగా ఉన్న సమయంలో ఆ సంఖ్యను మరింత తగ్గించి నడిపితే, రోడ్లపై ఉన్న ప్రయాణికులు బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి వస్తుంది. కానీ, ప్రయాణికుల అవస్థల కంటే ఆదాయమే ముఖ్యమన్న తరహాలో ఆర్టీసీ వ్యవహరిస్తుండటం ఇప్పుడు నగర ప్రయాణికులకు శాపంగా మారబోతోంది. గత్యంతరం లేని స్థితిలో, జేబులో బస్‌పాస్ ఉండి కూడా ఆటోలు, క్యాబ్‌లపై ఆధారపడాల్సి వస్తోంది. మహాలక్ష్మి పథకం ఉండి కూడా మహిళలు భారీ మొత్తం చెల్లించి ఆటోలు, క్యాబ్‌లలో వెళ్లాల్సి వస్తోంది.

వాన కురిసే వేళా అంతే...

- ప్రయాణికుల రద్దీ తక్కువున్న సమయంలో సర్వీసుల సంఖ్య కుదించాలని నిర్ణయించిన ఆర్టీసీ
- డిపో మేనేజర్లకు మౌఖిక ఆదేశాలు.. గత ఆదివారం నుంచి అమలు షురూ
- ఆరోజు రాత్రి బస్సుల జాడ లేక గంటల తరబడి రోడ్లపైనే గడిపిన జనం
- డీజిల్ ఖర్చును తగ్గించుకునేందుకు ఆర్టీసీ ఆరాటం
- లాభనష్టాల ఆధారంగా బస్సులు నడిపే నిర్ణయం

రద్దీ లేకుంటే రద్దు చేయమన్నారు

రోడ్లపై ప్రయాణికుల సంఖ్యను గమనిస్తూ తక్కువగా ఉన్న రోజుల్లో 10 నుంచి 15 శాతం సర్వీసులు నడపొద్దని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఆ మేరకు ఆదివారం మా డిపో పరిధిలో సాయంత్రం తర్వాత కొన్ని సర్వీసులను రద్దు చేశారు. సెలవు రోజుల్లో ఇలాగే కొనసాగించాలని సూచించారు. **- ఓ కండక్టర్**

ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదు

రాత్రి 9:30 గంటల సమయంలో బస్సుల కోసం గంటన్నర నుంచి రెండు గంటల పాటు ఎదురుచూసే పరిస్థితిని నేను ఎప్పుడూ చూడలేదు. ఆ సమయంలో 113 నంబరు బస్సు కోసం గమ్యం యాప్ చూస్తే వాటి జాడే లేదు. రాత్రి పదిన్నర సమయంలో ఒక బస్‌స్టాప్‌లో 30 మంది ప్రయాణికులు జమయ్యారంటే సర్వీసుకు సర్వీసుకు మధ్య విరామం ఎంత ఎక్కువగా ఉందో అవగతమవుతుంది. **-ఆంజనేయులు, రామంతాపూర్**

మూసీ సుందరీకరణ పేరిట భారీ దోపిడీ

- అంచనాలు రూ.16 వేల కోట్ల నుంచి రూ.1,50,000 కోట్లకు పెంచారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్ : మూసీ నది ప్రక్షాళన, సుందరీకరణ పేరుతో ప్రజల సొమ్మును దోచుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మూసీ అభివృద్ధి కోసం అన్ని ఏర్పాట్లు చేసి, మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం దాని అంచనాలను భారీగా పెంచి దోపిడీకి తెరలేపిందని గురువారం ఒక ప్రకటన ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి నీళ్లను హైదరాబాద్ దగ్గరలోని కొండపోచమ్మ సాగర్‌కు తెచ్చింది కేసీఆర్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. కొండపోచమ్మ సాగర్ నుంచి గండిపేట చెరువులోకి గోదావరి నీళ్లను తరలించడానికి 2022 లోనే రూ.1,100 కోట్లతో ప్రతిపాదనలకు ఆమోదం కూడా కేసీఆర్ ప్రభుత్వమే ఇచ్చిందని తెలిపారు. మూసీ అభివృద్ధి కోసం మొత్తం రంగం సిద్ధం చేసి రూ.16,000 కోట్లతో మాస్టర్ ప్లాన్, డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) తయారు చేస్తే, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆ అంచనాలను రూ.1,50,000 కోట్లకు పెంచి దోపిడీకి పాల్పడుతోందని ఆరోపించారు. ఈ దోపిడీని కచ్చితంగా అడ్డుకుంటామని స్పష్టంచేశారు. పదవి కాపాడుకునేందుకు ఢిల్లీకి మూటలు పంపుతూ..'నగర అభివృద్ధి' అనే అందమైన ముసుగు వేసుకున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని పచ్చి అబద్ధాలు చెబుతూ, మరోవైపు అదే కాళేశ్వరంలో అంతర్భాగమైన కొండపోచమ్మ సాగర్ నుంచి గోదావరి నీటిని తీసుకుంటామని చెబుతున్నారని ఎద్దేవా చేశారు.

రైతులను నిర్లక్ష్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- కేంద్ర పథకాలను సక్రమంగా అమలు చేయడం లేదు
- పల్లెపల్లెకూ బీజేపీ ప్రవాస్ యోజనలో రాంచందర్‌రావు



మల్కాపూర్ వద్ద బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

చేవెళ్ల: కేంద్ర పథకాలను రైతులకు అందించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం చన్‌వెళ్లిలో గురువారం ఆయన పల్లెపల్లెకూ బీజేపీ ప్రవాస్ యోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మల్కాపూర్ బస్టేజీ వద్ద పార్టీ శ్రేణులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికాయి. అనంతరం చేవెళ్లలోని ఫెర్టిలైజర్ దుకాణంలో ఎరువులను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి వెంకటేశ్వరాలయానికి చేరుకొని పూజలు చేశారు. అనంతరం చనువెల్లిలో రైతుల సమావేశం నిర్వహించి, అక్కడి నుంచి ఖానాపూర్ స్టేజీ వద్ద నిర్వహించిన యువ సమ్మేళనంలో పాల్గొన్నారు. రాత్రి ఖానాపూర్‌లోని ఓ దళిత రైతు ఇంట్లో బస చేశారు. ఆయాచోట్ల రాంచందర్‌రావు మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఫసల్ బీమాను అమలు చేస్తుంటే.. కాంగ్రెస్ దీనిని విస్మరించిందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన రుణమాఫీ, రైతు భరోసా పథకాలను సంపూర్ణంగా అమలు చేయకుండా రేవంత్ సర్కార్ మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. దేశంలో ఎక్కడా లేని యూరియా కొరత కేవలం తెలంగాణలోనే ఎందుకు వచ్చిందో ప్రభుత్వానికే తెలుసన్నారు. యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉద్యాన పంటల సాగుకు కేంద్రం అందజేస్తున్న సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. తెలంగాణలో ప్రజలు బీఆర్ఎస్‌కు, కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారని.. ఇప్పుడు బీజేపీకి అవకాశం ఇస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజభూపాల్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, రాష్ట్ర నాయకులు బొక్క నర్సింహ్మారెడ్డి, సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అంజన్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో రోడ్లకు రూ.1,000 కోట్ల నష్టం

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి అధికారుల వెల్లడి
- పూర్తి నివేదిక సిద్ధం చేయాలని మంత్రి ఆదేశాలు



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి


సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల కారణంగా ఆర్ అండ్ బీ శాఖ రోడ్లకు సుమారు రూ.1,000 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ఆ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి అధికారులు నివేదించారు. రోడ్లతోపాటు పలుచోట్ల కల్వర్టులు, మైనర్ బ్రిడ్జ్‌లు, హైవే స్ట్రెచ్‌లు దెబ్బతిన్నట్లు చెప్పారు. రోడ్లకు జరిగిన నష్టంపై గురువారం సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. వర్షాల కారణంగా రహదారులకు జరిగిన నష్టంపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో రాష్ట్ర, జాతీయ రహదారుల ప్రస్తుత పరిస్థితిపై ఫీల్డ్ రిపోర్ట్ తయారు చేయాలని సూచించారు. పూర్తిగా శిథిలావస్థకు చేరిన కల్వర్టులు, మైనర్ బ్రిడ్జ్‌ల స్థానంలో కొత్తగా నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. త్వరలోనే హ్యామ్ విధానం ద్వారా నాణ్యమైన రోడ్లు వేయబోతున్నట్లు వెల్లడించారు. వర్షాలు తగ్గుముఖం పట్టగానే ఆ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. కేంద్రం నుంచి క్లియరెన్స్ రావాల్సిన జాతీయ ప్రాజెక్టులపై మంత్రి ఆరా తీశారు. ఖానాపూర్ నుంచి బెల్లంపల్లి, ఉట్నూర్ నుంచి గుడిహత్నూర్ రోడ్డు మార్గంపై ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఇచ్చిన వినతి పత్రంపై మంత్రి సానుకూలంగా స్పందించారు. సమావేశంలో ప్రభుత్వ స్పెషల్ సీఎస్ వికాస్‌రాజ్, ఈఎన్సీ జయ భారతి, సి.ఈ రాజేశ్వర్‌రెడ్డి, ఎస్ఈ ధర్మారెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను డర్టీ పార్టీ అనడం కేటీఆర్ అహంకారానికి నిదర్శనం

దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన కాంగ్రెస్ పార్టీని డర్టీ పార్టీ అని దూషించటం బీఆర్ఎస్ నేత కేటీఆర్ అహంకారానికి నిదర్శనమని కోమటిరెడ్డి వెంకటరెడ్డి ధ్వజమెత్తారు. తెలంగాణ ఇచ్చిన పార్టీ నీకు థర్డ్ గ్రేడ్ పార్టీలా కనిపిస్తుందా? అని గురువారం ఒక ప్రకటనలో ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ నిలబెట్టిన ఉప రాష్ట్రపతి అభ్యర్థిని చూసి దేశం మొత్తం హర్షిస్తోందని తెలిపారు. తెలంగాణ బిడ్డను వ్యతిరేకిస్తే బీఆర్ఎస్‌ను తెలంగాణ ప్రజలు క్షమించబోరని హెచ్చరించారు.

రాజ్యాంగ సంస్థల నిర్వీర్యానికి బీజేపీ ప్రయత్నం

సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ ధ్వజం




సభలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ

సుభాష్‌నగర్: స్వయం ప్రతిపత్తిగల రాజ్యాంగబద్ధ సంస్థలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసి అధికారాన్ని కేంద్రీకృతం చేసుకోవడానికి ప్రయత్నిస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ గాజులరామారంలోని కామ్రేడ్ బాలమల్లేశ్ హాల్‌లో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర 4వ మహాసభలో గురువారం రెండవ రోజు ప్రతినిధుల సభలో ఆయన ప్రసంగించారు. సీబీఐ, ఈడీ, న్యాయవ్యవస్థ, నీతి ఆయోగ్ తదితర వ్యవస్థలను మోదీ సర్కారు స్వతంత్రంగా పనిచేయనివ్వడం లేదని ఆయన ఆరోపించారు. బీజేపీని వ్యతిరేకించే వారిని రాజకీయ కక్షతో జైళ్లలో పెట్టడం, నక్సలైట్ల అంతం పేరుతో అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే చర్యలు కొనసాగుతున్నాయని నారాయణ దుయ్యబట్టారు. కనీసం 30 రోజులపాటు జైలుపాలయ్యే నేతల చట్టసభల పదవులను రద్దు చేసేలా చట్టం చేసేందుకు మోదీ సర్కారు ప్రయత్నిస్తుండటంపై ఆయన మండిపడ్డారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీతో అవగాహన ఉన్నప్పటికీ రేవంత్ ప్రభుత్వం ఎలాంటి విధానాలను అవలంబించినా మద్దతు తెలిపాల్సిన అవసరం లేదని.. అంశాల ఆధారంగా మద్దతివ్వాలని సూచించారు. అవసరమైతే ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని ఆయన పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. ప్రజాసమస్యలపై పోరాడకుంటే ప్రజాసంఘాల మనుగడ కష్టసాధ్యమైనందున.. ప్రజాపోరాటాలు కొనసాగించాల్సిందేనని ఆయన ఉద్ఘాటించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం బీసీలు చేస్తున్న పోరాటానికి కమ్యూనిస్టు పార్టీ సంపూర్ణ మద్దతు ఇవ్వాలని, వారితో కలిసి కదనరంగంలోకి దిగాల్సిందేనని నారాయణ చెప్పారు.

2025 మే 9.. టీవీలకు అతుక్కుపోయిన ఉక్రెయిన్ ప్రజలు ఒక్కసారిగా షాక్ అయ్యారు. వారు చూస్తున్న కార్యక్రమాలు అర్ధంతరంగా నిలిచిపోయాయి. అంతరాయం కలిగితే షాక్‌కు గురికావడం ఏంటి? ఇది సహజమే కదా అన్నదే మీ ప్రశ్న కదూ. అక్కడికే వస్తున్నాం.. మాస్కో వేదికగా రష్యా తన యుద్ధ ట్యాంకులు, ఆయుధ సంపత్తిని ప్రదర్శిస్తూ సైనికులతో నిర్వహించిన విక్టరీ డే కవాతు తమ దేశంలో ప్రత్యక్ష ప్రసారం కావడం ఉక్రెయిన్లను ఆశ్చర్యానికి లోను చేసింది. ఉక్రెయిన్‌కు టెలివిజన్ సేవలను అందించే కక్ష్యలో తిరుగుతున్న ఉపగ్రహాన్ని రష్యాకు మద్దతుగా ఉన్న హ్యాకర్లు హైజాక్ చేశారు. ఇదంతా ఉక్రెయిన్ వాసులను భయపెట్టడానికి రష్యా చేసిందన్నమాట!

- సాక్షి, స్పెషల్ డెస్క్



స్పేస్ వార్..
ఇదే ఫ్యూచర్!

పెద్ద పెద్ద దేశాలన్నింటికీ అంతరిక్షంలో ఎన్నో శాటిలైట్లు ఉన్నాయి. వాటిలో ఒక్క ప్రధానమైన ఉపగ్రహాన్ని నిలిపేసినా చాలు.. ఒక్క బుల్లెట్ కూడా కాల్చకుండానే భారీ నష్టమే కలిగించవచ్చు! ఊహించుకుంటేనే భయంగానూ, విచిత్రంగానూ అనిపిస్తోంది కదూ. భవిష్యత్తులో అంతరిక్షం కూడా 'ప్రధాన యుద్ధభూమి' కానుంది.

మామూలు దెబ్బ కాదు..

కక్ష్యలో ఉన్న ఉపగ్రహాల్లో 12,000 పైచిలుకు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ప్రసార సమాచార మార్పిడిలో మాత్రమే కాకుండా సైనిక కార్యకలాపాలు, జీపీఎస్, నిఘా సేకరణ వంటి నావిగేషన్ వ్యవస్థ సహా అనేక అంశాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఇవి.. దేశం మీదకు వస్తున్న శత్రు క్షిపణులు సమీపిస్తున్నాయని హెచ్చరించగలవు. శత్రు దేశాల జాతీయ భద్రతను విఫలమయ్యేలా చేసేందుకు; శత్రువు ఆర్థిక వ్యవస్థను, సైనిక సంసిద్ధతను దెబ్బతీసేందుకు కూడా ఉపయోగపడగలవు. రష్యాకు మద్దతు ఇస్తున్న హ్యాకర్లు టెలివిజన్ సిగ్నల్స్‌ను హైజాక్ చేసి ఉక్రెయిన్‌కు చేసినట్టుగా మానసికంగానూ దెబ్బకొట్టగలవు.

బలహీనమైన లింక్ కోసం..

హ్యాకర్లు సాధారణంగా ఉపగ్రహానికి సపోర్ట్ చేసే లేదా భూమిపై సమాచారాన్ని నియంత్రించే సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌లలో బలహీనమైన లింక్ కోసం చూస్తుంటారు. కక్ష్యలో తిరిగే ఉపగ్రహం సాఫ్ట్‌వేర్‌లో ఏ చిన్న లోపం పసిగట్టినా.. ఇంతే సంగతులు! దాన్ని సులభంగా దెబ్బతీయవచ్చని నిపుణులు అంటున్నారు.

2022లో రష్యన్ దళాలు ఉక్రెయిన్‌ను ఆక్రమించినప్పుడు.. ఉక్రెయిన్ ప్రభుత్వం, సైన్యం ఉపయోగించే అమెరికాకు చెందిన ఉపగ్రహ సంస్థ వయాశాట్‌ను గుర్తు తెలియని వ్యక్తులు హ్యాక్ చేశారు. వేలాది మోడెమ్‌లను ప్రభావితం చేయడానికి మాల్వేర్‌ను ఉపయోగించడంతో యూరప్‌లోని చాలా ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి.

శత్రు దేశాల లక్ష్యాల జాబితాలో శాటిలైట్స్
కమ్యూనికేషన్ వ్యవస్థపై సైబర్ దాడులు
బుల్లెట్ కూడా పేల్చకుండానే భారీ నష్టం

అంతరిక్షంలో అణ్వాయుధం!

యూఎస్ జాతీయ భద్రతా అధికారుల ప్రకారం.. భూమి దిగువ కక్ష్యలో ఉన్న దాదాపు ప్రతి ఉపగ్రహాన్ని ఒకే సారి నాశనం చేయడానికి అణు, అంతరిక్ష ఆధారిత ఆయుధాన్ని రష్యా అభివృద్ధి చేస్తోంది. ఈ ఆయుధం భూమి దిగువన ఉన్న కక్ష్యను ఉపగ్రహాలకు ఒక సంవత్సరం పాటు ఉపయోగించలేని విధంగా చేయగలదని సమాచారం. దీనిని ఉపయోగిస్తే అమెరికా, దాని మిత్రదేశాలు ఆర్థిక సంక్షోభానికి, అణు దాడికి కూడా గురయ్యే అవకాశం కూడా ఉంది. రష్యా, చైనా సైతం ఉపగ్రహాలను కోల్పోతాయి. అయితే యూఎస్ మాదిరిగా కాకుండా విభిన్న శాటిలైట్లను రష్యా, చైనాలు ఉపయోగిస్తున్నాయి. ఉపగ్రహ వ్యతిరేక అణు ఆయుధాన్ని అంతరిక్షంలో ఉంచితే.. అది ఎలాంటి ముప్పు తెస్తుందో ఊహకు కూడా అందదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దేశాలు కొత్త సాంకేతిక పరిజ్ఞానాలను, ఇంధన వనరులను ఉపయోగించుకోవాలని చూస్తున్నందున.. చంద్రుడిపై, గ్రహశకలాలలో లభించే విలువైన ఖనిజాలు, ఇతర పదార్థాలు భవిష్యత్తులో సంఘర్షణలకు దారితీయవచ్చని అభిప్రాయపడుతున్నారు.

సూపర్ పవర్స్‌గా..

చంద్రుడిపైకి ఒక చిన్న అణు రియాక్టర్‌ను పంపే ప్రణాళికల్లో నాసా ఉంది. చైనా లేదా రష్యా కంటే ముందుగా ఈ పని పూర్తి చేయాలన్నదే అమెరికా లక్ష్యంగా కనిపిస్తోంది. చంద్రుడిపై ముందుగా స్థావరం ఏర్పాటు చేసుకుని, కొన్ని కీలక ప్రాంతాలను తమవే అని ప్రకటించుకోవాలని భావిస్తోంది. చంద్రుడిపై హీలియం-3 సమృద్ధిగా ఉంది. హీలియం కేంద్రక సంలీనం (రెండు హీలియం కేంద్రకాలు కలిసి ఒక పెద్ద కేంద్రకంగా ఏర్పడే రసాయన ప్రక్రియ) ద్వారా భారీ మొత్తంలో శక్తి ఉత్పన్నమవుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ సాంకేతికత ఇంకా పూర్తిస్థాయిలో సిద్ధం కాలేదు. కానీ, చంద్రుడిపై నియంత్రణ.. ఏ దేశాలు సూపర్ పవర్స్‌గా ఉద్భవిస్తాయో నిర్ణయించగలదని శాస్త్రవేత్తలు అంటున్నారు.

శాటిలైట్..: ఉపగ్రహ భద్రతా సాఫ్ట్‌వేర్‌ను లక్ష్యంగా చేసుకుని.. భూమి నుండి సంకేతాలను పంపే, లేదా స్వీకరించే దాని సామర్థ్యాన్ని దెబ్బతీస్తే.. ఉపగ్రహం కమ్యూనికేట్ చేయగల సామర్థ్యాన్ని అడ్డుకోగలిగితే.. గణనీయమైన స్థాయిలో నష్టం వాటిల్లుతుంది. ఉపగ్రహ ఆధారిత సేవలన్నీ నిలిచిపోతాయి. శత్రుదేశం ఏం చేయాలనుకుంటే చేయొచ్చు.

జీపీఎస్..: ఇక జీపీఎస్.. ఇప్పుడు మన నిత్య జీవితంలో ఇదో భాగమైపోయింది. జీపీఎస్ సేవల్లో ఒక్కసారిగా అంతరాయం కలిగితే.. అంతా గందరగోళం అవుతుందని సైబర్ నిపుణులు చెబుతున్నారు.

ఏం చేయొచ్చు? దాడులు, నిఘా, పనిచేయకుండా నిర్వీర్యం చేయడం.

ఎలా చేయొచ్చు?
- భూమి నుంచి.. అంతరిక్ష ఉపగ్రహాల వంటివాటిపై.
- అంతరిక్షంలో ఉన్న వాటిపై అంతరిక్షంలో నుంచి.
- అంతరిక్షం నుంచి భూమిపై ఉన్నవాటిపై.



క్లుప్తంగా...

సిఫర్ కాప్-2025కు దరఖాస్తులు

- సైబర్ హ్యాకథాన్‌కు విద్యార్థులు, ఐటీ నిపుణులకు టీజీ సీఎస్‌బీ ఆహ్వానం
- సెప్టెంబర్ 10న జాతీయస్థాయిలో సైబర్ హ్యాకథాన్

సాక్షి, హైదరాబాద్: 'సిఫర్ కాప్ 2025' పేరిట జాతీయ స్థాయిలో నిర్వహించనున్న వార్షిక హ్యాకథాన్‌లో నమోదు చేసుకోవాలని టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీ సీఎస్‌బీ) అధి కారులు కోరారు. సైబర్ భద్రత, భవిష్యత్తు పోలీసింగ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం తదితర అంశాలపై ఈ హ్యాకథాన్ నిర్వ హిస్తున్నట్టు పేర్కొన్నారు. విద్యార్థులు, సాఫ్ట్ వేర్ డెవలపర్స్, స్టార్టప్స్, టెక్నాలజిస్టులు సహా ఆసక్తి ఉన్న వారు ఆన్‌లైన్‌లో 'ciphercop. com'లో నమోదు చేసుకోవాలని సూచించారు. టీజీసీఎస్‌బీ, ఐఎస్‌బీ (ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్), బీపీఆర్‌అండ్‌డీ (బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్) సంయుక్త ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10న బంజారా హిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఈ హ్యాకథాన్ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

ఫాల్కన్ కేసులో మరో అరెస్టు

సాక్షి, హైదరాబాద్: క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ 'ఫాల్కన్ ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్ స్కీమ్'పేరుతో పెట్టుబడిదారులను మోసగించిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. కేసులో నిందితుడిగా ఉన్న చార్టర్డ్ అకౌంటెంట్ శరద్ చంద్ర తోష్నివాల్‌ను బుధవారం అరెస్టు చేశారు. ఈ మేరకు ఈడీ హైదరాబాద్ జోనల్ కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. శరద్ చంద్ర తోష్నివాల్‌కు పీఎంఎల్ఏ ప్రత్యేక కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. సైబరాబాద్ ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ దాఖలు చేసిన మూడు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో ఈడీ ఈ కేసులో దర్యాప్తు ప్రారంభించింది. క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ స్థాపించినప్పటి నుంచి శరద్ చంద్ర దాని ఆడిటర్‌గా ఉన్నాడని, 'ఫాల్కన్ ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్ బిజినెస్'పేరుతో జరిగిన మోసపూరిత లావాదేవీల గురించి అతనికి పూర్తి అవగాహన ఉందని ఈడీ దర్యాప్తులో తేల్చింది. క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ అమర్‌దీప్‌కుమార్‌కు, అతని కుటుంబ సభ్యులకు చెందిన అనేక సంస్థల ఆర్థిక వ్యవహారాలను శరద్ చంద్ర నిర్వహించినట్టు ఈడీ ఆధారాలు సేకరించింది. కాగా, ఈడీ గతంలో ఈ కేసులో రూ. 18.14 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసింది. ప్రధాన నిందితుడు అమర్‌దీప్ కుమార్, సోదరుడు సందీప్ కుమార్‌ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

'ఇన్‌ఫ్లుయెన్సర్ల'కు బీఆర్‌ఎస్ నోటీసులు

సాక్షి, హైదరాబాద్: పార్టీ నాయకత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ కొందరు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, కొన్ని డిజిటల్ సంస్థలపై బీఆర్‌ఎస్ పార్టీ చట్టపరమైన చర్యలు ప్రారంభించింది. వీడియోల ద్వారా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ, ప్రజలను గందరగోళానికి గురి చేస్తూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై బురదచల్లడానికి ఇన్‌ఫ్లుయెన్సర్లు, కొన్ని డిజిటల్ సంస్థలకు కాంగ్రెస్ పార్టీ డబ్బులు చెల్లిస్తోందని లీగల్ నోటీసులు ఇచ్చింది. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకొని కాంగ్రెస్ పార్టీ ప్రోద్బలంతో ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని నోటీసుల్లో పేర్కొంది. వీడియోల్లో ఉన్న తప్పుడు సమాచారాన్ని ఎత్తిచూపడంతో ఇప్పటికే కొన్ని చానెళ్లు వీడియోలు తొలగించాయని, తొలగించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించింది. ఆధారాలు లేకున్నా రాజకీయ దురుద్దేశంతో ప్రజలను తప్పుదోవ పట్టించాలనే లక్ష్యంతో చేస్తున్న దుష్ప్రచారంపై చర్యలు తీసుకుంటామని బీఆర్‌ఎస్ చెప్పింది.

ఒకే కుటుంబంలో ఐదుగురు మృతి

తినే ఆహారంలో విషం.. పోస్టుమార్టమ్ నివేదిక
హత్యా.. ఆత్మహత్యా..?
అనుమానాస్పద మృతిగా కేసు నమోదు
గ్రేటర్ పరిధిలోని మక్తమహబూబ్‌పేటలో ఘటన



విగతజీవులుగా లక్ష్మయ్య, వెంకటమ్మ కుటుంబ సభ్యులు

మియాపూర్: విషం కలిసిన ఆహారం తిని ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి చెందారు. ఈ ఘటన గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మియాపూర్ మక్త మహబూబ్‌పేటలో చోటుచేసుకుంది. సీఐ శివప్రసాద్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం...కర్ణాటకలోని రంజోల్ గ్రామానికి చెందిన ఉప్పరి లక్ష్మయ్య -వెంకటమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు లక్ష్మి, కవిత, నవిత, కుమారుడు భగవత్‌సాగర్ ఉన్నారు. లక్ష్మయ్య అనారోగ్యంతో ఇంటివద్దే ఉంటున్నాడు. వెంకటమ్మ బాచుపల్లిలోని ఓ స్కూల్‌లో అటెండర్‌గా పనిచేస్తోంది. భగవత్‌సాగర్ స్థానికంగా ఆటో నడుపుతున్నాడు. 10 రోజుల క్రితమే రెండో కూతురు కవిత తన కుటుంబంతో కలిసి మక్త మహబూబ్‌పేటలోని తల్లిగారింటికి వచ్చింది. బుధవారం రాత్రి అందరూ భోజనం చేశాక..కళ్లు తిరుగుతున్నాయి, నీరసంగా ఉందంటూ వెంకటమ్మ బాచుపల్లిలోని సాయికృష్ణ హిల్స్‌కాలనీలో ఉంటున్న పెద్దకూతురు లక్ష్మికి ఫోన్ చేసి చెప్పింది. దీంతో ఆమె తనభర్తతో కలిసి వచ్చి తల్లిదండ్రులతో మాట్లాడి రాత్రి 11 గంటల సమయంలో తిరిగి తన ఇంటికి వెళ్లిపోయింది. గురువారం ఉదయం 5 గంటలకు వెంకటమ్మ నిద్ర లేపేందుకు స్కూల్‌లో పనిచేసే సహఉద్యోగిని తలుపు తట్టగా ఉలుకూపలుకూ లేదు. దీంతో ఆమె లక్ష్మితోపాటు స్థానికులు సమాచారం ఇచ్చింది. ఉదయం 7:30 గంటలకు లక్ష్మి ఇంటికి చేరుకొని, స్థానికులతో కలిసి తలుపులు పగులగొట్టింది. ఇంట్లోకి వెళ్లిన చూడగా లక్ష్మయ్య(60), వెంకటమ్మ(50), కవిత (24), ఆమె భర్త అనిల్ (32), వారి కుమారుడు యువాన్స్(2) విగత జీవులుగా పడి ఉన్నారు. పక్కన వాంతి చేసుకున్నట్టు ఆనవాళ్లు ఉన్నాయి. వెంటనే మియాపూర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను కొండాపూర్‌లోని ఏరియా ఆస్పత్రికి తరలించి..అక్కడి నుంచి, పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఫుడ్‌లో పాయిజన్ కలవడంతోనే అది తిని ఐదుగురు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు.రాత్రి 7:30 గంటలకు మృతదేహాలకు వారి కుటుంబసభ్యులకు అప్పగించగా, స్వగ్రామానికి తరలించారు.

రెండు సార్లు వచ్చిన పెద్ద కూతురు..

ఐదుగురు కలిసి ఆహారంలో పాయిజన్ కలుపుకొని ఆత్మహత్య చేసుకున్నారా లేదా ఇతరులు ఆహారంలో విషం కలిపి ఇచ్చారా అనేది మిస్టరీగా మారింది. వీరు ఉంటున్న గదిలో ఎలుకల మందు ప్యాకెట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. పెద్దకూతురు లక్ష్మి వచ్చి వెళ్లిన తర్వాత తల్లి వెంకటమ్మ మళ్లీ నిరసంగా ఉందంటూ ఫోన్ చేసినట్టు సమాచారం. మళ్లీ లక్ష్మి వచ్చి వెళ్లిందని, ఆ తర్వాత ఏం జరిగిందనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ శివప్రసాద్ తెలిపారు.

ఇల్లు మారేందుకు వచ్చి..

కవితకు మూడేళ్ల క్రితం కర్ణాటక రాష్ట్రానికే చెందిన అనిల్‌తో వివాహం జరిగింది. వీరికి కుమారుడు యువాన్స్ అలియాస్ అప్పు ఉన్నాడు. పెళ్లయి కొద్ది రోజులకే నగరానికి వలస వచ్చి అజీజ్‌నగర్‌లో ఉంటున్నారు. అయితే 10 రోజుల క్రితమే వీరంతా ఇల్లు ఖాళీ చేసి మక్తమహబూబ్‌పేటకు వచ్చి వెంకటయ్య ఇంట్లో ఉంటున్నారు. తల్లిదండ్రులకు దగ్గరగా ఇల్లు తీసుకోవాలని కవిత భావించింది. ఇంతలోనే ఈ ఘోరం చోటుచేసుకుంది.

31 అర్ధరాత్రి నుంచి 'ఆరోగ్యశ్రీ' బంద్

ప్రభుత్వానికి నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ అల్టిమేటం
10 రోజుల్లో బకాయిలు చెల్లించాలి.. ప్యాకేజీలు పునఃసమీక్షించాలి
ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈఓకు తన్హా నోటీసు



సాక్షి, హైదరాబాద్: పది రోజుల్లో బకాయిలు చెల్లించడంతో పాటు వైద్య సేవలకు నిర్ణయించిన ధరలను ప్రభుత్వం పునఃసమీక్షించని పక్షంలో ఈ నెల 31 అర్ధరాత్రి నుంచి ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేయాలని నిర్ణయించినట్లు తెలంగాణ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ (తన్హా) తెలిపింది. గత జనవరిలో ఇచ్చిన హామీల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. తమ నిర్ణయాన్ని తెలియజేస్తూ ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్‌కుమార్‌కు గురువారం నోటీసు పంపించినట్లు తన్హా అధ్యక్షుడు డాక్టర్ వద్దిరాజు రాకేష్ తెలిపారు. ఆరోగ్యశ్రీతో పాటు ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్‌ఎస్), జర్నలిస్టుల ఆరోగ్య పథకం (జేహెచ్‌ఎస్) కింద అందిస్తున్న సేవలకు గాను ప్రభుత్వం నుంచి చెల్లింపులు జరగడం లేదని, ఈ పరిస్థితుల్లో ఆసుపత్రుల నిర్వహణ కష్టంగా మారిందని పేర్కొన్నారు.

రూ.1,000 కోట్లకు పైగా బకాయిలు

ఆరోగ్యశ్రీ పథకం కింద రాష్ట్రంలో 471 ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయి. వీటన్నిటికీ కలిపి ప్రభుత్వం సుమారు రూ.1,000 కోట్లకు పైగా బకాయిలు ఉన్నట్లు సమాచారం. 2023 డిసెంబర్ 8వ తేదీ వరకు రూ.723.97 కోట్ల మేర బకాయిలు ఉండగా, కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతినెల సగటున రూ.100 కోట్లకు తగ్గకుండా చెల్లింపులు చేస్తూ వస్తున్నట్లు ఆరోగ్యశాఖ చెపుతోంది. ఈ నేపథ్యంలో గత జూన్ 9 నాటికి బకాయిలు రూ.981 కోట్లకు చేరాయి. తాజాగా ఈ బకాయిలు రూ.1,000 కోట్లకు పైగానే పేరుకుపోయినట్లు తెలుస్తోంది. ఇంత భారీ మొత్తంలో బకాయిలు ఉన్నా ప్రభుత్వం నుంచి తగిన స్పందన లేకపోవడంతో ఈ నెల 31వ తేదీ అర్ధరాత్రి నుంచి ఆరోగ్యశ్రీ సేవలను నిరవధికంగా నిలిపివేయాలని నిర్ణయించినట్లు రాకేష్ వివరించారు.

గత జనవరిలో సేవలు నిలిపివేత

ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించాలనే డిమాండ్‌తో గత జనవరిలో వైద్య సేవలను నిలిపివేస్తూ అసోసియేషన్ నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రభుత్వం స్పందించి రూ.117 కోట్లు విడుదల చేసింది. అయితే అప్పట్లో ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ముఖ్యమైన ప్యాకేజీల సవరణ, క్రమం తప్పకుండా బకాయిల చెల్లింపు, ఒప్పందాల పునరుద్ధరణ వంటి అంశాలను ప్రభుత్వం పట్టించుకోలేదని ఆక్షేపిస్తూ తాజాగా మరోసారి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయాలని అసోసియేషన్ నిర్ణయించింది.

ఎత్తిపోతలకు కరెంట్ కోతలు

విద్యుత్ అంతరాయాలతో పంపింగ్ అవసరాలు తీరట్లేదు
ఇంధన శాఖకు నీటిపారుదల శాఖ లేఖ

సాక్షి, హైదరాబాద్: గోదావరికి భారీ వరదలు పోటెత్తినా, పంప్‌హౌజ్‌లకు నిరంతర విద్యుత్ సరఫరా లేక సాధ్యమైనంత అధిక నీళ్లను ఒడిసిపట్టుకోలేని పరిస్థితి నెలకొంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన 5 ప్రధాన పంపింగ్ స్టేషన్ల ద్వారా వరద నీళ్లను ఎత్తిపోసేందుకు ప్రస్తుతం అంతరాయాలతో విద్యుత్ సరఫరా చేస్తున్నారని రాష్ట్ర నీటిపారుదల శాఖ ఆక్షేపించింది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండటంతో పంప్‌హౌజ్‌ల ద్వారా గరిష్ఠ సామర్థ్యంతో నీళ్లను ఎత్తిపోయాల్సిన అవసరముందని తెలిపింది. వివిధ జలాశయాల నుంచి వస్తున్న ప్రవాహాలు తరచూ హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయని, ప్రస్తుతం సరఫరా చేస్తున్న విద్యుత్ ఏ మాత్రం సరిపో దని పేర్కొంది. ఈ నేపథ్యంలో వచ్చే 45 రోజులపాటు పంప్‌హౌజ్‌లకు నిరంతర విద్యుత్ సరఫరా చేసేలా ట్రాన్స్‌కోను ఆదేశించాలని కోరుతూ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా గురువారం ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శికి లేఖ రాశారు. ప్రస్తుత వానాకాలం సాగునీటి అవస రాలను తీర్చడం కోసం మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్, అక్క డి నుంచి రంగనాయక సాగర్, అక్కడి నుంచి మల్లన్నసాగర్, అక్కడి నుంచి కొండపోచమ్మ సాగర్‌కు నీళ్లను ఎత్తిపోసేందుకు ఈ 5 పంప్‌హౌజ్‌లను నిరంతరం నడపాల్సిన అవసరముందని తెలిపింది. తిప్పాపూర్ పంప్‌హౌజ్‌లో 106 మెగావాట్ల సామర్థ్యం గల 4 పంపులు, చంద్లాపూర్ పంప్‌హౌజ్‌లో చెరో 134.4 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 4 పంప్‌లు, తుక్కాపూర్ పంప్‌హౌజ్‌లో 43 మెగావాట్ల సామర్థ్యం గల 8 పంప్‌లు, అక్కారం పంప్ హౌజ్‌లో 27 మెగావాట్ల సామర్థ్యం గల 6 పంపులు, మర్కూక్ పంప్ హౌజ్‌లో 34 మెగా వాట్ల సామర్థ్యం గల 6 పంప్‌లున్నాయని తెలిపింది. ఈ అంశంపై ఈ నెల 23న నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ట్రాన్స్‌కో సీఎండీతో సమీక్ష నిర్వహించాలని నిర్ణయించారు.

అప్పటి హైజాక్‌కు ఇప్పుడు కంగారు!

1998లో పాక్‌లో ఓ విమానం హైజాక్.. ఆ దేశంలోని హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండింగ్
ఆ సందర్భాన్ని తాజాగా ప్రస్తావిస్తూ 'ఎక్స్'లో పోస్ట్ పంచుకున్న ఓ నెటిజన్
దాన్ని విమాన హైజాక్ బెదిరింపుగా పొరబడ్డ శంషాబాద్ ఎయిర్‌పోర్టులోని ఏఐ ఆధారిత టూల్
శంషాబాద్ ఎయిర్‌పోర్టు అధికారులను అప్రమత్తం చేసిన వైనం
పూర్వాపరాలు చూసుకోకుండానే పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారులు.. ఎఫ్ఐఆర్ నమోదు



శంషాబాద్: అప్పుడెప్పుడో 27 ఏళ్ల కిందట పాకిస్తాన్‌లో ఓ విమాన హైజాక్ ఘటన జరిగితే శంషాబాద్ ఎయిర్‌పోర్టు అధికారులు మాత్రం తెగ కంగారు పడిపోయి ఇప్పుడు కేసు పెట్టారు!! పోలీసులు కూడా పూర్వాపరాలు తెలుసుకోకుండానే ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేసేశారు!! ఇదేం విచిత్రం అనుకుంటున్నారా? విషయం ఏమిటంటే.. 1998 మే 28న జరిగిన పాక్ విమాన హైజాక్ ఉదంతం, హైజాకర్ల అరెస్టును ప్రస్తావిస్తూ ఓ నెటిజన్ ఈ నెల 14న తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశాడు. అయితే ఆ పోస్ట్‌లో హైదరాబాద్ ఎయిర్‌పోర్టు అనే పేరు పలుమార్లు రావడంతోపాటు హైజాకర్లు, ఢిల్లీ తదితర పదాలు ఉండటంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టు ప్రెడిక్టివ్ ఆపరేషన్స్ సెంటర్ (ఏపీఓసీ) ఉపయోగిస్తున్న ఓ ఏఐ ఆధారిత టూల్ పొరబడింది. 'ఎక్స్' వేదికగా 'బెదిరింపు సందేశం' వచ్చిందంటూ అధికారులను అప్రమత్తం చేసింది. దీంతో ఏపీఓసీకి చెందిన రాకేశ్ కుమార్ శర్మ అనే సెక్యూరిటీ, విజిలెన్స్ అధికారి.. పూర్వాపరాలు చూసుకోకుండానే అదే రోజు ఆర్‌జీఐఏ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని వివిధ సెక్షన్లతోపాటు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేసును దర్యాప్తు చేస్తున్నామని.. 'ఎక్స్'లో ఆ పోస్టు పెట్టిన వ్యక్తిని గుర్తించే పనిలో ఉన్నామని ఆర్‌జీఐఏ పోలీసులు పేర్కొనడం గమనార్హం. నిజాంల కాలంలో మన భాగ్యనగరం పేరును అన్ని రకాల సమాచార సందేశాల్లో హైదరాబాద్ అని కాకుండా హైదరాబాద్ (డెక్కన్) అని సంబోధించేవారు. అలాగే ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్న మరో హైదరాబాద్ నగరాన్ని హైదరాబాద్ (సింధ్)గా పిలుస్తున్నారు.

నాడు జరిగింది ఇదీ..

బలోచ్ హైజాకర్లు పాక్ విమానాన్ని ఢిల్లీ మళ్లించాలని డిమాండ్ చేయగా అంతదూరం వెళ్లేందుకు ఇంధనం సరిపోదంటూ హైజాకర్లను విమాన కెప్టెన్ ఉజెయిర్ ఖాన్ బురిడీ కొట్టించాడు. కావాలంటే తొలుత గుజరాత్‌లోని భుజ్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అయి ఇంధనం నింపుకున్నాక ఢిల్లీ తీసుకెళ్తానంటూ వారిని నమ్మించాడు. హైజాక్ ఉదంతాన్ని సింధ్ ప్రావిన్స్‌లో ఉన్న హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు కోడ్ భాషలో పంపాడు. వారు సైతం భారత అధికారులుగా హైజాకర్లను భ్రమింపజేస్తూ భుజ్‌లో విమాన ల్యాండింగ్‌కు అనుమతిస్తున్నట్లు రిప్లై ఇచ్చారు. చివరకు విమానం అక్కడి హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవగా తాము భారత భూభాగంలోకి ప్రవేశించామని హైజాకర్లు నమ్మారు. ఆ వెంటనే పాక్ కమాండోలు విమానంలోకి చొరబడి హైజాకర్లను అరెస్టు చేయడంతో కథ సుఖాంతమైంది. ఆ ఘటనలో ప్రయాణికులెవరూ ప్రాణాలు కోల్పోలేదు. ఆ ఉదంతం జరిగిన 17 ఏళ్లకు.. అంటే 2015 మే 28న హైజాకర్లను పాక్ ప్రభుత్వం ఉరితీసింది.

పోలీసు నియామకానికి నకిలీ పత్రాలు

నకిలీ బోనఫైడ్ సర్టిఫికెట్లు సమర్పించిన 59 మందిపై కేసు
పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు సీసీఎస్‌లో ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రస్థాయి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు 2022లో చేపట్టిన కానిస్టేబుల్, ఫైర్‌మెన్, వార్డర్ పోస్టుల ఎంపిక సమయంలో నకిలీ బోనఫైడ్ సర్టిఫికెట్లు సమర్పించిన 59 మందిపై సిటీ సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టీసీసీసీ) జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి.ఉమాకాంత్ ఫిర్యాదు మేరకు కుట్ర సహా వివిధ సెక్షన్ల కింద నమోదుచేశారు. ఈ కేసు దర్యాప్తును ప్రత్యేక దర్యాప్తు బృందానికి (సిట్) అప్పగిస్తూ గురువారం సీసీఎస్ డీసీపీ ఎన్.శ్వేత ఉత్తర్వులు జారీ చేశారు. నిందితుల్లో 54 మంది సివిల్, ఏఆర్, టీఎస్‌ఎస్పీ విభాగాలకు దరఖాస్తు చేసిన కానిస్టేబుల్, ముగ్గురు ఫైర్‌మెన్, ఇద్దరు వార్డర్ అభ్యర్థులున్నారు.

నకిలీల్లో అత్యధికం బోనఫైడ్ పత్రాలు

2022 ఏప్రిల్ 25న నోటిఫికేషన్ జారీ చేసిన పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఎంపిక ప్రక్రియ చేపట్టింది. వివిధ పరీక్షలు నెగ్గిన వారికి తుది దశలో సర్టిఫికెట్ల స్క్రూటినీ నిర్వహించగా, 59 మంది సమర్పించిన ధ్రువపత్రాలు నకిలీగా తేలాయి. వీటిలో అత్యధికం బోనఫైడ్ సర్టిఫికెట్లే కాగా... కొన్ని నకిలీ డొమిసైల్, విద్యార్హత పత్రాలున్నాయి. ఈ విషయం గుర్తించిన బోర్డు ఆయా అభ్యర్థుల ఎంపికను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో హైదరాబాద్ పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు టీసీసీసీ అధికారి సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ నిందితులను విచారించి వీరికి ఈ సర్టిఫికెట్లు విక్రయించిన వ్యక్తుల్ని గుర్తించి వారినీ నిందితులుగా చేర్చనున్నారు. కాగా, ఈ వ్యవహారంపై పోలీసులు భిన్నంగా స్పందిస్తున్నారు. ఈ నోటిఫికేషన్ వెలువడే నాటికి ప్రాథమిక విద్య పూర్తి చేసి చాలా ఏళ్లు అయి ఉంటుందని చెప్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు మినహా చిన్న చిన్న ప్రైవేట్ స్కూళ్లల్లో చదివిన వాళ్లు బోనఫైడ్ కోసం అనేక ఇబ్బందులు పడి ఉంటారని అంటున్నారు. నోటిఫికేషన్ సమయానికి ఆయా స్కూళ్లు మూత పడటమో, మరో చోటుకు మారిపోవడమో జరిగి ఉంటుందని,, అలాంటి సందర్భాల్లోనే బోనఫైడ్ కోసం నకిలీ సర్టిఫికెట్ల వైపు మొగ్గి ఉంటారని అభిప్రాయపడుతున్నారు.

నీటిపారుదలశాఖ గౌరవ సలహాదారుగా హర్పాల్‌సింగ్

ఎలాంటి పారితోషికం లేకుండా రెండేళ్లపాటు సేవలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర నీటిపారుదల శాఖ గౌరవ సలహాదారుడిగా రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ హర్పాల్ సింగ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.రామకృష్ణారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సరిహద్దు రహదారుల సంస్థ డైరెక్టర్ జనరల్‌గా, సైన్యంలోని ఇంజనీరింగ్ విభాగంలో ఇంజనీర్ ఇన్ చీఫ్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. హర్పాల్ సింగ్ ఎలాంటి వేతనం లేకుండా రెండేళ్లపాటు గౌరవ సలహాదారుడిగా నీటిపారుదల శాఖకు సేవలందించనున్నారు. ఆయనకు అఖిలభారత సేవల అధికారులకు సమానరీతిలో వసతి, ఇతర సదుపాయాలు కల్పించనున్నారు. భారత సైన్యంలో పనిచేసిన సమయంలో ఆయన అటల్ టన్నెల్, సిక్కింలోని థీయింగ్ టన్నెల్, అరుణాచల్‌ప్రదేశ్‌లోని సెలా, నెచిపు సొరంగాలతోపాటు హిమాలయాల్లో నిర్మించిన పలు సొరంగాల పూర్తిలో కీలక పాత్ర పోషించారు. సివిల్ ఇంజనీరింగ్ చేసిన హర్పాల్ సింగ్ అమెరికాలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. అంతర్జాతీయ రహదారుల సమాఖ్య అధ్యక్షు డిగా, ఇనిస్టిట్యూట్ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ ఇండియా వైస్‌చైర్మన్‌గా, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ బిల్డ్ ఇంజనీర్స్, కన్‌స్ట్రక్షన్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. సొరంగాల నిర్మాణంలో అపార అనుభ వాన్ని కలిగి ఉండడంతో ఎల్ఎల్‌బీసీ సొరంగ నిర్మాణం పనుల పునరుద్ధర ణలో ఆయన సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలి 8 మంది శిథిలాల కింద చిక్కుకుపోగా, ఇంకా ఆరుగురి ఆచూకీ తెలియరాలేదు. ఇప్పటికే లెఫ్టినెంట్ కల్నల్ పరీక్షిత్ మెహ్రాను నీటిపారుదల సలహాదారుడిగా ప్రభుత్వం నియమించింది.

నేడు గోదావరి-కావేరి అనుసంధానంపై భేటీ

ఇచ్చంపల్లి వద్ద బరాజ్‌కు సమ్మతి తెలపనున్న తెలంగాణ?

సాక్షి, హైదరాబాద్: గోదావరి- కావేరి నదుల అనుసంధాన ప్రాజెక్టులో భాగంగా గోదావరిపై ఇచ్చంపల్లి వద్ద బరాజ్ నిర్మించి..అక్కడి నుంచి నీటిని తరలించేందుకు కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలకు సమ్మతి తెలపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. ఈ ప్రతిపాదనలపై చర్చించడానికి నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) శుక్రవారం జలసౌధలో ఆయా రాష్ట్రాలతో నిర్వహించనున్న సంప్రదింపుల సమావేశంలో ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సమ్మతి తెలిపే అవకాశముంది. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ అతుల్‌జైన్‌అధ్యక్షతన జరగనున్న ఈ భేటీకి ఏపీ, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదు చ్చేరి, మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాలను ఆహ్వానించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చంపల్లి వద్ద బరాజ్ నిర్మాణాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. ఇచ్చంపల్లి వద్ద బరాజ్ నిర్మిస్తే సమ్మక్క బరాజ్ వద్ద వరదల నిర్వహణకు సమస్యలు వస్తాయని అప్పట్లో ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో గోదావరి-కావేరి అనుసంధానంలో భాగంగా సమ్మక్క బరాజ్ నుంచే నీటిని తరలించాలని అప్పట్లో ఎన్‌డబ్ల్యూడీఏకు సూచించింది. ఇచ్చంపల్లి వద్ద బరాజ్ నిర్మాణాన్ని వ్యతిరేకించడం ద్వారా గత ప్రభుత్వం తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిందని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఓ విలేకరుల సమావేశంలో బహిరంగంగా విమర్శించారు. గోదావరి-బనచకచర్ల అను సంధాన ప్రాజెక్టును నిర్మించడానికి ఏపీ సన్నాహాలు చేస్తుండగా, దానికి కౌంటర్‌గా ఇచ్చంపల్లి వద్ద 200 టీఎంసీల గోదావరి జలాల తరలింపునకు ప్రాజెక్టు చేపట్టాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కొత్త ప్రతిపాదనలను తెరపైకి తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో ఇచ్చంపల్లి వద్ద బరాజ్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సమ్మతి తెలిపే అవకాశముంది. శుక్రవారం జరగనున్న సమా వేశంలో అనుసరించాల్సిన వైఖరిపై సూచనలు తీసుకోవడానికి రాష్ట్ర నీటి పారుదల శాఖ అధికారులు గురువారం సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమ య్యారు. ఇచ్చంపల్లి వద్ద బరాజ్ నిర్మాణానికి సమ్మతి తెలపాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్టు సమాచారం.



వాటర్ బోర్డ్ @ ఆన్‌లైన్

భవన నిర్మాణదారులకు జలమండలి ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. గురువారం ఆన్‌లైన్‌లో వాటర్ ఫీజిబిలిటీ ధ్రువ పత్రం జారీ సేవలు ప్రారంభమయ్యాయి. -10లో



రన్ రాజా రన్..

ఉరుకు పరుగుల జీవితాల నుంచి ఉరుకుల పోటీల వైపు దృష్టి సారిస్తున్నారు నగరవాసులు. అంతర్జాతీయ స్థాయిలో జరిగే మారథాన్‌ల లోనూ పాలుపంచుకుంటున్నారు. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0/22.0

నగరంలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం పొడి వాతావరణం నెల కొంటుంది. గరిష్టంగా 29, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

'ఓసీ'తో మాయ చేసి..

ఔటర్ చుట్టుపక్కల అక్రమ నిర్మాణాలు

- హెచ్ఎండీఏ నుంచి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు
- ఆ తర్వాత యథేచ్ఛగా ఉల్లంఘనలు
- విల్లాలు, బహుళ అంతస్తుల భవనాలపై ఫిర్యాదులు
- అక్రమాలపై కొరవడిన నిఘా, నియంత్రణ
- హెచ్ఎండీఏ నిబంధనలు బేఖాతరు



సాక్షి, సిటీబ్యూరో:

అదో అతిపెద్ద గేటెడ్ కమ్యూనిటీ. నగర శివార్లలోని ఆ గేటెడ్ కమ్యూనిటీలో సుమారు వందల సంఖ్యలో విల్లాల నిర్మాణం చేపట్టారు. వాటిలో చాలావరకు పూర్తయ్యాయి. ఇంకా కొన్ని తుది దశ నిర్మాణంలో ఉన్నాయి. హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు పూర్తి చేసిన భవనాలకు అధికారులు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లను (ఓసీ) కూడా అందజేశారు. దీంతో అక్కడ చాలా మంది నివాసం ఉంటున్నారు. నిబంధనల మేరకు ఒకసారి ఓసీ తీసుకున్న తర్వాత ఎలాంటి అక్రమ నిర్మాణాలు, అడ్డగోలు కట్టడాలు చేపట్టడానికి అవకాశం లేదు. కానీ కొన్ని విల్లాలకు చెందిన యజమానులు ఇష్టారాజ్యంగా నిబంధనలను బేఖా తరు చేస్తూ అక్రమ కట్టడాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఈ మేరకు కొందరు స్థానికులు హెచ్ఎండీఏకు సైతం ఫిర్యాదు చేశారు. కానీ ఇలాంటి అక్రమ నిర్మాణాలపై హెచ్ఎండీఏ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేకపోవడం గమ నార్హం. ఒక్క గేటెడ్ కమ్యూనిటీల్లో కాదు. అపార్ట్‌మెంట్లు, బహుళ అంతస్తుల భవనాలు తదితర అ న్ని నిర్మాణాల్లోనూ ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు పొందిన తర్వాత ఉల్లంఘనలకు పాల్పడటం గమనార్హం.

వెల్ఫేర్ సంఘాల పేరిట ఉల్లంఘన..

శ్రీశైలం రహదారికి సమీపంలోని మరో భారీ గేటెడ్ కమ్యూనిటీలో కొన్ని విలాసవంతమైన విల్లాలు ఉన్నాయి. రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, సినీ తారలు, డైరెక్టర్లు, డాక్టర్లు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, వ్యాపారులు, ఎన్నారైలు తదితర వర్గాలకు చెందిన వారు విల్లాలను నిర్మించుకున్నారు. కొంతమంది సామాన్యులు కూడా ఊళ్లల్లోని ఆస్తులను అమ్ముకుని పిల్లల చదువు కోసం ఇందులో ప్లాటు కొనుక్కొని నివసిస్తున్నారు. కమ్యూనిటీ అంతటికీ ప్రాతినిధ్యం వహించేందుకు ఏర్పడిన వెల్ఫేర్ అసోసియేషన్‌లు సొంత నియమ నిబంధనలను రూపొందించుకొని హెచ్ఎండీఏ నిబంధనలను నీరుగారుస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొత్తగా నిర్మించుకునే వాళ్లు హెచ్ఎండీఏ నిబంధనల ప్రకారం నిర్మాణాలను కొనసాగిస్తుండగా, ఇప్పటికే భవనాలు పూర్తి చేసుకున్న వాళ్లు తమ పలుకుబడిని ఉపయోగించి అదనపు భవనాలను నిర్మిస్తున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. 'అసోసియేషన్‌లకు ప్రాతినిధ్యం వహించే వారే హెచ్ఎండీఏ నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారం నిర్మాణాలు కొనసాగిస్తున్నారు' అని హెచ్ఎండీఏ కమిషనర్‌కు అందజేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అసోసియేషన్ నిబంధనల పేరిట 2 శాతం అక్రమ నిర్మాణాలకు ప్రత్యేక అనుమతులు ఇవ్వడం గమనార్హం.

కొరవడిన నిఘా..

- సాధారణంగా ఒకసారి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు అందజేసిన తర్వాత ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా నియంత్రించాల్సిన బాధ్యత స్థానిక మున్సిపాలిటీలు లేదా గ్రామ పంచాయతీలు తదితర స్థానిక సంస్థల పరిధిలో ఉంటుంది.
- ఇలాంటి ఫిర్యాదులపై హెచ్ఎండీఏ అధికారులు సైతం స్థానిక సంస్థలను అప్రమత్తం చేసి అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంది. ఈ మేరకు హెచ్ఎండీఏకు చెందిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంతో పాటు, స్థానిక మున్సిపాలిటీలు, రెవెన్యూ అధికారులు, పోలీసులు సమన్వయంతో చర్యలు చేపట్టవచ్చు.
- మియాపూర్, శంషాబాద్ తదితర భూముల పరిరక్షణలో హెచ్ఎండీఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం స్థానిక సంస్థలతో కలిసి చర్యలు చేపట్టింది.
- గత ప్రభుత్వ హయాంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. హెచ్ఎండీఏతో పాటు స్థానిక సంస్థలు సమన్వయంతో పని చేశాయి. 500 గజాల నుంచి 1000 గజాల లోపు బహుళ అంతస్తుల భవనాల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.
- కొంతకాలంగా హెచ్ఎండీఏ విజిలెన్స్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైంది. హెచ్ఎండీఏకు చెందిన ప్లానింగ్, ఎస్టేట్ తదితర విభాగాలకు సహకరించేందుకు మాత్రమే పరిమితమైంది. ఈ క్రమంలో అన్ని చోట్ల ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు పొందిన తర్వాత యథావిధిగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ప్రణాళికా విభాగానికి చెందిన కొందరు అధికారులే ఈ మేరకు భవన యజమానులకు ఉచిత సలహాలు ఇస్తున్నట్లుగా కూడా ఆరోపణలు ఉన్నాయి. హెచ్ఎండీఏకు, స్థానిక సంస్థలకు మధ్య సమన్వయం లేకపోవడంతో అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకొనే వ్యవస్థలు పని చేయడం లేదు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న నగర కొత్వాల్ సీవీ ఆనంద్.. వాహనాలతో ట్రాఫిక్ సిబ్బంది



'ట్రాఫిక్' బండి.. అదిరెనండి!

అత్యాధునిక హంగులతో టాస్క్‌ఫోర్స్ వాహనాలు

- వీటికి జీపీఎస్ పరిజ్ఞానం, ప్రత్యేక కెమెరాల ఏర్పాటు
- ఎలాంటి ఇబ్బంది లేకుండా సమాచార మార్పిడికీ అవకాశం
- తొలిదశలో సమకూరిన 50 అవెంజర్ బైకులు, మూడు క్రేన్లు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ప్రధాన జంక్షన్ల వద్ద కనిష్ఠంగా ఇద్దరు, గరిష్ఠంగా ముగ్గురు చొప్పున ట్రాఫిక్ పోలీసులు విధుల్లో ఉంటారు. వీళ్లు ఆయా జంక్షన్లలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూస్తుంటారు. ఇలాంటి రెండు జంక్షన్ల మధ్య ఉన్న మార్గంలో ఇబ్బంది ఏర్పడితే! అప్పుడు స్పందించాల్సింది ఎవరు? ఆ మార్గాన్ని పర్యవేక్షించడం ఎలా? ఈ ప్రశ్నలకు సమాధానంగా సిటీ పోలీసులు ప్రత్యేకంగా ట్రాఫిక్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎస్సీ) సౌజన్యంతో తొలి దశలో 50 అవెంజర్ వాహనాలను ఖరీదు చేసి, వీటికి అత్యాధునిక ఉపకరణాలు ఏర్పాటు చేశారు. వీటిని నగర కొత్వాల్ సీవీ ఆనంద్ గురువారం ఆవిష్కరించారు.

వాహనాల హంగులిలా..

ఎనిమిది గంటల పాటు నిర్విరామంగా సంచరించినా చోదకుడు అలసిపోకుండా ఉండేందుకు బజాజ్ కంపెనీకి చెందిన తెలుపు రంగు అవెంజర్ 220 క్రూయిజ్ వాహనాన్ని ఎంపిక చేశారు. వీటిపై హెచ్‌సీఎస్సీ, సిటీ, ట్రాఫిక్ పోలీసు లోగోలు ముద్రించారు. ఈ వాహనం నిర్వహణ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది బాధ్యత. దశలవారీగా మరో 100 వాహనాలు కొనుగోలు చేయనున్నారు.

జంక్షన్ల మధ్య జామ్స్ లేకుండా చూడటం, అక్రమ పార్కింగ్, క్యారేజ్ వే ఆక్రమణలు తొలగించడం, ప్రమాదాలు జరిగినప్పుడు స్పందించడం, బ్రేక్ డౌన్ అయిన వాహనాల గుర్తింపు ఈ టాస్క్‌ఫోర్స్ విధులు. బ్రేక్ డౌన్ అయిన భారీ వాహనాలు తొలగింపునకు మూడు అత్యాధునిక క్రేన్లు సమీకరించుకున్నారు.



నంబర్ల వారీగా ఇలా..

1 పబ్లిక్ అడ్రస్ సిస్టం: ఈ వాహనానికి ముందు భాగంలో రెండు మైకులు ఉంటాయి. వీటిలో ఒకటి సైరన్ కాగా.. మరొకటి పబ్లిక్ అడ్రస్ సిస్టం.

2 కాలర్ మైక్రోఫోన్: దీనిపై సంచరించే సిబ్బంది ఈ పబ్లిక్ అడ్రస్ సిస్టం ద్వారా ప్రకటన చేయడానికి ఆగాల్సిన అవసరం లేదు. దీనికి అనుసంధానించి ఉండే కాలర్ మైక్రోఫోన్‌ను చేతితో పట్టుకోవాల్సిన అవసరం లేకుండా వాడవచ్చు.

3 వాకీటాకీకి మైక్రోఫోన్: క్షేత్రస్థాయిలో విధుల్లో ఉండే ట్రాఫిక్ పోలీసులు సమాచార మార్పిడికి వాకీటాకీ అనివార్యం. వాహచోదకుడు తన వాకీటాకీని చేత్తో పట్టుకోవాల్సిన అవసరం లేకుండా మైక్రోఫోన్ సౌకర్యం ఉంది.

4 డ్యాష్‌బోర్డ్ కెమెరా: ఈ వాహనాన్ని నడిపే ట్రాఫిక్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దారిలో కనిపించిన ఉల్లంఘనల్ని ఫొటో తీయడానికి చేతిలో ఉండే కెమెరాలు అవసరం లేదు. వాహనం హ్యాండిల్ పైన ప్రత్యేకంగా డ్యాష్‌బోర్డ్ కెమెరా ఏర్పాటు చేశారు. ఇది తీసిన ఫొటోలు నేరుగా కంట్రోల్ రూమ్‌కు చేరతాయి. అక్కడ నుంచి ఈ–చలాన్ జారీ అవుతుంది.

5 జీపీఎస్ ట్రాకింగ్: ట్రాఫిక్ టాస్క్‌ఫోర్స్ వాహనాలను అవసరాన్ని బట్టి ఏ ప్రాంతానికైనా మోహరిస్తారు. దీనికోసం అవి ఎక్కడ ఉన్నాయో కంట్రోల్ రూమ్ సిబ్బంది తెలుసుకోవడానికి జీపీఎస్ పరిజ్ఞానంతో పని చేసే ట్రాకింగ్ డివైజ్ ఉంది.

6 ఫస్ట్ ఎయిడ్ కిట్: అత్యవసర సమయంలో క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేయడానికి ఫస్ట్ ఎయిడ్ కిట్, అందులోనే కమ్యూనికేషన్ కోసం ట్యాబ్ ఉంటుంది.

7 ట్రాఫిక్ ఎక్యూప్‌మెంట్ బాక్స్: వర్షం కురిసినప్పుడు అసరమైన చోట విధులు నిర్వర్తించడానికి రెయిన్ కోట్, షూస్‌తో పాటు రిఫ్లెక్టివ్ జాకెట్ ఉండే పెట్టె ఉంది.

8 బాడీ వార్న్ కెమెరా: టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సంచరించే మార్గాలు, అక్కడి పరిస్థితులతో పాటు ప్రజలతో నడుచుకునే తీరు పరిశీలించడానికి బాడీ వార్న్ కెమెరా ఉంది. ఇది నేరుగా కంట్రోల్ రూమ్‌కు కనెక్ట్ అయి ఉంటుంది. అక్కడ దీని ఫీడ్ మొత్తం రికార్డు అవుతుంది.

9 యుటిలిటీ బాక్స్: రెస్క్యూ సమయంలో వాహన చోదకుడు తన హెల్మెట్, సెల్‌ఫోన్‌తో పాటు ఇతర పరికరాలు భద్రపరుచుకోవడానికి ఈ బాక్స్ ఉపకరిస్తుంది.

తుది మెరుగుల్లో మహా గణపతి

- ఈ నెల 25న నేత్రోనిలనం



ఖైరతాబాద్: ఈ ఏడాది ఖైరతాబాద్ మహా గణపతి శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతిగా భక్తులకు దర్శనమివ్వనున్నాడు. వినాయక చవితికి మరో అయిదు రోజులే ఉండటంతో మహాగణపతి తయారీ పనులు చివరి దశకు చేరుకున్నాయి. 71వ సంవత్సరం సందర్భంగా 69 అడుగుల ఎత్తుతో శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతి భక్తులకు దర్శనమివ్వనున్నాడని దివ్యజ్ఞాన గురూజీ విఠల్ శర్మ తెలిపారు.

ఈ నెల 25న మహాగణపతికి నేత్రోనిలన కార్యక్రమం ఉంటుందని శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ తెలిపారు.

దాహార్తి తీరేలా..

మరో ఆరు తాగునీటి రిజర్వాయర్ల నిర్మాణానికి జలమండలి అడుగులు

- ఆస్మాన్‌గఢ్‌లో రెండు, నియో పోలిస్‌లో మూడు, మహేంద్ర హిల్స్‌లో ఒకటి
- ఓఆర్ఆర్ ఫేజ్–2లో ప్రారంభానికి సిద్ధమైన 15 రిజర్వాయర్లు

సాక్షి, సిటీబ్యూరో: మహా నగర జనాభాకు అనుగుణంగా తాగునీటిని అందించేందుకు కొత్త రిజర్వాయర్ల నిర్మాణానికి జలమండలి అడుగులు వేస్తోంది. ఇప్పటికే అవుట్ రింగ్ పరిధిలో రిజర్వాయర్ల నిర్మాణాలు పూర్తి కాగా.. నగరంలోనూ పాత రిజర్వాయర్ల సామర్థ్యాలను పెంపొందించేందుకు అదనంగా కొత్తవాటి నిర్మాణాలకు చర్యలు చేపట్టింది. తాజాగా మరో ఆరు రిజర్వాయర్ల నిర్మాణాలకు సిద్ధమైంది. ఇప్పటికే ఆస్మాన్‌గఢ్ పాత రిజర్వాయర్ ప్రాంగణంలో కొత్తగా 2.50 ఎంఎల్ సామర్థ్యం గల ఎలివేటెడ్ లెవల్, ఆస్మాన్‌గఢ్‌లో ఇన్‌లెట్, అవుట్‌లెట్ పైపింగ్ పిక్చర్‌లు, అప్పూరెన్స్‌లను కలిగిన మరో 7 ఎంఎల్ సామర్థ్యం గల గ్రౌండ్ లెవల్ రిజర్వాయర్ల నిర్మాణాలకు ప్రభుత్వ అనుమతి లభించింది. సుమారు రూ.16 కోట్ల అంచనా వ్యయంతో రెండు రిజర్వాయర్ల నిర్మాణాలకు టెండర్లను ఆహ్వానించింది. మరోవైపు రూ.14.95 కోట్ల వ్యయంతో మహేంద్ర హిల్స్ వద్ద 5 ఎంఎల్ సామర్థ్యం గల గ్రౌండ్ లెవల్ రిజర్వాయర్‌ను నిర్మించనుంది. నియోపోలిస్‌లో సుమారు 9 ఎంఎల్ సామర్థ్యం గల గ్రౌండ్ లెవల్‌తోపాటు 2.5 ఎంఎల్ సామర్థ్యం చొప్పున రెండు ఎలివేటెడ్ లెవల్ రిజర్వాయర్లను నిర్మించనుంది.



త్వరలో అందుబాటులోకి 15 రిజర్వాయర్లు

జలమండలి పరిధిలో మరో 15 తాగునీటి రిజర్వాయర్లు అందుబాటులోకి రానున్నాయి. ఔటర్ రింగ్ రోడ్డు ఫేజ్–2లో 2761 కిలోమీటర్ల పైపులైన్ నిర్మించి సుమారు 140.50 మిలియన్ లీటర్ల సామర్థ్యం గల 71 రిజర్వాయర్లు నిర్మించగా.. అందులో 56 రిజర్వాయర్లు అందుబాటులో రాగా, మిగితావి కూడా నిర్మాణాలు పూర్తి చేసుకొని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే ఫేజ్–1కి 1602 కిలోమీటర్ల పైపులైన్ నిర్మించి 210.5 ఎంఎల్ సామర్థ్యం గల 164 రిజర్వాయర్లను నిర్మించి అందుబాటులో తీసుకొచ్చారు. ఇప్పటికే జీహెచ్ఎంసీ పరిధిలో 297 రిజర్వాయర్లు అందుబాటులో ఉన్నాయి. తాజాగా పాత రిజర్వాయర్ల విస్తరణతో పాటు కొత్త రిజర్వాయర్ల నిర్మాణాలకు జలమండలి సిద్ధమైంది. ఇందులో ఫ్లో మీటర్లు, స్మార్ట్ వాల్వ్ టెక్నాలజీ వంటి అధునాతన సాంకేతికతలను ఉపయోగించనున్నారు.

ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రిజర్వాయర్లు

రిజర్వాయర్	మిలియన్ లీటర్లు
గుర్రం గూడ	2
విశాఖనగర్	2
సుల్తాన్‌పూర్	1
గోల్డెన్‌హైట్స్ దేవత గుట్ట	6
బోధిగుట్ట	6
గంధంగూడ	2
ఉస్మాన్‌సాగర్	4
ఉస్మాన్‌సాగర్	2
కృష్ణా బృందావన్ కాలనీ	2
రాజీవ్‌గాంధీ నగర్	1
పీఎస్ఆర్‌టీ యూనివర్సిటీ	6
బోరంపేట –1	3
షాపూర్ కాలనీ	1
బోరంపేట–2	2
ఎంఆర్‌ఓ డీపీపల్లి	2

వీధి దీపాలు, ట్రాఫిక్ సిగ్నళ్ల నిర్వహణ ప్రైవేటుకు

గడువు ముగియడంతో మళ్లీ టెండర్లు

- ఆమోదించిన స్టాండింగ్ కమిటీ
- టేబుల్ ఎజెండా సహా 39 అంశాలకు ఓకే

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో వీధిదీపాల నిర్వహణ కోసం ఏడేళ్ల కాలానికి ప్రైవేటు ఏజెన్సీలను ఆహ్వానించేందుకు గురువారం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశం ఆమోదం తెలిపింది. గత ఏప్రిల్ వరకు వాటిని నిర్వహించిన ఈఈఎస్ఎల్ (ఎనర్జీ ఎఫీషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్) గడువు ముగియడంతో.. కొత్తగా నిర్వహణ కోసం టెండర్లను పిలిచేందుకు కమిటీ ఆమోదం తెలిపింది. గతంలో ఈఈఎస్ఎల్‌తో ఏడేళ్ల కాలం నిర్వహణకు రూ.563.58 కోట్లతో ఒప్పందం కుదుర్చుకోగా, కొత్తగా రూ.897 కోట్ల అంచనా వ్యయానికి ఓకే చేశారు. కాగా.. గతంలో నిబంధనలెన్నో పెట్టినా, 98 శాతం వెలుగులు లేకుంటే పెనాల్టీ విధిస్తామని పేర్కొన్నా, మొక్కుబడి తంతుగా మమ అనిపించారు. దీంతో పాటు ట్రాఫిక్ సిగ్నళ్ల నిర్వహణ ఏజెన్సీ గడువు కూడా త్వరలో ముగిసిపోనుండటంతో దానికి సైతం టెండర్లు పిలిచేందుకు కమిటీ ఆమోదం తెలిపింది. 404 ట్రాఫిక్ సిగ్నల్స్ నిర్వహణతో పాటు కొత్త సిగ్నళ్ల ఏర్పాటు కోసం అంచనా వ్యయం రూ. 72.31 కోట్లు. ఏడు టేబుల్ ఎజెండా అంశాలు సహా మొత్తం 39 అంశాలకు ఆమోదం తెలిపారు. మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, విభాగాధిపతులు పాల్గొన్నారు. రామంతాపూర్‌లో ఇటీవల విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయిన మృతులకు సంతాపసూచకంగా రెండు నిమిషాల మౌనం పాటించారు.

ఆమోదం పొందిన వాటిలో ముఖ్యాంశాలు

- నగరంలో కొత్తగా 50 ప్రాంతాల్లో విజయ డెయిరీ పార్లర్లు ఏర్పాటు కానున్నాయి. అందుకుగాను ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అద్దె చార్జీల ఖరారు చేసేందుకు ఆమోదం. కృష్ణకాంత్ పార్క్, మెహిదీపట్నం బస్టాప్, దుర్గంచెరువు పార్క్, ఆరాంఘర్ బస్టాప్, ఇందిరాపార్కు వెలుపల తదితర ప్రాంతాల్లో ఇవి ఏర్పాటు కానున్నాయి.
- టోలిచౌకి ఫ్లైఓవర్ కింద నిర్మించిన 18 కొత్త దుకాణాలకు మూడేళ్ల కాలపరిమితితో టెండర్ కమ్ బహిరంగ వేలం. జీహెచ్ఎంసీ ఎస్టేట్స్ విభానికి చెందిన దుకాణాల్లో 25 సంవత్సరాల లీజు దాటిన వాటిల్లో ఖాళీ దుకాణాలకు బహిరంగ వేలం. గడువు ముగిసిన దుకాణాల లీజులను పొడిగించేందుకు అద్దె పెంపు. మోడల్ మార్కెట్లలోని 354 ఖాళీ దుకాణాలకు మూడేళ్ల పాటు లీజుకు ఓపెన్ ఆక్షన్. కేబీఆర్ పార్కు పార్కింగ్ లాట్‌లోని కియోస్కుల లీజు గడువు ముగిసినందున ఐదు కియోస్కుల నిర్వహణ ప్రైవేటుకు ఇచ్చేందుకు టెండర్ కమ్ ఓపెన్ ఆక్షన్.
- హయత్ నగర్‌లోని సౌభాగ్య కాలనీ నుంచి ఇంజాపూర్ రోడ్ వరకు వరద కాల్వ నిర్మాణ పనులకు రూ.3 కోట్లు మంజూరు. కాప్రా వార్డులోని సాయి బాబా నగర్, ఎల్లారెడ్డిగూడ, వంపుగూడ స్మశాన వాటికల్లో సదుపాయాల కోసం రూ.5 కోట్లు మంజూరు. హెచ్ఎండీఏ లేఅవుట్‌లో నాలుగు సామాజిక సదుపాయాలు, మూడు ఖాళీ ప్రదేశాల రక్షణ కోసం ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌లో కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ. 3.10 కోట్లు మంజూరు.
- ఊర చెరువు వద్ద బాక్స్‌డ్రెయిన్ నిర్మాణం. అంచనా వ్యయం రూ.2.95 కోట్లు.
- నవాబ్‌సాబ్ కుంట ప్రాంతంలో బాక్స్‌డ్రెయిన్, వీడీసీసీ రోడ్ నిర్మాణం. అంచనా వ్యయం రూ.2.95 కోట్లు. శాస్త్రిపురంలో జవియా డైమండ్ హిల్స్ కాలనీ దగ్గర ప్లాట్ నెంబర్ 126 పక్కన ఆర్‌సీసీరిటైనింగ్ వాల్ ఎత్తు పెంచడం. అంచనా వ్యయం రూ.4 కోట్లు.
- షేక్ ఫైజ్ కమాన్ నుంచి డబీర్‌పురా ఫ్లైఓవర్ వరకు 60 అడుగుల వెడల్పుతో సీసీ రోడ్, ఫుట్‌పాత్ నిర్మాణానికి రూ.5.70 కోట్లు మంజూరు. రెయిన్‌బో విస్టాస్ నుంచి ఖైతలాపూర్ వరకు బీటీ రోడ్ విస్తరణ, వరద కాల్వ నిర్మాణాలకు రూ. 4.50 కోట్లు మంజూరు.
- గాజుల రామారం సర్కిల్ సూరారం టీఎస్ఐఐసీ కాలనీలో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్వహణ కోసం నెలకు రూ. 2.65 లక్షల కనీస ధరతో ఏడాది పాటు నిర్వహణకు టెండర్లు. లాల్‌సాబ్ గూడ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్వహణ కోసం రూ.3.30 లక్షల కనీస ధరతో సంవత్సరం పాటు నిర్వహణకు టెండర్లు.
- జీహెచ్ఎంసీ ఔట్‌సోర్సింగ్ కార్మికులు, సెల్ఫ్‌హెల్ప్‌గ్రూప్ మహిళలకు పర్సనల్ యాక్సిడెంట్ బెనిఫిట్, టర్మ్ ఇన్సూరెన్స్ బెనిఫిట్స్ కోసం వ్యక్తిగత అకౌంట్ తెరిచేందుకు బ్యాంకుతో ఎంఓయూ కుదుర్చుకునేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు.
- రోడ్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలకు సంబంధించి అందే ఫిర్యాదుల పరిష్కారానికి ప్రస్తుతమున్న బకెట్ లాడర్ వాహనాలకు అదనంగా మరో పది వాహనాలను ఏడాదిపాటు అద్దెకు తీసుకునేందుకు అవసరమైన అంచనా నిధులు రూ.4.07 కోట్లకు పరిపాలన అనుమతులు.



రామంతాపూర్ మృతులకు సంతాపం ప్రకటిస్తున్న మేయర్, కమిషనర్ తదితరులు

ముంపు నివారణకు సన్నద్ధం

అమీర్‌పేట, మైత్రివనంలలో జీహెచ్ఎంసీ, హైడ్రా కమిషనర్ల పర్యటన

అమీర్‌పేట: నగరంలోని అమీర్‌పేట, మైత్రివనంలలో గురువారం జీహెచ్ఎంసీ, హైడ్రా కమిషనర్లు ఆర్‌వీ కర్ణన్, రంగనాథ్ పర్యటించారు. ఆయా ప్రాంతాలు ముంపునకు గురి కాకుండా చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. మైత్రివనం, స్వర్ణజయంతి, గంగుబాయి బస్తీ, బౌద్ధనగర్‌లో వరద కాల్వకు ఉన్న ఆటంకాలను పరిశీలించారు. వరద ఉద్ధృతి శాశ్వత కట్టడికి ఉన్న అవకాశాలను క్షేత్ర స్థాయిలో కసరత్తు చేశారు. నాలాలు ఆక్రమణకు గురి కావడం, బహుళ అంతస్తులు భవన నిర్మాణాలు ఉండటంతో ముంపునకు దారి తీస్తోందని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనికి తోడు జూబ్లీహిల్స్, వెంకటగిరి, రహ్మత్‌నగర్, యూసుఫ్‌గూడ, కృష్ణకాంత్ పార్కు మీదుగా పారే కాల్వ గాయత్రినగర్ వద్ద ఉన్న నాలాలో కలుస్తోంది. మధురానగర్, వెస్ట్ శ్రీనివాస్ నగర్ నుంచి కూడా భారీగా వరద నీరు వస్తుండటంతో బౌద్ధనగర్, గంగుబాయి బస్తీలు చెరువులను తలపిస్తున్నాయి. డ్రెయిన్ రీ మోడలింగ్ (నాలా పునర్నిర్మాణం)కు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు కమిషనర్లు పేర్కొన్నారు.



మైత్రివనం వరద కాల్వను పరిశీలిస్తూ..

ప్రయాణికురాలి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్



ప్రయాణికురాలు సారదతో ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ సంజయ్‌కుమార్

సికింద్రాబాద్: కదులుతున్న రైలు ఎక్కబోయి ప్రమాదం బారిన పడిన ఒక మహిళ ప్రాణాలను అక్కడే విధుల్లో ఉన్న ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ రక్షించాడు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలను సికింద్రాబాద్ డివిజనల్ సెక్యూరిటీ ఆఫీసర్ ఏ.నవీన్‌కుమార్ గురువారం వెల్లడించారు. ఈనెల 20న సాయంత్రం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరుతున్న విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కేందుకు శ్రీకాకుళం జిల్లా కాంచిలికి చెందిన ముప్పినేటి సారద్ అనే 52 ఏళ్ల మహిళ ఎక్కే ప్రయత్నం చేసింది. బీ2 బోగీ ఎక్కబోయిన మహిళ అదుపు తప్పి కిందపడింది. అదే సమయంలో అక్కడే విధుల్లో ఉన్న ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ సంజయ్‌కుమార్ ప్రమాదం బారిన పడుతున్న మహిళను గుర్తించి బయటకు లాగి బోగీ, ప్లాట్‌ఫామ్ మధ్య నలిగిపోకుండా రక్షించాడు. విధుల్లో అప్రమత్తంగా ఉండి ప్రమాదం బారిన పడిన మహిళను రక్షించిన కానిస్టేబుల్ సంజయ్‌కుమార్‌ను ఆర్‌పీఎఫ్ అధికారులు అభినందించారు.



Shri. K. Pratap Reddy
Senior Advocate
11 April 1931 - 21 August 2025

With profound grief, we announce the sad demise of our beloved Shri K. Pratap Reddy, Senior Advocate on 21 August, 2025 in Hyderabad at the age of 94 years.

The final rites and cremation will be held on 22 August, 2025 (Friday) at 12 pm at Vaikunta Mahaprasthanam, Jubilee Hills (Shaikpet), Hyderabad.

In grief:

K. Vijayapal Reddy and Krishna Kumari
Geetha and Desai Prakash Reddy
Anitha and Tadasina Jayanth Reddy

Shruthi and Sudhanshu Desai
Gouri and Venkat Reddy
Devika and Avinash Desai
Deepali and Achyuth Reddy
Swathi and Srujith Reddy
Alekhya and Siva

Ved, Advait, Aparajita, Amogh, Vunsh, Anika, Dhruv, Diya and Medha



వాటర్ బోర్డ్ @ ఆన్‌లైన్

ఫీజిబిలిటీ సర్టిఫికెట్ జారీ ప్రక్రియ సులభతరం ● ఆన్‌లైన్‌సేవలు ప్రారంభించిన జలమండలి ఎండీ



ఆన్‌లైన్‌లో వాటర్ ఫీజిబిలిటీ ధ్రువపత్రం సేవలు ప్రారంభిస్తున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి తదితరులు

సాక్షి,సిటీబ్యూరో: మహానగర పరిధిలో నూతన భవన నిర్మాణదారులకు జలమండలి ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. కొత్తగా భవనాలు నిర్మించుకునే వారు జీహెచ్‌ఎంసీ అనుమతుల కోసం సమర్పించాల్సిన వాటర్ ఫీజిబిలిటీ ధ్రువపత్రాన్ని జారీ చేసే ప్రక్రియను సులభతరం చేసి ఆన్‌లైన్ లోనే పొందేలా సరికొత్త సదుపాయాన్ని కల్పించింది. గురువారం జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ కలిసి జూబ్లీహిల్స్‌లోని జలమండలి థీమ్ పార్క్ లో ఆన్‌లైన్‌లో వాటర్ ఫీజబిలిటీ ధ్రువపత్రాన్ని జారీ చేసే సేవలను లాంఛనంగా ప్రారంభించారు.

◆ గ్రేటర్ పరిధిలోని నూతన భవనం నిర్మించాలంటే జీహెచ్‌ఎంసీ పర్మిషన్ తప్పనిసరి. ఆ పర్మిషన్ కోసం భవన యజమానులు విద్యుత్ ఫీజబిలిటీ తో పాటు జలమండలి జారీ చేసే వాటర్ ఫీజిబిలిటీ ధ్రువపత్రం సమర్పించాల్సి ఉంటుంది. గతంలో ఈ సర్టిఫికెట్స్ పొందాలంటే జలమండలి సర్కిల్ కార్యాలయాల్లో, తర్వాత ఖైరతాబాద్ ప్రధాన కార్యాలయంలో సీజీఎం జారీ చేసేవారు. వివిధ కారణాల రీత్యా ఈ ప్రక్రియలో జాప్యం జరిగేది. ఈ ప్రక్రియను సులభతరం చేయడానికి ధ్రువపత్రాల జారీని ఆన్‌లైన్‌లోనే పొందేలాగా మార్పులు చేశారు.

ధ్రువపత్రాలు జారీ ఇలా...

జలమండలి హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బి వెబ్‌సైట్ ద్వారా నీటి ఫిజిబిలిటీ సర్టిఫికెట్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. దీని కోసం అప్లై ఆన్‌లైన్ ఫర్ వాటర్ ఫీజిబిలిటీ సర్టిఫికెట్ అనే లింక్ అందుబాటులో ఉంటుంది. దరఖాస్తు సమర్పించిన వెంటనే ఫైల్ నంబర్ జనరేట్ అవుతోంది. అవసరమైన పత్రాలను దరఖాస్తు సమయంలోనే అప్‌లోడ్ చేయాలి. ఇండెమ్నిటీ బాండ్‌ను రికార్డ్ కీపింగ్ కోసం సమర్పించాల్సి ఉంటుంది.

◆ ఒక్కో దరఖాస్తుపై రూ. 5,000 ప్రాసెసింగ్ ఫీజును నగదు కౌంటర్, ఆన్‌లైన్ విధానం ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. కనెక్షన్ చార్జీలు అందిన ఫైళ్లకు ఎస్‌ఎంఎస్ నోటిఫికేషన్ ఆధారంగా సీజీఎం (రెవెన్యూ) డిజిటల్ సంతకంతో ఫిజిబిలిటీ సర్టిఫికేట్ జారీ చేస్తారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ డేవిడ్‌రాజు తెలిపిన మేరకు.. రైల్వేస్టేషన్ 1వ ప్లాట్‌ఫామ్ 2ఏ గేట్ వద్ద ఒక వ్యక్తి అపస్మారక స్థితిలో పడిఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఘటన స్థలానికి వచ్చిన అంబులెన్స్ సిబ్బంది సదరు వ్యక్తి మృతి చెందినట్టు గుర్తించారు. మృతుడి వద్ద పోలీసులకు ఎటువంటి వివరాలు లభించలేదు. మృతుడి కుడిచేతిపై దానేశ్వర్‌యాదవ్ అని పచ్చబొట్టు ఉన్నట్టు, ఒంటిపై ఎరుపు రంగు టీ షర్టు, బ్లూ కలర్ నైట్‌ప్యాంటు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మరిన్ని వివరాల కోసం 9440083160 నెంబరు మొబైల్ ద్వారా సంప్రదించాలని పోలీసుల కోరారు.

బిహారీ యువకుడి అనుమానాస్పద మృతి

బాలానగర్: పనికోసం నగరానికి వచ్చిన ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. మృతుడు బీహార్‌లోని ఉపేంద్ర కోడా (30)గా పోలీసులు గుర్తించారు. పోలీసులు తెలిపిన మేరకు.. ఉపేంద్ర కోడా రెండు రోజుల క్రితమే బాలానగర్‌లోని రంగారెడ్డి నగర్‌లో ఉన్న వర్టెక్స్ ఇంజనీర్స్‌లో పనికి కుదిరాడు. గురువారం ఉదయం వర్షపు నీరు పోవడానికి కాలువ తవ్వుతున్న సమయంలో ఉపేంద్ర అకస్మాత్తుగా స్పృహ కోల్పోయి కుప్పకూలి పోయాడు. వెంటనే అతడిని తోటి కార్మికులు సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు మెరుగైన చికిత్స కోసం బీబీఆర్ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. ఆసుపత్రికి తీసుకుని వెళ్లే లోపే ఉపేంద్ర మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు దినేష్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు పోస్టుమార్టం నివేదిక వచ్చాక తెలుస్తాయని బాలానగర్ డిఐ సక్రమ్ తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికురాలి మృతి

చందానగర్ : అనుమానస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సుంకరి విజయ్ తెలిపిన మేరకు.. లింగంపల్లి గ్రామంలో యాదమ్మ (49) జీహెచ్‌ఎంసీలో కాంట్రాక్ట్ కింద పారిశుద్ధ్య కార్మికురాలిగా పని చేస్తోంది. బుధవారం రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవ జరిగి నేపథ్యంలో మనస్థాపానికి గురైన ఆమె ఇంటి పక్కనే ఉన్న నాలాలోకి దూకింది. దీంతో నాలాలో కొట్టుకుపోయి మృతి చెందింది. తారానగర్ కూరగాయాల మార్కెట్ వద్ద నాలాలో తేలడంతో స్థానికులు గమనించారు. వెంటనే చందానగర్ పోలీసులకు సమాచారం అందించగా అక్కడికి స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ మేరకు గురువారం అనుమానాస్పద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

నూతన ఆవిష్కరణలతో వ్యవసాయ పరిశ్రమకు మేలు

అమీర్‌పేట: సంప్రదాయ వ్యవసాయ పద్ధతులు, నూతన ఆవిష్కరణలతో అగ్రి పారిశ్రామిక స్థిరత్వాన్ని సాధించాల్సిన అవసరముందని అసోచామ్ దక్షిణ భారత వ్యవసాయ, ఆహార ప్రాసెసింగ్ కౌన్సిల్ చైర్మన్ డా.రంగయ్య అన్నారు. వాణిజ్య, పరిశ్రమల సంఘం అసోచామ్ ఆధ్వర్యంలో అమీర్‌పేట గ్రీన్‌పార్కు హోటల్‌లో గురువారం అగ్రిబిజ్ కనెక్ట్ 2025 ఆహార ప్రాసెసింగ్ సదస్సు నిర్వహించారు. సమగ్ర వ్యవసాయం, పారిశ్రామిక వృద్ధి, విలువ ఆధారిత, సాంకేతిక ఆధారిత పరిశ్రమగా మార్చే రోడ్‌మ్యాప్ అనే అంశంపై ప్రధానంగా సదస్సులో చర్చించారు. తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డా.రాజిరెడ్డి మాట్లాడుతూ ఉద్యానవన ఆధారిత వృద్ధి రైతుల ఆదాయాన్ని పెంచడం, ఆహార భద్రతను బలోపేతం చేసి,గ్రామీణ ఉపాధిని విస్తరించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు.

రైల్వే సేవల్లో ప్రమోటీ అధికారులే కీలకం

సాక్షి, సిటీబ్యూరో: భారతీయ రైల్వేల నిర్వహణలో ప్రమోటీ అధికారుల సేవలు ఎంతో కీలకమైనవని దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజీవ్‌కుమార్ శ్రీవాస్తవ అన్నారు. రైల్వేలకు వారు వెన్నెముకలాంటివారని పేర్కొన్నారు. భారతీయ రైల్వే ప్రమోటి అధికారుల సమాఖ్య కార్యనిర్వాహక కమిటీ రెండు రోజుల సమావేశం గురువారం సికింద్రాబాద్‌లోని రైల్‌కళారంగ్‌లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి జీఎం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశేష అనుభవం కలిగిన ప్రమోటీ కేడర్ సిబ్బంది ఉన్నతాధికారుల మధ్య వారధిగా ప్రధానమైన బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని చెప్పారు. సమావేశంలో పాల్గొన్న అదనపు జనరల్ మేనేజర్ సత్యప్రకాశ్ మాట్లాడుతూ ప్రమోటి అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను రైల్వే బోర్డు ఉన్నతస్థాయి సమావేశంలో ప్రస్తావించనున్నట్లు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రమోటీ అధికారుల సమాఖ్య అధ్యక్షుడు దీపక్‌రాజ్, సెక్రటరీ జనరల్ డా. అమిత్ జైన్,తదితరులు పాల్గొన్నారు.

మైనర్ బాలిక ఆత్మహత్య

హస్తినాపురం: స్నేహితుని మృతిని తట్టుకోలేక తీవ్రమనస్థాపానికి గురైన మైనర్‌బాలిక ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వనస్థలిపురం పోలీసులు తెలిపిన మేరకు.. హిల్‌కాలనీకి చెందిన మైనర్‌బాలిక(16)బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బెడ్‌రూంలోకి వెళ్లి చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. ఫ్యాన్‌కు వేలాడుతుండడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించగా వైద్యపరీక్షలు చేసిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా మృతురాలు తన స్నేహితుడు ఇటీవలే చనిపోవడంతో అతని మరణాన్ని జీర్ణించుకోలేక తీవ్రమనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి తండ్రి పిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిర్లక్ష్యం వహించిన ఇన్‌చార్జి హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల విధుల పట్ల నిర్లక్ష్యంపై విద్యాశాఖ కొరడా ఝులిపిస్తోంది గురువారం మొఘల్‌పురాలో నిర్వహించిన జీజీహెచ్‌ఎస్‌ల సమీక్షా సమావేశంలో ఎన్‌రోల్‌మెంట్, హాజరు నమోదుపై నిర్లక్ష్యాన్ని జిల్లా విద్యాశాఖాధికారిణి రోహిణి తీవ్రంగా పరిగణించారు. సంబంధిత వివరాలు సమర్పించడంలో నిర్లక్ష్యం వహించడమే కాకుండా వాదించడంతో లాడ్ బజార్ ఇంచార్జి హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు జారీచేశారు. రెండు రోజుల్లోపు వివరణ ఇవ్వాలని..లేనిపక్షంలో సీసీఏ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

దుబాయ్ నుంచి హైదరాబాద్

● సిటీకి ఈ- సిగరెట్లు దిగుమతి చేస్తున్న ముఠా ● పోలీసుల అదుపులో నిందితులు

బంజారాహిల్స్: దుబాయ్ నుంచి అక్రమంగా ఈ–సిగరెట్లు దిగుమతి చేసి విక్రయాలు జరుపుతున్న ఆరుగురు సభ్యులతో కూడిన ముఠాను వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.25 లక్షల విలువైన ఈ–సిగరెట్లతో పాటు ద్విచక్ర వాహనం, ఆరు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలు పోలీసులు తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి. బంజారాహిల్స్ ఎమ్మెల్యేకాలనీలో సోహైల్‌ఖాన్ అనే వ్యక్తి వద్ద ఈ–సిగరెట్లు కలిగి ఉండడాన్ని పోలీసులు గుర్తించి మొదటగా అతన్ని అరెస్టు చేశారు. విచారణలో అతను సామి అలియాస్ ముక్రం అనే వ్యక్తి నుంచి ఈ–సిగరెట్లను కొనుగోలు చేసినట్లు పేర్కొన్నాడు. ఆ తర్వాత సామిని అరెస్టు చేశారు. అతను ముంబాయికి చెందిన ఈ–సిగరెట్లు, విదేశీ సిగరెట్ల సరఫరా చేసే అబ్దుల్లాశెట్టి అనే వ్యక్తితో పరిచయాలు కలిగి ఉన్నాడని విచారణలో తేలింది. అబ్దుల్లాశెట్టి నగరానికి వచ్చినప్పుడల్లా లక్డీకాపూల్‌లోని హోటల్‌లో బస చేసి సరుకును సరఫరా చేస్తుంటాడని పోలీసులు తెలుసుకున్నారు. ఈ సమాచారం ఆధారంగా అబ్దుల్లాశెట్టితో పాటు ఇతర నిందితులు, ఈ–సిగరెట్లు, విదేశీ సిగరెట్ల డీలర్లను పట్టుకున్నారు. కొన్ని సంవత్సరాల క్రితం తాను మార్టిన్ అలియాస్ సోహైల్ అనే వ్యక్తితో పరిచయం పెంచుకున్నానని, సిగరెట్లు అమ్మడానికి అతనితో ఒప్పందం కుదుర్చుకున్నట్లు అబ్దుల్లాశెట్టి పోలీసులకు వివరించాడు. ఒప్పందం ప్రకారం మార్టిన్ పంపిన వేర్వేరు వ్యక్తుల ద్వారా దుబాయ్ నుంచి ఈ–సిగరెట్లు, విదేశీ సిగరెట్లను పొందినట్లు విచారణలో వెల్లడించాడు. సరుకును స్వీకరించడం, పంపిణీ చేయడం చూసుకునే సమన్వయకర్తగా మొహమ్మద్ తాజుద్దీన్ వ్యవహరించేవాడు. ఈ క్రమంలో దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన మయాంక్ బిసే.. మహమ్మద్ తాజుద్దీన్‌కు డెలివరీ చేయడానికి రాగా పట్టుకున్నారు. సోహైల్, మార్టిన్ వద్ద పనిచేసే మ్యాన్ పవర్‌ను ఖలీల్ అహ్మద్ అనే వ్యక్తి సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న అబ్దుల్లాశెట్టి(42), మొహమ్మద్ తాజుద్దీన్, (38), ముక్రం (34), మొహమ్మద్ సోహైల్‌ఖాన్ (22), ఖలీల్ అహ్మద్ (41), మాయంక్ బిసే (25)లను అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.25 లక్షల విలువైన ఈ–సిగరెట్లు, విదేశీ సిగరెట్లతో పాటు హోండా యాక్టివా , ఆరు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఓట్ల చేర్పుతోనే బీజేపీ గెలుపు



విద్యార్థులతో ప్రముఖ రాజకీయవిశ్లేషకుడు పరకాల ప్రభాకర్

రాయదుర్గం: ఓట్ల చేర్పుతోనే బీజేపీ గెలుపు సాధ్యమవుతోందని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు పరకాల ప్రభాకర్ అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో 'ఓట్ చోరీ అండ్ ది క్రైసిస్ ఆఫ్ ఎలక్టోరల్ ఇంటిగ్రిటీ ఇన్ ఇండియా' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 లోకసభ ఎన్నికలు, ఆతర్వాతి రాష్ట్రాల ఎన్నికలలో అవకతవకలు జరిగాయని వాటితోనే బీజేపీ గెలుపు, ప్రభుత్వాల ఏర్పాటు సాధ్యమయ్యాయని వివరించారు. 2025 ఎన్నికలలో దాదాపు 5 కోట్ల ఓట్లు చేర్చి బీజేపీ గెలిచేలా ప్రణాళికలు రచించారని తెలిసిందన్నారు. ఇందులో ఎన్నికల కమిషన్‌దే పెద్ద పాత్ర ఉందని అభిప్రాయపడాల్సి వస్తోందన్నారు. ఓటింగ్ రోజు పేర్కొన్న ఓట్లకు తర్వాత ఎన్నికల కమిషన్ ఓట్లకు చాలా అంతరం ఉందన్నారు. బీజేపీ నాయకులకు అనుకూలంగా అయిదు ఫేజులలో ఎన్నికలు నిర్వహించారని, ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో ఏ రోజు ఏ బూత్‌లో ఎన్ని ఓట్లు నమోదయ్యే వివరాలు ఇప్పటికీ లేవన్నారు. దాదాపు 12 శాతం ఓట్ల చేర్పు జరిగిందని, దానివల్లే దాదాపు 88 స్థానాల్లో బీజేపీ గెలుపు సాధ్యమయిందని ఆయన వివరించారు. సమావేశంలో ఎన్ఎస్‌యూఐ హెచ్‌సీయూ అధ్యక్షులు మారియా, ఉపాధ్యక్షుడు జాషువా భీమ్, మాజీ అధ్యోఉడు సునీల్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రితేష్‌రావు, పలువురు సభ్యులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

నాలుగు గుర్తుతెలియని మృతదేహాలు స్వాధీనం



గాంధీ మార్చురీలో భద్రపరిచిన గుర్తుతెలియని వ్యక్తుల మృతదేహాలు

చిలకలగూడ: వేర్వేరు ఘటనల్లో నాలుగు గుర్తుతెలియని వ్యక్తుల మృతదేహాలను చిలకలగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గాంధీఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది, చిలకలగూడ పోలీసులు తెలిపిన మేరకు.. సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి ప్రాంగణంలోని వెయిటింగ్‌హాలు వద్ద రెండు రోజులుగా ముగ్గురు వ్యక్తులు అపస్మారకస్థితిలో ఉన్నట్లు సెక్యూరిటీ సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వారిని అత్యవసర విభాగంలో చేర్పించారు. చికిత్సపొందుతూ గురువారం గుర్తుతెలియని ముగ్గురు మృతి చెందారు. మృతులంతా గాంధీఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో నివసించే యాచకులుగా భావిస్తున్నారు.

మైలార్‌గడ్డలో...

సీతాఫల్‌మండి మైలార్‌గడ్డలో బాలాజీ స్వీట్‌షాపు సమీపంలో ఓ వ్యక్తి అనారోగ్యంతో పడున్నట్లు గస్తీ పోలీసులు గుర్తించారు. ప్రత్యేక వాహనంలో గాంధీ అత్యవసర విభాగానికి తరలించగా, చికిత్స పొందుతు గురువారం మృతి చెందాడు. కుటుంబసభ్యులు, బంధువులు గుర్తించేందుకు వీలుగా ఆయా మృతదేహాలను గాంధీ మార్చురీలో భద్రపరిచామని పోలీసులు తెలిపారు.

రూ.40 లక్షల డెమో కారు చోరీ

సనత్‌నగర్: ఓ కార్ల షోరూంకు చెందిన రూ.40 లక్షల విలువైన హ్యుండయ్ టక్సన్ డెమో వాహనాన్ని దొంగిలించకుపోయిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. దర్జాగా గోడ దూకి వచ్చి గేటు తాళాలు పగులగొట్టి ఎంచక్కా కారును నడుపుకుంటూ దొంగ వెళ్లిపోయాడు. పోలీసులు తెలిపిన మేరకు....బాలంరాయి ప్రాంతంలో హ్యుందాయ్ కార్ల స్టాక్ యార్డు ఉంది. ఈ నెల 19వ తేదీన రాత్రి గుర్తుతెలియని వ్యక్తి స్టాక్‌యార్డు ప్రహరీగోడ దూకి లోనికి ప్రవేశించాడు. అక్కడి కార్యాలయంలోకి వెళ్లి తాళాలు తీసుకుని హ్యుండయ్ టక్సన్ డెమో వాహనాన్ని దొంగిలించుకుపోయాడు. ఈ క్రమంలో బండరాయితో గేటు తాళాలు పగులగొట్టినట్లు గుర్తించారు. తెల్లవారుజామున టక్సన్ డెమో వాహనం కనిపించకపోవడంతో జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దొంగిలించబడ్డ వాహనం విలువ రూ.40 లక్షలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మూసీ ఒడ్డున గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ జె.నర్సయ్య

అంబర్‌పేట: మూసీ ఒడ్డున గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటన గురువారం అంబర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపిన మేరకు.. గురువారం అంబర్‌పేట జీహెచ్‌ఎంసీ చెత్త డంపింగ్ యార్డు సమీపంలోని మూసి పరివాహక ప్రాంతం నీటి ఒడ్డున ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉంది. స్థానికులు గమనించి అంబర్‌పేట పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుని మెడకు వైర్లు చుట్టి ఉండడం, ఇతర గాయాలు ఉండడంతో పోలీసులు క్లూస్‌టీం రప్పించి పరిశీలించారు. మృతుడు సుమారు 35 సంవత్సరాల వయస్సు, నీలిరంగు టీ షర్టు, నీలి రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతదేహం నీటి ప్రవాహంలో కొట్టుకొచ్చిన ఆనావాళ్లు లేవు. ఇక్కడే హత్యచేసి పడేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ సంఘటన స్థలానికి అడిషనల్ డీసీపీ జె.నర్సయ్య, ఏసీపీ హరీష్‌కుమార్‌లు సందర్శించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మృత దేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు.

మద్యం తాగొద్దన్నందుకు మహిళ ఆత్మహత్య

రాజేంద్రనగర్: మద్యం తాగవద్దని భర్త మందలించడంతో ఓ భార్య ఎలుకల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మామిడి కిశోర్ తెలిపిన మేరకు.. కొడంగల్ ప్రాంతానికి చెందిన శేఖర్, అరుణ(35)లు దంపతులు. ఐదు సంవత్సరాల క్రితం కిస్మత్‌పూర్ ప్రాంతానికి వచ్చి అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు సంతానం. కొన్ని రోజులుగా మద్యానికి బానిసైన అరుణ మద్యం తాగుతూ కుటుంబాన్ని పట్టించుకోవడం లేదు. దీంతో భర్త శేఖర్ మద్యం తాగవద్దంటూ హెచ్చరించాడు. దీంతో మనస్తాపం చెందిన అరుణ మద్యంలో ఎలుకల మందు కలుపుకొని తాగి అస్వస్థకు గురైంది. వెంటనే భర్త శేఖర్ ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందింది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు సైబర్ నేరగాళ్లకు అరదండాలు

వేర్వేరు కేసుల్లో అరెస్టు చేసిన సిటీ పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: రెండు వేర్వేరు కేసుల్లో నిందితులుగా ఉన్న ముగ్గురు సైబర్ నేరగాళ్లకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు ఒక కేసులో, మరొకరు ఇంకో కేసులో నిందితులుగా ఉన్నట్లు డీసీపీ దార కవిత గురువారం ప్రకటించారు. సికింద్రాబాద్‌కు చెందిన ఓ బాధితుడు (62) ఫేస్‌బుక్‌లో వచ్చిన ప్రకటన చూసి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కారు. ట్రేడింగ్ ద్వారా భారీ లాభాలు ఆర్జించవచ్చని ఎర వేసిన కేటుగాళ్లు తొలుత లాభాలు ఇచ్చారు. ఆపై బాధితుడి నుంచి ఏకంగా రూ.2.02 కోట్లు స్వాహా చేశారు. ఈ మేరకు నమోదైన కేసు దర్యాప్తు చేసిన ఇన్‌స్పెక్టర్ పి.ప్రమోద్ కుమార్ నేతృత్వంలోని బృందం గతంలోనే ఐదుగురు నిందితులను అరెస్టు చేసింది. తాజాగా హర్యానాకు చెందిన అకౌంట్ హోల్డర్ వినీత్ చంద్రను పట్టుకున్నారు. ఐడీఎఫ్‌సీ బ్యాంకులో ఉన్న ఇతడి ఖాతాలోకి బాధితుడి నగదు రూ.40 లక్షలు డిపాజిట్ అయినట్లు గుర్తించారు. వినీత్ నుంచి పోలీసులు ఆరు సెల్‌ఫోన్లు, ఓ ల్యాప్‌టాప్, ఓ చెక్‌బుక్ స్వాధీనం చేసుకున్నారు. మరో ఉదంతంలో.. ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి రూ.63.45 లక్షలు రీఎంబర్స్‌మెంట్ చేయిస్తామంటూ నగర వాసికి (58) సైబర్ నేరగాళ్లు ఫోన్ ద్వారా ఎర వేశారు. బాధితుడు అంగీకరించడంతో అడ్వాన్స్‌గా కొంత మొత్తం చెల్లించాలని, రీఫండ్ అవుతుందని రూ.4.02 లక్షలు కాజేశారు. ఈ మేరకు నమోదైన కేసును దర్యాప్తు చేసిన పోలీసులు ఉత్తరప్రదేశ్‌కు చెందిన అకౌంట్ సప్లయర్లు దేవష్ రస్తోగీ, జితేందర్ అగర్వాల్‌లను అరెస్టు చేశారు.

మత్తుగా మాట్లాడి రూ.7.11 లక్షలు స్వాహా...

అమీర్‌పేటకు చెందిన ఓ వృద్ధుడికి (81) ఫోన్ ద్వారా మాయా రాజ్‌పుత్‌గా పరిచయమైన ఓ మహిళ మత్తుగా మాట్లాడి రూ.7.11 లక్షలు స్వాహా చేసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు గురువారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. బాధితుడికి ఈ ఏడాది జూన్ మొదటి వారం నుంచి ఫోన్, వాట్సాప్ కాల్స్‌తో పాటు సందేశాలు మొదలయ్యాయి. తొలినాళ్లలో మధురంగా మాట్లాడిన ఆమె ముగ్గులోకి దించింది. ఆపై అసలు కథ మొదలెట్టి వైద్యం, స్థిరాస్తి రిజిస్ట్రేషన్, తనఖాలో ఉన్న ఆభరణాలు విడిపించుకోవడం, గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోలు తదితర అవసరాలు చెబుతూ డబ్బు గుంజింది. ఓ దశలో బాధితుడిని ఆయన కుటుంబీకులకు వ్యతిరేకంగా మారేలా బ్రెయిన్ వాష్ చేసింది. ఎట్టకేలకు తాను మోసపోయానని గుర్తించిన బాధితుడు సైబర్ ఠాణాలో ఫిర్యాదు చేశారు.

ఒకరికి ఒక ఓటు మాత్రమే ఉండాలి



మాట్లాడుతున్న మురళీగౌడ్

వెంగళరావునగర్: ఎక్కడైనా ఒక వ్యక్తికి ఒక ఓటు మాత్రమే ఉండాలని, ఈ మేరకు అధికారులు కఠినంగా వ్యవహరించాలని యూసుఫ్‌గూడ మాజీ కార్పొరేటర్, జూబ్లీహిల్స్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జి.మురళీగౌడ్ డిమాండ్ చేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని కృష్ణకాంత్‌పార్క్ వద్ద వన్ మ్యాన్.. వన్ ఓట్ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఒకరికి ఒక ఓటు మాత్రమే ఉండాలని, ఇంకో ప్రాంతంలో కూడా ఉంటే తొలగించాలని సూచించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో వేలాదిగా దొంగ ఓట్లు ఉన్నాయని అన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన ఓట్లను గుర్తించాలని, ఓటరు కార్డును ఆధార్‌కార్డుతో లింక్ చేయాలని డిమాండ్ చేశారు. వెంగళరావునగర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు వినోద్‌కుమార్, మహ్మద్ గౌస్, నాగరాజు, అబ్దుల్‌ఖాదర్, చంద్రమౌళి, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాప్య సంరక్షణకు ఎమోహాతో కేర్ హాస్పిటల్స్ భాగస్వామ్యం



కేర్ హాస్పిటల్ ఎమోహా సంస్థ ప్రతినిధులు

బంజారాహిల్స్: ప్రపంచ సీనియర్ సిటిజన్స్ దినోత్సవం సందర్భంగా కేర్ హాస్పిటల్స్ దేశంలోని ప్రముఖ వృద్ధుల సంరక్షణ సంస్థ ఎమోహాతో కలిసి వారికి తోడ్పాటు అందించే పలు కార్యక్రమాలను చేపట్టింది. వృద్ధులకు వైద్యపరంగా మాత్రమే కాకుండా భావోద్వేగపరంగా పూర్తిస్థాయి సంరక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో కేర్ హాస్పిటల్స్ జోనల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ బిజునాయర్ తెలిపారు. ఈ భాగస్వామ్యంలో భాగంగా అక్టోబర్ 1న కేర్ హాస్పిటల్స్‌లో అత్యాధునిక జెరియాట్రిక్ కేర్ ఫెసిలిటీ ప్రారంభించనున్నట్లు చెప్పారు. వృద్ధుల ప్రత్యేక అవసరాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించిన ఈ యూనిట్‌లో సమగ్ర వృద్ధాప్య సమస్యల అంచనా నుంచి ఆధునిక వైద్య చికిత్సల వరకు అన్ని సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమోహా ఎల్డర్ కేర్ సీఈఓ సౌమ్యజిత్‌రాయ్, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆ భూములకు వెంటనే పట్టాలివ్వాలి

తెలంగాణ కార్మిక సమాఖ్య డిమాండ్

హిమాయత్‌నగర్: రాష్ట్రంలో ఉన్న పోడు భూములు, పంచరాయి భూములు, అసైన్‌మెంట్ భూములకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పట్టాలు ఇవ్వాలని తెలంగాణ కార్మిక సమాఖ్య(టీకేఎస్) సభ్యులు డిమాండ్ చేశారు. అన్ని రంగాల్లో పనిచేస్తున్న అసంఘటిత, సంఘటిత కార్మికుల హక్కుల సాధనకు త్వరలో ఇందిరా పార్క్ ధర్నాచౌక్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కలకోటి రామన్న, ప్రధాన కార్యదర్శి బందెల యాదగిరి, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు చిలుముల సుజాత మాట్లాడారు. అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు గుర్తింపు కార్డులు ఇచ్చి ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింపజేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు. విద్యా, వైద్యాన్ని ప్రభుత్వాలు ఉచితంగా అందించాలన్నారు. సమావేశంలో సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యాతాకుల ఈశ్వర్, ఉపాధ్యక్షుడు వేల్పుల వెంకట సాయిలు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు కిషోర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహాగణపతి వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా..



ఖైరతాబాద్: ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల మార్గాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు, బందోబస్తును గురువారం ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ పరిశీలించారు. ఖైరతాబాద్ మహాగణపతి మండం నుంచి రైల్వేగేట్, ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఉన్నతాధికారులతో నేరుగా తిరిగి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ట్రాఫిక్–2 డీసీపీ ఎస్.శ్రీనివాస్, అడిషనల్ డీసీపీ ట్రాఫిక్–2 రాములు, సెంట్రల్ జోన్ ఏసీపీ మోహన్ కుమార్, లా అండ్ ఆర్డర్ ఏసీపీ సంజయ్ కుమార్, సైఫాబాద్, ఖైరతాబాద్ పోలీసులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఉన్నారు.





పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా..
సర్కార్ స్కూళ్లలో ఎకో క్లబ్‌లు
భారీగా మొక్కలు నాటుతున్న విద్యార్థులు



బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12లోని ఎన్‌బీటీ నగర్ హైస్కూల్‌లో మొక్కలు నాటుతున్న ఎకో క్లబ్ విద్యార్థులు

రేపటి తరానికి.. ప్రకృతే ప్రసాదం

బంజారాహిల్స్: కొంతకాలంగా భారీ వర్షాలు జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. పలుచోట్ల మేఘ విస్ఫోటనం(క్లౌడ్ బరస్ట్)లతో భారీగా ఆస్తి, ప్రాణనష్టం సంభవిస్తోందని నిపుణులు చెబుతున్నారు. అడవుల నరికివేత, విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణం దెబ్బతిని భూతాపం పెరుగుతుండటంతో ఈ సమస్య రోజురోజుకూ పెరుగుతోందని పేర్కొంటున్నారు. అందుకే పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ ప్రభుత్వ కార్యక్రమాలు చేపట్టేందుకు నిర్ణయించింది. అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులను పర్యావరణ పరిరక్షకులుగా తీర్చిదిద్దాలని, నేటితరంతోనే రేపటి తరానికి ప్రకృతిని ప్రసాదించవచ్చనే ఉద్దేశ్యంతో సర్కార్ బడుల్లో పర్యావరణ క్లబ్‌లను గతంలోనే ఏర్పాటు చేశారు. ఈ విద్యా సంవత్సరం నుంచి 'ఎకో క్లబ్ ఫర్ మిషన్ లైఫ్'గా వీటిని ఏర్పాటు చేశారు. విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్, అమీర్‌పేట డివిజన్ల పరిధిలో 17 ప్రభుత్వ, 2 రెసిడెన్షియల్, 4 మైనార్టీ గురుకులాల్లో ఈ ఎకో క్లబ్‌లను ఏర్పాటు చేశారు. విద్యార్థులతో ఈ క్లబ్‌లు ఏర్పాటు కాగా, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటడం, వాటికి నీళ్లు పోయడం, సంరక్షించడం లక్ష్యంగా ఈ క్లబ్‌లు పనిచేస్తున్నాయి.

క్లబ్‌ల ప్రధాన లక్ష్యం ఇలా..

ఎకో క్లబ్‌లు ప్రధానంగా జీవ వైవిధ్యం, నీరు, శక్తి పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, చెట్ల పెంపకం, వనాలను సృష్టించడం, పచ్చదనం–పరిశుభ్రతను ప్రోత్సహించడం, ప్లాస్టిక్ వ్యతిరేక ప్రచారం వంటి కార్యకలాపాలపై దృష్టిసారిస్తాయి. విద్యార్థులకు ఆచరణాత్మక పర్యావరణ నిర్వహణలో అవగాహన కలిగించి అమలు చేయనున్నారు.

ఎలా నమోదు చేసుకోవాలంటే..

ఖైరతాబాద్ జోన్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. సీనియర్ ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీలు ఇందులో సభ్యులుగా ఉంటారు. ప్రత్యేకంగా రూపొందించిన వెబ్‌సైట్ ఎకో క్లబ్స్ ఎడ్యుకేషన్ గవర్నమెంట్ డాట్ ఇన్‌లో ఈ నెల 31వ తేదీ నాటికి వివరాలు పొందుపరిచి పూర్తి చేయాలని విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి తరగతి నుంచి ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేసి క్లబ్‌లో భాగస్వాములను చేయాలని, ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలని సూచించారు.

ఈ క్లబ్ ద్వారా ఏమి నేర్పిస్తారంటే..

- ప్రపంచ ప్రజా ఉద్యమంగా చేపట్టిన ఏడు ఇతివృత్తాలను ఎకోక్లబ్‌లలో ఈ ఏడాది భాగస్వామ్యం చేశారు. వీటిపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తారు.
- శక్తిని ఆదా చేయడం
- నీటిని ఆదా చేయడం.
- సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణ.
- స్థిరమైన ఆహార వ్యవస్థ.
- వ్యర్థాలను తగ్గించేందుకు కృషి.
- ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం.
- ఇ–వ్యర్థాలను తగ్గించేలా విద్యార్థులను ఉపాధ్యాయులు తీర్చిదిద్దడం.

ప్రకృతి పరిరక్షకులుగా పనిచేయాలి

గతేడాది ఎకో క్లబ్‌లో చాలామంది పేర్లు నమోదు చేసుకున్నారు. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఈ ఏడాది కూడా మిగతావారిని భాగస్వామ్యం చేస్తూ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేస్తున్నాం. ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన కలిగిస్తున్నాం. ఎకోక్లబ్‌ల ద్వారా పర్యావరణం కోసం పనిచేసే అవకాశం విద్యార్థులకు కల్పించడంతో వారు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నేటి బాలలనే రేపటి ప్రకృతి పరిరక్షకులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. విద్యార్థులు ఈ క్లబ్‌లలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో ఈ క్లబ్‌లలో పనిచేస్తున్నారు. మొక్కలు నాటి పచ్చదనాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

– రవీందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, ప్రభుత్వ పాఠశాల, ఎన్‌బీటీనగర్.

వినాయక మండపాలను పటిష్టంగా నిర్మించాలి

బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి



బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి, పోలీసు అధికారులు తదితరులు

బంజారాహిల్స్: వినాయక చవితి పర్వదినంతో పాటు మిలాద్ ఉన్ నబీ పండగ కూడా నవరాత్రి మహోత్సవాల్లోనే వస్తోందని, హిందూ, ముస్లింలు ఐకమత్యాన్ని చాటుకుంటూ ఒకరికొకరు అన్నదమ్ముల్లాగా ప్రశాంత వాతావరణంలో సమన్వయంతో నిర్వహించుకోవాలని బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి సూచించారు. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఫిలింనగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాసబ్‌ట్యాంక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని శాంతి కమిటీలతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాలి, వానను తట్టుకునేలా మండపాలు పటిష్టంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పార్కింగ్ కోసం తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. నిపుణుల సహాయం లేకుండా విద్యుత్ కనెక్షన్లు తీసుకోవద్దన్నారు. మండపాలు ఏర్పాటు చేసుకునే వారు తప్పనిసరిగా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. అనుమానస్పద వ్యక్తుల గురించి సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతి మండపానికి సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలన్నారు. నిమజ్జన శోభాయాత్ర రూట్ మ్యాప్ కూడా పోలీసులకు అందజేయాలన్నారు. డీజేలకు అనుమతి లేదని, లౌడ్ స్పీకర్లు కూడా నిబంధనలకు విరుద్ధంగా గడువుకు మించి పెట్టుకోవదన్నారు. సిటీ ఆల్ జోన్స్ పీస్ కమిటీ జనరల్ సెక్రటరీ కిషన్‌శర్మ, వెస్ట్‌జోన్ పీస్ కమిటీ ప్రెసిడెంట్ తేజూకూమారి, బాలదాస్, అసద్ అలీ, మాజీద్ అహ్మద్, మహ్మద్ సాదిక్ అలీ, బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ సంతోషం, మాసబ్‌ట్యాంక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'అంబర్‌జోన్'గా ఎన్‌బీటీనగర్ వారపు సంత



మాట్లాడుతున్న జూబ్లీహిల్స్ సర్కిల్ డీసీ సమ్మయ్య

బంజారాహిల్స్: ఖైరతాబాద్‌లోని జీహెచ్ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్ కార్యాలయంలో గురువారం టౌన్ వెండింగ్ కమిటీ(టీవీసీ) సమావేశం నిర్వహించగా టీవీసీ సభ్యులు పాల్గొని వీధి వ్యాపారుల సమస్యలపై చర్చించారు. సర్కిల్ లెవల్ టౌన్ వెండింగ్ కమిటీ అధికారులు వీధి వ్యాపారుల సీఐజీ గ్రూపులకు రూ.లక్ష వరకు రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12లోని ఎన్‌బీటీనగర్ వారాంతపు సంతను 'అంబర్ జోన్'గా ప్రకటిస్తూ నిర్ణయం తీసుకున్నారు. రేషన్ షాపు నుంచి షారోన్ చర్చి వరకు ఉన్న ప్రాంతాన్ని వారపు మార్కెట్‌గా గుర్తిస్తూ తీర్మానాన్ని ఆమోదించారు. షేక్‌పేట మండల కార్యాలయం, శానిటేషన్ సిబ్బంది, టౌన్‌ప్లానింగ్, ట్రాఫిక్ పోలీసులు, ఇతర టీవీసీ సభ్యులు ఆమోదాన్ని తెలిపారు. టీవీసీ చైర్మన్, జూబ్లీహిల్స్ సర్కిల్ డీసీ సమ్మయ్య మాట్లాడుతూ శానిటేషన్ వ్యర్థాలను స్వచ్ఛ ఆటోలకు మాత్రమే ఇవ్వాలని, లేకపోతే వీధివ్యాపారులపై చలానాలు విధిస్తామన్నారు. ప్లాస్టిక్ సంచులు వాడకూడదని, జ్యూట్ బ్యాగ్‌లను ప్రోత్సహించాలని సూచించారు. వీధి వ్యాపారులకు వివిధ బీమా పథకాలు, ఐఎంఎస్ యూనిట్ల వివరాలను కూడా చర్చించారు.

జూబ్లీహిల్స్ పరిధిలో ఓటరు నమోదుకు అవకాశం

సాక్షి, సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక కోసం స్పెషల్ సమ్మరి రివిజన్(ఎస్ఎస్ఆర్) షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన నేపథ్యంలో ఆ నియోజకవర్గం పరిధిలోని అర్హులైన వారు(జూలై 1 వరకు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ) ఓటు హక్కు కోసం పేరు నమోదు చేసుకోవాలని ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్తగా ఓటు నమోదు కోసం ఫాం–6, అభ్యంతరాల కోసం ఫాం–7, పేర్ల నమోదులో దొర్లిన తప్పుల సవరణ కోసం ఫాం–8ను ఉపయోగించాలని సూచించారు. అదేవిధంగా ఈనెల 28న పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్, సెప్టెంబర్ 2న డ్రాఫ్ట్ పబ్లికేషన్, 25 వరకు అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం, 30 తుది జాబితా విడుదల ఉంటుందని ప్రకటించారు.

సీఎంపై మంద కృష్ణమాదిగ విమర్శలు హేయం

పంజగుట్ట: ఎస్సీ వర్గీకరణ విద్య, ఉద్యోగాల్లోనే జరిగిందని ఉపాధి, రాజకీయ రంగాల్లో కూడా మాదిగలు ఎదగాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి దేవని సతీష్ మాదిగ పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ చేసిన కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాదిగలు అండగా నిలవాలని ఆయన పేర్కొన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎమ్మార్పీఎస్ సీనియర్స్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక మహిళా విభాగం అధ్యక్షురాలు మేరీ మాదిగతో కలిసి మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ పుట్టిందే వర్గీకరణ కోసం, కొన్ని దశాబ్దాల సుదీర్ఘ పోరాటం చేసినా రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలోనే సాధ్యమైందని, ముఖ్యమంత్రి పదవి నుంచి రేవంత్‌రెడ్డిని దిగిపొమ్మని మంద కృష్ణమాదిగ అనడం సరికాదని అన్నారు. ఎప్పటికైనా దళితులకు న్యాయం చేసే పార్టీ కాంగ్రెస్సే అని చెప్పారు. ఈనెల 31వ తేదీన 2 వేల మంది ఎమ్మార్పీఎస్ ఉద్యమకారులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్లు, వ్యవస్థాపక సభ్యులు అల్లారం రత్నయ్య, పాలడుగు శ్రీనివాస్, జన్ను జయరాజ్, ఇటుక రాజు, జున్ను కనకరాజు మాదిగ, దండు సురేందర్, బారిక నర్సింహ, అంజయ్య పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యంతో యూరియా కొరత

హిమాయత్‌నగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యంతోనే రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడి రైతులు కష్టాలు పడుతున్నారని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ(టీపీఆర్‌పీ) వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర రవికుమార్ ఆరోపించారు. ప్రభుత్వాలకు ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో రైతులు ఒక్క యూరియా బస్తా కోసం తిండి తిప్పలు లేక క్యూ కడుతున్నారన్నారు. ఏ రాష్ట్రంలో లేని యూరియా కొరత మన రాష్ట్రంలోనే ఎందుకు ఉందో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇచ్చి రైతుల కష్టాలను తీర్చాలని కోరారు.

నిమ్స్‌కు ట్రాఫిక్ మార్షల్స్!

లక్డీకాపూల్: నిమ్స్‌లో రోజురోజుకీ జటిలంగా మారుతున్న ట్రాఫిక్ నియంత్రణ బాధ్యతలను ఇక నుంచి ట్రాఫిక్ మార్షల్స్ నిర్వహించనున్నారు. ఆస్పత్రిలో మెరుగైన ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల సులభతరమైన రాకపోకల కోసం ఈ ట్రాఫిక్ మార్షల్స్ సహకరిస్తారు. ఇందుకు వీరికి నగర ట్రాఫిక్ పోలీసులు 15 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకు నిమ్స్ తొమ్మిది మంది ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను ఎంపిక చేసింది. వీరంతా శిక్షణ తర్వాత పంజాగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో నిమ్స్ లోపల, బయట పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ బాధ్యతలను నిర్వర్తించనున్నారు. ఆస్పత్రిలో ట్రాఫిక్‌ను మెరుగు పర్చడంలోనూ, నిమ్స్‌కు వచ్చే వారికి మెరుగైన సేవలు అందించడంలో ఈ ట్రాఫిక్ మార్షల్స్ కీలక పాత్ర పోషించనున్నారు. హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్(హెచ్‌సీఎస్‌సీ) చేపట్టిన కీలక చర్యలో నిమ్స్ భాగస్వామ్యమైంది. నగరంలో గురువారం జరిగిన హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్(హెచ్‌సీఎస్‌సీ) కార్యక్రమంలో పాల్గొన్న నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్పను నగర సీపీ సీవీ ఆనంద్ జ్ఞాపికతో సత్కరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. హెచ్‌సీఎస్‌సీ చేపట్టిన వినూత్న చర్యల్లో నిమ్స్ భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. దీని వల్ల ఆస్పత్రిలో ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు.



నిమ్స్ డైరెక్టర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న సీపీ ఆనంద్

అద్దె పేరుతో బ్యాంకు వివరాలు అడిగి మోసం

వెంగళరావునగర్: అద్దె చెల్లించడానికి బ్యాంకు వివరాలు అడిగి మోసం చేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం విశాఖపట్నం ప్రాంతానికి చెందిన కళ్యాణచక్రవర్తి ప్రైవేట్ జాబ్ చేస్తూ స్థానిక మధురానగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 4వ తేదీన వైజాగ్‌లో ఉన్న స్థలం గురించి ఆన్‌లైన్‌లో రెండు వెబ్‌సైట్స్‌లో పోస్ట్ చేశాడు. దాంతో 7వ తేదీన దీపక్ అనే వ్యక్తి తాను ఆ ప్లాట్‌లో ఉంటానని, అద్దె నగదు పంపడానికి బ్యాంకు వివరాలు పంపమని కోరారు. తర్వాత హేమంత్ అనే వ్యక్తి కూడా పరిచయం చేసుకుని బ్యాంకు వివరాలు అడిగాడు. అనంతరం కళ్యాణచక్రవర్తి అకౌంట్ నుంచి తొలుత రూ.50 వేలు, అనంతరం రూ.49,999 డెబిట్ చేసినట్లు మెసేజ్ వచ్చింది. అనుమానించిన బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

వెంగళరావునగర్: ఇంటి నుంచి వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం అబ్దుల్ ఖాదీర్ కుటుంబ సభ్యులు కొంతకాలంగా రాజీవ్‌నగర్ కాలనీలో ఉంటున్నారు. ఇటీవల అతడి భార్యకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో జవహర్‌నగర్‌లోని తల్లి ఇంటికి వచ్చి ఉంటోంది. ఆమెకు సేవలు చేస్తూ తన 19 కుమార్తె కూడా అక్కడే ఉంటోంది. ఇంటర్వ్యూ ఉందని బుధవారం అమీర్‌పేటకు వెళ్లింది. రాత్రి వరకు తిరిగి రాలేదు. ఫోన్ చేయగా స్విచ్ఛ్ ఆఫ్ వస్తోంది. దాంతో ఆమె తల్లి కుమార్తె కోసం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మళ్లీ నిర్మిస్తే కఠిన చర్యలు



వెస్ట్ శ్రీనివాస్‌నగర్‌లో పర్యటిస్తున్న హైడ్రా కమిషనర్, జీహెచ్ఎంసీ కమిషనర్ తదితరులు

ఆక్రమణలదారులకు హెచ్చరికలు జారీ

వెంగళరావునగర్: వర్షాలు కురిసిన ప్రతిసారీ అమీర్‌పేట, మైత్రీవనం, వెస్ట్ శ్రీనివాస్‌నగర్ తదితర కాలనీలు నీట మునుగుతున్నాయని, దాంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందని, త్వరలోనే శాశ్వత పరిష్కారం కోసం సన్నాహాలు చేస్తున్నామని హైడ్రా కమిషనర్ రంగనాథ్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ తెలిపారు. హైడ్రా అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులు గురువారం వెస్ట్ శ్రీనివాస్‌నగర్‌కాలనీలో పర్యటించారు. ఇందులో భాగంగా అమరావతి హోటల్ సమీపంలో ఉన్న కొన్ని అక్రమ నిర్మాణాలను తొలగించారు. మరోసారి వాటిని నిర్మిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన ఆక్రమణలదారులకు హెచ్చరికలు జారీ చేశారు. దారి పొడవునా రోడ్డు ఎగువ దిగువ ప్రాంతాలు, నాలాను ఆనుకుని ఉన్న షాపులు, దుకాణాలు తద్వారా సిల్ట్ పేరుకుపోవడం తదితర విషయాలను చర్చించారు. ముఖ్యంగా ఎగువ భాగాన ఉన్న జూబ్లీహిల్స్, యూసుఫ్‌గూడ, వెంకటగిరి, కృష్ణకాంత్‌పార్క్ మీదుగా వచ్చే కాలువ సైతం గాయత్రీనగర్ నాలాలో కలుస్తుందని, అంతేగాకుండా మధురానగర్‌కాలనీ, వెస్ట్ శ్రీనివాస్‌నగర్ కాలనీల మీదుగా వరద అమీర్‌పేట ప్రధాన రహదారిపై పారుతోందని, దాంతో అమీర్‌పేట, మెట్రోస్టేషన్ ప్రాంతాలన్నీ నిండిపోతున్నాయని పేర్కొన్నారు. ఎగువ ప్రాంతంలో 40 అడుగుల మేర నీటి వరద వచ్చి అమీర్‌పేటలో కేవలం 10 అడుగులకు కుచించుకు పోవడంవల్లే తరచూ ఇలాంటి సమస్యలు వస్తున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఇది పునరావృతం కాకుండా నాలా పునర్నిర్మాణం చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్ తదితర అధికారులు, ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



హైడ్రా సిబ్బంది కూల్చిన అక్రమ నిర్మాణం

అక్రమమా.. సక్రమమా?

- ఇంటి నిర్మాణం కోసం సెల్లార్ గుంత
- అందులో భారీగా చేరిన వ్యర్థాలు, వరద
- ఆ ప్రాంతమంతా దుర్వాసనతో తిప్పలు
- అధికారులకు ఫిర్యాదు చేసిన స్థానికులు
- పరిశీలించిన హైడ్రా అధికారులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–36/19లో ప్లాట్ నంబర్–459లో సెల్లార్ గుంతలో నిండిపోయిన వరద, మురుగు సమస్య పట్ల హైడ్రా అధికారులు స్పందించారు. హైడ్రా ఏడీఎఫ్ఓ మోహన్‌రావు, అస్సెట్ ప్రొటెక్షన్ సీఐ నర్సింహారావు పరిశీలించారు. ప్లాట్ నంబర్–459లో వరదనీటి నాలాను కబ్జా చేసిన ప్లాట్ దారుడు లైన్ బ్లాక్ చేయడంతో వరదంతా అక్రమంగా తవ్విన ఈ సెల్లార్ గుంతలో నిండిపోయింది. దీంతో దుర్వాసనలు, దుర్గంధం, వ్యర్థాలు, చెత్తా చెదారం ఇటీవల కురిసిన వర్షాలకు భారీగా పేరుకుపోయి పరిసర నివాసితులు, వ్యాపారులు ప్రమాదకరమైన పరిస్థితిలో బిక్కుబిక్కుమంటున్న వైనం గురువారం మీడియాలో ప్రచురితమయ్యాయి. స్పందించిన హైడ్రా అధికారులు ఇక్కడ పర్యటించి భారీగా నిండిపోయిన గుంతను పరిశీలించారు. వరద, మురుగు పేరుకుపోయి సమస్య తీవ్రంగా ఉన్న విషయాన్ని గుర్తించారు. ఈ సమస్యను ఎలా పరిష్కరించాలనే విషయంపై హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో చర్చిస్తామని అధికారులు తెలిపారు. మురుగు, వరద నిండిపోయిన గుంత ఎన్ని ప్లాట్లలో ఉంది..? వీటిని ఎప్పుడు తవ్వారు, అనుమతులు ఉన్నాయా.. లేవా..? పరిశీలించనున్నారు. ప్లాట్ నంబర్ 459కి అనుమతులు లేవని, అక్రమంగా తవ్వారని, నిర్లక్ష్యంగా గుంతలు గాలికి వదిలేశారని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ ప్లాట్లు అక్రమమా..? సక్రమమా? అనే విషయంలో పరిశీలించనున్నారు.



జూబ్లీహిల్స్‌లో వరద నిలిచిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మోహన్‌రావు, నర్సింహారావు

30న నర్సింగ్ అభ్యర్థులకు కౌన్సెలింగ్

లక్డీకాపూల్: నిజామ్ వైద్య విజ్ఞాన సంస్థ(నిమ్స్) నిర్వహించే బ్యాచిలర్ ఆఫ్ సైన్స్(నర్సింగ్) కోర్సుల్లో ప్రవేశాలకు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 30న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీన్ డాక్టర్ లిజ రాజశేఖర్ తెలిపారు. ఇప్పటికే నిమ్స్ వెబ్‌సైట్‌లో అర్హుల జాబితాను ఉంచామన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, కౌన్సెలింగ్ లెటర్‌తో నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో ఉదయం 10 గంటల నుంచి జరిగే కౌన్సెలింగ్ ప్రక్రియకు హాజరు కావాలని ఆమె సూచించారు.

సీనియర్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో కేపీహెచ్‌బీ బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ నాయకులు

కేపీహెచ్‌బీ కాలనీ: కేపీహెచ్‌బీ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రమ్య గ్రౌండ్స్ నుంచి ఏడుగురు క్రీడాకారులు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ఎంపికయ్యారు. ఏఎస్‌రావు నగర్‌లో ఈ నెల 17వ తేదీన జరిగిన పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన రమేష్, పెద్దిరెడ్డి, అశోక్ గౌడ్, అనికేత్ కుమార్, దినేష్ కుమార్, ప్రసన్న కుమార్, అనిల్ ఈ నెల 23, 24 తేదీల్లో ఆదిలాబాద్ జిల్లా గోలేటిలో జరిగే అంతర్ జిల్లాల సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారు. ఇందులో రాణించిన వారిని తెలంగాణ రాష్ట్రానికి ఎంపికై వచ్చే నెల 24 నుంచి 28 తేదీ వరకు చెన్నైలో జరగనున్న జాతీయ సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటారు. ఈ మేరకు కేపీహెచ్‌బీ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం. రామకృష్ణ ఒక ప్రకటనలో వివరాలు తెలిపారు.

'మూవీ మాస్టర్స్' పుస్తకావిష్కరణ

చందానగర్: కళారత్న ఎస్‌వీ రామారావు రచించిన 'మూవీ మాస్టర్స్' పుస్తకాన్ని ఏపీలోని అవనిగడ్డ ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. గురువారం యువకళావాహిని ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని బౌల్డర్స్ హిల్స్‌లో ఈ కార్యక్రమం జరిగింది. సినీ రంగానికి చెందిన 167 మంది ప్రముఖుల జీవిత చరిత్రలను ఈ పుస్తకంలో పొందుపరిచారు. 'సినీ మధురగీతాలు' పేరిట నిర్వహించిన సంగీత కార్యక్రమంలో సురేఖామూర్తి, బాల కామేశ్వరరావు ఆలపించిన అలనాటి గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్ అధ్యక్షుడు సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు, కిన్నెర కార్యదర్శి మద్దాళి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ కృష్ణా హోటల్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆకృతి ఎలైట్ ఆధ్వర్యంలో లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్ ప్లాజాలో చేనేత ఎగ్జిబిషన్ ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో 'ది గోలి మార్ ఎడిషన్' పేరిట హై లైఫ్ ఎగ్జిబిషన్ ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది
- సిరి ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ల్యాండ్ స్కేప్స్ పెయింటింగ్ ఎగ్జిబిషన్ మాసబ్ ట్యాంక్‌లోని జేఎన్ఏఎఫ్ఏయూ కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో గణేష్ చతుర్థి స్పెషల్ పేరిట ఏర్పాటు చేసిన ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు నేషనల్ సిల్క్ ఎక్స్‌పో అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

'ట్రాఫిక్'లో పీపీపీ మోడల్!

- ప్రైవేట్ విద్యాసంస్థలకు భాగస్వామ్యం
- ప్రాథమికంగా 125 మంది మార్షల్స్ ఎంపిక
- శిక్షణ ఇచ్చిన సంస్థల వద్దే విధుల కేటాయింపు
- ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఆవిష్కరించిన సీపీ ఆనంద్



ట్రాఫిక్ టాస్క్‌ఫోర్స్ ప్రారంభ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

సాక్షి, సిటీబ్యూరో: 'పబ్లిక్-ప్రైవేట్-పార్ట్‌నర్‌షిప్' మోడల్ తొలిసారిగా హైదరాబాద్ ట్రాఫిక్ విభాగంలోకి అడుగుపెట్టింది. ఇందులో భాగంగా హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్(హెచ్‌సీఎస్సీ) సౌజన్యంతో నగరంలోని ప్రైవేట్ విద్యాసంస్థల వద్ద ట్రాఫిక్ నిర్వహణ కోసం డిజైన్ చేసిన ట్రాఫిక్ మార్షల్స్‌ను నగర కొత్వాల్ సీవీ ఆనంద్ ట్రాఫిక్ వింగ్‌లో అంతర్భాగం చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ టాస్క్‌ఫోర్స్‌ను ఆవిష్కరించిన ఆయన వీరికి అందించిన 50 అత్యాధునిక అవెంజర్ వాహనాలను బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీలో గురువారం జరిగిన కార్యక్రమంలో విడుదల చేశారు.

ఎంపిక వారిది.. శిక్షణ వీరిది...

సిటీ వ్యాప్తంగా విస్తరించిన కొన్ని సంస్థలు, పాఠశాలలు, కళాశాలలకు రాకపోకలు సాగించే, పార్క్ చేసే వాహనాల కారణంగా ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. ట్రాఫిక్ విభాగంలో మానవ వనరుల కొరతను దృష్టిలో పెట్టుకున్న నగర పోలీసులు హెచ్‌సీఎస్సీ సహకారంతో ట్రాఫిక్ మార్షల్స్‌కు రూపమిచ్చారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్సార్) పథకంలో భాగంగా ఆయా సంస్థలు ఈ మార్షల్స్‌ను ఎంపిక చేసుకుంటాయి. వీరికి ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో 15 రోజుల శిక్షణ ఇస్తారు. ఆపై రిక్రూట్ చేసుకునే సంస్థ చుట్టుపక్కల ప్రాంతాల్లోనే వీరిని మోహరిస్తారు.

ఏడాది కాలానికి ఎంఓయూ...

స్థానిక ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆధీనంలోనే ఈ మార్షల్స్ పని చేస్తుంటారు. హోంగార్డుల మాదిరి యూనిఫాంను ప్రత్యేకంగా డిజైన్ చేసిన లోగోతో వీరికి అందించారు. నెల రోజులు ట్రాఫిక్ పోలీసులతో కలిసి, ఆపై స్వతంత్రంగా వీళ్లు విధులు నిర్వర్తిస్తారు. వీరి ఎంపిక చేసుకున్న సంస్థ కనీసం ఏడాదిపాటు నిర్వహించేలా ట్రాఫిక్ పోలీసులు ఒప్పందం చేసుకున్నారు. ఒక్కో ట్రాఫిక్ మార్షల్‌కు నెలకు రూ.20 వేల వేతనాన్ని ఆ సంస్థ చెల్లిస్తుంది. వీరి ఎంపికకు అవసరమైన అర్హతలను మాత్రం ట్రాఫిక్ విభాగం నిర్దేశిస్తుంది. తొలిదశలో 125 మందిని ఎంపిక చేసుకుని ఐదు రోజుల ప్రాథమిక శిక్షణ పూర్తి చేశారు. మరో పదిరోజుల ట్రైనింగ్ పూర్తి చేసుకున్న వారిని క్షేత్రస్థాయిలో మోహరిస్తారు.

ఆ రెండింటికీ పొంతన లేదు: సిటీలోని వాహనాల సంఖ్యకు ట్రాఫిక్ విభాగంలో ఉన్న మానవ వనరులకు పొంతన లేదు. ఈ విషయం గుర్తించిన హెచ్‌సీఎస్సీ ట్రాఫిక్ మార్షల్స్ వంటి కీలక చర్యతో ముందుకు వచ్చింది. ట్రాఫిక్ పోలీసుల శ్రమ ఫలితంగా గడిచిన ఎనిమిది నెలల్లో సిటీలో యావరేజ్ స్పీడ్ గంటకు 18 కిమీ నుంచి 23 కిమీకి పెరిగింది. ప్రస్తుతం 43 సంస్థలు రిక్రూట్ చేసిన 125 మంది మార్షల్స్ ఉన్నారు. వీరి సంఖ్యను 500కు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. అంబులెన్స్‌ను స్పాన్సర్ చేసిన నిఖిల కన్‌స్ట్రక్షన్స్ ఎండీ శ్రీనివాసరావుకు ధన్యవాదాలు. – సీవీ ఆనంద్, హైదరాబాద్ సీపీ

ఎనిమిది గంటలు పని చేస్తారు: నగరంలో 650 జంక్షన్లు ఉండగా, ప్రస్తుతం 350 నుంచి 400 జంక్షన్ల వద్దే సిబ్బందిని మోహరించగలుగుతున్నాం. ట్రాఫిక్ మార్షల్స్ విధానంతో పరిస్థితి 10 శాతం మెరుగవుతుంది. ఈ మార్షల్స్ రోజుకు ఎనిమిది గంటలు పనిచేస్తారు. ట్రాఫిక్ నిర్వహణతోపాటు తీవ్రమైన ఉల్లంఘనలను ఫొటో తీయడం వంటి విధులు నిర్వర్తిస్తారు. కొందరికి పెలికాన్ సిగ్నల్స్ నిర్వహణ విధులు అప్పగిస్తాం. – జోయల్ డెవిస్, ట్రాఫిక్ చీఫ్

ఓ ఠాణాను దత్తత తీసుకుంటాం: హైదరాబాద్‌లో ఉన్న ఓ పోలీసుస్టేషన్‌ను త్వరలో ప్రయోగాత్మకంగా దత్తత తీసుకుంటాం. అక్కడి సిబ్బందిని నిర్వహణ నుంచి అత్యాధునిక టెక్నాలజీ వినియోగం, ఉత్తమ సౌకర్యాలు కల్పించడం, సైనేజెస్ ఏర్పాటు ఇలా... దేశంలోనే బెస్ట్ రోల్ మోడల్‌గా తయారు చేస్తాం. ఆపై దశల వారీగా ఇలాంటి ఠాణాల సంఖ్య పెంచుతాం. త్వరలోనే ట్రాఫిక్ సమ్మిట్ ఏర్పాటు చేసి ఐఐటీ, అర్బన్ ప్లానింగ్, ఓయూ నిపుణులను ఆహ్వానిస్తాం. – శేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి హెచ్‌సీఎస్సీ ఆఫీస్ బేరర్స్

'నిమ్స్'కు సౌరకాంతులు!

రూ.5 కోట్లతో ఒక మెగావాట్ ప్లాంట్ ఏర్పాటుకు నిర్ణయం

లక్డీకాపూల్: నిమ్స్‌లో రూ.5 కోట్ల అంచనా వ్యయంతో ఒక మెగావాట్ సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ఆస్పత్రి యాజమాన్యం ప్రణాళికలు రూపొందించింది. నిమ్స్ విస్తరణ నేపథ్యం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సోలార్ ప్లాంట్ మంజూరు కోరుతూ టీజీ ట్రాన్స్‌కోకు యాజమాన్యం ప్రతిపాదనలను సమర్పించింది. ఈ ప్లాంట్ అందుబాటులోకి వస్తే ప్రతి నెలా విద్యుత్ సంస్థకు చెల్లించే కరెంట్ బిల్లు రూ.97 లక్షలు ఆదా అవుతుంది. సోలార్ విద్యుత్ ప్లాంట్ అందుబాటులోకి వస్తే రోగులకు సకాలంలో మరింత నాణ్యతా ప్రమాణాలతో కూడిన వైద్య సేవలను అందించడానికి అవకాశాలు మెరుగుపడతాయి. ఇందుకు విద్యుత్ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సానుకూలంగా స్పందించడమే కాకుండా ఆస్పత్రి భవనాలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకు ట్రాన్స్‌కు అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. కాగా, ఆస్పత్రికి ఇప్పటికే ఆకర్టియన్ సొల్యూషన్ నిర్మాణ్ సంస్థ రూ.20 లక్షల విలువైన సోలార్ ప్యానళ్లను విరాళంగా అందజేసింది. దీంతో నిమ్స్‌లోని డయాలసిస్ కేంద్రానికి సౌర విద్యుత్‌ను అందించే ప్రాజెక్ట్ గ్రీన్ డయాలసిస్ ఇన్షియేటివ్ అనే సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేశారు.

రూ.57 కోట్లతో వైద్య పరికరాలు

నిమ్స్‌కు పలు సంస్థలు సీఎస్ఆర్ కింద అత్యాధునిక వైద్య పరికరాలను సమకూర్చేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నాయని ఆస్పత్రి డైరెక్టర్ బీరప్ప తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 19 సంస్థలు రూ.57 కోట్లు కేటాయించాయన్నారు. ఈ నిధులతో అత్యాధునిక పరికరాలు, వసతులు సమకూర్చుకుంటామని ఆయన పేర్కొన్నారు.

23 వారాల్లో పుట్టిన శిశువు ఆరోగ్యంగా డిశ్చార్జ్

– అరుదైన ఘనత సాధించిన మెడికవర్ డాక్టర్లు



సమావేశంలో డాక్టర్లు, సిబ్బంది

మాదాపూర్: నియోనాటల్ వైద్యం అద్భుతమైన పురోగతి సాధించింది. 23 వారాలలో పుట్టిన ఆడశిశువును మాదాపూర్‌లోని మెడికవర్ ఉమెన్, చైల్డ్ హాస్పిటల్ ఆరోగ్యంగా డిశ్చార్జ్ చేసింది. హాస్పిటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ రవీందర్‌రెడ్డి పరిగే మాట్లాడుతూ తక్కువ సమయంలో పుట్టిన శిశువు బతకడం ప్రపంచంలో చాలా అరుదు అని అన్నారు. భారతీయ నియోనాటల్ ఆరోగ్య సంరక్షణలో ఇది ఒక చరిత్రాత్మక విజయమని పేర్కొన్నారు. శిశువు జన్మించినప్పుడు కేవలం 565 గ్రాముల బరువు ఉండటంతో తల్లిదండ్రులు వెంటనే నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చేర్పించినట్లు తెలిపారు. చికిత్సలో 6 రోజులు వెంటిలేషన్, 78 రోజులు బబుల్ సీపాప్, హెచ్ఎఫ్ఎన్సీ సపోర్ట్, చిన్నపాటి ఇన్ఫెక్షన్‌లకు చికిత్స, బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్‌లు, గుండె, మెదడు, రెటీనా అభివృద్ధిని నిరంతరం పర్యవేక్షించడం వంటివి ఉన్నాయని చెప్పారు. గుండె సంబంధిత సమస్యకు మందులతో విజయవంతంగా చికిత్స అందించినట్లు చెప్పారు. పరీక్షలు నిర్వహించి ఆరోగ్యకరమైన పురోగతిని ధ్రువీకరించినట్లు తెలిపారు. సమావేశంలో గైనకాలజిస్ట్ డాక్టర్ రాధిక, పలువురు డాక్టర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భాగస్వామ్యంతోనే పర్యావరణహితం

– కలెక్టర్ హరిచందన దాసరి

సాక్షి, సిటీబ్యూరో: సామాజిక భాగస్వామ్యంతోనే పర్యావరణహితం సాధ్యమని హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. గురువారం గ్లోబల్ రైల్వే కన్సల్టెన్సీ సంస్థ బార్సిల్ ప్రతినిధులు రీసైక్లింగ్ ద్వారా తయారు చేసిన ఎకో ఫ్రెండ్లీ ప్రొడక్ట్ నోట్ బుక్స్, పెన్సిళ్లను కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో పర్యావరణహితంపై అవగాహన పెంపొందించడానికి ఇటువంటి సహకారాలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్ తరాల కోసం సామాజిక భాగస్వామ్యం మరింత పెరగాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులుగా మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ శ్రీనివాస, డైరెక్టర్–కార్పొరేట్ అఫైర్స్ మనోరంజన్ పర్హాద్, హెడ్–హెచ్.ఆర్. – అడ్మినిస్ట్రేషన్ వాణి సోమ, సీనియర్ మేనేజర్–కార్పొరేట్ కమ్యూనికేషన్స్ సాయి సురేష్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



మూసారంబాగ్ బ్రిడ్జి పునరుద్ధరణ

అంబర్‌పేట: మూసారంబాగ్ బ్రిడ్జిపై వాహనాల రాకపోకలను జీహెచ్ఎంసీ అధికారులు పునరుద్ధరించారు. వర్షాలకు బ్రిడ్జి దెబ్బతినడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వారం రోజులుగా బ్రిడ్జిపైకి వాహనాలను అనుమతించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. దీంతో జీహెచ్ఎంసీ సర్కిల్–16 అధికారులు మరమ్మతులు, ఇతర పనులు చేపట్టారు. గురువారం డీఎంసీ మారుతీ దివాకర్, ఏఎంహెచ్ఓ డాక్టర్ హేమలత బ్రిడ్జ్ మరమ్మతు పనులను పర్యవేక్షించారు. అనంతరం బ్రిడ్జిపై ఉన్న బురదను పూర్తి స్థాయిలో తొలగింపజేశారు. మూసీ ప్రవాహంతో బ్రిడ్జిపై చెత్త, బురద రాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అనంతరం వాహనాలను అనుమతించారు. దీంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. బ్రిడ్జిపై వాహనాలు యథావిధిగా రాకపోకలు సాగిస్తున్నాయి. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మూసారంబాగ్ బ్రిడ్జిపై పునరుద్ధరణ పనులు చేపట్టిన జీహెచ్ఎంసీ అధికారులు

రాబడికి సరికొత్త సంస్కరణలు



జలమండలి రెవెన్యూ పెంపుపై మేధోమథన సమావేశం

- డొమెస్టిక్ కేటగిరీ కింద ఉన్న వాణిజ్య కనెక్షన్ల గుర్తింపు
- ఓఆర్ఆర్ పరిధిలోని నాన్–రెసిడెన్షియల్ భవనాల జాబితా
- జలమండలి యంత్రాంగం మేధోమథనం

సాక్షి, సిటీబ్యూరో: జలమండలి రాబడి పెంచడమే లక్ష్యంగా సరికొత్త సంస్కరణల అమలుకు సిద్ధమైంది. ఏకంగా గురువారం జూబ్లీహిల్స్‌లోని జలమండలి థీమ్ పార్క్‌లో రెవెన్యూ, ఐటీ విభాగం అధికారులతో సంస్థ ఎండీ అశోక్ రెడ్డి మేధోమథన సదస్సు నిర్వహించారు. డొమెస్టిక్ కేటగిరీ కింద ఉన్న వాణిజ్య కనెక్షన్లను గుర్తించడంతో పాటు జీహెచ్ఎంసీ, ఓఆర్ఆర్ పరిధిలోని నాన్–రెసిడెన్షియల్ భవనాల జాబితా సేకరించి వాటిని వాటర్ సప్లై కనెక్షన్లతో పోల్చాలని నిర్ణయించారు. బోర్డుకు వచ్చే ఆదాయం కొత్త ప్రాజెక్టులకు సరిపోకపోయినా, నీటి సరఫరా, సీవరేజ్ సేవల మెరుగుదలకు మాత్రం ఉపయోగపడుతుందని జలమండలి భావిస్తోంది. బోర్డు ఆదాయం పెరగడానికి మరింత మెరుగైన సేవల కోసం రెవెన్యూ, ఐటీలో ప్రతిపాదించిన సంస్కరణలను జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ వివరించారు.

సంస్కరణలు ఇలా..

- అన్ని ఓ అండ్ ఎం, సెక్షన్ల వారీగా సరఫరా చేసే నీటి పరిమాణం, పైపు పరిమాణం, మీటర్‌ను బట్టి వివరాల నివేదికలను రూపొందించి తుది నిర్ణయం
- మీటర్ లేని కనెక్షన్లకు బిల్లింగ్ విధానం.. ప్రస్తుత డాకెట్ సగటు కంటే మెరుగైన ప్రత్యామ్నాయాల అధ్యయనం
- ఎప్పటికప్పుడు రెవెన్యూ వివాదాల పరిష్కారం
- బల్క్ కనెక్షన్లు, అంగీకరించిన నీటి సరఫరాపై ఖచ్చితమైన విధానం.
- అవసరమైన ప్రాంతాల్లో కనీస బిల్లింగ్‌లో మార్పులు చేయడం.
- మీటర్ రీడింగ్ ఏజెన్సీల నియామకం కోసం టెండర్లు
- దీర్ఘకాల పెండింగ్ బకాయిల వసూలు–వ్యూహరచన ఈ మేధోమథన సదస్సులో రెవెన్యూ సీజీఎం కిరణ్ కుమార్, సింగిల్ విండో జీఎం దామోదర్ రెడ్డి, ఐటీ జీఎం సాయి కృష్ణ, రెవెన్యూ జీఎం శ్రీనివాస్, డీజీఎంలు, మేనేజర్లు పాల్గొన్నారు.

'ఆకర్షణ' గ్రంథాలయం ప్రారంభం



విద్యార్థిని ఆకర్షణను సన్మానించిన మంత్రి సీతక్క

సైదాబాద్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ఆకర్షణ అనే విద్యార్థిని సొంతంగా సైదాబాద్‌లోని ప్రభుత్వ బాలల సదనంలో ఏర్పాటు చేసిన లైబ్రరీని గురువారం రాష్ట్ర మంత్రి సీతక్క ప్రారంభించారు. అనంతరం మంత్రి జువైనల్ హోంను సందర్శించి బాలలతో మాట్లాడారు. వసతులు, సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అబ్జర్వేషన్ హోంలో ఉండటాన్ని బాలలు శిక్షగా కాకుండా శిక్షణను అందించే పరివర్తన కేంద్రంగా భావించాలని సూచించారు. తెలిసో తెలియకో చేసిన తప్పులను మరిచి బాధ్యత గల పౌరులుగా ఎదగాలన్నారు. అబ్జర్వేషన్‌లోని బాలల కోసం హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని ఆకర్షణ లైబ్రరీ ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ఆకర్షణకు మంత్రి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, జువైనల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ చార్వాక్, చీఫ్ ప్రొబెషన్ ఆఫీసర్ నవీన్, హోం సూపరింటెండెంట్లు అఫ్జల్, సంగమేశ్వర్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

ఎస్ఎస్‌సీ టాపర్లకు అవార్డులు ప్రదానం చేసిన తలసాని



విద్యార్థులకు అవార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

గన్‌ఫౌండ్రీ: ముఖ్యమంత్రి వద్దే విద్యాశాఖ ఉన్నప్పటికీ విద్యారంగ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సీ ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు గురువారం రవీంద్రభారతిలో అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 22 నెలలు అవుతున్నా విద్యాశాఖకు మంత్రి లేకపోవడం బాధాకరమన్నారు. ప్రైవేటు పాఠశాలల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి పోరాడతామని పేర్కొన్నారు. 30 ఏళ్లుగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేయడం అభినందనీయమన్నారు. అతి తక్కువ ఫీజులతో విద్యను అందిస్తున్న పాఠశాలలకు, లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలకు ఒకే విధమైన పన్ను విధించడం సరికాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఉమా మహేశ్వర్‌రావు, వివిధ ప్రాంతాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆవిష్కరణలకు 'టీ వర్క్స్'ను వినియోగించుకోవాలి



సమావేశంలో పాల్గొన్న వివిధ సంస్థల ప్రతినిధులతో రాష్ట్ర ఐటీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్‌కుమార్, టీవర్క్స్ సీఈఓ జోగేందర్ తనికెళ్ల

రాష్ట్ర ఐటీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్

రాయదుర్గం: సాంకేతిక ఆవిష్కరణలు, పరిశోధనలకు టీ వర్క్స్‌ను కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్ అన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ వర్క్స్ ప్రాంగణంలో గురువారం 'భారతదేశంలో తయారీ ఆవిష్కరణ–పర్యావరణ వ్యవస్థను నిర్మించడం' అనే అంశంపై వివిధ ఆటోమొబైల్ సంస్థలకు చెందిన ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీవర్క్స్ సీఈఓ జోగేందర్ తనికెళ్ల మాట్లాడుతూ టీ వర్క్స్‌ను జాతీయ స్థాయిలో ఇన్నోవేషన్, పరిశోధనలకు కూడా వినియోగించుకోవాలని సూచించారు. మేకిన్ ఇండియా నినాదానికి టీ వర్క్స్ అనుగుణంగా పనిచేస్తుందన్నారు. ఎకోఫ్రెండ్లీ టెక్నాలజీ వైపు కంపెనీలు పరుగు పెడుతున్నాయని చెప్పారు. దానికి అనుగుణంగా టీ వర్క్స్ కూడా ఇన్నోవేటివ్ ఆలోచనలతో వచ్చే వారిని ప్రోత్సహిస్తుందని, వారి నమూనాలకు పరిశోధనలు జతచేసి దాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు నమూనాల తయారీపై పనిచేసిన టీ వర్క్స్ ఇకపై రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌పై కూడా కృషి చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అశోక్ లేలాండ్, మహేంద్ర, మారుతి సుజుకి, ఎంజీ మోటార్స్, వోల్వో, ఐషర్ తదితర సంస్థల రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ప్రతినిధులు, టీవర్క్స్ అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల నిరసన

– బకాయిలు విడుదల చేయాలని డిమాండ్



ముషీరాబాద్: ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను ఆర్టీసీ యాజమాన్యం వెంటనే చెల్లించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు చంద్రారెడ్డి, రంగారావు, లక్ష్మయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సుమారు 16 వేల మంది రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించకపోవడంతో గురువారం ఆర్టీసీ బస్ భవన్ ముందు సుమారు నాలుగు వేలమంది రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులు శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం ప్రతినిధి బృందం ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 7–8 ఏళ్లలో రిటైర్డ్ అయిన వారికి వివిధ రకాల బకాయిలు రావాల్సి ఉందని అన్నారు. బకాయిలు రాకపోవడంతో రిటైర్డ్ ఉద్యోగులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, కొందరు మరణించారని, వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయని తెలిపారు. 28 నెలల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ ఎరియర్స్ రావాల్సి ఉందన్నారు. 2023 మార్చి తరువాత రిటైర్డ్ అయిన వారికి సుమారు రూ.10 లక్షల నుంచి 30 లక్షల వరకు రావాల్సి ఉందని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ ఎండీ సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల నేతలు కనకయ్య, హమీద్, నజీరుద్దీన్, కె.ప్రకాష్ తదతరులు పాల్గొన్నారు.

జూబ్లీ ఎన్‌క్లేవ్‌లో ఆక్రమణల తొలగింపు




సుమారు 16,000 గజాల స్థలాన్ని కాపాడిన హైడ్రా

మాదాపూర్: శేరిలింగంపల్లి మండలం మాదాపూర్ ప్రాంతంలోని జూబ్లీ ఎన్‌క్లేవ్‌లోని పార్కులతోపాటు రహదారుల ఆక్రమణలను హైడ్రా అధికారులు గురువారం తొలగించారు. 22.20 ఎకరాల్లో దాదాపు వంద ప్లాట్లతో అనుమతి పొందిన ఈ లేఅవుట్‌లో నాలుగు పార్కులు కబ్జాకు గురయ్యాయి. 5 వేల గజాల మేర రోడ్డు కూడా మాయమైంది. సుమారు 300 గజాల ప్రభుత్వ స్థలంలో ఆక్రమంగా ఏర్పాటు చేసిన హోటల్ షెడ్డును కూడా హైడ్రా అధికారులు తొలగించారు. సుమారు 16,000 గజాల స్థలాన్ని హైడ్రా కాపాడింది. దీని విలువ రూ.400 కోట్ల వరకు ఉంటుందని తెలిపారు. 1995 సంవత్సరంలో అనుమతి పొందిన ఈ లేఅవుట్‌ను 2006లో ప్రభుత్వం రెగ్యులరైజేషన్ చేసింది. ఈ లేఅవుట్ ప్రకారం జీహెచ్ఎంసీకి గిఫ్ట్ డీడ్ చేసిన పార్కులను జైహింద్‌రెడ్డి అనే వ్యక్తి కబ్జా చేశారని జూబ్లీ ఎన్‌క్లేవ్ లేఅవుట్ ప్రతినిధులు ఇటీవల ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో విచారించిన హైడ్రా అధికారులు పార్కు, రోడ్డు స్థలాలు కబ్జాకు గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు కబ్జాలను తొలగించారు. హైడ్రా ఏసీపీ శ్రీకాంత్, ఇన్‌స్పెక్టర్లు రాజశేఖర్, బాలగోపాల్ నేతృత్వంలో కూల్చివేతలు జరిగాయి. వెంటనే పార్కుస్థలానికి ఫెన్సింగ్, బోర్డు ఏర్పాటు చేశారు. కబ్జాదారుపై పోలీస్ స్టేషన్‌లో హైడ్రా అధికారులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆక్రమణల తొలగింపు..

హైటెక్ సిటీ– కొండాపూర్ రహదారికి ఆనుకుని మెటల్ చార్మినార్‌కు ఎదురుగా సుమారు 300 గజాల ప్రభుత్వ స్థలాన్ని జైహింద్‌రెడ్డి ఆక్రమించి అనుమతి లేకుండా హోటల్, హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి అద్దెలకు ఇస్తున్నాడని జూబ్లీఎన్‌క్లేవ్ ప్రతినిధులు హైడ్రాకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. 2006 సంవత్సరంలో రెగ్యులరైజ్ అయిన లేఅవుట్ ప్లాట్ల యజమానులకు తెలియకుండా అది ఎలా రద్దవుతుందని వాపోయారు. యూఎల్‌సీ ల్యాండ్ అయితే ప్రభుత్వానికి చెందుతుందని, జైహింద్‌రెడ్డిది ఎలా అవుతుందని వారు అనుమానం వ్యక్తం చేశారు. యూఎల్‌సీ ల్యాండ్ తన స్వంతమయితే ప్లాట్ల జోలికి రాకుండా పార్కులు మాత్రమే జైహింద్‌రెడ్డివి ఎలా అవుతాయని ప్రశ్నించారు. ఆయనపై ఇప్పటికే చాలా కబ్జా కేసులున్నాయని వారు పేర్కొన్నారు. పార్కులను కబ్జా నుంచి కాపాడిన హైడ్రాకు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్‌, శుక్రవారం, 22, ఆగస్టు, 2025



చిన్నారుల మనసును హత్తుకునే కథా రచయితలకు అద్భుత అవకాశం

చోటాభీమ్‌ వంటి పాత్రల సృష్టికర్త 'గ్రీన్‌ గోల్డ్‌ యానిమేషన్‌' వెల్లడి

తదుపరి యానిమేషన్‌ సిరీస్‌ కోసం ఆహ్వానం

కథ చెబుతారా..?!

సాక్షి, సిటీబ్యూరో: అందమైన కథలు చెప్పగలరా.. చిన్నారులు ఇష్టపడే ఆసక్తికరమైన కథలను సృష్టించగలరా..? ఇలాంటి కథకులు, రచయితలకు చోటాభీమ్‌ వంటి పలు ప్రసిద్ధి చెందిన పాత్రలను సృష్టించిన ప్రముఖ భారతీయ యానిమేషన్‌ స్టూడియో 'గ్రీన్‌ గోల్డ్‌ యానిమేషన్‌' అద్భుత అవకాశాన్ని అందిస్తోంది. పిల్లల కోసం అధునాతనంగా రూపొందించనున్న యానిమేటెడ్‌ సిరీస్‌ కోసం ఔత్సాహిక రచయితలను గ్రీన్‌ గోల్డ్‌ యానిమేషన్‌ ఆహ్వానిస్తోంది. వందకు పైగా దేశాల్లో 60 మిలియన్లకు పైగా చిన్నారులకు యానిమేషన్‌ కంటెంట్‌తో చేరువైన తమ స్టూడియో.. ఈ తరం చిన్నారులకు సరికొత్త కంటెంట్‌ ప్రపంచానికి అందించడానికి చేపడుతున్న ప్రాజెక్టులకు ఈ రచయితలను ఎంపిక చేయనుందని గ్రీన్‌ గోల్డ్‌ యానిమేషన్‌ వ్యవస్థాపకులు రాజీవ్‌ చిలక తెలిపారు. పిల్లల భావోద్వేగాలను హత్తుకునే రచయితలకు తమ తదుపరి యానిమేషన్‌ సిరీస్‌ బృందంతో కలిసి పనిచేసే అవకాశాన్ని కల్పిస్తున్నామని అన్నారు. యానిమేషన్‌లో అనుభవం లేకున్నా సరే, ఆకట్టుకునే సృజనాత్మకత ఉంటే చాలని, వారికి అనుభవజ్ఞులైన నిపుణుల మెంటార్‌షిప్‌ కూడా అందిస్తామన్నారు. సెప్టెంబర్‌ 1న ప్రారంభమయ్యే ఈ పోటీ వర్చువల్‌గా నిర్వహిస్తారని, ఔత్సాహికులు నమోదు చేసుకోడానికి careers@greengold. tvని సంప్రదించవచ్చని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్‌ తర్వాత, రాబోయే షో యొక్క సృజనాత్మక దిశను వివరించే ఒక చిన్న బ్రీఫ్‌ లేదా అసైన్‌మెంట్‌ వారికి అందుతుంది.





నిన్న మారథాన్‌.. నేడు రన్‌కేషన్‌.. | పర్యాటక ప్రాంతాలకు 'పరుగో' పరుగు' | మారథాన్‌ టూరిజంకు భారీగా ఊపు | నగరం నుంచి రన్‌–టూర్‌ ప్రియుల జోరు

నగరంలోనూ పెరుగుతున్న రన్‌కేషన్స్‌ | పరుగుని, వెకేషన్‌ని కలుపుతున్న ఔత్సాహికులు

రన్‌ రాజా రన్‌..

ప్రపంచవ్యాప్తంగా పేరొందిన మారథాన్‌లపై కన్ను

ఉరుకు పరుగుల జీవితాల నుంచి ఉరుకుల పోటీల వైపు దృష్టి సారిస్తున్నారు పలువురు నగరవాసులు. నగరంలో రెగ్యులర్‌గా నిర్వహించే ఏదో ఒక మారథాన్‌లో భాగస్వాములు అవుతుంటారు కొందరు.. ఇది క్రమంగా నగరం నుంచి విదేశాలకూ వ్యాపించింది.. పలువురు ఔత్సాహికులు వెకేషన్‌తో పాటు మారథాన్‌ కూడా చేస్తున్నారు.. అంతర్జాతీయ స్థాయిలో జరిగే మారథాన్‌లలోనూ పాలుపంచుకుంటున్నారు. మరికొందరు ఏకంగా రికార్డులవైపు పరుగు పెడుతున్నారు.. ఈ క్రమంలోనే రన్‌కేషన్‌ అనే కొత్త ట్రెండ్‌ నడుస్తోంది.. మారథాన్‌ పరుగునే క్రమంగా వెకేషన్‌తో కలగలిపి రన్‌కేషన్‌ అని పిలుస్తున్నారు.. ఈ ట్రెండ్‌ టూరిజానికి కూడా భారీగా ఊపునిస్తోందని పలువురు నిపుణులు చెబుతున్నమాట. – సాక్షి, సిటీబ్యూరో

అనుభవజ్ఞులైన రన్నర్లకు, అంతర్జాతీయ రేసులు అంటే కేవలం ఒక ప్రధాన మారథాన్‌కు అర్హత సాధించడం లేదా మరో వ్యక్తిగత పరుగు పందెం వేయడం మాత్రమే కాదు.. అవి కొత్త పర్యాటక గమ్యస్థానాలను అన్వేషించడానికి ఒక అవకాశం కూడా. 'సెలవులు ఇప్పుడు రన్‌ కేషన్‌లుగా మారాయి' అని ప్రముఖ మారథాన్‌ రన్నర్‌లు ఈ ట్రెండ్‌ను నిర్వచిస్తున్నారు

ఈవెంట్ల కోసమే..

'మారథాన్‌ టూర్‌లో పాల్గొనేవారిలో ఎక్కువ మంది పేరున్న అథ్లెట్లు కాదు, ఈవెంట్‌ల కోసం మాత్రమే శిక్షణ పొందే అమెచ్యూర్‌ రన్నర్లు. అందుకే మారథాన్‌ టూరిజం ఊపందుకుంటోంది' అని మారథాన్‌ టూర్‌లను నిర్వహించే గౌరీ జయరామ్‌ అంటున్నారు. నగరం నుంచి పర్యాటక పరుగుల కోసం ఎంచుకుంటున్న వాటిలో దేశీయంగా ముంబైలో జరిగే టాటా ముంబై మారథాన్‌, అలాగే న్యూఢిల్లీ, చెన్నైలలో జరిగే రన్స్‌, అదే విధంగా ప్రపంచ ప్రసిద్ధి చెందిన సిడ్నీ మారథాన్‌, రియో మారథాన్‌, అంటార్కిటికా మారథాన్‌, లండన్‌, టొరంటో, న్యూయార్క్‌.. వంటివెన్నో ఉన్నాయి.



మారథాన్‌ టూరిజం.. అంటే..?

మారథాన్‌ అంటే అత్యంత సుదీర్ఘ దూరంలో పాల్గొనే పరుగు పందెం పోటీలు. రోజు రోజుకూ ఆదరణ పెంచుకుంటున్న ఈ మారథాన్‌ ఈవెంట్స్‌ దేశంలోని ప్రతి ప్రధాన నగరానికీ ఒక అలంకారంగా మారాయి. అంతర్జాతీయంగానూ అనేక నగరాల్లో విందు, వినోదాల సమ్మేళనంగా సాగే ఈ మోడ'రన్‌' ఫెస్టివల్స్‌.. రాను రానూ పర్యాటక ఆకర్షణగా కూడా స్థిరపడుతున్నాయి. ఒకసారి స్థానికంగా జరిగే పరుగు పోటీలో పాల్గొని మారథాన్‌ రన్నర్‌గా మారిన తర్వాత కాలక్రమంలో.. ఇతర నగరాల్లోని మారథాన్స్‌లో పాల్గొనడంపై నగరవాసుల్లో ఆసక్తి పెరుగుతోంది. అదే మారథాన్‌ టూరిజంకు ఊపునిస్తోంది. ఏటా మారథాన్‌ టూరిజంలో పాల్గొనే భారతీయ రన్నర్లలో ఐదు రెట్లు పెరుగుదల ఉందని నిపుణులు చెబుతున్న మాట.



నిపుణుల సూచనలు..

మారథాన్‌ పర్యాటకులకు నగరానికి చెందిన నిపుణులు పలు సూచనలను చేస్తున్నారు.. అవగాన లేకుండా, శిక్షణ లేకుండా మారథాన్‌లలో పాల్గొంటే ఆరోగ్య సమస్యలు తప్పవని చెబుతున్నారు.

- ప్రయాణించే ముందు తగినంత శిక్షణ పొందాలి.
- మారథాన్‌ పర్యటనలలో పేరొందిన మారథాన్‌ ప్రయాణ సంస్థలను ఎంచుకోవాలి.
- స్థానిక వాతావరణ పరిస్థితులకు సంపూర్ణంగా సిద్ధం అవ్వాలి.
- హ్యాండ్‌ లగేజీలో రేస్‌ డే పరికరాలను తప్పనిసరిగా తీసుకెళ్లాలి.
- ఆతిథ్య దేశంలో అత్యవసర కాంటాక్ట్స్‌ అందుబాటులో ఉంచుకోవాలి.
- మారథాన్‌ టూరిజం కోసం ప్రణాళిక సాధారణంగా ఆరు నెలల ముందుగానే ప్రారంభించాల్సిన అవసరం ఉంది.

సకుటుంబ సమేతంగా 'రన్‌'డి..

రన్నర్లు క్రీడ పట్ల తమ మక్కువను పెంచుకుంటూనే కొత్త నగరాలు సంస్కృతీ, సంప్రదాయాలను అన్వేషించేందుకు ఈ ట్రెండ్‌ వీలు కల్పిస్తోంది. స్థానిక సంప్రదాయాలు హృదయపూర్వక ఆతిథ్యాన్ని ఆస్వాదిస్తూ సుందరమైన ప్రకృతి దృశ్యాల మీదుగా పరుగు తీసే అవకాశాన్ని మారథాన్‌ టూరిజం అందిస్తోంది. 'పని ఒత్తిడి కారణంగా, నేను నా కొడుకుతో ఎక్కువ సమయం గడపలేకపోతున్నాను. మారథాన్‌ల కోసం ప్రయాణించే సమయాన్ని పాఠశాల సెలవులతో మేళవింపు చేయడం ద్వారా రన్‌కేషన్‌లో ఆ లోటు పూడ్చగలుగుతున్నా' అని కొన్ని సంవత్సరాలుగా మారథాన్‌ రన్నర్‌గా ఉన్న నగరవాసి డాక్టర్‌ కునాల్‌ అంటున్నారు. తాము పాల్గొనే మారథాన్‌ ఈవెంట్స్‌ కోసం కుటుంబాన్ని తీసుకెళ్లడం అనేది కుటుంబంతో ఒక వెకేషన్‌ను గడపడం వంటి ప్రయోజనాలతో పాటు స్ఫూర్తిని నింపుతోంది. 'ఇది నా భార్యను మారథాన్‌ రన్నర్‌గా మార్చింది. ఇప్పుడు నా 14 ఏళ్ల కొడుకు 5 కె రన్నర్‌గా శిక్షణ పొందుతున్నాడు.' అని కునాల్‌ ఆనందం వ్యక్తం చేశారు. ఈ తరహా రన్‌కేషన్స్‌ నిర్వహించేందుకు ప్రత్యేక ఈవెంట్‌ ప్లానర్లు కూడా పుట్టుకొచ్చేశారు.



జీవితంలో ఎంత ఎదిగినా, ఏం సాధించినా.. ఆరోగ్యం, మానసిక ప్రశాంతత ఎంతో ప్రధానమైనవని, ఇంటర్నల్‌ వెల్‌నెస్‌, ఎక్స్‌టర్నల్‌ కేర్‌ ప్రతి ఒక్కరి వ్యక్తిత్వాన్నీ ప్రదర్శిస్తాయని ప్రముఖ సినీతార శ్రియా శరణ్‌ తెలిపారు. చాలా రోజుల తరువాత ఈ పాన్‌ ఇండియా నటి నగరంలో సందడి చేశారు. నగరంలోని కొండాపూర్‌ వేదికగా వెల్‌నెస్‌, చర్మ సంరక్షణ, అధునాతన సౌందర్య సేవలందించే 'జెన్నారా క్లినిక్స్‌'ను శ్రియా శరణ్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో ప్రత్యేకంగా ముచ్చటించారు. అందమైన జీవితం, ఆరోగ్యకరమైన ప్రయాణంతో పాటు తన తదుపరి సినిమాల గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఆ విశేషాలు ఆమె మాటల్లోనే..
– సాక్షి, సిటీబ్యూరో

ఆరోగ్యమే..

అందం.. ఆనందం

స్వీయ సంరక్షణే ఆరోగ్య రహస్యం | సహజ ఉత్పత్తులే అందానికి కారణం | సాక్షితో ప్రముఖ సినీ నటి శ్రియా శరణ్‌



ఆ రోజులు ఎంత మధురమో..
చాలా మంది నన్ను కలిసినప్పుడు అప్పుడూ.. ఇప్పుడూ ఒకేలా ఎలా ఉండగలుగుతున్నారని అడుగుతున్నారు.., దానంతటికీ కారణం 'ఎల్లప్పుడూ నాకు మానసిక సంతోషాన్నందిస్తున్న అభిమానుల ప్రేమ, రెండోది ఆరోగ్యం పట్ల నా జాగ్రత్త. సినిమా రంగంలో ఉన్నాను కాబట్టి ఆరోగ్యంతో పాటు అందాన్ని కూడా సంరక్షించుకోవాలి. దీని కోసం నేను సాధారణ పద్ధతులను కొనసాగిస్తాను. ఇంట్లో తయారు చేసిన ఫేస్‌ప్యాక్‌లు వాడతాను, కొబ్బరి నూనె, ఆల్‌మండ్‌ ఆయిల్‌ వినియోగించడంతో పాటు ఆయుర్వేదిక్‌ పద్ధతులను పాటిస్తాను. మన సంస్కృతిలో ఇలాంటి ఎన్నో మంచి అలవాట్లు ఉన్నాయి. అప్పటి రోజులు ఎంత మంచివో.., అమ్మమ్మలు, నానమ్మల కాలంలో ఎలాంటి కాలుష్యం ఉండేదికాదు. రసాయనాలు లేని ఆహారం తినేవారు. అందుకే వారి మోములో సహజ సౌందర్యం ఉట్టిపడేది. ఆ గ్లో నాకు చాలా ఇష్టం. ప్రస్తుత ఫాస్ట్‌ ఫుడ్‌ కల్చర్‌లో అలా బతకడం కాస్త కష్టమే కానీ ఎవరికి వారు వారి ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి. ఈ తరాన్ని నేను వేడుకునేది కూడా ఇదే, మైండ్‌ మెడిటేషన్‌, యోగా చేయండి. పాజిటివ్‌ లైఫ్‌ పై అవగాహన పెంచుకోండి. నాలాగే మినరల్స్‌, విటమిన్స్‌ ఉన్నటువంటి ఆహారాన్ని స్వీకరించండి. హైదరాబాద్‌లో సౌందర్య రంగం, సినిమా రంగం గ్లోబల్‌ స్థాయిని చేరుకుంది. మోడ్రన్‌ లైఫ్‌స్టైల్‌ హబ్‌గా మారింది. దానిని ఆస్వాదిస్తూనే విభిన్న విధాలుగా మనల్ని మనం సంరక్షించుకోవడం చాలా ముఖ్యం.

ఆల్‌ టైం ఫేవరెట్‌..

హైదరాబాద్‌ ఎప్పటికీ నా ఫేవరెట్‌ సిటీ. ఎన్నెన్నో మధురమైన అనుభవాలు, ఆనందాలు నగరంతో పెనవేసుకుని ఉన్నాయి. 17 ఏళ్లప్పుడు అనుకుంటా మొదటిసారి ఇక్కడికి వచ్చాను. సినీ ప్రయాణంలో భాగంగా ఈ నగరాన్ని నాకు కుటుంబంలా మార్చేసింది. ఇప్పటికీ నా బెస్ట్‌ ఫ్రెండ్స్‌ను కలవడానికే ఇక్కడికి వస్తుంటాను. నా తదుపరి సినిమాలతో మళ్లీ తెలుగు ప్రేక్షకులను చేరుకుంటున్నాను. ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న మిరాయ్‌ సినిమాలో నటించాను. ఇందులో నా పాత్ర అందరికీ నచ్చుతుంది. మరో అద్భుతమైన ప్రాజెక్ట్‌ చంద్రయాన్‌. ఈ సినిమా కోసం చాలా ఆతృతగా ఎదురు చూస్తున్నాను. వినూత్నమైన సబ్జెక్ట్‌ ఇది. ఎంతో వైవిధ్యమున్న ఈ సినిమాలో నటించడం ఆనందంగా ఉంది.



కళాత్మకం..

శిల్పారామం..

- ఆకట్టుకుంటున్న మట్టి, ఫైబర్‌ ప్రతిమలు
- కళాకృతులను తీర్చిదిద్దుతున్న కళాకారులు
- పల్లె జీవన విధానాన్ని తెలిపే విలేజ్‌ మ్యూజియం

మాదాపూర్‌ : కళాత్మకంగా రూపుదిద్దుకున్న మాదాపూర్‌లోని శిల్పారామం సందర్శకులను అబ్బురపరుస్తోంది. కళాకారులు తీర్చిదిద్దుతున్న కళాకృతులు, పల్లె జీవన విధానాన్ని తెలిపే విలేజ్‌ మ్యూజియం ఆకట్టుకుంటున్నాయి. కళాకారులు శంకర్‌, సుధాకర్‌ మట్టి, ఫైబర్‌తో రూపొందించి వివిధ రకాల ప్రతిమలు చూపరులను కట్టిపడేస్తున్నాయి. అచ్చమైన పల్లె వాతావరణాన్ని తలపించేలా కుల వృత్తులతో ఏర్పాటు చేసిన సంత, కూరగాయల మార్కెట్‌ వంటి సన్నివేశాలు శిల్పారామానికి అదనపు ఆకర్షణగా నిలుస్తున్నాయి. వీటిని సందర్శించేందుకు నగరం నలుమూలల నుంచి నగరవాసులు వస్తున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. ఈ ప్రతిమలు అచ్చుగుద్దినట్లు నిజమైన మనుషుల మాదిరిగా ఉన్నట్లు సందర్శకులను విస్మయపరిచేలా ఉన్నాయని పలువురు చెబుతున్నారు. ఈ మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8.00 గంటల వరకూ అందుబాటులో ఉంటుంది.



పర్యావరణ హితంగా..

బృందావనంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుడు, గోపికల విగ్రహాలను అద్భుతంగా తీర్చిదిద్దారు. కేవలం శిల్పారామానికి ఆకృతులను తయారు చేయడమే కాకుండా మరిన్ని థీమ్‌లను ఔత్సాహికులకు అందిస్తున్నట్లు తెలిపారు. పార్కులు, ఫామ్‌హౌస్‌లు, గృహాల్లో కావాల్సిన విధంగా ప్రత్యేక ఆకృతులను తయారుచేస్తామని కళాకారుడు శంకర్‌ చెబుతున్నారు. గణేశ ఉత్సవాల నేపథ్యంలో మట్టి విగ్రహాలు అందిస్తున్నామని, తక్కువ నీటిని పోస్తే విగ్రహం కరిగిపోయే విధంగా రూపొందించినట్లు తెలిపారు. చిన్న ప్రతిమలతో పాటు 12, 15 అడుగుల విగ్రహాలను సైతం అందిస్తున్నట్లు కళాకారులు తెలిపారు.

నమితకు వీజీ మిసెస్‌ ఇండియా టైటిల్‌

ఢిల్లీలో నిర్వహించిన ఫైనల్స్‌లో ప్రకటన



సనత్‌నగర్‌ : ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకూ ఢిల్లీలో నిర్వహించిన వీజీ మిసెస్‌ ఇండియా–2025 పోటీల్లో బేగంపేటకు చెందిన నమిత కుల్‌ శ్రేష్ఠ మిసెస్‌ ఇండియా–2025 టైటిల్‌ దక్కించుకున్నారు. ఈ మేరకు బేగంపేటలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో నమిత కుల్‌ శ్రేష్ఠ కుటుంబ సభ్యులు పోటీల వివరాలను వెల్లడించారు. దేశవ్యాప్తంగా 700 మంది మహిళలు మిసెస్‌ ఇండియా పోటీల కోసం దరఖాస్తు చేసుకోగా చివరి నాలుగు రోజుల వ్యవధిలో జరిగిన ఫైనల్స్‌కు 56 మంది ఎంపికైనట్లు తెలిపారు. ఇందులో కఠినమైన రౌండ్లు, సవాళ్లతో కూడిన పోటీలో జడ్జ్‌లు అడిగిన ప్రశ్నలకు ఆకట్టుకునే రీతిలో సమాధానాలు చెప్పిన నమితకు మిసెస్‌ సౌత్‌ జోన్‌ టైటిల్‌తో పాటు వయోవర్గంలో మిసెస్‌ ఇండియా–2025 టైటిల్‌ అందజేసినట్లు తెలిపారు. దీంతో పాటు మిసెస్‌ ఇండియా ఎలిగెన్స్‌, మిసెస్‌ ఇండియా గ్రేస్‌ఫుల్‌ సోల్‌, మిసెస్‌ ఇండియా చారిటీ క్వీన్‌ టైటిళ్లు కూడా దక్కాయని తెలిపారు.

థర్డ్‌గ్రేడ్ అంటే కేటీఆర్‌కే బాగా తెలుసు: సీతక్క

మేడారం జాతరకు రూ.150 కోట్లు: మంత్రి అడ్లూరి



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుది డర్టీ మైండ్ అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో సొంత కుటుంబ సభ్యుల ఫోన్లు కూడా ట్యాపింగ్ చేయించిన ఘన చరిత్ర కేటీఆర్‌ది అని మండిపడ్డారు. ఆయన అహంకారంతో మాట్లాడుతున్నారని, థర్డ్‌క్లాస్ అంటే ఏమిటో ఆయనే చెప్పాలని చురకలంటించారు. గురువారం సచివాలయంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా రూ.2,198 కోట్ల వ్యయంతో 1.15 లక్షల పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, మేకల, గొర్రెల షెడ్లు, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి పనులు వీటిలో ఉన్నాయని వెల్లడించారు. ఈ పనులు ప్రజలకు ఉపాధి కల్పించడమే కాకుండా గ్రామాల రూపురేఖలు మార్చడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. పనుల జాతరలో ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. మంత్రి కొండా సురేఖతో తనకు ఎలాంటి విభేదాలు లేవని సీతక్క స్పష్టం చేశారు. సమ్మక్క-సారక్క మాదిరిగా తాము అక్కాచెల్లెళ్లుగా కలిసే ఉన్నామని తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు జరుగనున్న సమ్మక్క సారలమ్మ జాతరకు రూ.150 కోట్లు కేటాయించినట్లు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఆదివాసీ పూజారులు కోరినట్లే జాతర పనులు చేయాలని నిర్ణయించామని వివరించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ శాఖ చేపడుతున్న 'పనుల జాతర – 2025'వాల్ పోస్టర్‌ను మంత్రులు ఆవిష్కరించారు.

దశల వారీగా ఫీజు రీయింబర్స్‌మెంట్

సాక్షి, హైదరాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను దశల వారీగా విడుదల చేస్తామని ప్రభుత్వం వెల్లడించింది. విద్యా రంగానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తోందని పేర్కొంది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను గతంలో మాదిరిగానే కొనసాగిస్తామని ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ పథకాన్ని మార్చే ఉద్దేశం లేదని వివరించింది.

ఒక విద్యార్థి.. ఒక ఉపాధ్యాయుడు



పాన్‌గల్: ఏకోపాధ్యాయ పాఠశాలలో ఒకే ఉపాధ్యాయుడు ఉండటం సాధారణం. కానీ వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం మల్లాయిపల్లితండా ప్రాథమిక పాఠశాల ఒక విద్యార్థితోనే కొనసాగుతోంది. ఈ పాఠశాలలో గతేడాది ముగ్గురు విద్యార్థులున్నారు. వీరిలో ఇద్దరు 5వ తరగతిలో చేరేందుకు మరో పాఠశాలకు వెళ్లారు. ఇక ఒకటో తరగతిలో మిగిలిన ఒకే ఒక్క విద్యార్థి మహేశ్‌కు.. ఎస్జీటీ శేఖర్‌గౌడ్ పాఠాలు బోధిస్తున్నారు. పాఠశాలకు ఆ ఒక్క విద్యార్థి రాకుంటే ఉపాధ్యాయుడు ఖాళీగా కూర్చోవలసిందే. దీనిపై ఎంఈవో శ్రీనివాసులును వివరణ కోరగా.. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

గతేడాది సెప్టెంబర్ ఒకటో తేదీ.. భారీ వర్షం కురిసింది. కేసముద్రం-ఇంటికన్నె సెక్షన్‌ల మధ్య అర్ధరాత్రి వేళ రైల్వే కీమెన్ ట్రాక్ పెట్రోలింగ్‌లో ఉన్నాడు. ఎడతెగని వర్షం వల్ల అయోధ్యపురం చెరువులోకి వరద పోటెత్తి కట్ట తెగింది. దీంతో రైల్వే ట్రాక్ వద్ద మట్టి కొట్టుకుపోతున్న విషయాన్ని కీమెన్ గుర్తించి వెంటనే వైర్‌లెస్ సెట్ ద్వారా అధికారులకు సమాచారం అందించాడు. సరిగ్గా అదే సమయంలో సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ రైళ్లు (అప్ అండ్ డౌన్ ట్రాక్ మీద వెళ్లే రెండు రైళ్లు) కేసముద్రం స్టేషన్‌కు చేరుకున్నాయి. వెంటనే అధికారులు వాటిని నిలిపేశారు. కాసేపటికే ట్రాక్ కింద మట్టి కొట్టుకుపోయింది. ఆరోజు కీమెన్ అప్రమత్తంగా ఉండటం వల్ల భారీ ప్రమాదం తప్పింది.. అదే కీమెన్ నిర్లక్ష్యంగా వ్యవహరించి ఉంటే...

పేజర్ తరహాలో ఉండే ఉపకరణాల కేటాయింపు

- వారు విధుల్లో అప్రమత్తంగా ఉన్నదీలేనిదీ నిరంతర ట్రాకింగ్
- దక్షిణ మధ్య రైల్వేలో 1,600 మంది సిబ్బందికి ఏర్పాటు..
- మిగతావారికి నెల రోజుల్లో

రైల్వే కీమెన్‌కు జీపీఎస్

సాక్షి, హైదరాబాద్

పట్టాలపై రైళ్లు సురక్షితంగా పరుగుపెట్టడం వెనుక దేశవ్యాప్తంగా వేలమంది కీమెన్ (గ్యాంగ్‌మెన్) నిర్విరామ పహారానే ప్రధాన కారణం. అత్యంత కిందిస్థాయి ఉద్యోగులే అయినా.. రైల్వే భద్రతలో వీరిదే కీలక భూమిక. ప్రకృతి విపత్తులు, సంఘ విద్రోహ శక్తుల వల్ల రైళ్లకు పొంచి ఉండే ప్రమాదాన్ని తప్పించేది వీరే కావటంతో ఇప్పుడు వీరి విధులపై రైల్వేశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. కీమెన్ విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటున్నదీ లేనిదీ తెలుసుకునేందుకు వారిని నిరంతరం ట్రాక్ చేసే విధానాన్ని ప్రారంభించింది. ఇందుకోసం పేజర్ తరహాలో ఉండే జీపీఎస్ ఉపకరణాన్ని వారికి ఏర్పాటు చేశారు. వారు విధి నిర్వహణలో ఉన్నప్పుడు ఆ ఉపకరణాన్ని వెంటపెట్టుకొని వెళ్లాలి. వారు ఏయే మార్గాల్లో, ఏయే సమయాల్లో విధుల్లో ఉన్నారో ఆ ఉపకరణం ద్వారా డివిజన్ హెడ్ క్వార్టర్స్‌లో ఉండే కంట్రోల్ సెంటర్ నుంచి ట్రాక్ చేస్తారు. ఇందుకోసం కంట్రోల్ సెంటర్‌లో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేశారు. 24 గంటలపాటు ట్రాకింగ్ కోసం సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నారు. ఫలితంగా కీ మెన్ ఏమాత్రం నిర్లక్ష్యం లేకుండా విధుల్లో ఉండేందుకు ఇది దోహదం చేస్తుంది.



దక్షిణ మధ్య రైల్వే పరిధిలో...

దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో ప్రస్తుతం 2,800 మంది ట్రాక్ పర్యవేక్షణ విధుల్లో ఉన్నారు. వీరిలో 1,800 మంది కీమెన్ కాగా, ప్రత్యేక పెట్రోలింగ్ విధుల్లో మిగతా వారుంటారు. ఇప్పుడు వీరిలో 1,600 మందిని తాజాగా జీపీఎస్‌తో అనుసంధానం చేశారు. మిగతా వారిని మరో నెల రోజుల్లో దాని పరిధిలోకి తేనున్నారు. వాస్తవానికి ట్రాక్ కీమెన్‌లో అప్రమత్తత పెంచేందుకు వారిని జీపీఎస్ ట్రాకింగ్ పరిధిలోకి తీసుకురావాలన్నది 2018లో తీసుకున్న నిర్ణయం. కానీ, దాన్ని అమలులోకి తేవటంలో తీవ్ర జాప్యం జరిగింది. కొన్ని రైల్వే జోన్‌లలో పాక్షికంగా అమలులోకి తెచ్చినా, పూర్తిస్థాయిలో జీపీఎస్ ట్రాకింగ్ విధానం ఏర్పాటు చేయలేకపోయారు.



భారీ వర్షాలప్పుడు మరింత అవసరం

భారీ వర్షాలప్పుడు ఏర్పడే మెరుపు వరదలు రైల్వేను అతలాకుతలం చేస్తున్నాయి. చెరువులు, వాగులు, గుట్ట దిగువన ఉండే ట్రాక్‌కు ఈ వరదలు ప్రమాదకరంగా మారుతాయి. దీంతో 24 గంటలు ట్రాక్‌పై నిఘా అవసరం. గత సంవత్సరం కేసముద్రం సమీపంలో ట్రాక్ దిగువన మట్టి కొట్టుకుపోయిన విషయాన్ని సకాలంలో గుర్తించటంతో భారీ ప్రమాదం తప్పింది. దీన్ని తీవ్రంగా పరిగణించిన రైల్వే శాఖ, వీలైనంత తొందరలో కీమెన్, పెట్రోలింగ్ మెన్‌కు జీపీఎస్ ఏర్పాటు చేయాలని నిర్ణయించి వేగంగా కసరత్తు పూర్తి చేసింది. ఈ వర్షాకాలం నాటికి మూడొంతుల మందిని ట్రాకింగ్ పరిధిలోకి తీసుకొచ్చారు.

త్వరలో తెలంగాణకు 50 వేల ఎంటీల యూరియా

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి

- కాంగ్రెస్ ఒత్తిడితో కాదు.. బాధ్యతతో ఇస్తున్నామని వ్యాఖ్య
- యూరియా సరఫరాలో ఇబ్బందులు వాస్తవమేనని అంగీకారం



సాక్షి, న్యూఢిల్లీ: త్వరలో తెలంగాణకు 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేస్తామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. రాష్ట్రానికి యూరియా సరఫరాలో అవాంతరాలు, ఇబ్బందులు ఉన్నాయని అంగీకరించారు. గురువారం ఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'యూరియా విషయంలో ఇబ్బంది ఏర్పడిందనేది వాస్తవం. కేంద్రమంత్రిగా, కేంద్ర ప్రభుత్వం తరఫున అంగీకరిస్తున్నా. ఈ విషయంలో అందరూ సహకరించాలని కోరుతున్నా. రామగుండం ఎఫ్‌సీఎల్‌లో సాంకేతిక లోపాల కారణంగానూ ఉత్పత్తికి కొన్ని ఆటంకాలు ఏర్పడ్డాయి. అయితే త్వరలోనే వివిధ రాష్ట్రాల నుంచి తెలంగాణకు 50 వేల మెట్రిక్ టన్నుల యూరియాను తరలించేదుకు ఏర్పాట్లు చేస్తున్నాం. కరైకల్ పోర్టులో యూరియా ఉంది. ఇందులో 10 వేల మెట్రిక్ టన్నులు, ఇఫ్కో నుంచి 15 వేల మెట్రిక్ టన్నులు. క్రిబ్ కో నుంచి 17,500 మెట్రిక్ టన్నులు. రాష్ట్రీయ కెమికల్ అండ్ ఫెర్టిలైజర్స్ నుంచి 7,500 మెట్రిక్ టన్నులు తెలంగాణకు వస్తోంది. కాంగ్రెస్ ధర్నాలు చేయడం వల్ల కాదు.. రైతులకు మేలు జరగాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం బాధ్యతగా యూరియా ఇస్తున్నాం..'అని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

రాష్ట్రం అడిగినంత ఇప్పటికే ఇచ్చేశాం

'రాష్ట్ర ప్రభుత్వం వద్ద 2 లక్షల టన్నుల యూరియా నిలువ ఉండాలి. అదేమైందో అర్థం కావడం లేదు. యూరియాను పద్ధతి ప్రకారం వాడుకోవాలి. దుర్వినియోగం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చూడాలి. యూరియా విషయంలో తెలంగాణ మంత్రులు రాద్ధాంతం చేస్తున్నారు. వాళ్లు కూడా కొరత ఉందని చెప్పడం వల్లే సమస్య తలెత్తింది. తెలంగాణ ప్రభుత్వం అడిగినంత యూరియా ఇప్పటికే సరఫరా చేశాం. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 ఏళ్లలో ఏనాడూ యూరియా కొరత ఏర్పడలేదు'అని కేంద్రమంత్రి తెలిపారు.

బీఆర్ఎస్ మద్దతు కోరతాం..

యూరియా సరఫరా చేస్తేనే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎవరికైనా బీఆర్ఎస్ మద్దతు ఉంటుందన్న కేటీఆర్ వ్యాఖ్యలపై కిషన్‌రెడ్డి స్పందించారు. 'బీఆర్ఎస్ మద్దతు ఎవరికి కావాలి. వాళ్లు రాష్ట్రంలో లేరు, కేంద్రంలోనూ లేరు. కేటీఆర్ ఎవరు? ఆయన సపోర్టు మాకు అవసరం లేదు. యూరియా ఇస్తే మద్దతు ఇస్తామంటూ చిన్న పిల్లల ఆటలాడొద్దు. యూరియాకు కేటీఆర్‌కు ఏం సంబంధ? యూరియా ఇస్తుంది కేంద్రం, తీసుకుంటున్నది రైతులు..'అని వ్యాఖ్యానించారు. ఆ తర్వాత కాసేపటికే బీఆర్ఎస్ మద్దతు కోరతామంటూ కిషన్‌రెడ్డి చెప్పారు. తెలుగు వ్యక్తులైన జీఎంసీ బాలయోగి లోక్‌సభ స్పీకర్‌గా, వెంకయ్యనాయుడు ఉప రాష్ట్రపతిగా పోటీలో నిలిచినప్పుడు కాంగ్రెస్ మద్దతు ఇవ్వలేదన్నారు. ఆనాడు కాంగ్రెస్ నేతలకు తెలుగు గౌరవం గుర్తురాలేదా?. అని ప్రశ్నించారు. 30 రోజుల పాటు జైల్లో ఉన్నట్లయితే.. పీఎం, సీఎం, కేంద్ర, రాష్ట్ర మంత్రులు పదవినుంచి తొలగిపోవాలనే ఆలోచనతో కేంద్రం తీసుకొచ్చిన సంస్కరణకు మద్దతు ఇవ్వాల్సిన విపక్షాలు, అందుకు విరుద్ధంగా వ్యవహరించడం దుర్మార్గమని కేంద్రమంత్రి వ్యాఖ్యానించారు.

రాష్ట్రాల ఆదాయాలకు గండి కొట్టొద్దు

జీఎస్టీ సంస్కరణలతో ఆదాయాలు తగ్గకుండా చూడాలి

- జీఎస్టీ మంత్రుల కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



నిర్మలా సీతారామన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న భట్టి. చిత్రంలో మల్లు రవి

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రాల ఆదాయాలు క్షీణించకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వస్తు సేవల పన్ను (జీఎస్టీ) కౌన్సిల్‌ను కోరారు. వాటాకు తగిన విధంగా దక్షిణాది రాష్ట్రాలకు నిధులు పంపిణీ కావడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. జీఎస్టీ పన్ను స్లాబుల సవరణ, పన్ను రేట్ల మార్పులపై ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీ సమావేశం గురువారం ఢిల్లీలో జరిగింది. ఆ కమిటీలో సభ్యుడైన భట్టి విక్రమార్క.. సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 'జీఎస్టీ ప్రవేశపెట్టిన సమయంలో రాష్ట్రాల వార్షిక వృద్ధి రేటు 14 శాతంగా ఉంది. దానిని స్థిరంగా కొనసాగించేందుకు మొదటి 5 సంవత్సరాలపాటు జీఎస్టీ పరిహారం (కాంపెన్సేషన్) అందించే విధానం అమలు చేశారు. అయితే, ఇప్పటివరకు 14 శాతం వృద్ధి స్థిరపడలేదు. ప్రస్తుతం రాష్ట్రాల వార్షిక వృద్ధి కేవలం 8 నుంచి 9 శాతం మధ్యలోనే ఉంది. జీఎస్టీ రేట్ల సరళీకరణ (రేట్ రేషనలైజేషన్), పన్ను భారం తగ్గించడం ఆహ్వానించదగినదే అయినా.. రాష్ట్రాల ఆదాయాలు క్షీణించకుండా తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలి 'అని కోరారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాలు దేశానికి గణనీయంగా ఆదాయం సమకూరుస్తున్నప్పటికీ నిధులు పంపిణీలో వాటికి తగిన ప్రాధాన్యం ఇవ్వటం లేదని భట్టి విక్రమార్క విమర్శించారు. జీఎస్టీ రేట్ రేషనలైజేషన్‌కు సరైన పరిహార యంత్రాంగం ఉండాలని స్పష్టం చేశారు. అందుకు ప్రస్తుతం అమలులో ఉన్న పరిహార సెస్సు (కాంపెన్సేషన్ సెస్) కొనసాగించి, దానివల్ల సమకూరే ఆదాయాన్ని పూర్తిగా రాష్ట్రాలకు ఇవ్వాలని ప్రతిపాదించారు.

నిర్మలా సీతారామన్‌తో భట్టి భేటీ

రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు ఆర్థిక సహాయం అందించాలని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌ను భట్టి విక్రమార్క కోరారు. గురువారం పార్లమెంట్‌లో ఎంపీలు పోరిక బలరాం నాయక్, రామసహాయం రఘురామిరెడ్డి, మల్లు రవిలతో కలిసి నిర్మలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక అంశాలపై చర్చించారు.

యూరియాను దారి మళ్లించారు

- రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్ఎస్ ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, కేఆర్.సురేశ్‌రెడ్డి
- యూరియా కొరత తీర్చాలంటూ కేంద్ర మంత్రి నడ్డాకు విజ్ఞప్తి



జేపీ నడ్డాకు వినతిపత్రం అందజేస్తున్న వద్దిరాజు, సురేశ్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో యూరియాను దారి మళ్లించారని బీఆర్ఎస్ ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, కేఆర్.సురేశ్‌రెడ్డి ఆరోపించారు. గతేడాది ఏప్రిల్-జూలై మధ్యలో 4.23 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇస్తే, ఈ ఏడాది 5.33 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేంద్రం పంపిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గతేడాదితో పోలిస్తే సుమారు లక్ష మెట్రిక్ టన్నుల యూరియా ఎక్కువ వచ్చిందని, మరి కొరత ఎందుకు ఏర్పడిందని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆ లక్ష మెట్రిక్ టన్నుల యూరియా ఏమైందో, దానిని ఎక్కడకు మళ్లించారో చెప్పాలని నిలదీశారు. గురువారం ఢిల్లీలో కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ.నడ్డాను వద్దిరాజు రవిచంద్ర, సురేశ్‌రెడ్డిలు కలిశారు. రాష్ట్రానికి ఎరువులు సరఫరా చేయాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. తెలంగాణకు శుక్రవారమే 10 వేల మెట్రిక్ టన్నులు, మూడురోజుల్లో మరో 15 వేల మెట్రిక్ టన్నులు, వారం రోజుల్లో మరో 25 వేల మెట్రిక్ టన్నుల యూరియా పంపుతామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిపై కేసీఆర్ నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. ఇద్దరు సమర్థవంతమైన అభ్యర్థులు బరిలో ఉన్నారని, తెలంగాణ ప్రయోజనాల మేరకు తమ నిర్ణయం ఉంటుందని చెప్పారు. తెలంగాణకు నష్టం చేకూర్చే బనకచర్ల ప్రాజెక్టును నిలిపివేయాలని సభలో డిమాండ్ చేశామని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చిత్తశుద్ధి లేదన్నారు. తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని మేమే డిమాండ్ చేస్తున్నా, పట్టించుకోవడం లేదని చెప్పారు.

పార్టీలో జరుగుతున్న వ్యవహారాలను ప్రశ్నిస్తే కక్ష కట్టారు

- నా లేఖను లీక్ చేసిన కుట్రదారులే వివిధ రూపాల్లో వేధిస్తున్నారు
- కార్మిక చట్టాలకు విరుద్ధంగా కొప్పులను గౌరవ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు
- నాపై జరుగుతున్న కుట్రలతో నాకు వ్యక్తిగతంగా జరిగే నష్టమేమీ లేదు

సింగరేణి బొగ్గు గని కార్మికులకు అమెరికా నుంచి ఎమ్మెల్సీ కవిత లేఖ



సాక్షి, హైదరాబాద్ : పార్టీలో జరుగుతున్న వ్యవహారాలను ప్రశ్నించడమే తప్పు అన్నట్టుగా తనపై కక్ష కట్టారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ అధినేత కేసీఆర్‌కు తాను రాసిన లేఖను లీక్ చేసిన కుట్రదారులే వివిధ రూపాల్లో తనను వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. కార్మిక చట్టాలకు విరుద్ధంగా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) సెంట్రల్ కమిటీ సమావేశం నిర్వహించి గౌరవ అధ్యక్షుడిని కొత్తగా ఎన్నుకున్నారని చెప్పారు. అమెరికా పర్యటనలో ఉన్న కవిత సింగరేణి బొగ్గు గని కార్మికులకు లేఖ రాశారు.

బీఆర్ఎస్ పరిణామాలు అందరికీ తెలుసు

'బీఆర్ఎస్‌లో కొన్నాళ్లుగా జరుగుతున్న పరిణామాలు మీకందరికి తెలిసే ఉంటుందని భావిస్తున్నాను. పార్టీ రజతోత్సవ సభలో అధినేత కేసీఆర్ ప్రసంగంపై వివిధ వర్గాల ప్రజలు వ్యక్తం చేసిన అభిప్రాయాలను నేను లేఖ రూపంలో తెలియజేశాను. నేను గతంలో అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు కేసీఆర్‌కు రాసిన ఆ లేఖను లీక్ చేశారు. ఆ లేఖను లీక్ చేసి నాపై కుట్రలకు పాల్పడుతున్న వారు ఎవరో బయట పెట్టాలని నేను కోరాను. ఆ తర్వాత జరుగుతున్న పరిణామాలు మీ మనసులో ఉన్నాయనే అనుకుంటున్నాను. ఆడబిడ్డగా పార్టీ మంచి కోరి రాసిన లేఖను లీక్ చేసిన కుట్రదారులు ఎవరో చెప్పాలని కోరితే నాపైనే కక్షగట్టారు.

రాజకీయ కారణాలతోనే ఎన్నిక

టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షురాలిగా పదేళ్ల పాటు సింగరేణి కార్మిక కుటుంబాలకు సేవలు అందించాను. తెలంగాణ భవన్‌లో కార్మిక చట్టాలకు విరుద్ధంగా గౌరవ అధ్యక్షుడిగా కొప్పుల ఈశ్వర్‌ను ఎన్నుకున్నారు. రాజకీయ కారణాలతోనే ఈ ఎన్నిక జరిగినట్టుగా తెలుస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం నేను పోరాడుతుంటే కొందరు నాపై కుట్రలు పన్నుతున్నారు. అలాంటి కుట్రలతో వ్యక్తిగతంగా నాకు వచ్చే నష్టమేమీ లేకపోయినా, కార్మికుల శ్రేయస్సుకు కృషి చేస్తున్న నన్ను తొలగించి వారి ఐక్యతను దెబ్బతీయడమే కొందరి లక్ష్యంగా కనిపిస్తున్నది'అని కవిత తన లేఖలో పేర్కొన్నారు.

యూరియాపై కేంద్రానివి కాకి లెక్కలు

బీజేపీ, బీఆర్ఎస్ ఒక తాను ముక్కలే: మంత్రి పొంగులేటి



సైకిళ్లు తొక్కుతున్న పొంగులేటి, కలెక్టర్ అనుదీప్

కూసుమంచి: యూరియాను సరఫరా చేయాల్సింది కేంద్రప్రభుత్వమే అనే విషయం అందరికీ తెలిసినా రాష్ట్ర ప్రజలు, రైతులను పక్కదారి పట్టించేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాకి లెక్కలు చెబుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, విపత్తు శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం, నేలకొండపల్లి మండలాల్లో గురువారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన మంత్రి.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఆ తర్వాత కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. యూరియా సరఫరాపై ఎప్పటికప్పుడు సీఎం, వ్యవసాయ శాఖ మంత్రి కేంద్రంతో మాట్లాడుతున్నారని తెలిపారు. ఎంపీలు సైతం పార్లమెంట్‌లోనే కాకుండా కేంద్ర మంత్రుల వద్ద ఒత్తిడి తీసుకొస్తున్నారని చెప్పారు. కేంద్రంతో కొట్లాడైనా రాష్ట్ర వాటా సాధిస్తామని మంత్రి తెలిపారు.

ఊచలు లెక్క పెట్టాల్సి వస్తుందనే...

బీజేపీ, బీఆర్ఎస్ ఒకే తాను ముక్కలని మంత్రి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు చేసిన తప్పులకు ఊచలు లెక్కపెట్టడం ఖాయమని తేలడంతో కేంద్రం మోచేతి నీళ్లు తాగుతున్నారని దుయ్యబట్టారు. యూరియా ఇచ్చిన వారికే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటేస్తామని బీఆర్ఎస్ నాయకులు చెప్పడం వెనుక బీజేపీకే వారి మద్దతు ఉందన్న విషయం బయటపడిందని తెలిపారు. కాగా, రాష్ట్రంలో ఎలాంటి విపత్తులు ఎదురైనా ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సమర్థవంతంగా తమ ప్రభుత్వం ఎదుర్కొంటుందని పొంగులేటి చెప్పారు.

అమాత్యుల మాటలు ఉట్టివేనా?

'వసతి గృహాల' సమావేశంలో హరీశ్‌రావు ఆగ్రహం



సిద్దిపేటజోన్: వసతి గృహాలు సమస్యలకు నిలయంగా మారాయని, అసెంబ్లీ సాక్షిగా అమాత్యులు (సీఎం, డిప్యూటీ సీఎం) చెప్పిన మాటలు ఉట్టివేనా? అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. బుధవారం రాత్రి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వసతి గృహాల సలహా సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం పిల్లల బాగోగులు చూసి సంక్షేమ హాస్టల్స్‌గా తీర్చిదిద్దితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని సంక్షోభ హాస్టల్స్‌గా మార్చిందని ఆయన ఎద్దేవా చేశారు. విద్యా సంవత్సరం నుంచి పిల్లలు దుస్తులు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఆరు నెలల నుంచి వచ్చే మెస్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలు రావడం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి హాస్టల్ విద్యార్థుల సమస్యలు కనబడటం లేదా అని ప్రశ్నించారు. కాగా, నియోజకవర్గ పరిధిలోని హాస్టల్స్‌ను స్వయంగా సందర్శిస్తానని హరీశ్‌రావు తెలిపారు. హాస్టల్స్ పరిసరాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం పైన దృష్టి పెట్టాలని కోరారు. ఈ సమావేశంలో మండల విద్యాధికారులు, తహశీల్దార్లు, సంక్షేమ శాఖ అధికారులు, వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కష్టాలు

నల్లగొండ జిల్లా హాలియా మండలం కొత్తపల్లి పీఏసీఎస్ వద్ద రైతుల బారులు





గాయపడిన రైతు అజ్మీర లక్కను ఆస్పత్రికి తీసుకెళ్తున్న దృశ్యం

నల్లగొండ/మరిపెడ: వర్షాకాలంలో సాగు పనులు ఊపందుకున్న వేళ రైతులకు యూరియా కష్టాలు తప్పడంలేదు. గురువారం నల్లగొండ హాలియా మండలం కొత్తపల్లి, త్రిపురారం మండలం త్రిపురారం, పెద్దదేవుల పల్లి, బాబుసాయి పేట, నకిరేకల్ మండలంలోని తాటికల్ పీఏసీఎస్‌ల వద్ద రైతులు ఉదయం నుంచే బారులుదీరారు. సరిపడా యూరియా రాకపోవడంతో ఒక్కో రైతుకు మూడు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. చాలామంది రైతులు యూరియా అందక నిరుత్సాహంతో వెనుదిరగాల్సి వచ్చింది. తాటికల్‌లో యూరియా అందకపోవడతో ఆందోళనకు దిగారు. వీరికి మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మద్దతుగా నిలిచి ఆందోళనలో పాల్గొన్నారు. కట్టంగూరు పీఏసీఎస్ వద్ద పోలీసుల సహకారంతో ఒక్కో రైతుకు ఒక బస్తాచొప్పున పంపిణీ చేశారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడలోని ఆగ్రోస్ కేంద్రంలో క్యూలో నిల్చోగా చిల్లంచర్ల మల్లమ్మకుంట తండాకు చెందిన అజ్మీర లక్క అనే రైతు సొమ్మసిల్లి పడిపోయాడు. దీంతో అతనికి తలకు తీవ్రగాయమైంది. వెంటనే అతనిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

వ్యవసాయ యంత్ర పరికరాలపై జీఎస్టీ ఎత్తేయాలి

- కేంద్ర ఆర్థిక, వ్యవసాయశాఖ మంత్రులకు లేఖలు రాశాం
- యూరియా కొరత నివారణకు ప్రణాళిక సిద్ధం చేయండి
- వ్యవసాయశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ యాంత్రీకరణ దిశగా రైతులను ప్రోత్సహించేందుకు వ్యవసాయ యంత్ర పరికరాలపై జీఎస్టీ మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు లేఖ రాసినట్లు తెలిపారు. గురువారం ఆయన వ్యవసాయ కమిషనరేట్‌లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. యూరియా కొరతను అధిగమించేందుకు అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టాలని తుమ్మల ఆదేశించారు. రైతులకు యూరియా స్టాక్ ఎప్పుడు వస్తుందో తెలిసేలా ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. ప్రైవేట్ డీలర్ల వద్ద ఉన్న యూరియాను సక్రమంగా రైతులకు అందేలా చూడాలని ఆదేశించారు. ప్రైవేట్ డీలర్లు ఎక్కువ ధరకు యూరియా అమ్మినట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.


ప్రతీకాత్మక చిత్రం

ఓ టీనేజీ అమ్మాయి అప్పటివరకూ అన్ని విధాలా ఆరోగ్యంగా ఉంది. కానీ అకస్మాత్తుగా కాళ్లు రెండూ చచ్చుబడ్డాయి. ఏమాత్రం కదల్లేకపోవడంతో వీల్‌చైర్‌కు పరిమితమైంది. కారణం తెలుసుకోడానికి చేయని పరీక్ష లేదూ... తీయని స్కాన్ లేదు. కానీ ఎందులోనూ ఏమీ కనిపించలేదు. ఎట్టకేలకు తెలిసిన విషయం డాక్టర్లనే అబ్బురపరచింది. ఆ మెడికల్ సీక్రెట్ ఏమిటో చూద్దాం.

మనసును 'స్కాన్' చేసి వైద్యం నడిపిద్దాం

ఈ కథ ఓ మెడికల్ థ్రిల్లర్‌ను తలపిస్తుంది. ఎంతకూ క్లూయే దొరకని పరిశోధనాత్మకమైన సస్పెన్స్ స్టోరీని గుర్తుచేస్తుంది. రియా (పేరు మార్చాం) అనే ఓ పదిహేన్నేళ్ల చురుకైన అమ్మాయికి అకస్మాత్తుగా ఓ క్షణాన రెండు కాళ్లూ పడిపోయాయి. ఎంతకీ చలనం కలగలేదు. దాంతో అమ్మాయి వీల్ చైర్‌కే పరిమితం కావాల్సివచ్చింది.

రియాను హాస్పిటల్‌కు తరలించారు. అపరాధ పరిశోధనల్లో నేరస్తుని జాడల కోసం వెతికినట్టుగా డాక్టర్లు ఓ అమ్మాయి జబ్బుకు కారణమైన ఆ అంశం కోసం పరిశోధనలు చేశారు... చేస్తూ పోయారు. రక్తపరీక్షలు చేశారు, ఎమ్మారైలు తీశారు. వాటి ద్వారా కండరాలను పరీక్షించారు. నరాలల్లోకి పరికించి చూశారు. ఇంకా ఇంకా అడ్వాన్స్‌డ్ పరీక్షలతో మెదడూ, వెన్నుపాముల్లోకి తరచి చూశారు. ఊహూ... కారణమెంతకూ దొరకలేదు.

రియా చదువుల్లో సరస్వతి. స్కూలు వక్తృత్వపు పోటీల్లో మంచి వక్త. అంతేకాదు... మంచి మంచి పెయింటింగ్స్ కూడా వేసేది. అలాంటి అమ్మాయిని పేరు తెలియని జబ్బు హైజాక్ చేసేసింది. కాళ్లనొప్పితో ఎలాగో కుంటుతూ స్కూలు దాకా వెళ్లిన ఆ అమ్మాయి స్కూలు నుంచి తిరిగి వచ్చేసరికి ఆమె రెండు కాళ్లూ చచ్చుబడ్డాయి. రక్త పరీక్షలు చేశారు. ఏమీలేదు. ఇలా ఎన్ని పరీక్షలు చేసినా జబ్బు ఆచూకీ అంతు చిక్కలేదు. విటమిన్ లెవెల్స్, ఎలక్ట్రోలైట్స్ ఇలా ఎన్ని చికిత్సలు చేసినా ఫలితమూ దక్కలేదు. అప్పటివరకూ అక్షరాలా 'తన కాళ్ల మీద తాను నిలబడ్డ' ఆ అమ్మాయి తన స్వతంత్రతను కోల్పోయి మరొకరి మీద ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చింది. దాంతో లంబార్ పంక్చర్ అనే వెన్నుపాముకు గాటు పెట్టి అందులో నీరు తీసి చూసే చిట్టచివరి పరీక్షకు డాక్టర్లు సిఫార్సు చేశారు.

రెండో ఒపీనియన్ కోసం...

దేహానికి గాటు పెట్టి చేసే మరింత తీవ్రమైన పరీక్షలతో ఆమెను బాధించడానికి పూనుకునే ముందర ఎందుకోగానీ... రియా తల్లిదండ్రులు రెండో ఒపీనియన్ కోసం హైదరాబాద్‌లోని సుధీర్‌కుమార్ అనే న్యూరాలజిస్టును సంప్రదించారు. ఇతరత్రా పరీక్షలతో పాటు రిపోర్టుల్లో విటమిన్–బి12, విటమిన్ డీతో పాటు మెదడూ, వెన్నెముకా, నర్వ్ కండక్షన్ స్టడీస్... ఇలాంటివన్నీ పరిశీలిస్తున్న డాక్టర్ గారికి ఎందుకో అనుమానం వచ్చి 'హూవర్స్ సైన్' అనే ఓ సునిశిత పరిశీలన చేశారు.

ఏమిటీ హూవర్స్ సైన్ ?

బాధితులను పడుకోబెట్టాక రెండు కాళ్ల మడమల కింద రెండు చేతులూ పెట్టి, బలహీనంగా ఉన్న ఓ కాలిని ప్రయత్నపూర్వకంగా ఎంతోకొంత పైకెత్తమని డాక్టర్లు అడుగుతారు. వాస్తవంగా కాళ్లలో పూర్తిగా చచ్చుబడిపోయిన వ్యక్తుల్లో ఓ కాలు కాస్త ఎత్తడానికి ప్రయత్నించినా రెండోకాలిలో ఎలాంటి చలనమూ ఉండదు. కానీ అది వాస్తవంగా చచ్చుబడిన కేసు కానప్పుడు బాధితులు ఓ కాలు ఎత్తడానికి ప్రయత్నిస్తున్నప్పుడు మరో కాలిమీద బరువు/ఒత్తిడి పెరుగుతుంది. అంటే... కాలిని ఎత్తే ప్రయత్నంలో మరోకాలు వెనక్కెళ్తుండటంతో ఇలా జరుగుతుంది. (ఈ హూవర్స్ సైన్ (గుర్తు) అన్నది కాలు చచ్చుబడిపోయిన సందర్భంలో నిర్ధారణ కోసం చేసేది. ఇలాంటి హూవర్స్ సైన్స్ (గుర్తులు) ఊపిరితిత్తుల విషయంలో మరో రకంగా ఉంటాయి). దాంతో ఇది వాస్తవంగా కాళ్లు చచ్చుబడిపోయిన కేసు కాదనీ, ఆ కండిషన్‌ను అనుకరిస్తున్న (మిమిక్ చేస్తున్న కేసు) అని డాక్టర్‌కు అర్థమైంది. అంతా బాగున్నప్పటికీ ఆమె కాళ్లను కదలించలేకపోతోందంటే ఏదో మతలబు ఉంది.

అది నటన కాదు... బాధితురాలు నటించడం లేదు...

అయితే ఇక్కడ బాధితురాలు రియా నటిస్తోందని అనుకోడానికి వీల్లేదు. కాళ్లు పడిపోవడం జరగనప్పటికీ... మానసిక కారణాలతో కాళ్లను కదలించలేకపోతోంది. తన మానసిక సమస్య కారణంగా నిజంగానే ఆమె కాళ్లు కదిలించలేకపోతోంది. దీన్ని వైద్యపరిభాషలో 'ఫంక్షనల్ న్యూరలాజికల్ డిజార్డర్ – ఎఫ్ఎన్‌డీ' అంటారు. దీనికి కౌన్సెలింగ్ అవసరమని గ్రహించిన డాక్టర్ సుధీర్‌కుమార్ ఆమెతో ఏకాంతంగా మాట్లాడారు.

అసలు కారణమిది...

రియా కాస్త బొద్దుగా ఉండటంతో తోటి విద్యార్థినీ, విద్యార్థులు ఆమెను వెక్కిరిస్తుండేవాళ్లు. ఆమె బరువును చూసి గేలి చేస్తుండేవాళ్లు. దాంతో తీవ్రమైన వ్యాకులతకూ, మనఃక్లేశానికీ లోనైన ఆమె తనకు తెలియకుండానే ఇలాంటి కండిషన్‌కు గురైంది. అన్నీ నార్మల్‌గా ఉన్నా అనారోగ్యానికి గురయ్యే మానసిక సమస్య అని తేల్చారు డాక్టర్ సుధీర్‌కుమార్. ఇందులో నరాలకు సంబంధించిన అంశంతో పాటు మానసిక నిపుణులతో మల్టీ డిసిప్లినరీగా ప్రయత్నించాల్సిన సంక్లిష్టమైన కేసు. ఇది అర్థమయ్యాక ఆమెలో మానసిక స్థైర్యం నింపేలా అనేక స్పెషాలిటీలకు సంబంధించిన డాక్టర్లు సంయుక్తంగా చికిత్స మొదలుపెట్టారు.

ఆర్నెల్ల తర్వాత...

అన్ని చికిత్సలూ ఫలించడంతో రియా మామూలుగా మారింది. ఇప్పుడు తన కాళ్ల మీద తాను మళ్లీ నిలబడటంతో పాటు తన చేతుల్లోని కుంచెను కదిలించి అందమైన బొమ్మలు వేయడం మొదలు పెట్టింది. ఇప్పుడామె టీనేజ్ లైఫ్ తాను వేస్తున్న పెయింటింగ్స్ అందంగా అందులోని కలర్సంతగా రంగులమయంగా మళ్లీ మారిపోయింది.

డాక్టర్లూ... ఇది వినండి

ఈ కేసు ద్వారా డాక్టర్లకూ ఓ సందేశమిస్తున్నారు డాక్టర్ సుధీర్‌కుమార్. అదేమిటంటే...

- కేవలం రిపోర్టులు చూసే ఓ నిర్ధారణకు రాకండి. బాధితులు చెప్పేది పూర్తిగా సానుభూతితో, సహానుభూతితో వినండి. అప్పుడు కొన్ని వాస్తవాలు తెలుస్తాయి.
- ఫంక్షనల్ డిజార్డర్లలో పేషెంట్స్ చేసేది నటించడం కానే కాదు. వాళ్ల బాధలు పూర్తిగా జెన్యూన్. వాళ్లు చెప్పేది పచ్చి వాస్తవం.
- క్లినికల్ పరీక్షల తర్వాత కూడా ఏ కారణాలూ తెలియకపోతే... వారిని కోసి చేసే పరీక్షలకూ, పొడిచి నిర్వహించాల్సిన ప్రొసీజర్లకు వెంటనే గురిచేయకండి. కాస్త చురుగ్గా, నిశితంగా ఆలోచించి 'హూవర్స్ సైన్స్' లాంటి వాటి గురించి మీ పరిధి దాటి (ఔట్ ఆఫ్ ద బాక్స్) ఆలోచించేలా ప్రయత్నించండి. దాంతో పేషెంట్స్‌ను బాధించి చేసే ఇన్వేజివ్ ఇన్వెస్టిగేషన్స్‌కు ముందే జబ్బు నిర్ధారణకు అవకాశం దొరుకుతుంది.
- ఒక వ్యక్తికి స్వస్థత చేకూర్చడం మీ ఒక్కరివల్లనే కుదరనప్పుడు టీమ్‌తో కలిసి... అంటే సైకాలజిస్టులూ, ఫిజీషియన్లూ, ఫిజియోథెరపిస్టులతో పాటు అవసరమైతే టీచర్లూ, కుటుంబ సభ్యులందరూ బృందంగా టీమ్‌వర్క్‌తో తగిన చికిత్స అందించి, బాధితులు హాయిగా కోలుకునేలా చేయండి.


డాక్టర్ సుధీర్‌కుమార్
సీనియర్ న్యూరో ఫిజీషియన్

చివరగా... అందించాల్సిన ట్రీట్‌మెంట్ ఒక్కటే డాక్టర్ల బాధ్యత కాదు... సంక్లిష్ట సమయాల్లో అందించాల్సినవి... చికిత్సా, మందులతో పాటు అక్కడ నిజంగా అందాల్సినదీ, అవసరమైనదేమిటంటే... చక్కటి సానుభూతీ, చిక్కటి సహానుభూతి.

– యాసీన్

ఫస్ట్ టైమ్


చంపా రాస్పెడా

చంపా... చరిత్ర సృష్టించింది

అడుగడుగునా ఆర్థిక కష్టాలు.
'అమ్మాయికి ఈ మాత్రం చదువు చాలు' అనే ఇరుగు పొరుగు వెటకారాలు.
అయినా సరే, చదువు విషయంలో ఎప్పుడూ వెనకడుగు వేయలేదు.
'పదవ తరగతి అయినా పూర్తి చేయగలనా' అనుకున్న అమ్మాయి ఇప్పుడు ఎంతో మంది అమ్మాయిలకు స్ఫూర్తిగా నిలిచింది. దిద్దై అనేది ఒడిశాలోని ఒక గిరిజన తెగ. ఈ తెగ నుంచి జాతీయ వైద్య ప్రవేశ పరీక్ష నీట్‌లో ఉత్తీర్ణత సాధించిన తొలి విద్యార్థిగా చంపా రాస్పెడా చరిత్ర సృష్టించింది.

ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లాలోని అమ్లిబెడ గ్రామానికి చెందిన చంపా రాస్పెడా తల్లి గృహిణి. తండ్రి ఓ పేద రైతు. ఆర్థిక కష్టాల వల్ల ఒకానొక దశలో చంపాకు చదువు కొనసాగించడం కష్టమైంది. అయినా సరే, ఎలాగో ఒకలా ఆర్థిక కష్టాలను అధిగమించి ముందడుగు వేసింది.

చిత్రకొండలో హైస్కూల్ చదువు పూర్తయిన తరువాత గోవింద్‌పల్లిలోని ఎస్ఎస్‌డీ హైయర్ సెకండరీ స్కూల్‌లో ఇంటర్ పూర్తి చేసింది. ఆ తరువాత ఆర్థిక కష్టాలతో బీఎస్సీ చదువు మధ్యలోనే ఆగిపోయింది. అయితే హైస్కూల్ రోజుల్లో చంపాకు సైన్స్ పాఠాలు చెప్పిన టీచర్ ధైర్యం చెప్పడమే కాదు బాలసోర్‌లోని నీట్ ఉచిత శిక్షణ తరగతులలో చేర్పించారు.

ఆ క్లాసులలో చేరిన క్షణం నుంచే 'ఎలాగైనా డాక్టర్ కావాల్సిందే' అనే లక్ష్యాన్ని ఏర్పరుచుకుంది. తన కలను నిజం చేసుకుంది చంపా.

బాలసోర్‌లోని ఫకీర్ మోహన్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో అడ్మిషన్ పొందింది.

మల్కన్‌గిరి జిల్లాలో మారుమూల అటవీ ప్రాంతంలో నివసించే దిద్దై తెగ ప్రజలకు వ్యవసాయం, అటవీ ఉత్పత్తులు ప్రధాన జీవనాధారం. చదువు వారికి చాలా దూరంగా ఉండేది. ఇప్పుడిప్పుడే వారు చదువుకు దగ్గరవుతున్నారు. ఈ దశలో చంపా సాధించిన విజయం ఎంతో మంది అమ్మాయిలకు స్ఫూర్తినిస్తుంది అని చెప్పడంలో సందేహం లేదు.

'వైద్యురాలిగా పేదప్రజలకు సేవ చేయాలనేది నా లక్ష్యం. మనం ఒక లక్ష్యం ఏర్పరుచుకున్నప్పుడు ఆర్థిక కష్టాలు అడ్డంకి కాదు... అనే విషయాన్ని విద్యార్థులలో విస్తృతంగా ప్రచారం చేయాలనుకుంటున్నాను' అంటుంది చంపా రాస్పెడా.

'ఈ విజయానికి మూలం ఆమె పడిన కష్టం. అంకితభావం. ఆమె విజయం ఒడిశాలోని యువతకు స్ఫూర్తినివ్వాలని కోరుకుంటున్నాను. వైద్యురాలిగా పేదప్రజలకు సేవ చేయాలని ఆశిస్తున్నాను. ఆమె భవిష్యత్ ఉజ్వలంగా ఉండాలని కోరుకుంటున్నాను' అని చంపా రాస్పెడా గురించి 'ఎక్స్'లో పోస్ట్ చేశారు ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి.




ఈ ఇంట్లోనే...


'రకరకాల మూఢనమ్మకాల వల్ల మా కమ్యూనిటీలో ఆడపిల్లల చదువుకు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వరు' అంటున్న చంపా రాస్పెడా తన తల్లిదండ్రులను ఒప్పించి, ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటూ చదువు దారిలో ముందుకు వెళ్లింది. పెద్దగా సౌకర్యాలు లేని ఇంట్లో పెరిగింది చంప. ఇప్పుడు సాధారణ దృశ్యంగా కనిపిస్తున్న ఆమె ఇంటి చిత్రం భవిష్యత్‌లో స్ఫూర్తిదాయక చిత్రంగా నిలవనుంది. 'ఈ ఇంట్లోనే చదివి చంప డాక్టర్ అయింది' అనే ఒక్కమాట చాలదా ఎంతోమంది అమ్మాయిలలో ధైర్యం నింపడానికి, 'మేము కూడా సాధించాలి' అని వారిలో ఆత్మవిశ్వాసాన్ని కలిగించడానికి!

డ్రెస్ స్టైల్‌నూ మార్చేయచ్చు

ఫ్యాషన్

పెద్ద సైజులో బీడ్స్, స్టోన్స్ లేదా సిల్వర్, గోల్డ్, బ్రాస్ మెటల్‌తో తయారు చేసిన ఆకర్షణీయంగా కనిపించే స్టేట్మెంట్ జ్యువెలరీని ధరించడం ఈ రోజుల్లో మరింత ఫ్యాషనబుల్‌గా ఆకట్టుకుంటోంది. యువతరం సాధారణంగా లైట్, సన్నని జ్యువెలరీకి బదులు బోల్డ్ డిజైన్స్‌ని పెద్ద సైజులో ఎంపిక చేసుకుంటోంది. ట్రైబల్ జ్యువెలరీకి అతి దగ్గరగా ఉంటోన్న ఈ ఫ్యాషన్ ఆభరణాలు డ్రెస్ స్టైల్‌ను మార్చేసే 'హైలైట్ యాక్సెసరీస్'గా నిలుస్తున్నాయి.





ఇయర్ హ్యాంగింగ్స్

హూప్స్, జుమ్కీలు, డ్రాప్ ఇయర్ రింగ్స్, షెల్స్ లేదా జియోమెట్రిక్ షేప్స్.వన్ పీస్ డ్రెస్ లేదా సింపుల్ కుర్తీకి బాగా సెట్ అవుతాయి.

నెక్లెస్, గాజులు

మొత్తం మెడ కవర్ చేసే హారాలు లేదా మొత్తం చేతిని కవర్ చేసే గాజులు లభిస్తున్నాయి. వీటిని మెటల్, బీడ్స్, ముత్యాలు, స్టోన్స్‌తో తయారు చేస్తారు. ప్లెయిన్ టాప్స్, చీరల మీదకు బాగా నప్పుతాయి. మెటల్, వుడ్, ఆర్ట్ వర్క్ ఉన్నవి. వెస్టర్న్ – ట్రెడిషనల్ రెండింటికీ సెట్ అవుతాయి.

క్యాజువల్ లుక్ డైలీ వేర్ / ఫ్రెండ్స్ అవుటింగ్

షర్ట్ స్టైల్స్‌కి ఓవర్‌సైజ్డ్ ఆక్సిడైజ్డ్ సిల్వర్ నెక్‌పీస్ + పెద్ద హూప్ ఇయర్ రింగ్స్.

బోహో మ్యాక్సీ డ్రెస్ పైకి కలర్‌ఫుల్ బీడ్స్, షెల్ జ్యువెలరీ, బ్రాడ్ బ్యాంగిల్స్.

కుర్తీ లెగ్గింగ్స్ పైకి ఆక్సిడైజ్డ్ జుమ్కీలు లేదా చెవులు మొత్తం కవర్ చేసే లాంగ్ ఇయరింగ్స్.

ఆఫీస్ లేదా ఫార్మల్ లుక్

ఆఫీస్ వేర్ పైకి సింపుల్ ఓవర్‌సైజ్డ్ రింగ్ + చిన్న హూప్స్ బాగుంటాయి. ఒకే రింగ్ పెద్దగా వేసుకుంటే చేతి మీదే ఫోకస్ ఉంటుంది. కాక్‌టెయిల్ రింగ్స్ ఇప్పుడు ట్రెండింగ్. బ్లేజర్, ట్రౌజర్స్ పైకి పెద్ద చెయిన్ లేదా మంద పాటి నెక్ పీస్ సెట్ అవుతుంది. కాటన్ లేదా లినెన్ శారీస్ పైకి పొడవాటి ముత్యాల దండ, స్టడ్స్ లేదా ఆక్సిడైజ్డ్ లాంగ్ ఇయర్ రింగ్స్.

పార్టీ ఈవెనింగ్ లుక్

బ్లాక్ డ్రెస్‌పైకి గోల్డెన్ చంకీ నెక్‌పీస్, పెద్ద స్టేట్మెంట్ రింగ్ బాగా నప్పుతుంది. గౌన్ పైకి షైనీ స్టోన్ ఓవర్‌సైజ్డ్ ఇయర్ రింగ్స్ సరిపోతాయి. నెక్లెస్ అవసరం లేదు.

కాక్‌టెయిల్ పార్టీ

మినిమలిస్టిక్ గౌన్‌కి ఓవర్‌సైజ్డ్ బ్రేస్‌లెట్ హైలెట్ అవుతుంది. సింపుల్ డ్రెస్‌కి హెవీ జ్యువెలరీ పర్ఫెక్ట్ లుక్. వెస్టర్న్ అవుట్‌ఫిట్‌కి బోల్డ్ మెటల్, ఆక్సిడైజ్డ్ జ్యువెలరీ బాగుంటుంది. శారీస్, లెహంగాస్‌కి స్టోన్స్, పెరల్స్, కుంకుమ పువ్వు కలర్స్‌తో ఉన్నవి బాగా మెరిసిపోతాయి. ఆఫీస్ లుక్‌కి – చిన్న ఓవర్‌సైజ్డ్ రింగ్స్ లేదా లైట్ కలర్ హూప్స్. పార్టీ లుక్‌కి – షైనీ, గ్లిట్టర్, బోల్డ్ నెక్‌పీసులు అందంగా ఉంటాయి.

సంప్రదాయ వేడుకలైన పండగలు /పెళ్లిళ్లకు

పట్టు చీరల మీదకు ఓవర్‌సైజ్డ్ కుందన్ లేదా టెంపుల్ జ్యువెలరీ నెక్లెస్, హ్యాంగింగ్స్ బాగుంటాయి. లెహంగా మీదకు నెక్‌లెస్ లేకుండా హెవీగా ఉండే చాంద్‌బాల్ ఇయర్ రింగ్స్ సెట అవుతాయి. అనార్కలీ లేదా కుర్తీస్ మీదకు లేయర్డ్ పెరల్ నెక్లెస్, చేతికి పెద్ద కఫ్స్ అందంగా కనిపిస్తాయి.

మోడర్న్ ఫ్యూజన్ లుక్

క్రాప్ టాప్, స్కర్ట్ మీదకు ఓవర్‌సైజ్డ్ నెక్లెస్, లాంగ్ ఫెదర్ ఇయర్ రింగ్స్ అందంగా ఉంటాయి. ఇండోవెస్ట్రన్ ఔట్‌ఫిట్స్‌కి ఆక్సిడైజ్డ్ సిల్వర్ ఓవర్‌సైజ్డ్ ఇయర్ రింగ్స్ బాగుంటాయి. ప్లెయిన్ జంప్‌సూట్ మీదకు బోల్డ్ జియోమెట్రిక్ నెక్లెస్ చంకీ బ్రేస్‌లెట్ బాగా నప్పుతుంది.

ప్రకృతి నుంచి స్ఫూర్తి

జీన్స్, కుర్తీస్ కి పెర్ఫెక్ట్ లుక్ ఆక్సిడైజ్డ్ సిల్వర్ జ్యువెలరీ అయితే బోహో లుక్ కోసం కలర్‌ఫుల్ బీడెడ్ హారాలు బాగుంటాయి. ఈవెనింగ్ పార్టీ లుక్స్ కోసం యంగ్ జనరేషన్‌లో బాగా పాపులర్‌గా ఉన్నది లేయర్డ్ నెక్‌పీస్, ప్రకృతి నుంచి స్ఫూర్తి పొందినవి ఫ్లవర్, లీఫ్ షేప్ ఎకో ఫ్రెండ్లీ జ్యువెలరీ.

జాగ్రత్తలు

- ఔట్‌ఫిట్ కలర్‌కి మ్యాచ్ అయ్యే జ్యువెలరీని ఎంచుకోవాలి. ఆభరణాలు చాలా హెవీ వాడితే నెక్ లేదా ఇయర్ మీద బరువు పడొచ్చు, సౌకర్యంగా ఉండేవి చూసుకోవాలి.
- ఒకేసారి హెవీ మేకప్, హెవీ జ్యువెలరీ కాకుండా బ్యాలెన్స్ చేయాలి.
- ఓవర్‌సైజ్డ్ నగల ధరించేటప్పుడు అన్నీ ఓవర్‌గా వేసుకోకూడదు.
- హెవీ ఇయర్ రింగ్స్ ధరించినప్పుడు హెవీ నెక్లెస్ వాడద్దు.
- సింపుల్ డ్రెస్ ధరించినప్పుడు ఓవర్ సైజ్డ్ జ్యువెలరీ అట్రాక్టివ్‌గా ఉంటుంది.
- క్లచ్ లేదా హ్యాండ్ బ్యాగ్ కూడా జ్యువెలరీ షైన్ కి మ్యాచ్ అయ్యేలా చేసుకోవాలి.










సమ్‌థింగ్ స్పెషల్

ఇండియన్ స్పైసీ రెస్టారెంట్ ఇన్ జపాన్

జపనీస్ దంపతులు నకయమ–సాన్, సచికో–సాన్ జపాన్‌లోని కసుగలో 'ఇండియన్ స్పైసీ ఫ్యాక్టరీ' పేరుతో ఒక రెస్టారెంట్ నడుపుతున్నారు. ఈ దంపతులకు ఇండియా అంటే ఇష్టం. ఇండియాలోని రుచికరమైన వంటలు అంటే బోలెడు ఇష్టం. ఆ ఇష్టంతోనే 'ఇండియన్ స్పైసీ ఫ్యాక్టరీ'ని ప్రారంభించారు.





బెంగాలీ సంప్రదాయ వంటకాల నుంచి దక్షిణాది వంటకాల వరకు ఈ రెస్టారెంట్‌లో వడ్డిస్తారు.

మరో విశేషం ఏమిటంటే ఈ రెస్టారెంట్ యజమాని సచికో ఎప్పుడూ చీరలోనే కనిపిస్తుంది. ఆమె కొంతకాలం పాటు కోల్‌కత్తాలో జపానీ రెస్టారెంట్ నిర్వహించింది. ఢిల్లీ, చెన్నైలలో కూడా రెస్టారెంట్‌లు నిర్వహించింది.

'ఇండియన్ స్పైసీ రెస్టారెంట్'లో భారతీయ సంగీత పరికరాలు, కళాకృతులు దర్శనమిస్తాయి.

ఈ రెస్టారెంట్‌కు వెళ్లడానికి ఇండియన్స్ మాత్రమే కాదు ప్రపంచ నలుమూలల నుంచి జపాన్‌కు వచ్చే భోజనప్రియులందరూ ఇష్టపడతారు.

బులియన్
(బంగారం 10 గ్రా. : వెండి కిలో)
ఆగస్టు 21న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,01,500	1,02,150	1,00,750	1,02,150	1,00,600	1,00,690
బంగారం (22 క్యారెట్లు)	94,560	92,3000	92,300	95,070	92.550	92,300
వెండి	1,16,000	1,16,300	1,26,000	1,16,300	1,16,200	1,26,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

• సోషల్ మీడియా

‘షార్ట్స్’ సూపర్‌హిట్ కావాలంటే...

పంచ్, సూపర్ ఎంగేజింగ్ స్టోరీ టెల్లింగ్‌తో సోషల్ మీడియాలో పాపులర్ అయ్యాడు క్రియేటర్ జోర్డాన్ హోలెట్. ‘షార్ట్స్’ క్రియేటర్‌ల కోసం జోర్డాన్ చెప్పిన కొన్ని ఐడియాలు...



- ప్రతి ‘షార్ట్’ సూపర్‌హిట్ కాకపోవచ్చు. అయితే ప్రతి ఫెయిల్యూర్‌ను ఒక పాఠంగా తీసుకొని ‘నెక్ట్స్ బెటర్‌గా ఏం చేయవచ్చు’ అని ఆలోచించాలి.
- కేవలం మన దృష్టితో కాకుండా ఇతరులు కూడా రిలేట్ అయ్యేలా చెయ్యాలి. అప్పుడే ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు. కంటెంట్ ఫ్రెష్‌గా, ఎంగేజింగ్‌గా ఉండాలి.
- ‘ఇప్పుడు ఫలానా ట్రెండ్ నడుస్తుంది’ అంటూ గుడ్డిగా ఆ ట్రెండ్‌ను ఫాలో కావద్దు. ట్రెండ్స్ ఎంత వేగంగా వస్తాయో అంతే వేగంగా వెనక్కి వెళతాయి. అందుకే ఎప్పుడు ఒరిజినల్ ఐడియాలనే నమ్ముకోవాలి. ఒరిజినల్ ఐడియాలు మన పర్సనాలిటీని ప్రతిబింబిస్తాయి. ప్రేక్షకులను మీ కంటెంట్‌తో కనెక్ట్ అయ్యేలా చేసేవే అవే.
- ‘షార్ట్స్’ కోసం యూ ట్యూబ్ కొత్త ఏఐ ఎడిటింగ్ ఫీచర్‌లు ప్రకటించింది. ఏఐ కంటెంట్ ప్రేక్షకులను ‘ఆహా’ అనిపించేలా చేసేది నిజమే అయినా, ప్రేక్షకులను మెప్పించడానికి ఏఐ సాంకేతికత మాత్రమే సరిపోదు. కంటెంట్‌ను మరింత ఆసక్తిగా మలచడానికి ‘ఏఐ’ ఉపయోగపడాలిగానీ ‘ఏఐ కోసమే ఏఐ’ అన్నట్లుగా ఉండకూడదు. అందుకే ‘యూట్యూబ్’ ఇలా అంటుంది...
- ‘షార్ట్స్ విజయరహస్యం... యూనిక్ క్రియేటివిటీ’

ఏంటో... ఈతరం పిల్లలకు బరువు, బాధ్యత అంటూ ఉండదు... తిన్నామా... తిరిగామా అన్న ధ్యాస తప్ప! ప్రతి తరమూ తమ తర్వాత తరాన్ని ఇలా ఆడిపోసుకోవడం పరిపాటే! కానీ ఈ తరాన్ని, అంటే జన్ జీ (జనరేషన్-జెడ్)ని అలా తిట్టిపోయడానికి లేదు! ఎందుకంటే వాళ్లు తమ లైఫ్ స్టయిల్లోంచి ఆల్కహాల్ హ్యాంగవుట్స్‌ని డిలీట్ చేశారు! అంటే నో పార్టీయింగా? అయ్యో పార్టీ ఫ్రీక్సే! కాకపోతే ఆల్కహాల్‌కి బదులు కాఫీ సేవిస్తున్నారు. రాత్రిళ్లకు బదులు ఉదయాలను ఆస్వాదిస్తున్నారు... వాటినే కాఫీ రేవ్స్ అని పిలుచుకుంటున్నారు!

మంచి రుచిగల ఉదయం

• యూత్ ట్రెండ్



క్లబ్బులు, పబ్బుల పట్ల జన్ జీ అట్టే ఆసక్తి చూపట్లేదు. అసలామాటకొస్తే మందు తాగడాన్నే ఇష్టపడట్లేదు. కానీ సోషలైజ్ అవడానికి ఆత్రంగానే ఉన్నారు. మసక చీకట్లో మందు కొడుతూ హోరెత్తే మ్యూజిక్‌తో అడుగులేస్తూ అర్ధరాత్రి దాకా జోగిపోవడం, తెల్లవారి హ్యాంగోవర్‌తో కళ్లు తెరవలేక పోవడమే వాళ్లకు నచ్చలేదు. లైక్ మైండ్ పీపుల్‌తో కాలక్షేపానికి ఒక కూడలి అయితే కావాలనుకున్నారు. ఊరికే కూర్చొని మాట్లాడే బదులు, నచ్చిన కాఫీతో ముచ్చట్లు చెప్పుకుంటే బాగుంటుందని ఆలోచించారు. రోజంతా ఆఫీసుల్లో మగ్గి, ఆ నీరసంతో చిట్‌చాట్ ఏం చేస్తాం? అందుకే పొద్దున్నైతే చక్కటి కాఫీ, కాసిన్ని కబుర్లతో మంచి ఉదయానికి స్వాగతం పలకొచ్చు, ఆ మూడ్‌తో రోజంతా ఉల్లాసంగా గడపొచ్చు అనుకున్నారు.

కెఫేలలో కలవడం మొదలుపెట్టారు. ఈ హాంగవుట్స్‌కి బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ఉంటే కూడా బాగుంటుంది కదా అనిపించింది. మేమున్నాం అంటూ డీజేలు ముందుకొచ్చారు. అయితే పబ్బుల ఫాస్ట్ బీట్ కాకుండా కాఫీ క్లబ్‌కి సరిపోయే బాణీని ట్యూన్ చేశారు. దాన్నే కాఫీ రేవ్స్‌గా పిలవడం మొదలుపెట్టారు. ఇప్పుడదే జన్ జీ ట్రెండ్... ప్రపంచ వ్యాప్తంగా!

ఎక్కడ మొదలైందంటే...

లండన్ బేకరీల్లో మొదలై ఆమ్‌స్టర్‌డామ్ ఓపెన్ కిచెన్స్ నుంచి వయా న్యూయార్క్ ఇండియా చేరుకున్నాయి. మన దగ్గర ఢిల్లీ, హైదరాబాద్, ముంబై, బెంగళూరు, కోల్‌కతా లాంటి మెట్రో సిటీస్‌లోనే కాదు లక్నో, సూరత్, నాగ్‌పూర్, ఇండోర్, ఆగ్రా లాంటి పట్టణాల్లోనూ ఈ ట్రెండ్ హల్‌చల్ చేస్తోంది. ఇంకోమాట..కాఫీ రేవ్స్‌ని కేవలం జన్ జీలే కాదు అన్ని వయసుల వాళ్లూ ఆస్వాదిస్తున్నారు. నలుగురితో కలవడానికి పెద్దగా ఇష్టపడని ఇంట్రావర్ట్స్ కూడా కాఫీ రేవ్స్ అంటే ఉత్సాహం చూపుతున్నారు. సంగీత సరిగమల మధ్య కాఫీ కమ్మదనాన్ని చవిచూపించే ఉషోదయాల కోసం ఎదురుచూస్తున్నారు.



న్యూ క్రియేషన్స్

డ్రంక్ అండ్ డ్రైవ్ భయాలు, హ్యాంగోవర్ బాధలు లేని ఈ కాఫీ రేవ్స్ కోసమే ప్రత్యేకంగా ఇంట్రడ్యూస్ అవుతున్న కాఫీలూ ఉన్నాయి. మాచాషాట్స్, మైలో షాట్స్, కోల్డ్ బ్రూ షాట్స్ ఆ జాబితాలోనివే. అవేకాక యాకుల్ట్ మాచా, స్పానిష్ అండ్ క్యోటో లాటేస్, డర్టీ మాచా లాటే లాంటివీ ఇష్టపడుతున్నారు కాఫీ రేవ్స్ ప్రియులు. చలికాలంలో హాట్ చాకొలేట్స్‌ను ఎక్కువగా సేవిస్తున్నారట. సాధారణంగా అయితే కోల్డ్ కాఫీ, ఐస్డ్ లాటేస్, మాచా లాటేస్, అమెరికానోస్, ఎస్‌ప్రెసో షాట్స్, క్రాన్‌బెర్రీ, ఐస్డ్ కాఫీలను కోరుకుంటున్నారు. ఇలా అన్ని వయసుల వాళ్లను రిఫ్రెష్ చేసి వాళ్ల ఎనర్జీని పెంచుతున్న ఈ కాఫీ రేవ్స్.. కాఫీ లవర్స్, మ్యూజిక్ లవర్స్, పార్టీ లవర్స్‌కి ఓ వారధిలా ఉంటున్నాయని చెబుతున్నారు వీటిని హోస్ట్ చేస్తున్న కాఫీ క్లబ్ ఓనర్స్. మెట్రో సిటీస్‌లో కాఫీ డే, బారిస్టాలు కూడా కాఫీ రేవ్స్‌కి ఆతిథ్యమిస్తున్నాయి. ఈ పార్టీల్లో డీజేలకూ డిమాండ్ పెరిగింది.

పబ్బుల్లో పనిచేసిన డీజేలు ఎంతోమంది తమ దారి మార్చుకుని ఉదయం పూట కాఫీ క్లబ్స్ కోసం మీటర్ సవరించుకుంటున్నారట. పార్టీలకు చంద్రోదయాలే కాదు ఉషోదయాలూ చక్కటి సమయాలే అని నిరూపిస్తున్న ఈ కాఫీ రేవ్స్ ట్రెండ్ ఎంతకాలం ఉంటుందో తెలియదు కానీ..ఉన్నంత కాలమైతే అన్ని వయసుల వారినీ అలరించగలదన్నది మాత్రం వాస్తవం. కొత్తకొత్త ఫార్మాట్స్‌తో ప్రయోగాలు చేస్తున్న ఈతరం ఈ ఒరవడిని ఓ కల్చర్‌గా స్థిరపరుస్తుందన్న గ్యారెంటీ కూడా కనిపిస్తోంది. వీటివల్ల ఇండియాలో కాఫీ బిజినెస్ పెరగడమే కాదు రానున్న అయిదేళ్లలో రెండింతలవుతుందని బిజినెస్ అనలిస్ట్‌లు అంచనాలూ వేస్తున్నారు.

– సరస్వతి రమ

• టెక్... టాక్



వన్‌ప్లస్ ప్యాడ్ 3

డిస్‌ప్లే	: 13.20 అంగుళాలు
రిఫ్రెష్‌రేట్	: 144 హెచ్‌జడ్
రిజల్యూషన్	: 2400×3392 పిక్సెల్స్
ఫ్రంట్ కెమెరా	: 8 ఎంపీ
మెమోరీ	: 256 జీబి 12జీబి ర్యామ్/ 512 జీబి 16జీబి ర్యామ్
బ్యాటరీ	: 12140 ఎంఏహెచ్
బరువు	: 675 గ్రా.



‘ఎడ్జ్’లో కోపైలట్ మోడ్

మైక్రోసాఫ్ట్ తమ ‘ఎడ్జ్’ బ్రౌజర్‌కి సంబంధించి ‘కోపైలట్ మోడ్’ అనే కొత్త ఫీచర్‌ని పరీక్షిస్తోంది. ‘కోపైలట్’ ఫీచర్‌తో ధరలు పోల్చి చూసుకోవడం, రెస్టారెంట్ బుక్ చేసుకోవడం, వెబ్ పేజీల నుంచి కంటెంట్‌ను సంక్షిప్తీకరించడం... మొదలైనవి చేయవచ్చు. ఈ ఫీచర్ కొత్త ట్యాబ్ పేజీలో కనిపిస్తుంది. ‘కోపైలట్ మోడ్’ ఫీచర్ ఆప్షనల్ మాత్రమే. ‘కోపైలట్ మోడ్’ వద్దనుకునేవారు ఎడ్జ్ సెట్టింగ్ నుంచి టర్న్ ఆఫ్ కావచ్చు. ప్రయోగ దశలో ఉన్న ‘కోపైలట్ మోడ్’ను మరింత మెరుగుపరచనున్నారు.

• ఇంగ్లీష్ ఇడియమ్స్

డెలులు విత్ నో సోలులు

గుడ్డి ఆశావాదానికి సంబంధించి ఉపయోగించే మాట... డెలులు విత్ నో సోలులు. ‘పరీక్ష ఫస్ట్ క్లాస్‌లో పాస్ కావాలి’ అనుకున్న విద్యార్థి అందుకు తగిన కృషి చేయాలి. ఏ మాత్రం కష్టపడకుండా ‘ఫస్ట్ క్లాస్‌లో పాస్ అవుతాను’ అనుకునే అతి ఆత్మ విశ్వాసమే డెలులు విత్ నో సోలులు.

ఉదా: హర్ ప్లాన్ టు బికమ్ ఫేమస్ వోవర్‌నైట్ ఫెల్ట్ లైక్ ప్యూర్ డెలులూ విత్ నో సొలూలు.

వోడ్స్ అండ్ సాడ్స్

చిన్నవి, అంత ప్రాముఖ్యమైనవి కానివి..అనే చెప్పే సందర్భంలో వాడే మాట...వోడ్స్ అండ్ సాడ్స్.

ఉదా: ఐ ప్యాక్‌డ్ అప్ ది బిగ్ స్టఫ్, బట్ దేర్ ఆర్ స్టిల్ వోడ్స్ అండ్ సాడ్స్ లెఫ్ట్ ఇన్ ది కిచెన్.

అల్ఫా అండ్ ఒమేగా

‘ప్రారంభం నుంచి చివరి వరకు’ అని చెప్పే సందర్భంలో ఉపయోగించే మాట... అల్ఫా అండ్ ఒమేగా.

ఉదా: హీ వాజ్ ఫోర్స్‌డ్ టు లెర్న్ ది ఆల్ఫా అండ్ ఒమేగా ఆఫ్ కార్పొరేట్‌లా.

హువావే 80 అల్ట్రా



డిస్‌ప్లే: 6.80 అంగుళాలు
రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్
రిజల్యూషన్: 1276×2848 పిక్సెల్స్
మెమరీ: 512 జీబి 16జీబి ర్యామ్
ఫ్రంట్ కెమెరా: 13 ఎంపీ
బ్యాటరీ: 5170 ఎంఏహెచ్

ఫీచర్డ్ నోట్‌బుక్స్




మోస్ట్ అడ్వాన్స్‌డ్ ఏఐ-పవర్డ్ రిసెర్చ్, రైటింగ్ టూల్స్‌లో గూగుల్ నోట్‌బుక్‌ఎల్‌ఎమ్ ఒకటి. ఇప్పుడు దీనికి సరికొత్త ఫీచర్‌లను జోడించారు. ఒక అంశాన్ని లోతుగా అధ్యయనం చేయడానికి, సరికొత్త ఐడియాల గురించి ఆలోచించడానికి విద్యార్థులు, ప్రొఫెషనల్స్‌కు ఈ కొత్త టూల్స్ ఉపయోగపడతాయి.

రచయితలు, పరిశోధకులు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి ‘ఫీచర్డ్ నోట్ బుక్స్’ అనే సరికొత్త ఫీచర్‌ని తీసుకువచ్చింది నోట్‌బుక్‌ఎల్‌ఎమ్. పేరెంటింగ్ నుంచి లైఫ్‌స్టైల్ గైడెన్స్ వరకు విస్తృత సబ్జెక్ట్‌లకు సంబంధించి ‘ఫీచర్డ్ నోట్స్‌బుక్స్’ టూల్ ఉపయోగపడుతుంది. విస్తృత సమాచారం నుంచి కీలక పాయింట్స్‌ను నోట్ చేసుకోవడానికి, మైండ్ మ్యాప్‌ను క్రియేట్ చేయడానికి, ఏఐ-జనరేటెడ్ హోస్ట్‌లతో పాడ్‌కాస్ట్‌లు చేయడానికి ఉపయోగపడుతుంది.


సాక్షి సినిమా

వంద కోట్లతో కొత్త ట్రెండ్


• విష్ణు

‘కన్నప్ప’ సినిమాతో మంచి విజయం అందుకోవడంతో పాటు నటుడిగానూ ప్రశంసలు అందుకున్నారు విష్ణు మంచు. ఇప్పుడాయన వంద కోట్లతో మైక్రో డ్రామాలు రూపొందించేందుకు సన్నద్ధం అవుతున్నారు. ‘‘మూడు నుంచి ఏడు నిమిషాల వ్యవధితో సాగే ఎపిసోడ్స్‌ని మైక్రో డ్రామాలు అంటారు. వీటి ద్వారా ఇండస్ట్రీలో కొత్త ట్రెండ్‌ను సృష్టించేందుకు విష్ణు మంచు ముందడుగు వేయబోతున్నారు. మొబైల్ యూజర్స్‌కి సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్ ఇచ్చేలా వాటిని రూపొందించాలని నిర్ణయించుకున్నారు. రీల్స్ మాదిరిగా కాకుండా పూర్తి స్థాయి నిర్మాణం, ప్రొఫెషనల్ దర్శకత్వం, ఎఫెక్టివ్ స్టోరీ, నెరేషన్‌తో ఈ మైక్రో డ్రామాల్ని రూపొందించనున్నారు. ఈ కొత్త వెంచర్ భారతీయ వినోదంలో గేమ్-ఛేంజింగ్‌గా మారుతుందని అనుకుంటున్నారు. యాక్టర్‌గా, ప్రొడ్యూసర్‌గా విష్ణు అందర్నీ మెస్మరైజ్ చేశారు. ఇక ఈ మైక్రో డ్రామాలే కాదు మరికొన్ని భారీ బడ్జెట్ చిత్రాల్ని ఆయన పట్టాలెక్కిస్తున్నారు’’ అని మంచు విష్ణు ప్రతినిధులు పేర్కొన్నారు.

డేట్ ఫిక్స్


• రామ్

రామ్ పోతినేని హీరోగా నటించిన ‘ఆంధ్ర కింగ్ తాలూకా’ చిత్రం రిలీజ్ డేట్ ఫిక్స్ అయింది. ‘మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి’ మూవీ ఫేమ్ పి. మహేశ్‌బాబు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించారు. ఉపేంద్ర, రావు రమేశ్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేశ్ ఇతర పాత్రలు పోషించారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రాన్ని నవంబరు 28న విడుదల చేయనున్నట్లు గురువారం ప్రకటించి, రామ్ కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. ‘‘యునిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం ‘ఆంధ్ర కింగ్ తాలూకా’. ఈ సినిమా కోసం వివేక్- మెర్విన్ స్వరపరిచిన ‘నువ్వుంటే చాలే...’ పాటని అనిరుధ్ రవిచందర్ పాడగా, రామ్ స్వయంగా లిరిక్స్ రాశారు. ఈ పాట వైరల్‌గా మారి అందర్నీ ఆకట్టుకుంది. సినిమా కూడా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఉంటుంది’’ అని చిత్ర బృందం ప్రకటించింది. ఈ చిత్రానికి కెమెరా: సిద్దార్థ నుని, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరి తుమ్మల, సీఈఓ: చెర్రీ.

చందమామ కథలా విశ్వంభర


• చిరంజీవి

చిరంజీవి హీరోగా రూపొందుతున్న ‘విశ్వంభర’ విడుదల ఖరారైంది. నేడు చిరంజీవి పుట్టినరోజుని పురస్కరించుకుని ఈ సినిమా గ్లింప్స్‌ని గురువారం విడుదల చేయడంతో పాటు 2026 వేసవిలో సినిమాని రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న చిత్రం ‘విశ్వంభర’. త్రిష, ఆషికా రంగనాథ్ హీరోయిన్లు. విక్రమ్ రెడ్డి సమర్పణలో వంశీకృష్ణా రెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా ఈ చిత్రం నుంచి ఓ గ్లింప్స్‌ని రిలీజ్ చేసింది యూనిట్. అలాగే చిరంజీవి ఓ వీడియోను విడుదల చేశారు. ‘‘విశ్వంభర’ చిత్రం ఎందుకు అంత ఆలస్యమవుతోందని చాలామందికి ఒక డౌట్ ఉంది. ఈ ఆలస్యం, జాప్యం చాలా సముచితమని భావిస్తున్నాను. ఎందుకంటే ఈ సినిమా సెకండ్ హాఫ్ మొత్తం వీఎఫ్‌ఎక్స్, గ్రాఫిక్స్ మీద ఆధారపడి ఉంది. మీకు బెస్ట్ క్వాలిటీ అందివ్వాలన్న దర్శక-నిర్మాతల ప్రయత్నమే ఈ జాప్యానికి ప్రధాన కారణం. ‘విశ్వంభర’ గురించి చెప్పాలంటే ఒక చందమామ కథలా సాగిపోయేటటువంటి అద్భుతమైన కథ. ముఖ్యంగా చిన్నపిల్లలకు, మరీ ముఖ్యంగా పెద్దవాళ్లల్లో ఉండే చిన్న పిల్లలను సైతం ఇది అలరిస్తుంది... వినోదపరుస్తుంది. 2026 వేసవికి ఈ సినిమా మీ ముందు ఉంటుంది. నాదీ భరోసా’’ అని చిరంజీవి ఆ వీడియోలో పేర్కొన్నారు.



‘‘సినిమా అంటే ఒక సెలబ్రేషన్. కమర్షియాలిటీ కూడా. అయితే ఈ తరహా చిత్రాలతో పాటు ఒక్కొక్కసారి మనల్ని ఆలోచింపజేసే ‘పరదా’లాంటి చిత్రాలు కూడా రావాలి. ‘పరదా’ చాలా కొత్త కథ. నిజాయితీగా చెప్పే ప్రయత్నం చేశాం. ప్రేక్షకులు మా సినిమాను ఆదరిస్తారనే నమ్మకం ఉంది. ఫ్యామిలీస్‌తో కలిసి చూడాల్సిన సినిమా ఇది’’ అని హీరోయిన్ అనుపమా పరమేశ్వరన్ అన్నారు. అనుపమా పరమేశ్వరన్ కథానాయికగా, సంగీత, దర్శన, రాజేంద్రప్రసాద్, రాగ్ మయూర్ ఇతర కీలక పాత్రల్లో నటించిన చిత్రం ‘పరదా’. ‘ది ఫ్యామిలీ మ్యాన్’ సిరీస్ మేకర్స్ రాజ్ అండ్ డీకే సపోర్ట్‌తో ‘సినిమా బండి’ ఫేమ్ ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వంలో శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువతో కలిసి విజయ్ డొంకాడ నిర్మించిన ఈ చిత్రం నేడు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం విలేకరుల సమావేశంలో అనుపమా పరమేశ్వరన్ చెప్పిన సంగతులు.

పరదాని సవాల్‌గా తీసుకున్నా – అనుపమా పరమేశ్వరన్

- ‘పరదా’లాంటి కథలు తెలుగులోనే కాదు... భారతీయ సినిమాలోనూ చాలా అరుదు. ఈ తరహా ఫ్రెష్ కాన్సెప్ట్‌తో కూడిన కథ నా దగ్గరకు రాలేదు. అందుకే దర్శకుడు ప్రవీణ్ కథ చెప్పినప్పుడు ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యాను. ఒక అమ్మాయి మాత్రమే దాన్ని అర్థం చేసుకోగలదు. ‘పరదా’ ఒక బోల్డ్ అటెంప్ట్. ఈ సినిమా చూస్తున్నప్పుడు ఎవరైనా ఒక్క సెకండ్ ఆలోచించగలిగినా అది సక్సెస్‌గా భావిస్తాను.
- ఈ చిత్రంలో చాలావరకు నేను పరదా ధరించిన సన్నివేశాల్లోనే కనిపిస్తాను. కొన్ని సీన్స్‌లో సైలెంట్‌గానే ఉంటాను. అయితే నా పరదా వెనక నా క్యారెక్టర్ తాలూకు భావోద్వేగం కనిపిస్తుంది. నా కళ్లతో, నా బాడీ లాంగ్వేజ్, నా వాయిస్‌తో నేను నటించగలిగానని సినిమా చూసిన ప్రేక్షకులు చెబుతుంటే చాలా ఆనందంగా ఉంది. ఓ సవాల్‌గా తీసుకుని ఈ సినిమా చేశాను. ‘పరదా’ చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను.
- నిజానికి నేను స్విచ్చాన్, స్విచ్చాఫ్ యాక్టర్‌ని. అయితే ‘పరదా’ మాత్రం వెంటాడింది. నా పాత్రకు ఆత్మహంతి సీక్వెన్స్ ఉంటుంది. ఆ సీన్లో వచ్చే మ్యూజిక్ అవన్నీ నన్ను కదిలించేశాయి. కారులో కూర్చుని ఏడ్చేశాను.
- సోషల్ మీడియాలో ‘పరదా’ సినిమా పురుషులకు కాస్త వ్యతిరేకంగా ఉందన్నట్లుగా ఎవరో పోస్ట్ చేశారు. అది చూసి బాధగా అనిపించింది. కానీ ఈ సినిమా అందరికీ నచ్చుతుంది. ఏదైనా మనం చూసే దృష్టి కోణాన్ని బట్టి ఉంటుంది. ఓ హీరోయిన్ నటించిన ఫ్లాప్ అయితే ఐరన్ లెగ్ అనే ముద్ర వేస్తారు. గతంలో మోహన్‌లాల్‌గారితో విద్యాబాలన్‌గారు చేయాల్సిన సినిమా ఒకటి ఇలాంటి కారణం (ఐరన్ లెగ్) వల్లే క్యాన్సిల్ అయ్యిందట. ఆ తర్వాత విద్యాబాలన్ చేయాల్సిన తొమ్మిది సినిమాల నుంచి ఆమెను తప్పించారట. ఇది ఎంతవరకు కరెక్ట్?
- ‘పరదా’లో డిఫరెంట్ క్యారెక్టర్ చేశాను. ‘డీజే టిల్లు 2’ సినిమాలో మరో విభిన్నమైన పాత్ర చేశాను. ‘డీజే టిల్లు 2’లో నేను గ్లామరస్‌గా కనిపించిన విషయాన్నే మాట్లాడుతున్నారు. కానీ, అందులో నేను గన్ పట్టుకుని, యాక్షన్ చేశాను. కాస్త నెగటివ్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్ చేశాను. ఈ అంశాలు హైలైట్ కావడం లేదు. ఏదైనా మనం ఆలోచించేదాన్ని బట్టి ఉంటుంది.

ముప్పై కేజీలు తగ్గాను – విజయ రామరాజు


• విజయ రామరాజు, సిజా రోజ్


విజయ రామరాజు టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం ‘అర్జున్ చక్రవర్తి’. ఈ చిత్రంలో సిజా రోజ్ హీరోయిన్. విక్రాంత్ రుద్ర దర్శకత్వంలో శ్రీని గుబ్బల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో విజయ రామరాజు మాట్లాడుతూ –‘‘ఈ సినిమా కోసం దాదాపు 30 కేజీల బరువు తగ్గాను. ఆ తర్వాత బరువు పెరిగాను. నేను సిక్స్ ప్యాక్‌తో ఉన్న సీన్స్ తీసినప్పుడు రెండు రోజులు ఏమీ తినలేదు. కొన్ని ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్నాను. అయితే ట్రైలర్ విజువల్స్ చూసివారు పెద్ద సినిమాలా ఉందని అంటుంటే సంతోషంగా ఉంది’’ అన్నారు. ‘‘ఈ సినిమా నా తొమ్మిదేళ్ల కల. ఆరేళ్ల మా టీమ్ కష్టం. విజయ్ ఈ సినిమా కోసం ప్రాణం పెట్టాడు. బడ్జెట్ పెరిగినా మా నిర్మాత నన్ను సపోర్ట్ చేశారు’’ అని చెప్పారు విక్రాంత్ రుద్ర. ‘‘ఆగస్టు 29న నేషనల్ స్పోర్ట్స్ డే. కబడ్డీ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన మా సినిమా అదే రోజు రిలీజ్ అవుతోంది’’ అని చెప్పారు శ్రీని గుబ్బల.

కొత్త సినిమాకి క్లాప్


• పవన్ కేసరి, కావ్య, రామ్ అబ్బరాజు

పవన్ కేసరి, కావ్యా కల్యాణ్ రామ్ జంటగా కుంచం శంకర్ దర్శకత్వంలో తలారి దినకరణ్ రెడ్డి నిర్మిస్తున్న చిత్రం గురువారం ఆరంభమైంది. తొలి సన్నివేశానికి రామ్ అబ్బరాజు క్లాప్ ఇవ్వగా, ప్రశాంత్ కుమార్ దిమ్మెల కెమెరా స్విచ్చాన్ చేశారు. రామ్ అబ్బరాజు, ప్రశాంత్ దిమ్మెల, అడిదాల విజయ్‌పాల్‌రెడ్డి స్క్రిప్ట్ అందించారు. పవన్ కేసరి మాట్లాడుతూ–‘‘నా బాల్య స్నేహితుడు సన్నీ స్థాపించిన ఈ బ్యానర్‌పై సినిమా చేయడం హ్యాపీ’’అని అన్నారు. ‘‘నాకు సహకరిస్తూ, ప్రోత్సహిస్తున్న నా టీమ్‌కు ధన్యవాదాలు’’ అన్నారు కుంచం శంకర్. ‘‘శంకర్‌గారు మంచి కథతో ఈ సినిమా చేస్తున్నారు’’ అని తెలిపారు తలారి హేమావతి రెడ్డి. ‘‘కథ బాగా నచ్చింది’’ అన్నారు సంగీత దర్శకుడు విజయ్ బుల్గానిన్.

మది హద్దు మీరి..!


• విజయ్ ఆంటోని, తృప్తి రవీంద్ర

‘‘మారెనా... ఏదో మారెనా... మది హద్దు మీరి గుండె జారిపోయెనా... ఎవరీమె... మల్లెపువ్వునా... ఎదలోన కురిసే చిరు వాన జల్లున..’’ అంటూ సాగుతుంది ‘భద్రకాళి’ సినిమాలోని ‘మారెనా...’ పాట. విజయ్ ఆంటోని కెరీర్‌లోని 25వ చిత్రం ఇది. ఈ చిత్రంలో వాగై చంద్రశేఖర్, సునీల్ కృపలానీ, సెల్ మురుగన్, తృప్తి రవీంద్ర, కిరణ్, రినీ బోట్, రియా జీత్తు, మాస్టర్ కేశవ్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పొరేషన్, మీరా విజయ్ ఆంటోని సమర్పణలో అరుణ్ ప్రభు దర్శకత్వంలో సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్‌పై రామాంజనేయులు జవ్వాజి నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబరు 19న విడుదల కానుంది. తాజాగా ఈ చిత్రంలోని ‘మారెనా...’ అనే లిరికల్ లవ్ సాంగ్‌ను విడుదల చేశారు మేకర్స్. భాష్యశ్రీ సాహిత్యం అందించిన ఈ పాటకు అభిజిత్ అనిల్ కుమార్ గాత్రం అందించారు. ఈ చిత్రంలో హీరోగా నటించిన విజయ్ ఆంటోని ఈ సినిమాకు సంగీత దర్శకుడిగానూ వ్యవహరించారు. ఇక ‘భద్రకాళి’ సినిమాను తెలుగులో ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్, రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా సంస్థలు రిలీజ్ చేస్తున్నాయి.

ఆత్మకథ ఆరంభం


• జెమినీ సురేష్, అఖిలా నాయర్

జెమినీ సురేష్, అఖిలా నాయర్ హీరో హీరోయిన్లుగా శ్రీనివాస్ గుండ్రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం ‘ఆత్మకథ’. సోమేశ్వర రావు నిర్మిస్తున్న ఈ సినిమా గురువారం ఆరంభమైంది. తొలి సన్నివేశానికి నిర్మాత పి. కిరణ్ స్విచ్చాన్ చేయగా, జెమినీ సురేష్ తల్లి సుబ్బలక్ష్మి క్లాప్ ఇచ్చారు. అనంతరం జెమినీ సురేష్ మాట్లాడుతూ– ‘‘హీరోగా ఇది నా తొలి చిత్రం. నా 18 ఏళ్ల కల నెరవేరబోతోంది. ఒక మంచి కథతో శ్రీనివాస్‌గారు ఈ ‘ఆత్మకథ’ చేస్తున్నారు’’ అన్నారు. ‘‘కథే హీరోగా అనుకుని ‘ఆత్మకథ’ని రూపొందిస్తున్నాను. శ్రేయాస్ చాలా ప్రతిభావంతుడు. అందుకే చిన్న వయస్కుడు అయినప్పటికీ సంగీత దర్శకుడిగా తీసుకున్నాను’’ అని తెలిపారు శ్రీనివాస్ గుండ్రెడ్డి. ‘‘నేను గ్రేడ్ 6 చదువుతున్నాను. ఇప్పటికే ఐదు ఇన్‌స్ట్రుమెంట్లు ప్లే చేస్తున్నాను. ఎన్నో సంగీత కోర్సులు కూడా నేర్చుకున్నాను’’ అని తెలిపాడు సంగీత దర్శకుడు వారాహి శ్రేయాస్.

సాక్షి బిజినెస్
శుక్రవారం
22-8-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
143	33
82,001	25,084

విదేశీ సూచీలు

నాస్డాక్	21,087	▽	86
డోజోన్స్	44,793	▽	146
ఎఫ్టీఎస్ఈ 100	9,302	△	14
డాక్స్	24,296	△	19
హాంషై	3,771	△	5
నికాయ్	42,610	▽	278

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.75	87.77
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	116.50	119.46
€	యూరో	ఎస్‌బీఐ	100.10	102.90
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.41	59.90
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.06	57.29
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.46	69.11
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.33	23.83
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.81	24.07
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.26	13.08

ఐపీవో గ్రే మార్కెట్‌కు సెబీ చెక్

- ట్రేడింగ్‌కు అధికారిక ప్లాట్‌ఫామ్
- ఈక్విటీ డెరివేటివ్స్ గడువు పెంపు
- లావాదేవీల్లో నాణ్యత, ఇన్వెస్టర్లకు రక్షణ
- ప్రణాళికలు వెల్లడించిన చైర్‌పర్సన్ పాండే



ముంబై: ఐపీవోకంటే ముందు(ప్రీ ఐపీవో) లావాదేవీల నిర్వహణకు అధికారిక ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చైర్‌పర్సన్ తుహిన్ కాంత పాండే తాజాగా పేర్కొన్నారు. తద్వారా ప్రస్తుత అనధికార(గ్రే) మార్కెట్ లావాదేవీలకు చెక్ పెట్టే ప్రణాళికల్లో ఉన్నట్లు తెలియజేశారు. వెరసి నియంత్రణలకు లోబడి ప్రీఐపీవో లావాదేవీలు చేపట్టేందుకు కొత్త ప్లాట్‌ఫామ్ ఇన్వెస్టర్లను అనుమతించనుంది. ఐపీవో కేటాయింపులు(అలాట్‌మెంట్), స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్ మధ్య మూడు రోజుల పాటు లావాదేవీలకు వీలు కల్పించనుంది. దీంతో ప్రస్తుత గ్రే మార్కెట్ స్థానే నియంత్రిత లావాదేవీల ప్లాట్‌ఫామ్‌కు సెబీ తెరతీయనున్నట్లు పాండే వెల్లడించారు. అయితే ఇన్వెస్టర్లు పెట్టుబడి నిర్ణయాలు తీసుకునేందుకు ప్రీలిస్టింగ్ సమాచారం ఒక్కటే సరిపోదని 2025 ఫిక్కీ క్యాపిటల్ మార్కెట్ సదస్సు సందర్భంగా సెబీ చీఫ్ స్పష్టం చేశారు. క్యాపిటల్ మార్కెట్లను మరింత విస్తరించడంతోపాటు.. ఇన్వెస్టర్ల పరిరక్షణకు వీలుగా నియంత్రణలతోకూడిన ప్రీఐపీవో ట్రేడింగ్‌ను పరిశీలనాత్మకంగా ప్రవేశపెట్టే యోచనలో ఉన్నట్లు తెలియజేశారు.

నగదు ఈక్విటీ మార్కెట్‌పై దృష్టి

ఈక్విటీ డెరివేటివ్స్ గడువు(ఎక్స్‌పైరీ)లోనూ మార్పులు చేపట్టనున్నట్లు పాండే సంకేతమిచ్చారు. వీటి కాలావధి, ఎక్స్‌పైరీని ఒక క్రమపద్ధతిలో పొడిగించే ఆలోచనలో ఉన్నట్లు తెలియజేశారు. తద్వారా గతేడాది(2024–25) 91 శాతం వ్యక్తిగత ట్రేడర్లు నష్టపోయిన ఇలాంటి ప్రొడక్టులకు క్లెం వేసే వీలుంటుందని పేర్కొన్నారు. నగదు ఈక్విటీ మార్కెట్లను విస్తరించే బాటలో ఈక్విటీ డెరివేటివ్స్‌లో మార్పులు తీసుకురానున్నట్లు తెలియజేశారు. దీర్ఘకాలిక గడువుగల ప్రొడక్టులను ప్రవేశపెట్టడంతో డెరివేటివ్స్ నాణ్యతను సైతం పెంచే యోచనలో ఉన్నట్లు వెల్లడించారు. అయితే సంబంధిత వర్గాలతో చర్చలు చేపట్టాక, ఒక క్రమపద్ధతిలో డెరివేటివ్ ప్రొడక్టుల మెచూరిటీపై నిర్ణయించనున్నట్లు తెలియజేశారు. దీంతో హెడ్జింగ్, దీర్ఘకాలిక పెట్టుబడులకు దన్నునివ్వనున్నట్లు వివరించారు. నగదు విభాగంలో పరిమాణం భారీగా పెరుగుతున్నట్లు వెల్లడించారు. గత మూడేళ్లలో లావాదేవీల పరిమాణం రెట్టింపైనట్లు తెలియజేశారు. పారదర్శకత కీలకమని, దీంతో క్యాపిటల్ మార్కెట్లలో నిధుల సమీకరణకు వీలుంటుందని వివరించారు.

సెలబ్రేషన్స్ ముసుగులో సైబర్ ట్రాప్స్..!

- పండుగ సీజన్‌లో హ్యాకర్ల హంట్
- బోగస్ ట్రావెల్ ప్యాకేజీలు, ఫేక్ బుకింగ్స్
- క్విక్ హీల్ హెచ్చరిక



న్యూఢిల్లీ: పండుగల సీజన్‌లో ఆదమరిచి ఉన్న తరుణంలో సైబర్ మోసాల విషయంలో జాగ్రత్త వహించాలని సైబర్‌సెక్యూరిటీ సొల్యూషన్స్ సంస్థ క్విక్ హీల్ టెక్నాలజీస్ హెచ్చరించింది. ఫేక్ బుకింగ్ ఇంటర్‌ఫేస్‌లు, బోగస్ ట్రావెల్ ప్యాకేజీలు, నమ్మశక్యం కాని బూటకపు ఈ–కామర్స్ ఆఫర్లతో మోసగాళ్లు గాలం వేసే ముప్పు ఉందని పేర్కొంది. నకిలీ టికెట్ల సైట్లు, మోసపూరిత లింకులు, ఫిషింగ్ పేజీలకు దారి తీసే యూపీఐ పేమెంట్ రిక్వెస్టుల రూపంలో ఈ దాడులు జరగొచ్చని పేర్కొంది. అలాగే, అప్పటికప్పుడు రుణాలిచ్చేస్తామని ఆకర్షించే క్రెడిట్, లోన్ యాప్‌లు కూడా మందుపాతరల్లాంటివని ఒక ప్రకటనలో వివరించింది. అన్నింటికీ పర్మిషన్లు కావాలంటూ అడిగే ఫేక్ యాప్‌లకు దూరంగా ఉండాలని సూచించింది. సాధారణంగా పండుగల సందర్భంగా దాండియా, ఇతరత్రా కార్యక్రమాల కోసం బుక్ చేసుకునే వారిని సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేసుకునే అవకాశం ఉందని క్విక్ హీల్ తెలిపింది. ఆగస్టు నుంచి డిసెంబరు దాకా సాగే పండుగల నెలల్లో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఇలాంటి ఉదంతాలు పెద్ద ఎత్తున చోటు చేసుకుంటున్నాయని పేర్కొంది. ఔట్‌డేటెడ్ సాఫ్ట్‌వేర్ వల్లే ఈ తరహా మోసాలు జరుగుతుంటాయి కాబట్టి, యూజర్లంతా ఎప్పటికప్పుడు యాంటీవైరస్‌లను, సిస్టమ్ ప్యాచ్‌లను అప్‌డేట్ చేసుకుంటూ ఉండాలని సూచించింది. డీల్స్ విషయంలో సందేహం కలిగితే ఎంబెడెడ్ లింకులను క్లిక్ చేయకుండా, నేరుగా బ్రాండ్ అధికారిక యాప్‌నే ఉపయోగించడం లేదా బ్రౌజర్‌లో పోర్టల్ అడ్రెస్‌ని స్వయంగా టైప్ చేయడం మంచిదని పేర్కొంది.

తెలిసే సరికే ఆలస్యం..

- వినాయక చవితి, దసరా, దీపావళి, క్రిస్మస్ దగ్గర పడే కొద్దీ రైలు, ఫ్లయిట్ టికెట్లను బుక్ చేసుకునేందుకు ఐఆర్‌సీటీసీ, ఎయిర్‌లైన్స్ వెబ్‌సైట్లు మొదలైన వాటిని ఉపయోగించడం పెరుగుతుంది. ఇదే అదనుగా, సిసలైన వాటిలా అనిపించే నకిలీ బుకింగ్ ఇంటర్‌ఫేస్‌లు, బోగస్ ట్రావెల్ ప్యాకేజీ ఆఫర్లతో నేరగాళ్లు మోసం చేస్తారు.
- మంచి ఆఫర్ల కోసం అన్వేషించే యూజర్లను నకిలీ వెబ్‌సైట్ల వైపు మళ్లిస్తుంటారు. వాటిలోని మాల్‌వేర్‌లతో బ్యాంకింగ్ వివరాలను తస్కరిస్తారు. మొబైల్స్‌కి పండుగ గ్రీటింగ్ ఈ–కార్డుల రూపంలో ట్రోజన్లను పంపించి కాంటాక్టు లిస్టులను సంగ్రహిస్తారు. ఓటీపీలను దారి మళ్లిస్తారు. తమ వ్యక్తిగత, పేమెంట్ వివరాలన్నీ క్రిమినల్స్ చేతుల్లోకి చేరిపోయాయని బాధితులకు తెలిసేసరికే అలస్యమైపోతుంది.
- ఇక ఇన్‌స్టంట్ రుణాల యాప్‌లది మరో తీరు. వీటిని ఒక్కసారి ఇన్‌స్టాల్ చేస్తే, కాంటాక్టులు, ఎస్ఎంఎస్‌లు ఇలా ప్రతి దానికీ పర్మిషన్లు అడుగుతాయి. బాధితుల స్నేహితులు, కుటుంబ సభ్యులకు కూడా మోసపూరిత మెసేజీలను పంపిస్తుంటాయి.

మళ్లీ 82,000 పైకి సెన్సెక్స్



- నిఫ్టీ లాభం 33 పాయింట్లు
- సూచీలకు ఆరోరోజూ లాభాలే
- రిలయన్స్, ఐసీఐసీఐ బ్యాంకు షేర్ల దన్ను

ముంబై: రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంకు షేర్లు 1% రాణించడంతో స్టాక్ సూచీలు ఆరోరోజూ లాభపడ్డాయి. సెన్సెక్స్ 143 పాయింట్లు పెరిగి 82 వేల స్థాయిపైన 82,001 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 33 పాయింట్లు బలపడి 25,084 వద్ద నిలిచింది. ఒక దశలో సెన్సెక్స్ 373 పాయింట్లు బలపడి 82,231 వద్ద, నిఫ్టీ 103 పాయింట్లు ఎగసి 25,154 వద్ద ఇంట్రాడే గరిష్టాలు అందుకున్నాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 18 పైసలు బలహీనపడి 87.25 వద్ద ముగిసింది. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు స్తబ్దుగా ట్రేడవుతున్నాయి.

- వేదాంతా లిమిటెడ్ బోర్డు తాజాగా షేరుకి రూ. 16 చొప్పున రెండో మధ్యంతర డివిడెండ్ చెల్లించేందుకు అనుమతించింది. ఆగస్ట్ 27 రికార్డ్ డేట్‌గా నిర్ణయించింది. దీంతో 2025–26 గాను వాటాదారులకు రూ. 1 ముఖ విలువగల ఒక్కో షేరుకి రూ. 16 చొప్పున డివిడెండ్ చెల్లించనుంది. ఇందుకు రూ. 6,256 కోట్లు వెచ్చించనుంది.
- ఇంట్రాడే నష్టాలు దాదాపు భర్తీ చేసుకున్న నజరా టెక్నాలజీస్ షేరు చివరికి 1.31% స్వల్ప నష్టంతో రూ.1,206 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 11% పతనమై రూ.1,085 కనిష్టాన్ని తాకింది.

విప్రో చేతికి హర్మన్ డీటీఎస్

డీల్ విలువ రూ. 3,270 కోట్లు



న్యూఢిల్లీ: ఐటీ సేవల దేశీ దిగ్గజం విప్రో తాజాగా హర్మన్‌కు చెందిన డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సొల్యూషన్స్(డీటీఎస్) బిజినెస్ యూనిట్ కొనుగోలుకి తెరతీసింది. శామ్‌సంగ్‌కు చెందిన ఈ సంస్థలో 100 శాతం వాటా కొనుగోలుకి తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఇందుకు నగదు రూపేణా 37.5 కోట్ల డాలర్లు(సుమారు రూ. 3,270 కోట్లు) వెచ్చించనుంది. ఒప్పందంలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా 5,600మంది డీటీఎస్ ఉద్యోగులు విప్రోకు బదిలీ కానున్నారు. 2025 డిసెంబర్31కల్లా లావాదేవీ పూర్తికావచ్చని అంచనా వేస్తున్నారు. హర్మన్ కనెక్టెడ్ సర్వీసెస్ ఇంక్‌లో 100 శాతం వాటా కొనుగోలుకి హర్మన్ ఇంటర్నేషనల్ ఇండస్ట్రీస్ ఇంక్‌తో తప్పనిసరి ఒప్పందంపై సంతకాలు చేసినట్లు విప్రో పేర్కొంది. తద్వారా హర్మన్ అనుబంధ సంస్థలుసహా.. సంబంధిత ఆస్తులను సొంతం చేసుకోనున్నట్లు తెలియజేసింది. కొనుగోలు తదుపరి విప్రో ఇంజినీరింగ్ గ్లోబల్ బిజినెస్ లైన్‌లో డీటీఎస్ విలీనం కానున్నట్లు వెల్లడించింది. కనెక్టికట్(యూఎస్) కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న డీటీఎస్ అంతర్జాతీయంగా ఈఆర్అండ్‌డీ, ఐటీ సర్వీసులను అందిస్తోంది. ఎంబెడెడ్ సాఫ్ట్‌వేర్, డిజిటల్ ఇంజినీరింగ్, డిజైన్ థింకింగ్, క్లౌడ్, ఇన్‌ఫ్రా సర్వీసులలో ప్రధానంగా కార్యకలాపాలు విస్తరించింది.

డీల్ నేపథ్యంలో విప్రో షేరు బీఎస్ఈలో 0.4 శాతం నీరసించి రూ. 250 వద్ద ముగిసింది.

అపోలో హాస్పిటల్స్‌లో సునీతా రెడ్డి వాటాల విక్రయం..

న్యూఢిల్లీ: అపోలో హాస్పిటల్స్ ప్రమోటరు, ఎండీ సునీత రెడ్డి తాజాగా తమ సంస్థలో 1.25 శాతం వాటాలను బ్లాక్ డీల్స్ ద్వారా విక్రయించనున్నట్లు సమాచారం. వీటి విలువ సుమారు రూ. 1,395 కోట్లు ఉంటుందని తెలుస్తోంది. ఒక్కో షేరుకు రూ. 7,747 చొప్పున ఆమె 18 లక్షల షేర్లు విక్రయించనున్నట్లు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. షేర్‌హోల్డింగ్ వివరాల ప్రకారం సునీత రెడ్డికి కంపెనీలో 3.36 శాతం వాటాలు ఉన్నాయి.

కార్వీ ఇన్వెస్టర్ల క్లెయిమ్‌లకు డెడ్‌లైన్ పొడిగింపు



న్యూఢిల్లీ: డిఫాల్ట్ అయిన కార్వీ స్టాక్ బ్రోకింగ్ ఇన్వెస్టర్లు తమ క్లెయిమ్‌లను దాఖలు చేసేందుకు గడువును డిసెంబర్ 31 వరకు పొడిగిస్తూ సెబీ నిర్ణయం తీసుకుంది. 2020 నవంబర్ 3న కేఎస్‌బీఎల్‌ను ఎన్ఎస్ఈ డిఫాల్టరుగా ప్రకటించింది. తొలుత 2025 జూన్ 2 నాటికల్లా క్లెయిమ్‌లను దాఖలు చేసేందుకు సెబీ అవకాశం కల్పించింది. సహాయం కోసం ఎన్ఎస్ఈ టోల్ ఫ్రీ నంబరు 1800 266 0050ని సంప్రదించవచ్చని సెబీ తెలిపింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
లాభమ్... మినిమమ్
చైనా స్నేహంతో సోలార్ రంగానికి జోష్

సాక్షి స్పోర్ట్స్



అజేయంగా ప్రజ్ఞానంద

సింక్‌ఫీల్డ్ కప్ గ్రాండ్ చెస్ టూర్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద అజేయంగా సంయుక్త ఆధిక్యంలో కొనసాగుతున్నాడు. అమెరికాలోని సెయింట్ లూయిస్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో మూడో రౌండ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు ప్రజ్ఞానంద, దొమ్మరాజు గుకేశ్ తమ గేమ్‌లను 'డ్రా' చేసుకున్నారు. నొదిర్బెక్ అబ్దుసత్తొరోవ్ (ఉజ్బెకిస్తాన్)తో జరిగిన గేమ్‌ను ప్రజ్ఞానంద 46 ఎత్తుల్లో... స్యామ్ సెవియాన్ (అమెరికా)తో జరిగిన గేమ్‌ను ప్రపంచ చాంపియన్ గుకేశ్ 44 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించారు. ఇతర గేముల్లో ఫాబియానో కరువానా (అమెరికా) 46 ఎత్తుల్లో అలీరెజా ఫిరూజా (ఫ్రాన్స్)పై గెలుపొందగా... అరోనియన్ (అమెరికా)–మాక్సిమి లాగ్రెవ్ (ఫ్రాన్స్) గేమ్ 73 ఎత్తుల్లో; వెస్లీ సో (అమెరికా)–జాన్ క్రిస్టాఫ్ డూడా (పోలాండ్) గేమ్ 32 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిశాయి. మూడో రౌండ్ తర్వాత ప్రజ్ఞానంద, కరువానా, అరోనియన్ రెండు పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు.

భారత్, పాక్ పోరుకు రాజముద్ర

ఒకవైపు పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత పాకిస్తాన్‌పై భారతీయుల్లో తీవ్ర ఆగ్రహం... మన దేశంలో ఉన్న పాక్ జాతీయులను వెంటనే వెనక్కి పంపడంతో పాటు అన్ని రకాల సంబంధాలు తెంచుకుంటూ ప్రభుత్వ స్పందన... ఇలాంటి స్థితిలో శత్రుదేశం పాకిస్తాన్‌తో క్రికెట్ మ్యాచ్‌లను బాయ్‌కాట్ చేయాలని దేశవ్యాప్తంగా డిమాండ్లు... స్వయంగా టీమిండియా హెడ్ కోచ్ గంభీర్ తటస్థ వేదికల్లో కూడా ఆడకూడదంటూ వ్యాఖ్యలు ... వెటరన్ ఆటగాళ్ల 'వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్'లో పాక్‌తో రెండు మ్యాచ్‌ల్లో బరిలోకి దిగకుండా తప్పుకున్న భారత బృందంపై ప్రశంసలు...

మరోవైపు 'ఆ మ్యాచ్' కోసమేనా అన్నట్లుగా ఆసియా కప్ వేదిక భారత్ నుంచి యూఏఈకి మారడం... కొద్ది రోజులకే షెడ్యూల్ విడుదల... జోరుగా ప్రచారం మొదలు పెట్టిన ప్రసారకర్తలు... భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్‌కు 10 సెకన్ల ప్రకటనకు రూ. 16 లక్షల రేటు... చూస్తుండగానే టోర్నీలో పాల్గొనే జట్ల ప్రకటన... అయినా సరే చివరి నిమిషంలో మ్యాచ్ రద్దు కావచ్చని, లేదా భారత్ ఆడకుండా పాయింట్లు ఇవ్వవచ్చని చర్చ... కానీ అలాంటి అవసరం లేదని తేలిపోయింది. ఇప్పుడు అధికారికంగా కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చి భారత్, పాక్ పోరుకు ఆమోద ముద్ర వేసింది.

ఆసియా కప్ క్రికెట్ మ్యాచ్‌లకు అనుమతించిన కేంద్ర ప్రభుత్వం

ఇరు జట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లకు నో ● కొత్తగా మార్గదర్శకాలు జారీ



న్యూఢిల్లీ: ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో భారత్, పాకిస్తాన్ మధ్య సెప్టెంబర్ 14న దుబాయ్‌లో జరిగే మ్యాచ్ నిర్వహణపై ఉన్న సందేహాలు తొలగిపోయాయి. క్రికెట్ అభిమానులు ఈ మ్యాచ్‌ను చూసేందుకు అమితోత్సాహంతో సిద్ధం కావచ్చు! ఆసియా కప్‌లో పాక్‌తో తలపడేందుకు కేంద్ర ప్రభుత్వం మన జట్టుకు అనుమతి ఇచ్చింది. ఇతర దేశాలు కూడా పాల్గొంటున్న 'మల్టీలేటరల్ ఈవెంట్' కావడంతో ఈ మ్యాచ్‌లో ఆడటంపై ప్రభుత్వం ఆంక్షలు విధించడం లేదని ప్రకటించింది. టోర్నీ షెడ్యూల్ ప్రకారం చూస్తే ఇరు జట్ల మధ్య మూడు మ్యాచ్‌లు జరిగే అవకాశం కూడా ఉంది. ఈ మ్యాచ్‌లపై ఉన్న ఆసక్తి, ప్రాధాన్యతను బట్టి చూస్తే తాజా ప్రకటనతో వాణిజ్యపరంగా భాగస్వాములందరూ సంతోషించే నిర్ణయం వెలువడటం విశేషం. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడేందుకు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేసింది.

మార్గదర్శకాలతో స్పష్టత...

భారత్, పాకిస్తాన్ మధ్య నిజానికి 2012–13 నుంచి ద్వైపాక్షిక సిరీస్‌లు జరగడం లేదు. కానీ ఇరు జట్లు ఐసీసీ టోర్నీలైన వన్డే, టి20 వరల్డ్ కప్‌లు, చాంపియన్స్ ట్రోఫీతో పాటు ఆసియా కప్ మ్యాచ్‌లలో తలపడుతూనే ఉన్నాయి. కాబట్టి ప్రభుత్వ ప్రకటనలో కొత్తగా పేర్కొన్న అంశం ఏమీ లేదు. అయితే దీనికే మరింత స్పష్టతనిస్తూ అధికారికంగా మార్గదర్శకాలు జారీ చేసింది. సరిహద్దు దేశాల మధ్య ఇంకా ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో క్రీడా సంబంధాల విషయంలో కేంద్రం వీటిని ప్రకటించింది. 'క్రీడలకు సంబంధించి పాకిస్తాన్‌తో ఎలా వ్యవహరించాలనే విషయంపై ప్రభుత్వం తమ విధానాన్ని వెల్లడిస్తోంది. ఇరు జట్ల మధ్య ఎలాంటి ద్వైపాక్షిక సిరీస్‌లు ఉండవు. మన జట్టు అక్కడికి వెళ్లి ఆడేందుకు లేదా ఆ జట్టు ఇక్కడికి వచ్చే ఆడేందుకు కూడా అనుమతించేది లేదు. అయితే పలు ఇతర జట్లతో ముడిపడి ఉన్న టోర్నీల విషయంలో ఆయా క్రీడల అంతర్జాతీయ సంఘాల నిబంధనలను, మన ఆటగాళ్లను కూడా దృష్టిలో ఉంచుకొని నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. భారత్ పెద్ద ఈవెంట్ల వేదికగా మారుతున్న అంశాన్ని కూడా చూడాలి. కాబట్టి ఇలాంటి ఈవెంట్లలో పాక్ ఆడుతున్నా సరే మన జట్టు పాల్గొనవచ్చు. భారత్ ఆతిథ్యం ఇచ్చే ఇలాంటి టోర్నీల్లో కూడా పాకిస్తాన్ ఆడేందుకు అభ్యంతరం లేదు' అని కేంద్ర ప్రభుత్వం తాజా ప్రకటనలో పేర్కొంది.

అధికారుల కోసం వీసా సడలింపులు...

భవిష్యత్‌లో కామన్వెల్త్ క్రీడలు, ఒలింపిక్స్ కూడా నిర్వహించాలని ఆశిస్తున్న నేపథ్యంలో మన దేశానికి అత్యుత్తమ వేదికగా గుర్తింపు రావాలని కూడా కేంద్రం భావిస్తోంది. అందుకే వివిధ క్రీడా ఈవెంట్ల సమయంలో వీసాలు జారీ చేసే విషయంపై కూడా ప్రకటనలో వివరంగా పేర్కొంది. 'క్రీడాకారులు, అధికారులు, సాంకేతిక సిబ్బందితో పాటు అంతర్జాతీయ క్రీడా సమాఖ్యల ప్రతినిధులకు వారి అధికారిక పర్యటన సమయం, ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని వీసాలు జారీ చేస్తాం. ఇది గరిష్టంగా ఐదేళ్లు ఉంటుంది. టోర్నీల నిర్వహణ, ఏర్పాట్లకు సంబంధించి వచ్చే అధికారులకు ఇబ్బంది లేకుండా తమ బాధ్యతలు నిర్వర్తించేందుకు ఇది ఉపకరిస్తుంది' అని కేంద్రం వెల్లడించింది.


షఫాలీ వర్మ

టాపార్డర్ విఫలం

- భారత 'ఎ' జట్టు 93/5
- ఆస్ట్రేలియా మహిళల 'ఎ' జట్టుతో అనధికారిక టెస్టు

బ్రిస్బేన్: టాపార్డర్ విఫలమవడంతో... ఆస్ట్రేలియా మహిళల 'ఎ' జట్టుతో గురువారం ప్రారంభమైన ఏకైక అనధికారిక టెస్టులో భారత మహిళల 'ఎ' జట్టు కష్టాల్లో పడింది. వర్షం అంతరాయం కలిగించిన మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన రాధా యాదవ్ సారథ్యంలోని భారత మహిళల 'ఎ' జట్టు తొలి రోజు ఆట నిలిచే సమయానికి 23.2 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 93 పరుగులు చేసింది. ఓపెనర్ షఫాలీ వర్మ (38 బంతుల్లో 35; 8 ఫోర్లు) క్రీజులో ఉన్నంతసేపు ధాటిగా ఆడింది. మరో ఓపెనర్ నందిని కశ్యప్ (0), ధారా గుజ్జర్ (0) డకౌట్ కాగా... తేజల్ హసబ్నిస్ (9; 2 ఫోర్లు), తనుశ్రీ సర్కార్ (13; 2 ఫోర్లు) విఫలమయ్యారు. కెప్టెన్ రాధా యాదవ్ (8 బ్యాటింగ్; 1 ఫోర్), రాఘ్వీ బిస్త్ (26 బ్యాటింగ్; 5 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. ఈ పర్యటనలో భాగంగా టి20 సిరీస్‌ను 0–3తో కోల్పోయిన భారత మహిళల 'ఎ' జట్టు, వన్డే సిరీస్‌ను 2–1తో కైవసం చేసుకుంది. ఏకైక అనధికారిక టెస్టుకు వర్షం ఆటంకం కలిగించగా... ఆట సాగిన కాసేపులోనే భారత జట్టు వెనుకబడిపోయింది. ఆసీస్ బౌలర్ల ధాటికి ఎదురునిలవలేక మన బ్యాటర్లు ఒకరి వెంట ఒకరు పెవిలియన్‌కు వరుస కట్టారు. ఆస్ట్రేలియా 'ఎ' జట్టు బౌలర్లలో జార్జియా 3 వికెట్లు పడగొట్టింది.



భారత్ గురి 'బంగారం'

ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో మరో స్వర్ణం

షిమ్‌కెంట్ (కజకిస్తాన్): ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్ సీనియర్ విభాగంలో భారత్ ఖాతాలో మరో స్వర్ణ పతకం చేరింది. గురువారం జరిగిన పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు బంగారు పతకం లభించింది. రుద్రాంక్ష్ పాటిల్, అర్జున్ బబూటా, అంకుశ్ జాదవ్‌లతో కూడిన భారత జట్టు 1892.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి పసిడి పతకాన్ని గెల్చుకుంది. రుద్రాంక్ష్ 632.3 పాయింట్లు, అర్జున్ 631.6 పాయింట్లు, అంకుశ్ 628.6 పాయింట్లు స్కోరు చేశారు. అయితే వ్యక్తిగత విభాగంలో రుద్రాంక్ష్ 207.6 పాయింట్లతో నాలుగో స్థానంలో, అర్జున్ 185.8 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచారు. సత్పయేవ్ (కజకిస్తాన్; 250.1 పాయింట్లు) స్వర్ణం ... లూ డింగ్‌కి (చైనా; 249.8 పాయింట్లు) రజతం ... హజున్ పార్క్ (కొరియా; 228.7 పాయింట్లు) కాంస్యం సాధించారు. ఇదే వేదికపై జరుగుతున్న ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్లు మెరిశారు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్, వ్యక్తిగత విభాగంలో భారత్‌కే స్వర్ణాలు దక్కాయి. వ్యక్తిగత విభాగంలో అభినవ్ షా 250.4 పాయింట్లతో పసిడి పతకం నెగ్గగా... టీమ్ విభాగంలో అభినవ్, హిమాంశు, ప్రణవ్‌లతో కూడిన భారత జట్టు 1890.1 పాయింట్లతో బంగారు పతకాన్ని నెగ్గింది. జూనియర్ మహిళల స్కీట్ ఈవెంట్‌లో మాన్సి స్వర్ణం, యశస్వి రజతం... జూనియర్ పురుషుల స్కీట్ ఈవెంట్‌లో హర్‌మెహర్ రజతం, జ్యోతిరాదిత్య సిసోడియా కాంస్యం గెలిచారు. హర్‌మెహర్, జ్యోతిరాదిత్య, అతుల్‌లతో కూడిన బృందం టీమ్ స్కీట్ ఈవెంట్‌లో బంగారు పతకాన్ని దక్కించుకుంది. ఓవరాల్‌గా భారత్ 16 స్వర్ణాలు, 8 రజతాలు, 7 కాంస్యాలతో 31 పతకాలతో 'టాప్'లో ఉంది.

యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ ఫలితాలు
మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ–పేపర్‌లో

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.


ఆసక్తితో చూడండి
దీనిని తీసుకురండి. ఇది ఈ మధ్యనే లాంచ్ చేయబడిన 'BE 6 Pack Two', ఇది ప్రతివిషయంలోనూ శ్రేష్ఠతకి చిహ్నం. మా టాప్ ఎండ్ Pack Three లాగానే. ఇంకా, దీని ఆకర్షణీయమైన ధర కేవలం ₹21.90 లక్షలు* మరియు EMI కూడా సులువుగా, కేవలం ₹39 454.00# వచ్చేసిందిగా మీ ముఖంలో చిరునవ్వు! ఇప్పుడు కాస్త శ్రద్ధగా చూడండి మా టాప్ ఎండ్ ఫీచర్లని. ఇవి మీకు లభిస్తాయి Pack Two లో:
రేస్ రెడీ కాక్ పిట్, డ్యూయల్ 31.24 cm స్క్రీన్ తోపాటు • ప్రీమియం లెదరెట్ ఇంటీరియర్స్ • సోనిక్ స్టూడియో 16- స్పీకర్ హర్మన్ కార్డన్ సిస్టంతోపాటు డాల్బీ అట్మాస్ • లెవల్ 2 ADAS • LED ల్యాంప్స్ • R19 వీల్స్ ఫిక్స్డ్-గ్లాస్ ఇన్ఫినిటీ రూఫ్ • 5- స్టార్ భారత్ NCAP సేఫ్టీ రేటింగ్
సింగిల్ ఛార్జితో 79 kWh బ్యాటరీ మీకిప్పిస్తుంది 500 km^ల రియల్ వర్ల్డ్ రేంజ్ అదే 59 kWh బ్యాటరీ తో 400 km^, అంటే వారంలో ఒక్కసారి ఛార్జి చేస్తే సరిపోతుంది. దాంతోపాటు, మీకు లభిస్తుంది బ్యాటరీ మీద లైఫ్ టైం వారంటీ###. ఇప్పుడు ప్రయాణం టెన్షన్ - ఫ్రీ.
ప్రారంభధర
₹21.90 లక్షలు*
₹39 454.00#ల సులువైన EMI
బిజినెస్సులకై 40% డిప్రిసిఏషన్ ప్రయోజనం## • ₹30 000.00ల ఎక్స్ ఛేంజ్ ప్రయోజనం**
BE 6 PACK TWO | డెలివరీ ఇప్పుడు ప్రారంభం
మీకు దగ్గరలోనున్న డీలర్ షిప్ ని తెలుసుకునేందుకై స్కాన్ చెయ్యండి
*ఛార్జర్ మరియు ఇన్ స్టలేషన్ ఖర్చు లేకుండా BE 6 Pack Two 59 kWh యొక్క ఎక్స్-షోరూమ్ ప్రారంభ ధర #MMFSL తరఫున బెలూన్ పేమెంట్ తోపాటు స్పెషల్ EMI స్కీమ్. ##అర్హత కోసం మీ ఫైనాన్షియల్ అడ్వైజర్ ని సంప్రదించండి. ###మొదటి రిజిస్టర్డ్ ఓనర్ కోసం. కేవలం ప్రైవేట్ రిజిస్ట్రేషన్ కై వర్తిస్తుంది. ఓనర్ షిప్ (యాజమాన్యం) మారితే, HV బ్యాటరీకి వారంటీ 10 సంవత్సరాలు లేదా 2 00 000 km, ఏది బండి డెలివరీకి ముందైతే అది. ^AC ఆన్ చేసి, నగరపు ప్రాంతాలలో నిజమైన పరీక్షల అనుసారం. వాస్తవిక పరిణామాలలో భిన్నంగా ఉండచ్చు. ARAI MIDC P1+P2 ప్రమాణిత రేంజ్ 59 kWh: 557 km, 79 kWh: 683 km. **షరతులు, నిబంధనలు వర్తిస్తాయి.
విస్తృతమైన షరతులు, నిబంధనలకై, ఇక్కడ విజిట్ చెయ్యండి: visit www.mahindraelectricsuv.com/tnc.html
ELECTRIC ORIGIN SUVs
mahindra



రోజురోజుకు కృత్రిమమేధ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ వినియోగం విస్తృతం అవుతున్నాయి. ఈ నేపథ్యంలోప్రపంచవ్యాప్తంగా డిమాండ్‌కు అనుగుణంగా ఉద్యోగాల సాధన ఉద్యోగార్థులకు కష్టసాధ్యంగా మారుతోంది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కార్పొరేట్ సంస్థలు కోరుకున్న విధంగా వివిధ నైపుణ్యాలున్న వారు ఉద్యోగాలు పొందడం సులభమవుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా చూస్తే... విమర్శనాత్మక ఆలోచన, విశ్లేషణాత్మక నైపుణ్యాలు, భావోద్వేగ మేధస్సు వంటివి కీలక ఉద్యోగ నైపుణ్యాలుగా పరిగణిస్తున్నారు. ఏఐ, మెషీన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా విశ్లేషణ వంటి సాంకేతిక నైపుణ్యాలకూ అధిక డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో అత్యంత ముఖ్యమైన ఉద్యోగ నైపుణ్యాలపై 'గ్లోబల్ సర్వే ఆఫ్ ఎంప్లాయర్స్'నివేదిక రూపొందించింది. అలాగే, వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఆయా నైపుణ్యాలకు ర్యాంకింగ్స్ ఇస్తూ 'ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్ 2025'నివేదికను వెలువరించింది. ఇది ప్రపంచవ్యాప్తంగా 1.41 కోట్లకు పైగా ఉద్యోగులున్న 1,043 కంపెనీల ప్రతినిధుల అభిప్రాయాల ఆధారంగా రిపోర్ట్ ఇచ్చింది. ప్రపంచవ్యాప్తంగా ర్యాంకింగ్స్‌లో అనలిటికల్ థింకింగ్ (విశ్లేషణాత్మక ఆలోచన) 69 శాతంతో అగ్రస్థానంలో నిలుస్తోంది.

- సాక్షి, హైదరాబాద్

కింగ్.. 'అనలిటికల్ థింకింగ్'!

కీలక ఉద్యోగ నైపుణ్యాలుగా విశ్లేషణ, విమర్శనాత్మక ఆలోచన, భావోద్వేగ మేధస్సు

'గ్లోబల్ సర్వే ఆఫ్ ఎంప్లాయర్స్'నివేదికలో వెల్లడి

వరల్డ్ ఎకనామిక్ ఫోరం 'ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్ 2025'నివేదికలోనూ ప్రస్తావన

ఇక భారత్ విషయానికొస్తే...

వివిధ అధ్యయనాలు, సర్వేలు, నిపుణుల అభిప్రాయాలు సూచనలను బట్టి చూస్తే దేశంలో ముఖ్యమైన ఉద్యోగ నైపుణ్యాలు... కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్, డేటా అనాలిసిస్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ చుట్టూ కేంద్రీకృతం అవుతున్నాయి. భారత్‌లో కంపెనీలు కోరుకుంటున్న ముఖ్య సాంకేతికత ఇలా ఉన్నాయి.

కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్: ఏఐ అల్గోరిథంలు, న్యూరల్ నెట్‌వర్క్ అప్లికేషన్లలో నైపుణ్యం కలిగిన నిపుణులకు డిమాండ్.

డేటా విశ్లేషణ: డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకోవడం ఒక ప్రమాణంగా మారుతోంది. అందువల్ల డేటా మానిప్యులేషన్, గణాంక విశ్లేషణ, విజువలైజేషన్‌లో నైపుణ్యాల ఆవశ్యకత పెరిగింది.

సైబర్ భద్రత: రోజురోజుకు సైబర్ ముప్పు పెరుగుతుండటంతో నెట్‌వర్క్‌ల రక్షణలో నైపుణ్యాలు, సాంకేతికంగా ఎదురయ్యే ముప్పును అర్థం చేసుకోవడం, భద్రతా ప్రోటోకాల్ అమలుకు అత్యంత ప్రాధాన్యత

క్లౌడ్ కంప్యూటింగ్: వ్యాపారాలు క్లౌడ్‌లోకి మార్పిడి జరుగుతుండటంతో, క్లౌడ్ సేవలు, ఆర్కిటెక్చర్ డిజైన్, డిప్లాయ్‌మెంట్ వ్యూహాల పరిజ్ఞానం వంటి వాటికి అధిక డిమాండ్

సాఫ్ట్‌వేర్ అభివృద్ధి: సాఫ్ట్‌వేర్ డెవలపర్ల కోసం ముఖ్యంగా ఏఐ-ఆధారిత అప్లికేషన్‌లు, క్లౌడ్ టెక్నాలజీలలో అనుభవం ఉన్నవారి కోసం డిమాండ్.

బ్లాక్‌చైన్ టెక్నాలజీ: ఫైనాన్స్, సప్లయ్ చైన్ పరిశ్రమల్లో పరివర్తనాత్మక ప్రభావంతో బ్లాక్‌చెయిన్ నిపుణులకు డిమాండ్ పెరిగింది.

సాఫ్ట్ స్కిల్స్, అనుకూలతలు: కొత్త వ్యవస్థలను త్వరగా నేర్చుకోవడం, మారుతున్న పని వాతావరణాలకు అనుగుణంగా మారడం, కొత్త సాంకేతికతలను స్వీకరించే సామర్థ్యం చాలా ముఖ్యం.

సమస్య పరిష్కారం: దినచర్యలనూ ఆటోమేట్ చేస్తున్నందున సంక్లిష్ట సమస్యల పరిష్కారం, విమర్శనాత్మక ఆలోచనా నైపుణ్యాలకు డిమాండ్ పెరిగింది.

భావోద్వేగ మేధస్సు: ఆటోమేటెడ్ ప్రపంచంలో సానుభూతి, భావోద్వేగ మేధస్సు వంటి మానవ నైపుణ్యాలకు డిమాండ్.

నాయకత్వం, సామాజిక ప్రభావం: టీమ్‌లకు మార్గనిర్దేశం చేయడానికి, సంక్లిష్ట పరిస్థితులను అధిగమించడానికి సమర్థ నాయకత్వం, సామాజిక ప్రభావ నైపుణ్యాలు ముఖ్యం.

కస్టమర్ సర్వీస్: వ్యాపార విజయానికి బలమైన కస్టమర్ సంబంధాలను పెంపొందించుకోవడం ముఖ్యం.

డిజిటల్ మార్కెటింగ్: వ్యాపారాలు తమ నిర్దేశిత, టార్గెటెడ్ కస్టమర్లను చేరుకునేందుకు సెర్చ్ ఇంజిన్ ఆప్టిమేషన్ స్కిల్స్, కంటెంట్ మార్కెటింగ్, సోషల్ మీడియా మార్కెటింగ్‌లో నైపుణ్యాలు చాలా అవసరం

ప్రాజెక్ట్ నిర్వహణ: వనరుల నిర్వహణ, సాంకేతిక ప్రాజెక్ట్ నాయకత్వంతో సహా ప్రాజెక్ట్ నిర్వహణ నైపుణ్యాలకు డిమాండ్ ఉంది.

నైపుణ్యాలపై వరల్డ్ ఎకనామిక్ ఫోరం ర్యాంకింగ్స్ ఇలా..

నైపుణ్యం	శాతం
విశ్లేషణాత్మక ఆలోచన (అనలిటికల్ థింకింగ్)	69
క్లిష్టమైన పరిస్థితులకు తగ్గట్లు పనిచేయడం, చురుకుదనం	67
నాయకత్వం, సామాజిక ప్రభావం	61
సృజనాత్మక ఆలోచన	57
ప్రేరణ, స్వీయ-అవగాహన	52
సాంకేతిక అక్షరాస్యత	51
చురుగ్గా వినడం	50
కొత్తవిషయాలను నేర్చుకోవాలనే జిజ్ఞాస	50
సర్వీస్ ఒరియెంటేషన్, కస్టమర్ సర్వీస్	47
ఏఐ, బిగ్ డేటా	45

(ఇంకా వనరుల నిర్వహణ, క్వాలిటీ కంట్రోల్, బోధన, సైబర్ భద్రత, డిజైన్, మార్కెటింగ్, ప్రోగ్రామింగ్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.)

గిరిజన విద్యకు కేంద్రం పెద్దపీట

- తెలంగాణలో 23 ఏకలవ్య పాఠశాలలు
- కాంగ్రెస్ ఎంపీ బలరాం నాయక్ ప్రశ్నకు కేంద్రం సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, తెలంగాణలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో విద్యార్థుల నమోదు పెరుగుతున్నట్లు కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ బలరాం నాయక్ అడిగిన ప్రశ్నకు మంత్రి జువల్ ఓరం ఈ మేరకు సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి దేశవ్యాప్తంగా, ముఖ్యంగా తెలంగాణలో గిరిజన విద్య స్థితిగతులపై వివరణాత్మక నివేదికను సమర్పించారు.

తెలంగాణలో ఏకలవ్య పాఠశాలల స్థితి..

పాఠశాలలు–నమోదు: తెలంగాణలో 23 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ పనిచేస్తున్నాయని, వీటిలో 9,282 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని కేంద్ర మంత్రి తెలిపారు. దేశవ్యాప్తంగా మొత్తం 728 ఏకలవ్య పాఠశాలలు మంజూరు కాగా, ప్రస్తుతం 479 పాఠశాలలు పనిచేస్తున్నాయి.

నిధుల విడుదల: తెలంగాణలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల స్థాపన, నిర్వహణ కోసం గత ఐదేళ్లలో కేంద్రం రూ. 554.77 కోట్లు విడుదల చేసింది. అదేవిధంగా, ఆర్టికల్ 275(1) కింద కూడా గిరిజన విద్య సంబంధిత కార్యకలాపాలకు నిధులు మంజూరు చేసింది.

ఆశ్రమ పాఠశాలలు: 'ఆశ్రమ పాఠశాలల స్థాపన పథకం'ను 2018–19 నుంచి నిలిపివేసి, ఈ నిధులను 'స్పెషల్ సెంట్రల్ అసిస్టెన్స్ టు ట్రైబల్ సబ్-స్కీమ్'లో కలిపినట్లు కేంద్రమంత్రి జుయెల్ ఓరం పేర్కొన్నారు. కొత్తగా ప్రారంభించిన 'ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్' కింద కూడా ఆశ్రమ పాఠశాలల స్థాయి పెంచేందుకు నిధులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

గిరిజన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు..

2020 నుంచి తెలంగాణలో ప్రీ-మెట్రిక్ మరియు పోస్ట్- మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకాల కింద లక్షలాది మంది గిరిజ న విద్యార్థులు లబ్ధి పొందారని తెలిపారు. 2020-21 నుంచి 2024-25 వరకు ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కింద మొ త్తం 13,576 మంది విద్యార్థులకు రూ.4.27 కోట్లు పంపిణీ చేయగా, పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కింద 5,51,332 మంది విద్యార్థులకు రూ.803.17 కోట్లు విడుదల చేశారు.

సవాళ్ల పరిష్కారానికి చర్యలు..

మౌలిక సదుపాయాలు: పాఠశాలల నిర్మాణ వ్య యాన్ని పెంచడంతో పాటు, పనులు వేగవంతం చేసేందుకు సీపీడబ్ల్యూడీ, రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీ లకు బాధ్యతలను అప్పగించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. పాత ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల పునరుద్ధరణకు ఒక్కో పాఠశాలకు రూ. 5 కోట్లు మంజూరు చేస్తున్నామన్నారు.

ఉపాధ్యాయుల కొరత..

ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు 10,391 పోస్టులకు నేరుగా నియామకాలు చేపట్టి, వివిధ పాఠశాలల్లో నియమించినట్లు చెప్పారు. అవసరమైన చోట గెస్ట్ టీచర్లు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించారు.

పార్లమెంట్‌లో తెలంగాణం

విమానాశ్రయాల అభివృద్ధికి రూ.16,300 కోట్ల పెట్టుబడి

లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ చామల ప్రశ్నకు కేంద్రం సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో అదానీ గ్రూప్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఏడు విమానాశ్రయాల ఆధునీకరణ, విస్తరణ పనులకు ఇప్పటివరకు రూ.16,300 కోట్లు మూలధన పెట్టుబడి జరిగినట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ గురువారం లోక్‌సభలో వెల్లడించింది. కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి మురళీధర్ మొహోల్ సమాధానం ఇస్తూ, విమానాశ్రయాల విస్తరణ, ఆధునీకరణ నిరంతర ప్రక్రియ. ట్రాఫిక్ డిమాండ్, ఆర్థిక సాధ్యాసాధ్యాలు, భద్రతా అవసరాలు, ఎయిర్‌లైన్స్ అవసరాలను బట్టి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామన్నారు. జాయింట్ వెంచర్, పీపీపీ, లీజు విమానాశ్రయాల్లో పెట్టుబడులు ఏఏఐ (ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) నిర్వహించే విమానాశ్రయాలతో పోలిస్తే ఎక్కువగా ఉంటాయని కేంద్రం స్పష్టం చేసింది. ఈ భిన్న పెట్టుబడి స్థాయిల ఆధారంగా ఎయిర్‌పోర్ట్స్ ఎకనామిక్ రెగ్యులేటరీ అథారిటీ టారిఫ్‌లు నిర్ణయిస్తుందని పేర్కొంది.

వరంగల్‌లో ఇంక్యుబేషన్ సెంటర్‌కు కేంద్రం 'నో'

కాంగ్రెస్ ఎంపీ కడియం కావ్య ప్రశ్నకు కేంద్రం సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: వరంగల్ లోక్‌సభ నియోజకవర్గంలో ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు ప్రతిపాదన ఏదీ కేంద్రం వద్ద లేదని కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ స్పష్టం చేసింది. కాంగ్రెస్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే గురువారం లోక్‌సభలో సమాధానమిచ్చారు.

తెలంగాణలో 11 వేల మెగావాట్ల బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి



రాష్ట్రంలో 9 బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్లు కలిపి మొత్తం 11,042 మెగావాట్ల సామర్థ్యంతో పనిచేస్తున్నాయని కేంద్ర విద్యుత్ శాఖ వెల్లడించింది. లోక్‌సభలో గురువారం బీజేపీ ఎంపీ అర్వింద్ ధర్మపురి అడిగిన ప్రశ్నకు కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ నాయక్ సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం ప్రధాన బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలు తెలంగాణలో 9 ఉన్నాయి. ఎన్టీపీసీ రామగుండం ఎస్‌టీపీఎస్‌లో 2,600 మెగావాట్లు, తెలంగాణ ఎస్‌టీపీఎస్ ఫేజ్-1లో 1,600 మెగావాట్లు, సింగరేణి టీపీపీలో 1,200 మెగావాట్లు, భద్రాద్రి టీపీపీలో 1,080 మెగావాట్లు, కాకతీయ టీపీఎస్‌లో 1,100 మెగావాట్లు, కొత్తగూడెం టీపీఎస్ (కొత్తది)లో 1,000 మెగావాట్లు, కొత్తగూడెం టీపీఎస్ (స్టేజ్-7)లో 800 మెగావాట్లు, రామగుండం-బి టీపీఎస్‌లో 62.5 మెగావాట్లు, యాదాద్రి టీపీఎస్‌లో 1,600 మెగావాట్లు కలిపి మొత్తం సామర్థ్యం: 11,042.5 మెగావాట్లుగా ఉందని కేంద్రమంత్రి పేర్కొన్నారు. 2025 మేలో కేంద్రం శక్తి పాలసీని ఆమోదించింది. ఈ కొత్త విధానం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న అన్ని బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్లకు, తెలంగాణలోవాటికి కూడా, బొగ్గు లింకేజీ సులభతరం అవుతుంది. అధిక కోల్ లింకేజీలు, విస్తృత అర్హతలు, మెరుగైన యాక్సెసిబిలిటీ కల్పించే విధంగా ఈ పాలసీ రూపుదిద్దుకుంది. అయితే, సామర్థ్య విస్తరణపై తుది నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వంపైనే ఆధారపడుతుందని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

యూరియాపై రైతుల్ని తప్పదోవ పట్టిస్తున్నారు

బీజేపీ, బీఆర్ఎస్‌పై ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం
బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నైట్ వాచ్‌మెన్ లాంటి వాడు అంటూ ఎద్దేవా
ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో సుదర్శన్‌రెడ్డికి మద్దతివ్వాలని విపక్షాలకు పిలుపు

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రానికి యూరియా సరఫరా విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ రైతులను తప్పుదారి పట్టిస్తున్నాయని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ పోరాటంతోనే రాష్ట్రానికి యూరియా సరఫరా చేసేందుకు కేంద్రం దిగివచ్చిందన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ ఉద్దేశపూర్వకంగానే... ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు రాష్ట్రానికి రావాల్సిన యూరియాను సరఫరా చేయలేదని ఆయన ఆరోపించారు. గురువారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఎంపీ చామల మీడియాతో మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు క్రికెట్ ఆటలో నైట్ వాచ్‌మన్‌లా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. యూరియా సరఫరా అంశంపై సిక్సులు, ఫోర్‌లు కొట్టేలనే తాపత్రయంలో ఏం మాట్లాడుతున్నారో ఆయనకు అర్థం కావడం లేదని విమర్శించారు. మంచి బ్యాట్స్‌మన్‌గా మారాలంటే రాష్ట్రానికి నిధులు తేవాలని హితవు పలికారు. కాంగ్రెస్ పోరాటంతో యూరియా సరఫరా చేయలేదని.. కేంద్ర ప్రభుత్వం బాధ్యతగా ఇచ్చిందంటున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాంచందర్‌రావులకు చిత్తశుద్ధి ఉంటే తెలంగాణకు రావాల్సిన మెట్రో ఫేజ్-2, ట్రిపుల్ ఆర్, మూసీ ప్రక్షాళనకు నిధులను తీసుకురావాలని సవాల్ విసిరారు. రాష్ట్రపతి ఎన్నికల్లో తెలంగాణకు చెందిన బి.సుదర్శన్‌రెడ్డికి రాష్ట్రంలోని విపక్ష పార్టీలు మద్దతివ్వాలని ఆయన పిలుపునిచ్చారు.



పీఎంకేఎస్‌వై ప్రాజెక్టులు మంజూరు చేయండి

కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు కాంగ్రెస్ ఎంపీల విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన (పీఎంకేఎస్‌వై) కింద తెలంగాణలోని అన్ని జిల్లాలకు ప్రాజెక్టులు మంజూరు చేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు కాంగ్రెస్ ఎంపీలు విజ్ఞప్తి చేశారు. గురువారం ఢిల్లీలో ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, సురేశ్ షెట్కార్, రఘురాంరెడ్డి కేంద్రమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ వ్యవసాయ యోగ్యమైన రాష్ట్రమని, నీటిపారుదల, నీటి సంరక్షణ చర్యలు అవసరమని తెలిపారు. పీఎంకేఎస్‌వై ప్రాజెక్టుల ద్వారా 'హర్ ఖేత్‌కో పానీ'ని నిర్ధారించడం, నీటివినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరచడం, వాటర్ షెడ్లు మంజూరు చేయాలని కోరారు.

కేటీఆర్‌వి అజ్ఞానపు మాటలు

వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఆత్మ గౌరవం కోసం ఇండియా కూటమి తరఫున ఉపరాష్ట్రపతిగా పోటీ చేస్తున్న జస్టిస్ సుదర్శన్ రెడ్డిని గెలిపించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరుతుంటే.. బీజేపీతో కుమ్మక్కైన కేటీఆర్ మాత్రం అజ్ఞానపు మాటలు మాట్లాడుతున్నారని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు విమర్శించారు. ఆయన గాంధీభవన్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ కోసం తనవంతు కృషి చేసిన న్యాయ కోవిదుడు సుదర్శన్‌రెడ్డికి ఓటేస్తారా? అని అడిగితే.. యూరియా ఇచ్చిన వారికే మద్దతు ఇస్తామనడం కేటీఆర్ అవివేకానికి నిదర్శనమన్నారు. 30 రోజులు జైల్లో ఉంటే పదవులకు అనర్హులనే బిల్లును కాంగ్రెస్ వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. ఓట్ చోరీ ఆందోళనను కప్పి పుచ్చుకోవడానికి ఆ బిల్లును తెచ్చారని ఆరోపించారు.

విద్యుదాఘాత మృతులకు రూ.50 లక్షలు ఇవ్వాలి

వీహెచ్‌పీ ప్రచార ప్రముఖ్ బాలస్వామి

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల పరిహారం, క్షతగాత్రులకు రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి డిమాండ్ చేశారు. ఇటీవల రామంతపూర్ శ్రీకృష్ణ జన్మాష్టమి శోభాయాత్రలో విద్యుత్ తీగలు తగిలి ఆరుగురు, ఆ తర్వాత వినాయక విగ్రహాలను తీసుకువెళ్లే క్రమంలో హైదరాబాద్, కామారెడ్డి జిల్లా పరిధిలో ముగ్గురు యువకుల మరణం తీవ్ర బాధాకరమని పేర్కొన్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదాలు జరిగాయని ఆరోపించారు. మృతుల కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఒక ప్రకటనలో ఆయన డిమాండ్ చేశారు. దీనిపై టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ బాధ్యతారహితంగా మాట్లాడటం, ప్రమాదాన్ని చిన్నదిగా చూపే ప్రయత్నం సరికాదని పేర్కొన్నారు. నాసిరకం తీగలు అమర్చి, వేలాడుతున్న తీగలను సరి చేయని అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

సీజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించండి

కేంద్రమంత్రి జేపీ నడ్డాకు ఎంపీ కడియం కావ్య వినతి

సాక్షి, న్యూఢిల్లీ: వరంగల్‌లో సీజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్‌ను త్వరగా ప్రారంభించాలని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డాను వరంగల్ కాంగ్రెస్ ఎంపీ కడియం కావ్య కోరారు. గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి ఆమె వినతిపత్రం అందజేశారు. వరంగల్‌లో వేలాది మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు ఉన్నారని, వైద్యంకోసం వారంతా తరచూ హైదరాబాద్ వెళ్లాల్సి వస్తోందని కేంద్రమంత్రికి వివరించారు. తక్షణమే వరంగల్ సీజీహెచ్‌ఎస్‌లో వైద్య సిబ్బందిని నియమించాలని, శాశ్వత భవన్‌లో సెంటర్‌ను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ బిడ్డను కేటీఆర్ కించపరిచారు

జస్టిస్ సుదర్శన్‌రెడ్డిపై ఆయన చేసిన వ్యాఖ్యలు సరికాదు: చనగాని

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ నుంచి పార్టీలకు అతీతంగా ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపికైన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పట్ల కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ఆయన అహంకారానికి పరాకాష్ట అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ విమర్శించారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రిని థర్డ్ క్లాస్ అని మాట్లాడటం సిగ్గుచేటన్నారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి విలువలుగల వ్యక్తి అని, బీఆర్ఎస్ పార్టీకి తెలంగాణ ప్రాంతంపైన, తెలంగాణ మూలాలపైన గౌరవం ఉంటే సుదర్శన్‌రెడ్డికి మద్దతు ప్రకటించాలని పేర్కొన్నారు. రాజకీయాలకు సంబంధం లేని, రాజ్యాంగ విలువల కోసం పాటుపడిన వ్యక్తి సుదర్శన్‌రెడ్డి అని అన్నారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిపైన చేసిన వ్యాఖ్యలకు బేషరతుగా కేటీఆర్ క్షమాపణ చెప్పాలని చనగాని డిమాండ్ చేశారు.

యూరియా కష్టాలకు ప్రభుత్వమే కారణం

బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నెలకొన్న యూరియా సంక్షోభానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి ఆరోపించారు. యూరియా సంక్షోభంపై కాంగ్రెస్, బీజేపీ నేతల తీరు గుమ్మడికాయ దొంగలు అంటే భుజాలు తడుముకున్న చందంగా మారిందని విమర్శించారు. ఈ మేరకు గురువారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో శ్రీధర్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురించి మాట్లాడే స్థాయి కాంగ్రెస్ మంత్రులకు లేదన్నారు. అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి యూరియా కొరత గురించి ఎందుకు మాట్లాడటం లేదని ఆయన ప్రశ్నించారు.


కొండల్లో జాలువారుతున్న పొల్లూరు జలపాతం

ప్రకృతి కాంతకు ఎన్నెన్ని హొయలో..

బండరాళ్ల దారుల్లో తిరిగేటి సెలయేరు గుండెల్లో నడిచేస్తూ రా రమ్మని ప్రకృతి ప్రేమికులకు ఆహ్వానం పలుకుతోంది. పచ్చని కొండల్లో జాలువారుతూ అల్లూరి జిల్లాలో పొల్లూరు జలపాతం కనువిందు చేస్తోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సమీపంలో తడికవాగు పరవళ్లు తొక్కుతోంది. సీలేరు నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నందున ప్రకృతి అందాలను చూసేందుకు వస్తున్న పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని జెన్‌కో అధికారులు, పోలీసులు హెచ్చరిస్తున్నారు. – మోతుగూడెం


పరవళ్లు తొక్కుతున్న పొల్లూరు జలపాతం


సీలేరు నది నుంచి పొల్లూరు విద్యుత్ కేంద్రానికి వెళ్తున్న నీరు

ఉప్పొంగిన చాపరాయి గెడ్డ

- మూతపడిన జలవిహారి
- నిరాశకు గురైన పర్యాటకులు

అల్లూరి జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలవిహారి వద్ద గెడ్డ ఉప్పొంగి ప్రవహించింది. ముందుగానే ఊహించిన అధికార యంత్రాంగం సందర్శకుల అనుమతిని నిలిపివేసింది. తిలకించేందుకు వచ్చిన పర్యాటకులకు ఈ విషయం తెలియకపోవడంతో నిరాశకు గురయ్యారు. ముఖద్వారం నుంచి ప్రకృతి అందాలను తిలకించి వెనుదిరిగారు. గెడ్డ ఉధృతి తగ్గనందున కలెక్టర్ ఆదేశాల మేరకు చాపరాయి జలవిహారిని మూసి వేసినట్టు నిర్వాహకులు తెలిపారు.
– దుంబ్రిగుడ



యాజమాన్య పద్ధతులు పాటించండి..
పంటలను కాపాడుకోండి..!

ఆంగ్రూ విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివ నారాయణ

సాక్షి, అమరావతి: అధిక వర్షాల కారణంగా ముంపునకు గురైన వివిధ దశల్లోని పంటలను యాజమాన్య పద్ధతులు పాటిస్తూ కాపాడుకోవాలని ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ రైతులకు ఒక ప్రకటనలో సూచించారు. ఆయన సూచించిన యాజమాన్య పద్ధతులు ఇవి..

వరి


- నారు దశలో ఉన్న పొలాలు నీట మునిగితే అవి త్వరగా పుంజుకోవడానికి 5 సెంట్ల నారు మడికి కిలో యూరియా, కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ పైపాటుగా వేయాలి.
- పిలకలు కట్టే దశలో పైరు నీటి ముంపునకు గురైతే, నీరు బయటకు తీసిన వెంటనే ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ పైపాటుగా వేయడం వల్ల పంట త్వరగా కోలుకుంటుంది. నష్టం కూడా చాలా వరకు తగ్గుతుంది.
- వాతావరణంలో అధిక తేమ ఉన్నప్పుడు అగ్గి, పాము పొడ తెగులు ఆశించే అవకాశం ఉంటుంది. అగ్గి తెగులు నివారణకు లీటరు నీటికి ట్రై సైక్లోజోల్ 0.6 గ్రా. లేదా కాసుగామైసిన్ 3 ఎల్. 2.0 మి.లీ. చొప్పున కలిపి పిచికారి చేయాలి. పాము పొడ తెగులు నివారణకు ప్రొపికొనజోల్ 1 మి.లీ. లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి దుబ్బు మొదలు తడిచేటట్లు 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.

పత్తి


- పత్తి పంటలో వర్షపు నీరు నిలబడితే పూత, పిందె, కాయలు రాలిపోతాయి. ఆకులు ఎర్రబడి వాడిపోయి రాలిపోతాయి. పొలంలో నిలబడి ఉన్న నీటిని తీసి వేసి ఎకరానికి 25–30 కిలోల యూరియా, 10–15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను అదనంగా వేయాలి. వర్షం తెరపిచ్చాక అవసరాన్ని బట్టి పొటాషియం నైట్రేట్ 20 గ్రా. లీటరు నీటికి కలిపి 7–10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.
- అధిక వర్షాల వలన పైరులో మెగ్నీషియం లోపం వలన ఆకులు ఎర్రబారి ఎండిపోయి రాలిపోతాయి. దీని నివారణకు మెగ్నీషియం సల్ఫేట్ లీటరు నీటికి 10 గ్రా. చొప్పున కలిపి 7–10 రోజుల వ్యవధిలో పైరుపై పిచికారి చేయాలి.
- పత్తిలో కాయ కుళ్ళు, ఆకుమచ్చ తెగుళ్ల ఆశించే అవకాశం ఉన్నందున, నివారణకు లీటరు నీటికి 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి పిచికారి చేయాలి.

మినుము


- పొలాల్లో అధికంగా నిలిచిపోయిన నీటిని బయటకు తీయాలి.
- అధిక వర్షాల్లో ఇనుము లోపం వచ్చే అవకాశం ఉంది. నివారణకు అన్నబేధి 5.0 గ్రా, నిమ్మ ఉప్పు 0.5 గ్రా. లీటరు నీటికి కలుపుకుని పిచికారి చేయాలి.
- ఒక వారం తర్వాత, 1 శాతం 19:19:19 లేదా 1–2 శాతం పొటాషియం నైట్రేట్లతో పిచికారి చేయాలి.
- ఈ దశలో వేరుకుళ్ళు, ఆకుమచ్చ తెగుళ్ళను నివారణకు లీటరు నీటికి హెక్సాకోనజోల్ 2 మి.లీ. లేదా ప్రొపికోనజోల్ 1 మి.లీ./ చొప్పున కలిపి పిచికారి చేయాలి.

కంది


- ప్రభావిత ప్రాంతాల్లోని పొలాల్లో అధికంగా నిలిచిన నీటిని బయటకు తీయాలి.
- పైరులో ఇనుము లోపాన్ని సరిచేయడానికి అన్నబేధి 5.0 గ్రా.,నిమ్మ ఉప్పు 0.5 గ్రా./ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.
- ఎక్కువగా ముంపునకు గురైన పొలాల్లో నీరు తగ్గిన వెంటనే ఎకరానికి 20 కిలోల యూరియా బూస్టర్ మోతాదుగా వేయడం వల్ల పంట ఎదుగుదల పుంజుకుని నష్టాన్ని తగ్గించవచ్చు.

వేరుశనగ


- సాధ్యమైన చోట పొలాల నుండి అదనపు నీటిని వెంటనే తీసివేయాలి.
- ఆకుమచ్చ తెగుళ్ళను నియంత్రణకు టెబ్యుకొనజోల్ 1 మి.లీ. లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. ఇనుము లోపాన్ని సవరించడానికి అన్నబేధి 5 గ్రా. + నిమ్మ ఉప్పు 0.5 గ్రా./లీటరు చొప్పున కలుపుకుని పిచికారి చేయాలి.

మొక్కజొన్న


- నిలిచిన నీటిని తీసివేసిన తర్వాత, పంటపై 2 శాతం యూరియా లేదా 1 శాతం పొటాషియం నైట్రేట్‌ను పిచికారి చేయడం వల్ల పంట త్వరగా కోలుకుంటుంది.
- అధిక తేమతో కాండంకుళ్ళు లేదా వేరుకుళ్ళు తెగులు, గింజ బూజు తెగులు రావడానికి అవకాశం ఉంది. ఈ తెగుళ్ళ నివారణకు లీటరు నీటికి కార్బెండజిమ్ 2–3 గ్రా. లేదా మెటాలాక్సిల్ 35 శాతం డబ్ల్యూ.ఎస్. 2 గ్రా. చొప్పున కలిపి పిచికారి చేయాలి.

ఇప్పుడు బాల్కనీలోనే... సౌర విద్యుత్

అందుబాటులోకి 'ప్లగ్ ఇన్' సౌర ఫలకలు

- సోలార్ రూఫ్ టాప్‌కు ప్రత్యామ్నాయ విధానం
- ఖర్చు తక్కువ... అమర్చడం, నిర్వహణ తేలిక
- సౌర విద్యుత్ వినియోగంలో సరికొత్త ట్రెండ్

సాక్షి, అమరావతి: కరెంటు బిల్లుల మోత నేపథ్యంలో పునరుత్పాదక ఇంధన వనరులను వినియోగించుకుని విద్యుత్ అవసరాలను తీర్చుకునే మార్గాల అన్వేషణ నిరంతరం జరుగుతోంది. ఆ క్రమంలోనే భానుడి కాంతి కిరణాలను విద్యుత్ శక్తిగా మార్చే సౌర ఫలకల వాడకం పెరుగుతోంది. అయితే విస్తరిస్తున్న పట్టణీకరణ కారణంగా వెలుస్తున్న బహుళ అంతస్తుల భవంతులపై సోలార్ రూఫ్ టాప్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసేందుకు పరిమితులు అడ్డంకులుగా మారుతున్నాయి. వివిధ అంతస్తుల్లో నివాసం ఉండే వారికి సౌర విద్యుత్ సరఫరా అందని ద్రాక్షగా మారుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు తాజాగా బాల్కనీలే వేదికగా 'ప్లగ్ ఇన్' సౌర ఫలకలు అందుబాటులోకి వస్తున్నాయి. ఖర్చు, అమర్చడం, నిర్వహణ పరంగా చూస్తే ఇవి సరికొత్త ట్రెండ్ సెట్టర్‌గా నిలుస్తున్నాయి.

సులువైన ప్రత్యామ్నాయం

విశాఖపట్నంలో ఓ హోటల్ యజమాని ఐదంతస్తుల భవనం మొత్తం గోడలను సౌర ఫలకలతో నింపేశారు. ఇది ఒక సోలార్ ప్యానెల్ ఎలివేషన్‌తో నిర్మాణం జరిగిన ఫుల్ ఎకో గ్రీన్ హోటల్. ప్లగ్ ఇన్ ప్యానెల్స్‌ను అపార్ట్‌మెంట్లు, భవనాల బాల్కనీలో ఏర్పాటు చేసుకుని నేరుగా ఇంటిలోని ఇన్వర్టర్‌కి ప్లగ్ చేసుకోవచ్చు. అంటే సౌర ఫలక నుంచి నేరుగా ఒకే ఒక వైరు ద్వారా విద్యుత్ సరఫరాను పొందవచ్చు. దీనికి ఎలాంటి ప్రభుత్వ, సాంకేతిక అనుమతులు కూడా అవసరం లేదు. బాల్కనీ పొడవును బట్టి, సౌర ఫలకలు అమర్చేందుకు ఉన్న వెసులుబాటును బట్టి, ఎన్ని ప్యానెళ్లు ఏర్పాటు చేసుకోగలిగితే అంత ఎక్కువ విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవచ్చు.



సూర్య కిరణాలే... భవన విద్యుత్ వెలుగులు

దేశం మొత్తం మీద వాడే విద్యుత్‌లో భవనాల్లో వినియోగం మూడవ వంతు కంటే ఎక్కువ. దేశ వ్యాప్తంగా 2027 నాటికి రూ.75,021 కోట్లతో సోలార్ రూఫ్ టాప్ సిస్టమ్‌లు కోటి ఇళ్లకు అమర్చాలనే లక్ష్యంతో కేంద్రం ప్రభుత్వం పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ పథకాన్ని 2024 ఫిబ్రవరిలో ప్రారంభించింది. 2024–25 కోసం రూ.13,175.33 కోట్లను కేటాయించింది. కానీ ఇప్పటి వరకూ కేవలం 16.15 లక్షల గృహాలపై మాత్రమే రూఫ్‌టాప్ పెట్టగలిగింది. అదే బాల్కనీలో ప్లగ్ ఇన్ సౌర ఫలకలు ఏర్పాటు చేయగలిగితే నగరాలు, పట్టణాల్లోని అన్ని అపార్ట్‌మెంట్లలో సౌర విద్యుత్ వెలుగులు విరజిమ్మే అవకాశం ఉంది.

క్లుప్తంగా...

సమన్వయంతోనే ఆర్థిక నేరాల కట్టడి

సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్

సాక్షి, అమరావతి: ఆర్థిక నేరాల కట్టడికి బ్యాంకులు, దర్యాప్తు సంస్థల మధ్య సమన్వయం ఉండాలని సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ పేర్కొన్నారు. సందేహాస్పద ఆర్థిక లావాదేవీలపై బ్యాంకు అధికారులు ఓ కన్నేసి ఉంచాలని, వాటి సమాచారాన్ని దర్యాప్తు సంస్థలకు ఎప్పటికప్పుడు అందించాలన్నారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థల అధికారులతో మంగళగిరిలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక నేరాల కేసుల దర్యాప్తునకు బ్యాంకులు, ఆర్థిక సంస్థలు సత్వరం సహకరించాలన్నారు. కేసుల దర్యాప్తులో కీలకమైన సీసీటీవీ ఫుటేజీలను సక్రమంగా భద్రపరచాలని సూచించారు.

కేంద్ర ఆర్థిక మంత్రితో నేడు సీఎం భేటీ

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు గురువారం ఢిల్లీ వెళ్లారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయి, రాష్ట్రానికి ఆర్థిక సాయం కోరనున్నారు. సాయంత్రం 5 గంటలకు ఢిల్లీలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఎకనమిక్ టైమ్స్ నిర్వహించే వరల్డ్ లీడర్స్ ఫోరం సదస్సుకు ఆయన హాజరవుతారు. అదేరోజు రాత్రి ఢిల్లీ నుంచి అమరావతికి తిరుగు ప్రయాణమవుతారు.

ఏపీఎం టెర్మినల్స్‌కు పోర్టుల్లో కార్గో హ్యాండ్లింగ్ బాధ్యతలు

అవగాహనా ఒప్పందంపై సంతకాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా అభివృద్ధి చేస్తున్న పోర్టుల్లో కార్గో నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం ఏపీ మోలర్ మేర్స్క్ అనుబంధ సంస్థ ఏపీఎం టెర్మినల్స్‌కు అప్పగించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో ఏపీ మారిటైమ్ బోర్డు– ఏపీఎం టెర్మినల్స్ సంస్థల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టుల్లో ఆధునిక టెర్మినల్స్, కార్గో హ్యాండ్లింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేసి నిర్వహణకు పెట్టుబడులు పెట్టనుంది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, దేశీయ మార్కెట్‌లో సరకు రవాణాకు ఏపీఎం టెర్మినల్స్ సేవలు ఉపకరించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఏపీఎం టెర్మినల్స్ ప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.

సమస్యలు పరిష్కరించుకుంటే ఆందోళన ఉధృతం

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్వాడీలు మానవహారం

బీచ్‌రోడ్డు (విశాఖ): సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని అంగన్‌వాడీ వర్కర్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ఆందోళనలో భాగంగా గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విశాఖలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నల్ల రిబ్బన్‌లు ధరించి మానవహారం నిర్వహించారు. అనంతరం తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని గాంధీ విగ్రహానికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) జిల్లా కార్యదర్శి ఎం. వెంకటలక్ష్మి మాట్లాడుతూ.. వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాట్యుటీ, ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు కల్పించకుండా, రోజురోజుకు పనిభారం పెంచుతూ దేశవ్యాప్తంగా అంగన్‌వాడీ టీచర్లను, ఆయాలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో జాతీయ, రాష్ట్ర ప్రభుత్వాలకు, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చి చర్చించినప్పటికీ, నేటికీ ప్రధానమైన వేతనాల పెంపు, గ్రాట్యుటీ సవరణ, సంక్షేమ పథకాల అమలు, యాప్‌ల సవరణ, వేసవి సెలవులు, ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకం పనిని తమకు నిలిపివేయడం వంటి ప్రధాన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, జూలై నెలలోనే ప్రిన్సిపల్ సెక్రటరీకి యాప్ సమస్యలన్నీ వివరించినప్పటికీ, పరిష్కరించనందున ఆగస్టు 4వ తేదీన మొబైల్స్ అన్నింటినీ ఆయా ఐసీడీఎస్ కార్యాలయాల్లో తిరిగి ఇచ్చేశామని తెలిపారు. చాలీచాలని వేతనాలతో పనిభారం మోస్తున్న అంగన్‌వాడీలకు ప్రభుత్వ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.



నిరసన చేస్తున్న అంగన్వాడీ వర్కర్స్

10 గ్రాముల బంగారు కోసం వృద్ధురాలి హత్య

తిరుపతి క్రైమ్: 10 గ్రాముల బంగారం కోసం ఓ వృద్ధురాలిని హత్య చేసిన ఘటన తిరుపతిలో గురువారం వెలుగులోకి వచ్చింది. తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం, అలిపిరి సీఐ రామకిషోర్ తెలిపిన వివరాల మేరకు.. సీపీఆర్ అర్బన్ డెవలప్‌మెంట్ బ్లాక్ నెంబర్ 'సి' లో నివాసముంటున్న షణ్ముగం గత కొంతకాలంగా పక్షవాతంతో మంచానికి పరిమితమయ్యాడు. ఆయన కుమారుడు శివానందన్ హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. షణ్ముగం అనారోగ్యంతో ఉండడంతో ఆయన చెల్లెలు ధనలక్ష్మి (73) గత కొంతకాలంగా అన్న వద్దనే ఉంటోంది. షణ్ముగం కోసం కుమారుడు శివానందన్ విజయవాడకు చెందిన రవి అనే కేర్‌టేకర్ నియమించాడు. అతనికి ప్రతి నెల 22 వేలు జీతంతో పాటు ఇంటి వద్దనే ఉండి, భోజన వసతులు సమకూర్చాడు. రవి దృష్టి ధనలక్ష్మి చెవిలో ఉన్న 10 గ్రాముల కమ్మలపై పడింది. బుధవారం రాత్రి సమయంలో కత్తితో వృద్ధురాలు ధనలక్ష్మి గొంతుకోసి ఆమె చెవిలో ఉన్న కమ్మలను లాక్కొని పరారైపోయాడు. పక్షవాతంతో ఉన్న షణ్ముగం ఏమీ చేయలేని పరిస్థితిలో ఉండిపోయాడు. ఉదయం విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి వేలిముద్రలను సేకరించారు. ఇంట్లో వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. ప్రస్తుతం రవి పరారీలో ఉన్నాడని త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

ప్యాకేజీ ఇచ్చేయండి సార్.. వెళ్లిపోతాం

పునరావాస కేంద్రంలో వరద బాధితులు

కూనవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా): మాకీ బాధలు వద్దు సార్... వెళ్లిపోయి కలోగంజో తాగిబతుకుతాం అంటు అల్లూరి జిల్లా ఉదయ్‌భాస్కర్ కాలనీ వరద బాధితులు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ వద్ద తమగోడు వెళ్లబోసుకున్నారు. గత వారం రోజుల నుంచి ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు శబరి, గోదావరి నదులకు వరద పోటెత్తడంతో కూనవరంలోని ఉదయ్ భాస్కర్ కాలనికి చెందిన 120 కుటుంబాలను ముందస్తు చర్యల్లో బాగంగా టేకులబోరులోని మెరక ప్రదేశమైన గిరిజన బాలబాలికల ఆశ్రమ పాఠశాలకు తరలించి పునరావాసం కల్పించారు. అలాగే గిన్నెల బజారుకు చెందిన 49 కుటుంబాలను స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో పునరావాసం ఏర్పాటు చేశారు. శబరి కొత్త గూడెంలో 8 కుటుంబాలకు మెరకప్రదేశాలకు తరలించారు. కాగా టేకులబోరు, గిన్నెలబజార్ కేంద్రలను కలెక్టర్ దినేష్ కుమార్ గురువారం సందర్శించి వారికి అందిస్తున్న నిత్యావసరాలను పరిశీలించారు. ఈనేపద్యంలో వరద బాదితులు తమ బాధలను కలెక్టర్‌కు చెప్పుకున్నారు. కలెక్టర్ స్పందిస్తూ ఈఏడాది ఓపికపట్టండి వచ్చే సంవత్సరం తప్పనిసరిగా ప్యాకేజీ ఇచ్చి పంపిస్తాం అన్నారు. ఇప్పటికే 16 గ్రామాల్లో ఆర్ అండ్ఆర్ వెరిఫికేషన్‌లు పూర్తి అయ్యాయని, స్థల సేకరణ ప్రక్రియ సైతం వేగవంతంగా జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో రంపచోడవరం ఐటీడీఏ పీఓ శుభం నోఖ్వాల్, ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా,ఎస్‌డీసీ అంబేడ్కర్, తహసీల్దార్ కె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


టేకులబోరు పునరావాస కేంద్రంలో వరద బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

26 ఎర్రచందనం దుంగలు స్వాధీనం


ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసిన తిరుపతి టాస్క్‌ఫోర్స్ బృందం

కొమరోలు : తిరుపతి టాస్క్‌ఫోర్స్ బృందం ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి 26 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లుగా కడప సబ్ కంట్రోల్ ఆర్ఎస్ఐ నరేష్ తెలిపారు. ప్రకాశం జిల్లా కొమరోలు మండలంలోని గుంతపల్లె బీట్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ బృందం కూంబింగ్ చేపట్టింది. ఈ క్రమంలో ముగ్గురు అనుమానాస్పదంగా సంచరిస్తూ టాస్క్‌ఫోర్సు బృందాన్ని చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. విచారణలో గుంతపల్లె అటవీ ప్రాంతంలోని కల్వర్టు కింద 26 ఎర్రచందనం దుంగలను ఉంచినట్లుగా తెలిపారు. టాస్క్‌ఫోర్స్ బృందం 26 ఎర్రచందనం దుంగలను, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకొని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసుస్టేషన్‌కు తరలించినట్లుగా తెలిపారు. ఎర్రచందనం దుంగల విలువ రూ.25 లక్షలు ఉంటుందని అధికారులు వెల్లడించారు.

ఏసీబీకి చిక్కిన వీఆర్వో

వేపాడ: విజయనగరం జిల్లా వేపాడ మండలం శింగరాయి వీఆర్వో కె.సత్యవతి ఏసీబీ వలకు చిక్కారు. తన రెవెన్యూ పరిధిలో ఒక రైతు అనుభవంలో ఉన్న శింగరాయి, గుడివాడ భూములకు మ్యుటేషన్ దరఖాస్తు చేశారు. ఇందుకోసం వీఆర్వో సత్యవతి సంబంధిత రైతు నుంచి రూ.లక్షా 70వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధిత రైతు ఏసీబీని ఆశ్రయించడంతో ఏసీబీ డీఎస్పీ ఎస్.రమ్య ఆధ్వర్యంలో అధికారులు గురువారం సాయంత్రం వేపాడ సమీపంలో కళ్లాల వద్ద ఫిర్యాదుదారి నుంచి రూ.లక్ష నగదు తీసుకుంటుండగా పట్టుకున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులపై ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పెత్తనమా?

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అబ్దుల్ రజాక్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థపై పూర్తి స్థాయి పర్యవేక్షణ కోసం మూడంచెల వ్యవస్థ పేరిట ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పెత్తనం అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ గురువారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగానే సచివాలయాలను పర్యవేక్షించే మండల, జిల్లా స్థాయి కార్యాలయాల్లో పనిచేసేందేకు 1,785 మంది సిబ్బందిని డిప్యుటేషన్, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించేందుకు కేబినెట్ నిర్ణయం తీసుకోవడం అనాలోచిత చర్య అని ఆయన పేర్కొన్నారు. ఆరేళ్లుగా గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వాలనే కనీస ఆలోచన కూడా ప్రభుత్వానికి లేదన్నారు. సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోగా కొత్త సమస్యలను సృష్టిస్తోందని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులైన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను పర్యవేక్షించడానికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఎలా నియమిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అర్హులైన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకే పదోన్నతులు కల్పించి మండల, జిల్లా స్థాయి సచివాలయ ప్రధాన కార్యాలయాల్లో ఖాళీలను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కొత్తగా 1,785 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించడం ప్రభుత్వానికి అదనపు ఆర్థిక భారమన్నారు. వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శుల నుంచి ఎడ్యుకేషన్ అనే విభాగాన్ని తొలగించి ఇతర ఉద్యోగులకు కేటాయించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.



శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని 25 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 75,688 మంది స్వామిని దర్శించుకున్నారు. 29,099 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.45 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 15 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనమవుతోంది.

30, 31న తిరుమల నంబి అవతార మహోత్సవాలు


తిరుమల: ప్రముఖ వైష్ణవాచార్యులు శ్రీ తిరుమలనంబి 1052వ అవతార మహోత్సవాన్ని ఆగస్టు 30, 31వ తేదీల్లో తిరుమలలోని దక్షిణ మాడ వీధిలోని తిరుమల నంబి ఆలయంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తిరుమలనంబి ఆలయంలో 16 మంది ప్రముఖ పండితులు శ్రీ తిరుమల నంబి జీవిత చరిత్రపై ఉపన్యసించనున్నారు. శ్రీవారి భక్తాగ్రేసరులలో ఒకరైన తిరుమలనంబి వేంకటేశ్వర స్వామివారికి తీర్థ కైంకర్యం ప్రారంభించారు. వీరు భగవద్రామానుజుల వారికి స్వయాన మేనమామ, గురుతుల్యులు. వీరు రామానుజుల వారికి రామాయణ పఠనం చేశారని పురాణాల ద్వారా తెలుస్తోంది.

నేత్రపర్వం.. నారసింహుని శాంతి కల్యాణం



ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ఐఎస్ జగన్నాధపురంలోని శ్రీ కనకవల్లి సమేత లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో దివ్య పవిత్రోత్సవాల ముగింపును పురస్కరించుకుని గురువారం విశేష కార్యక్రమాలు జరిగాయి. ద్వారకాతిరుమలలో గల శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయంగా ఉన్న ఈ ఆలయంలో స్వామివారి శాంతి కల్యాణం, గరుడ వాహన సేవ, పవిత్రావరోహణ, మహా పూర్ణాహుతి వేడుకలు కనులపండువగా నిర్వహించారు.

కనులపండువగా శివయ్యకు రుద్రాభిషేకం



ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలలోని శ్రీవారి ఆలయ క్షేత్రపాలకునిగా విరాజిల్లుతున్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో శివదేవునికి ఏకాదశ రుద్రాభిషేకాన్ని గురువారం నేత్రపర్వంగా నిర్వహించారు. మాసశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ వేడుకను వైభవంగా జరిపారు. అర్చకులు, పండితులు గర్భాలయంలో కొలువైన శివదేవునికి వేద మంత్రోచ్ఛరణలతో రుద్రాభిషేకాన్ని జరిపి, హారతులిచ్చారు.

సాక్షి సినిమా

యాక్షన్ షురూ

రీ ఎంట్రీకి రెడీ అయిన స్టార్స్

'యాక్టింగ్ అనేది ఎడిక్షన్'లాంటిది అని చాలామంది స్టార్స్ అంటుంటారు. అందుకే లైట్స్ ఆన్, స్టార్ట్ కెమెరా, టేక్... ఈ మాటలకు దూరం కావాలని అనుకోరు. అవకాశాలు వచ్చినంతవరకు, ఓపిక ఉన్నంతవరకు నటించాలనుకుంటారు. అఫ్ కోర్స్ కొంతమంది సినిమాలకు దూరంగా వెళ్లిపోతారనుకోండి. అయితే ఆ సంఖ్య చాలా తక్కువగా ఉంటుంది. ఇక వ్యక్తి గత కారణాల వల్ల సిల్వర్ స్క్రీన్‌కి దూరమై, ఆ తర్వాత పరిస్థితులు అనుకూలించినప్పుడు రీ ఎంట్రీకి రెడీ అయిపోతారు కొందరు స్టార్స్. అలా ఈ ఏడాది ఇప్పటికే ఒకప్పటి కథానాయికలు తెరపై క్యారెక్టర్ ఆర్టిస్ట్‌లుగా రీ ఎంటర్ అయ్యారు. మరికొందరు స్టార్స్ 'యాక్షన్ షురూ' అంటూ రీ ఎంట్రీకి రెడీ అయిపోయారు. ఆ విశేషాలు తెలుసుకుందాం.



● 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు'లో వడ్డే నవీన్

తొమ్మిదేళ్ల తర్వాత...

వడ్డే నవీన్ పేరు తలచుకోగానే 20 ఏళ్ల క్రితం నాటి ప్రేక్షకులకు గుర్తొచ్చే పాట 'జాబిలమ్మ నీకు అంత కోపమా...'. నవీన్ హీరోగా నటించిన రెండో చిత్రం 'పెళ్లి'లోని పాట ఇది. ఈ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. నిజానికి 'క్రాంతి' అనే సినిమా ద్వారా నవీన్ హీరోగా పరిచయం కావాల్సింది. అయితే ఆ సినిమా ఆగిపోవడంతో 'కోరుకున్న ప్రియుడు' (1996) ద్వారా హీరోగా సిల్వర్ స్క్రీన్‌కి పరిచయం అయ్యారు. ఆ తర్వాత 2016 వరకూ హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా చేశారు. అది కూడా 2010 తర్వాత ఆరేళ్లకు 'ఎటాక్' (2016) చిత్రంలో విలన్‌గా నటించారు నవీన్. ఇప్పుడు తొమ్మిదేళ్లకు 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' చిత్రంతో మళ్లీ వెండితెరపై కనిపించనున్నారు. కాగా గతంలో వడ్డే నవీన్ తండ్రి వడ్డే రమేశ్ నిర్మాతగా పలు విజయవంతమైన చిత్రాలు నిర్మించారు. ఇప్పుడు రీ ఎంట్రీలో వడ్డే క్రియేషన్స్ బేనర్ ఆరంభించి, టైటిల్ రోల్ చేయడంతో పాటు 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' చిత్రాన్ని నిర్మిస్తున్నారు వడ్డే నవీన్. కమల్ తేజ నార్ల దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది.



● అబ్బాస్

'ప్రేమ దేశం' హీరో ఎంట్రీ

'ప్రేమ దేశం' (1996) ఎవర్ గ్రీన్ లవ్‌స్టోరీ మూవీ. ఈ సినిమాలో హీరోలుగా నటించిన వినీత్, అబ్బాస్ కెరీర్స్‌కి బ్లాక్ బస్టర్ మూవీ ఇదే అని చెప్పొచ్చు. ఇక హీరోయిన్ టబుకి ఈ సినిమా స్పెషల్. ఇప్పుడు ఈ సినిమా గురించి ఎందుకూ అంటే... ఈ చిత్రం తర్వాత పలు చిత్రాల్లో నటించిన అబ్బాస్ 2014లో 'అలా జరిగింది ఒక రోజు' సినిమా తర్వాత తెలుగులో కనిపించలేదు. అటు తమిళ్, మలయాళం వంటి ఇతర భాషల్లోనూ సినిమాలు చేయలేదు. ఇప్పుడు పదకొండేళ్లకు అబ్బాస్ రెండు తమిళ చిత్రాలు అంగీకరించారు. ఒకటి శివ కార్తికేయన్ హీరోగా నటిస్తున్న 'పరాశక్తి', మరొకటి జీవీ ప్రకాశ్ కుమార్ హీరోగా రూపొందుతున్న సినిమా. ఇలా రీ ఎంట్రీలో రెండు సినిమాలు అంగీకరించిన అబ్బాస్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా బిజీ అవుతారని ఊహించవచ్చు.



● 'బుల్లెట్టు బండి'లో డిస్కో శాంతి



● రంభ

కమ్‌బ్యాక్‌లోనూ హీరోయిన్‌గా...

2002లో ప్రభాస్ హీరోగా పరిచయమైన 'ఈశ్వర్' చిత్రం ద్వారానే హీరోయిన్‌గా పరిచయం అయ్యారు ప్రముఖ క్యారెక్టర్ నటుడు విజయ్‌కుమార్ కుమార్తె శ్రీదేవి. ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించిన శ్రీదేవి 'వీర' (2011) సినిమా తర్వాత టాలీవుడ్‌లో కనిపించలేదు. వేరే భాషల్లోనూ సినిమాలు చేయలేదు. కన్నడంలో మాత్రం 2016లో 'లక్ష్మణ' చిత్రంలో నటించారు. ఇక ఈ ఏడాది 'సుందరకాండ' చిత్రంతో శ్రీదేవి తెలుగు తెరపై మళ్లీ కనిపించనున్నారు. నారా రోహిత్ హీరోగా వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. అయితే విశేషం ఏంటంటే... ఈ కమ్‌బ్యాక్‌లోనూ ఆమె హీరోయిన్‌గానే నటించారు. ఇక మధ్యలో సినిమాలకు బ్రేక్ తీసుకోవడానికి కారణం పెళ్లి. 2009లో నిజామాబాద్‌కి చెందిన వ్యాపారవేత్త రాహుల్‌తో శ్రీదేవి పెళ్లి జరిగింది. ఆ తర్వాత పాప పుట్టింది. పాపని చూసుకోవడానికి సినిమాలకు బ్రేక్ తీసుకున్న శ్రీదేవి టీవీ షోస్‌లో మాత్రం కనిపించారు. ఇక వరుసగా సినిమాల్లోనూ నటించాలనుకుంటున్నారు.

28 ఏళ్లకు...

'బంగారు కోడి పెట్ట వచ్చెనండి'... పాట ఇప్పటికీ పాపులర్. 'ఘరానా మొగుడు' (1992) సినిమాలోని ఈ స్పెషల్ సాంగ్‌కి చిరంజీవితో కలిసి డిస్కో శాంతి వేసిన స్టెప్స్ మాస్‌ని ఓ రేంజ్‌లో ఉర్రూతలూగించాయి. స్పెషల్ సాంగ్స్‌లో శాంతి ఎనర్జిటిక్ డ్యాన్స్ ఆమెకు 'డిస్కో' శాంతి అని పేరు తెచ్చింది. డిస్కో డ్యాన్స్ అదరగొట్టిన శాంతి పలు చిత్రాల్లో కొన్ని కీలక పాత్రలు కూడా చేశారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ... ఇలా పలు భాషల్లో దాదాపు 900 చిత్రాలు చేశారు శాంతి. 1996లో నటుడు శ్రీహరిని పెళ్లి చేసుకున్న తర్వాత ఆమె సినిమాలకు ఫుల్‌స్టాప్ పెట్టారు. 1997 తర్వాత ఆమె తెరపై కనిపించలేదు. ఇద్దరు కుమారుల ఆలనా పాలనా చూసుకుంటూ శ్రీహరితో చక్కని జీవితాన్ని చవి చూశారు శాంతి. 2013లో శ్రీహరి చనిపోయాక బయట కనిపించడం మానేశారామె. ఇప్పుడు 28 ఏళ్లకు మళ్లీ సిల్వర్ స్క్రీన్‌పై కనిపించనున్నారు శాంతి. లారెన్స్, ఆయన తమ్ముడు ఎల్విన్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న 'బుల్లెట్ బండి' చిత్రంలో శాంతి ఓ కీలక పాత్ర చేస్తున్నారు. ఈ చిత్రంలో ఆమె జోస్యం చెప్పే పాత్రలో కనిపిస్తారని టీజర్ స్పష్టం చేస్తోంది. ఇన్నాసి పాండియన్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని కదిరేశన్ నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నారు.



● 'చిమ్నీ'లో సమీరా రెడ్డి

పుష్కరకాలం పూర్తయ్యాక...

'నరసింహుడు, జై చిరంజీవ, అశోక్' వంటి చిత్రాల్లో కథానాయికగా నటించి, 'కృష్ణం వందే జగద్గురుమ్' (2012)లో స్పెషల్ సాంగ్ చేశారు సమీరా రెడ్డి. ఆ తర్వాత తెలుగులో కనిపించలేదు. ఎక్కువగా హిందీ చిత్రాల్లో నటించిన సమీరా 2013లో చేసిన కన్నడ చిత్రం 'వరదనాయక' తర్వాత పూర్తిగా సిల్వర్ స్క్రీన్‌కి దూరం అయ్యారు. 2014లో అక్షయ్ వర్దేని పెళ్లి చేసుకుని, ఒక బాబు, పాపకి జన్మనిచ్చారామె. కుటుంబం కోసం నటనకు కాస్త బ్రేక్ ఇచ్చారు. పిల్లలు కాస్త పెద్దవాళ్లు కావడం, సమీరా గతంలో నటించిన 'రేస్' మూవీ చూసి, ఆమె కుమారుడు ఎందుకు సినిమాలు చేయడంలేదని అడగడంతో ఆమె రీ ఎంట్రీకి రెడీ అయ్యారు. ప్రస్తుతం హిందీలో 'చిమ్నీ' అనే హారర్ థ్రిల్లర్ మూవీలో నటిస్తున్నారు సమీరా. పుష్కర కాలం పూర్తయ్యాక కెమెరా ముందుకు రావడం ఏదో కొత్తగా అనిపించిందని, టెక్నాలజీలో, సినిమా టేకింగ్‌లో వచ్చిన మార్పులు స్పష్టంగా కనిపించాయని సమీరా పేర్కొన్నారు. 'చిమ్నీ'లో తన కుమార్తెను ఆవహించిన దుష్ట శక్తితో పోరాడి, కాపాడుకునే కాళీ అనే తల్లి పాత్ర చేస్తున్నారు సమీరా. కాగా ఈ చిత్రంలో సమీరా యువ పెళ్లికూతురు, తల్లి, 60 ఏళ్ల వృద్ధురాలు... ఇలా మూడు షేడ్స్ ఉన్న పాత్రలో కనిపిస్తారు. కమ్‌బ్యాక్‌కి ఇది సరైన పాత్ర అని భావిస్తున్నారామె. గగన్ పురి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ఈ ఏడాది చివర్లో విడుదల కానుంది. ఇదిలా ఉంటే... గత ఏడాది సమీరా రెడ్డి 'నామ్' అనే హిందీ చిత్రంలో కనిపించారు. అయితే 2004లో షూటింగ్ ముగించుకున్న ఈ చిత్రం పలు సమస్యల వల్ల 20 ఏళ్లకు విడుదలైంది.



● శ్రీదేవి విజయ్ కుమార్

ముందుగా చిన్ని తెరపై...

1990లలో హీరోయిన్‌గా పరిచయమై దాదాపు పదేళ్లకు పైగా గ్లామరస్ స్టార్‌గా ఓ వెలుగు వెలిగారు రంభ. ప్రత్యేక పాటల్లోనూ ఆమె ఆకట్టుకున్నారు. 2008 తర్వాత తెలుగులో, 2010 తర్వాత తమిళంలో బ్రేక్ తీసుకున్నారు రంభ. కెనడాలో స్థిరపడ్డ శ్రీలంకన్ తమిళ వ్యాపారవేత్త ఇంద్రకుమరన్‌ని 2010లో ప్రేమ వివాహం చేసుకున్నారు రంభ. ఆ తర్వాత భర్తతో కలిసి టొరెంటోలో సెటిలయ్యారామె. ఈ దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. పిల్లల కోసం కెరీర్‌కి బ్రేక్ ఇచ్చిన రంభ ఇప్పుడు రీ ఎంట్రీకి రెడీ అయ్యారు. అయితే పెద్ద తెరపై కనిపించే ముందు చిన్ని తెరపై గెస్ట్‌గా కనిపించారామె. జీ తెలుగులో ప్రసారమైన ఓ రియాలిటీ షోలో అతిథిగా మెరిశారు రంభ. ఆ షోలో దక్కిన ఆదరణ చూసి తనకు చాలా ఆనందం అనిపించిందని ఇటీవల ఓ సందర్భంలో పేర్కొన్నారామె. పిల్లలు పెద్దవాళ్లు కావడంతో మళ్లీ కెమెరా ముందుకు రావాలనుకుంటున్నానని మనసులో మాటని బయటపెట్టారు. కాగా.. రంభకు కొన్ని ఆఫర్స్ కూడా ఉన్నాయట. రీ ఎంట్రీలో తాను చేయనున్న తొలి సినిమా గురించి అధికారికంగా ప్రకటిస్తానని అంటున్నారామె. మరి... తెలుగు అమ్మాయి రంభ ఎంట్రీ తెలుగు చిత్రంతోనా లేక వేరే భాషలోనా? అనేది వేచి చూడాల్సిందే.

ఒకప్పటి తారలు కొంత బ్రేక్ తర్వాత మళ్లీ తెరపై కనిపిస్తే వారి అభిమానులకు మాటల్లో చెప్పలేనంత ఆనందం కలగడం సహజం. ఈ స్టార్స్ రీ ఎంట్రీ పట్ల ఫ్యాన్స్ ఖుషీగా ఉన్నారు. ఈ తారలు మాత్రమే కాదు... ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన మరికొందరు స్టార్స్ కూడా రీ - ఎంట్రీకి రెడీ అవుతున్నారు.

– డి.జి.భవాని



● అర్చన



● రాశి

● అర్చన పేరు వినగానే 1980–1990ల ప్రేక్షకులకు తులసి అనే గిరిజన యువతి గుర్తొస్తుంది. 'నిరీక్షణ' చిత్రంలో అర్చన ఆ పాత్రలో ఎంతలా ఒదిగిపోయారో చూసినవాళ్లకు తెలుసు. ఈ సహజ నటి తెలుగు తెరపై కనిపించి, 2022కి దాదాపు పాతికేళ్లయింది. 'చోర్ బజార్' (2022) చిత్రంతో క్యారెక్టర్ నటిగా ఎంట్రీ ఇచ్చి, ఆ తర్వాత మూడేళ్లకు ఈ ఏడాది 'షష్టిపూర్తి' చిత్రంలో రాజేంద్రప్రసాద్‌కి జోడీగా నటించారామె. విశేషం ఏంటంటే... 37 ఏళ్ల తర్వాత రాజేంద్రప్రసాద్–అర్చన కలిసి నటించిన చిత్రం ఇది. హిట్ మూవీ 'లేడీస్ టైలర్'లో జంటగా నటించిన ఈ ఇద్దరూ మళ్లీ 'షష్టిపూర్తి'లో నటించారు.

● దాదాపు పదేళ్లకు ఈ ఏడాది రాశి వెండితెరపై కనిపించిన చిత్రం 'ఉసురే'. తమిళ్, తెలుగు భాషల్లో విడుదలైన ఈ సినిమా ప్రేక్షకుల్లో పెద్దగా ప్రభావం చూపించలేకపోయింది. ఈ సినిమాలో కనిపించక ముందు 2020 నుంచి 2023 వరకూ రాశీ 'గిరిజా కల్యాణం', 'జానకి కలగనలేదు' సీరియల్స్‌లో నటించారు.

● 'గుండెల్లో ఏముందో...' అంటూ 'మన్మథుడు' (2002) లో ఓ కథానాయికగా నాగార్జునతో ఆడి పాడిన అన్షు అప్పట్లో చాలా పాపులర్ అయ్యారు. అయితే ఆ తర్వాత రెండు మూడు చిత్రాల్లో నటించి, విదేశాలకు వెళ్లిపోయారు. 23 ఏళ్లకు మళ్లీ ఆమె సిల్వర్ స్క్రీన్‌పై కనిపించిన చిత్రం 'మజాకా'. సందీప్ కిషన్ హీరోగా రూపొందిన ఈ చిత్రం ఆశించిన ఫలితం ఇవ్వకపోవడంతో అన్షు రీ ఎంట్రీ హాట్ టాపిక్ కాలేదు.

2025లో రీ ఎంట్రీ అయిన తారలు వీరే

● హోమ్లీ హీరోయిన్ లయకి కూడా రీ ఎంట్రీ పెద్దగా కలిసి రాలేదు. దాదాపు 20 ఏళ్లకు 'తమ్ముడు' సినిమాతో ఆమె రీ ఎంట్రీ జరిగింది. ఈ చిత్రంలో హీరో నితిన్‌కి అక్కగా నటించారు లయ. ఈ చిత్రం అంచనాలు అందుకోలేపోయింది.

● ఇక 'బొమ్మరిల్లు' చిత్రంలో చేసిన పాత్ర పేరు (హాసిని)తో ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోయిన జెనీలియా ఈ ఏడాది తెలుగులో 'జూనియర్' చిత్రంతో పదమూడేళ్లకు మళ్లీ తెరపై కనిపించారు. ఈ సినిమా కూడా అంచనాలు అందుకోలేకపోయింది. అటు బాలీవుడ్‌లో కీలక పాత్రలు చేస్తున్నారు జెనీలియా.

ఇలా రీ ఎంట్రీలో ఒకప్పటి ఈ ఐదుగురు కథానాయికలు క్యారెక్టర్ ఆర్టిస్టులుగా కనిపించి, తమ నటనతో ఆకట్టుకున్నారు. అయితే ఈ నలుగురూ చేసిన సినిమాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడం ఓ చేదు అనుభవంగా చెప్పొచ్చు.



● అన్షు



● లయ



● జెనీలియా

లడఖ్‌లో బ్యాటిల్ ఆఫ్ గాల్వాన్



● సల్మాన్ ఖాన్

సల్మాన్‌ఖాన్ హీరోగా నటిస్తున్న తాజా హిందీ చిత్రం 'బ్యాటిల్ ఆఫ్ గాల్వాన్'. ఈ సినిమాలో నటి చిత్రాంగద సింగ్ కథానాయికగా నటిస్తున్నారు. అపూర్వ లఖియా దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ మూవీని సల్మాన్‌ఖాన్ ఫిల్మ్స్ పతాకంపై సల్మాన్‌ఖాన్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో సల్మాన్‌ఖాన్ ఆర్మీ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నారు. గాల్వాన్ లోయలో 2020లో భారత్–చైనా సరిహద్దుల్లో జరిగిన ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ లడఖ్‌లో ప్రారంభమైంది. ఈ విషయాన్ని అపూర్వ లఖియా సోషల్ మీడియా వేదికగా ధ్రువీకరించారు. సల్మాన్‌ఖాన్ పాల్గొనగా యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారని తెలిసింది. 'బ్యాటిల్ ఆఫ్ గాల్వాన్'ని వచ్చే గణతంత్ర దినోత్సవం సందర్భంగా రిలీజ్ చేయాలనుకుంటున్నారట మేకర్స్.

బిజినెస్ రీల్

ర్యాపిడోకి సీసీపీఏ రూ. 10 లక్షల జరిమానా



న్యూఢిల్లీ: తప్పుదోవ పట్టించే ప్రకటనలు, అనుచిత వ్యాపార విధానాలకు గాను రైడ్ సేవల సంస్థ ర్యాపిడోకి వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ సీసీపీఏ రూ. 10 లక్షల జరిమానా విధించింది. '5 నిమిషాల్లో ఆటో లేదా రూ. 50 పొందండి ' ఆఫర్ కింద పరిహారం లభించని కస్టమర్లకు రీయింబర్స్ చేయాలని కూడా ఆదేశించింది. దీనితో పాటు 'గ్యారంటీడ్ ఆటో' ఆఫర్ ప్రకటనలను కూడా పరిశీలించిన సీసీపీఏ, ఇవి వినియోగదారులను తప్పుదోవ పట్టించే తప్పుడు అడ్వర్టైజ్‌మెంట్లుగా నిర్ధారించింది. హామీ ఇచ్చినట్లుగా రూ. 50 డబ్బు రూపంలో కాకుండా రూ. 50 వరకు విలువ చేసే ర్యాపిడో కాయిన్ల రూపంలో లభిస్తాయన్న విషయాన్ని చాలా చిన్నని, చదవడానికి అనువుగా లేని ఫాంట్లలో కంపెనీ డిస్‌ప్లే చేసిందని సీసీపీఏ విచారణలో తేలింది. పైపెచ్చు ఆ మొత్తాన్ని బైక్ రైడ్స్ కోసమే వినియోగించుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ ఏడు రోజుల వ్యవధిలో ఉపయోగించుకోకపోతే కాలపరిమితి తీరిపోతుంది. అంతేగాకుండా ఈ హామీ బాధ్యతను కంపెనీ తన మీద పెట్టుకోకుండా వ్యక్తిగత డ్రైవర్ల మీదకు నెట్టేసినట్లు విచారణలో తేలింది. నేషనల్ కన్జూమర్ హెల్ప్‌లైన్ డేటా ప్రకారం 2024 జూన్ నుంచి 2025 జూలై మధ్య కాలంలో ర్యాపిడోపై ఫిర్యాదులు 1,224కి ఎగిశాయి. అంతక్రితం 14 నెలల వ్యవధిలో 575 కంప్లైంట్లు నమోదయ్యాయి.

5 ఏళ్ల వారంటీతో కెన్‌స్టార్ కూలర్స్



ముంబై: విద్యుత్‌ను మరింతగా ఆదా చేసే 5 స్టార్ బీఈఈ రేటెడ్ ఎయిర్ కూలర్ల శ్రేణిని దేశీయంగా తొలిసారి ప్రవేశపెట్టినట్లు కెన్‌స్టార్ సీఈవో సునీల్ జైన్ తెలిపారు. వీటికి అయిదేళ్ల వారంటీనిస్తున్నట్లు వివరించారు. అత్యుత్తమ సామర్థ్యంతో, దీర్ఘకాలం పని చేసేలా వీటిలో బీఎల్‌డీసీ మ్యాక్స్, క్వాడ్రా ఫ్లో తదితర టెక్నాలజీలు, హెవీ డ్యూటీ డబుల్ బాల్ బేరింగ్ మోటర్ మొదలైన ఫీచర్లు ఉన్నాయని చెప్పారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-8-2025

విశాఖ	520-00
చిత్తూరు	553-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	520-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	495-00
వరంగల్	497-00
రిటైల్ ధర	5.55

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
CIPLA	1,593.90	3.09
DRREDDY	1,277.90	2.61
BAJAJFINSV	1,978.60	1.03
ICICIBANK	1,444.70	0.99
HINDALCO	707.05	0.88

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATACONSUM	1,088.00	-1.57
BAJAJ-AUTO	8,690.00	-1.56
ETERNAL	321.5	-1.55
POWERGRID	284.05	-1.51
INDUSINDBK	767.6	-1.36

స్టాక్ మార్కెట్ డేటా


	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,796
ఎన్ఎస్ఈ	97,001
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,70,295
ఎఫ్ఐఐ	+ 1,247
డీఐఐ	+ 2,546

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	63.57 (రాత్రి 11.30కు)	$ 62.71 (క్రితం ముగింపు)
బ్రెంట్	67.71 (రాత్రి 11.30కు)	$ 66.84 (క్రితం ముగింపు)

లాభమ్...మినిమమ్

- పెట్టుబడిదారులకు లాంగ్‌టర్మ్ షాక్
- ఫిన్‌టెక్ నుంచి క్విక్‌కామర్స్ వరకు కొత్తతరం కంపెనీలు డీలా
- అయిదేళ్లలో 36 శాతం మాత్రమే సక్సెస్



ముంబై: గత ఐదేళ్ల కాలంలో కొత్త తరం కంపెనీల పబ్లిక్ ఇష్యూలలో 36 శాతమే ప్రామాణిక ఇండెక్స్(బీఎస్ఈ 500) కంటే మెరుగైన ప్రతిఫలాల్ని ఇచ్చినట్లు 'క్లయింట్ అసోసియేట్స్' నివేదిక తెలిపింది. 25 న్యూఏజ్(కొత్త తరం) ఐపీవోలపై 'ద న్యూ-ఏజ్ ఐపీఓ పర్ఫార్మెన్స్ అనాలిసిస్' పేరుతో జరిపిన అధ్యయనంలో ఆసక్తికర విషయాలు వెల్లడించింది. 2020 మే నుంచి 2025 జూన్ మధ్య కాలంలో పబ్లిక్ ఇష్యూకు వచ్చిన ఫిన్‌టెక్, లాజిస్టిక్స్, కన్జూమర్ ఇంటర్నెట్, క్విక్ కామర్స్, సాఫ్ట్‌వేర్-యాజ్-ఎ-సర్వీస్ (సాస్) రంగాలకు చెందిన కంపెనీ షేర్లను విశ్లేషించారు.

లిస్టింగ్ లాభాలు మాయం

ఈ అధ్యయనం బీఎస్ఈ 500 ఇండెక్స్‌ను బెంచ్‌మార్క్ ప్రాతిపదికగా ప్రీ-ఐపీఓ, ఐపీఓ, పోస్ట్-ఐపీఓ సందర్భాల్లో ఇన్వెస్టర్ల లాభాలు లెక్కించింది. 68% ఐపీఓలు సగటున 24.15% లిస్టింగ్ లాభాలు ఇచ్చాయి. అయితే దీర్ఘకాలంలో లాభాలు తుడిచిపెట్టుకుపోయాయి. కేవలం మూడోవంతు ఇన్వెస్టర్లు మాత్రమే స్థిరమైన లాభాలు గడించారు. లిస్టింగ్ తర్వాత స్టాక్ మార్కెట్లో షేర్లను కొనుగోలు(పోస్ట్-ఐపీఓ) చేసిన ఇన్వెస్టర్లలో 32% మంది మాత్రమే రాబడులు చూశారు. పబ్లిక్ ఇష్యూకు రాక ముందు పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్లు(ప్రీ-ఐపీఓ ఇన్వెస్టర్లు)లో 43% మంది లాభాలు గడించారు. అధిక మూలధనం అవసరమయ్యే వ్యాపార కంపెనీల షేర్ల కంటే స్పష్టమైన మానిటైజేషన్ మోడల్స్ కలిగిన జొమాటో, నజారా కంపెనీల షేర్లు మంచి లాభాలు అందించాయి. అలాగే బీ2బీ, సాఫ్ట్‌వేర్-యాజ్-ఎ-సర్వీస్(సాస్) సేవలు అందించే ఆఫీస్ స్పేస్ సొల్యూషన్స్ లిమిటెడ్, జాగిల్ దీర్ఘకాలానికి ఉత్తమ రాబడులు ఇచ్చాయి.

ఫండమెంటల్స్‌తో 'బూమ్'

ఆసక్తికర కథనాలకంటే ఫండమెంటల్స్ మాత్రమే ఐపీఓ 'బూమ్'కు మద్దతిచ్చాయని క్లయింట్ అసోసియేట్స్ అడ్వైజరీ నితిన్ అగర్వాల్ తెలిపారు. ''రిస్క్ సామర్థ్యం భరించగలిగిన వారికే మాత్రమే లిస్టింగ్ లాభాలు సొంతమయ్యాయి. బలమైన ఫండమెంటల్స్ కలిగిన కంపెనీల షేర్లు దీర్ఘకాలంలో రాణించాయి. మూలధనాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ సాధించిన వృద్ధి, లాభదాయకత, వ్యాపార క్రమశిక్షణ కలిగిన కంపెనీల షేర్లు దీర్ఘకాలిక విలువను అందిచగలవు'' అని పేర్కొన్నారు. లాభదాయకత, నగదు ప్రవాహం,మూలధన సమర్థతలు ఇన్వెస్టర్ల ప్రమాణాలుగా మారుతున్నాయని అగర్వాల్ వివరించారు.

బీఎస్ఈ 500 ఇండెక్సుతో పోలిస్తే..

లాభాల బాటలో		నష్టాల సరళిలో..	
ఇక్సిగో	89.50%	ఓలా ఎలక్ట్రిక్	-60.1%
జాగిల్	62.5%	మొబిక్విక్	-42.6%
ఏథర్ ఎనర్జీ	48.1%	పేటీఎం	-32.9%
ఆఫీస్ స్పేస్	44.9%	ఫస్ట్‌క్రై	-27.3%
జొమాటో	36.8%	యాత్ర	-20.9%

నిరాశపరిచిన పేటీఎం, ఓలా

భారీ అంచనాల మధ్య లిస్టయిన పేటీఎం, ఓలా ఎలక్ట్రిక్ షేర్లు ఇన్వెస్టర్లను పూర్తిగా నిరాశపరిచాయి. అధిక వాల్యుయేషన్లతో పబ్లిక్ ఇష్యూకు రావడం, లిస్టింగ్ తర్వాత ప్రత్యర్థి కంపెనీలకు మార్కెట్ వాటాను కోల్పోవడం ఇందుకు కారణమని నివేదిక తెలిపింది. అయితే బలమైన ఫండమెంటల్ కారణంగా పాలసీ బజార్, ఇక్సిగో షేర్లు బీఎస్ఈ 500 కంటే మెరుగైన ఆదాయాలు ఇచ్చాయి.

ఆర్థిక ప్రణాళికల్లో తెలంగాణ టాప్

- బీమా అవగాహన కమిటీ కాంటార్ అధ్యయనంలో వెల్లడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళికలు వేసుకోవడంలో తెలంగాణ ప్రజలు ముందుంటున్నారని ఇన్సూరెన్స్ ఎవేర్‌నెస్ కమిటీ (ఐఏసీ-లైఫ్), ఐఎంఆర్‌బీ కాంటార్ నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. దీని ప్రకారం రాష్ట్రంలో 94 శాతం మంది జీవితంలో తలెత్తే అనూహ్య పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తుగా ప్రణాళికలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. జీవిత బీమా అనేది పొదుపు, రక్షణ సాధనంగా ఉపయోగపడుతుందని రాష్ట్రంలో 100 శాతం అవగాహన ఉంది. వచ్చే 3 నెలల్లో జీవిత బీమా కొనాలని 38 శాతం మంది భావిస్తున్నారు. సబ్‌సే పెహ్లే లైఫ్ ఇన్సూరెన్స్ 2.0 ప్రచారానికి సంబంధించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఐఏసీ-లైఫ్ కో-చెయిర్‌పర్సన్ వెంకటాచలం ఈ విషయాలు తెలిపారు. రాష్ట్రంలో టర్మ్, చైల్డ్, పొదుపు ప్లాన్లతో పాటు ఇతర బీమా పథకాల గురించి ప్రాంతీయంగా టీవీ, డిజిటల్ తదితర మాధ్యమాల ద్వారా ఇన్‌ఫ్లుయెన్సర్లతో ప్రచార కార్యక్రమాలను మరింతగా నిర్వహించనున్నట్లు వివరించారు.

కేసీ మహీంద్రా ఎడ్యుకేషన్ ట్రస్ట్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు

mahindra Rise

న్యూఢిల్లీ: వార్షిక మహీంద్రా ఆలిండియా టాలెంట్ స్కాలర్‌షిప్ 2025కి సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేసీ మహీంద్రా ఎడ్యుకేషన్ ట్రస్ట్ వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా స్టూడెంట్స్‌కి ఆగస్టు 27 ఆఖరు తేదీగా ఉంటుంది. అల్పాదాయ కుటుంబాలకు చెందిన విద్యార్థులు గుర్తింపు పొందిన ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యా సంస్థల్లో జాబ్ ఆధారిత డిప్లొమా కోర్సు అభ్యసించేందుకు ఈ స్కాలర్‌షిప్ ఉపయోగపడుతుంది. ఏటా 550 మంది విద్యార్థులకు రూ. 10,000 చొప్పున గరిష్ఠంగా మూడేళ్ల పాటు ఇస్తారు. ఎస్ఎస్‌సీ, హెచ్ఎస్‌సీ లేదా తత్సమాన పరీక్షల్లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై, పాలిటెక్నిక్ ఇనిస్టిట్యూట్స్‌లో అడ్మిషన్ పొందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డాల్బీ ఆట్మస్ సౌండ్ ఫీచర్‌తో మహీంద్రా 'ఆర్ఈవీఎక్స్ ఏ'

ఎక్స్ షోరూం ధర రూ.12 లక్షలు



ముంబై: మహీంద్రా అండ్ మహీంద్రా తన 'ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ' ఎస్‌యూవీ లైనప్‌లో డాల్బీ అట్మస్ సౌండ్ టెక్నాలజీతో 'ఆర్ఈవీఎక్స్ ఏ' వేరియంట్‌ను తీసుకొచ్చింది. దీని ఎక్స్ షోరూం ధర రూ.12 లక్షలుగా ఉంది. అతి తక్కువ ధరలో డాల్బీ అట్మోస్ సౌండ్ అనుభవాన్ని అందించే మొదటి ఎస్‌యూవీ ఇదేనని కంపెనీ తెలిపింది. కేవలం 'ఆర్ఈవీఎక్స్ ఏ' లోనే కాకుండా, ఏఎక్స్5 ఎల్, ఏఎక్స్7, ఏఎక్స్7ఎల్ వేరియంట్లలో కూడా లభిస్తుంది. ఈ నాలుగు వేరియంట్లు సెప్టెంబర్ మధ్య నుంచి కస్టమర్లకు అందుబాటులోకి రానున్నాయి. డాల్బీ అట్మాస్ సౌండ్ సిస్టమ్‌లో ఆరు స్పీకర్ ఆడియో డిజైన్‌ను ఉపయోగించారు. ''అధునాతన ఆవిష్కరణలను విస్తృత స్థాయిలో కస్టమర్లకు అందుబాటులోకి తెచ్చేందుకు కట్టుబడి ఉన్నాము. అందులో భాగంగా రూ.12 లక్షల లోపు ధర గల 'ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ ఆర్ఈఎక్స్ ఏ' వేరియంట్‌లో డాల్బీ అట్మోస్‌ని అందుబాటులోకి తెచ్చాము. ఈ ధర శ్రేణిలో ప్రపంచంలోనే తొలి ఎస్‌యూవీని ప్రవేశపెట్టాము. ఎస్‌యూవీ వినియోగదారుల ఆకాంక్షలను తీర్చాలనేది మా లక్ష్యం'' అని మహీంద్రా అండ్ మహీంద్రా ప్రెసిడెంట్ ఆర్ వేలు స్వామి తెలిపారు. డాల్బీ అట్మోస్ ఫీచరు గల మహీంద్రా వాహనాల సిరీస్‌లలో ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ నాలుగోది. అంతకు ముందు బీఈ 6, ఎక్స్ఈవీ 9ఈ, థార్ ఆర్ఓఎక్స్‌ఎక్స్‌లో ఉంది.

టీవీఎస్ నుంచి కింగ్ కార్గో హెచ్‌డీ

ధర రూ. 3.85 లక్షలు



న్యూఢిల్లీ: ఆటోమొబైల్ దిగ్గజం టీవీఎస్ మోటర్ కంపెనీ తమ కార్గో సెగ్మెంట్లో కింగ్ కార్గో హెచ్‌డీ పేరిట మరో ఎలక్ట్రిక్ త్రీ-వీలర్ వాహనాన్ని ప్రవేశపెట్టింది. దీని ధర రూ. 3.85 లక్షలు (ఎక్స్ షోరూం). ఒక్కసారి చార్జింగ్ చేస్తే 156 కి.మీ. రేంజి ఉంటుంది. ముందుగా ఢిల్లీ-ఎన్‌సీఆర్ (నేషనల్ క్యాపిటల్ రీజియన్)తో మొదలుపెట్టి తర్వాత బెంగళూరు, గుజరాత్, మహారాష్ట్రలో కింగ్ కార్గో హెచ్‌డీ వాహనాలను ప్రవేశపెట్టనున్నట్లు కంపెనీ తెలిపింది. ఈ ఏడాదిలోనే దీని సీఎన్‌జీ వెర్షన్‌ను కూడా ప్రవేశపెట్టనున్నట్లు కంపెనీ హెడ్ (కమర్షియల్ మొబిలిటీ బిజినెస్) రజత్ గుప్తా తెలిపారు. ఎలక్ట్రిక్ మోడల్స్‌కి గణనీయంగా ఆదరణ లభిస్తోందని, 2030 నాటికి త్రీ-వీలర్ల మార్కెట్లో వీటి వాటా 60 శాతానికి పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. గతేడాది త్రిచక్ర వాహనాలు 60,000 అమ్ముడు కాగా అందులో ఈవీ మోడల్స్ సుమారు 20,000 ఉన్నాయని (దాదాపు 31 శాతం వాటా) గుప్తా వివరించారు. కార్గో సెగ్మెంట్లో ప్రతి నెలా 10,000 యూనిట్లు అమ్ముడవుతుండగా, డీజిల్ వాహనాల వాటా 50 శాతంగా, ఈవీ-సీఎన్‌జీలది చెరో 25 శాతంగా ఉందని పేర్కొన్నారు. ప్యాసింజర్ సెగ్మెంట్‌కి సంబంధించి కింగ్ ఈవీ మ్యాక్స్ పేరిట టీవీఎస్ మోటర్స్ ఇటీవలే ఎలక్ట్రిక్ త్రిచక్ర వాహనాన్ని ప్రవేశపెట్టింది.

చైనా స్నేహంతో సోలార్ రంగానికి జోష్

- సరఫరా వ్యవస్థ మెరుగుపడుతుంది
- విక్రమ్‌సోలార్ సీఎండీ జ్ఞానేష్



కోల్‌కతా: భారత్-చైనా మధ్య సంబంధాలు మెరుగుపడితే.. అది దేశ సోలార్ రంగానికి మేలు జరుగుతుందని విక్రమ్ సోలార్ సీఎండీ జ్ఞానేష్ చౌదరి అన్నారు. దేశీయంగా సోలార్ ఎక్విప్‌మెంట్ తయారీదారులకు సరఫరాలు మెరుగుపడతాయన్నారు. చైనాతోతో మెరుగైన సంబంధాలు ఆ దేశం నుంచి చౌకగా ఉత్పత్తులు భారత్‌లోకి వచ్చి పడతాయన్న ఆందోళలను తోసిపుచ్చారు. సుంకాల విధింపుతో ప్రభుత్వం తీసుకున్న రక్షణాత్మక చర్యలను ప్రస్తావించారు. పీఎల్ఐ పథకం కింద సోలార్ తయారీదారులకు ప్రోత్సాహకాలు అందించడం, చౌక దిగుమతులపై అధిక కస్టమ్స్ సుంకాల అమలు, ఏఎల్ఎంఎం మార్గదర్శకాల ద్వారా దేశీ తయారీదారులకు రక్షణలు కల్పించినట్టు చెప్పారు. ''చైనాతో మంచి సంబంధాలు మనకు మంచే చేస్తాయి. ముడి పదార్థాల సరఫరా మెరుగుపడుతుంది. చైనా చౌక ఉత్పత్తులు దేశీ పరిశ్రమను గతంలో దెబ్బతీసినప్పటికీ.. నేడు ప్రభుత్వం దేశీ తయారీదారులకు తగిన రక్షణలు కల్పించింది''అని వివరించారు. సోలార్ మాడ్యూళ్లపై 40% బేసిక్ కస్టమ్స్ డ్యూటీ, సెల్స్‌పై 25 శాతం విధించినట్టు గుర్తు చేశారు. సోలార్ ఉత్పత్తులకు గతంలో చైనాపై 100% ఆధారపడి ఉండగా, ఇప్పుడది 80 శాతానికి తగ్గినట్టు తెలిపారు. దేశీయంగా సోలార్ ఎకోసిస్టమ్ అభివృద్ధి చెందిందని.. వచ్చే మూడు, ఐదేళ్ల కాలంలో చైనాపై ఆధారపడడం మరింత తగ్గుముఖం పడుతుందన్నారు. చైనా దిగుమతులు నిలిచిపోవడంతో గతేడాది పరిశ్రమ ఆదాయంలో 90% దేశీ మార్కెట్ నుంచే వచ్చినట్టు జ్ఞానేష్ చౌదరి తెలిపారు. అమెరికా టారిఫ్ లపై స్పష్టత కోసం వేచి చూస్తున్నట్టు చెప్పారు. గతేడాది దేశీ మార్కెట్ వినియోగం 50 గిగావాట్లుగా ఉంటే, అమెరికా కాకుండా ఎగుమతి అయిన మొత్తం 2 గిగావాట్లుగానే ఉన్నట్టు తెలిపారు.

టర్మ్, లైఫ్ ప్లాన్లపై ప్రయోజనం

- జీఎస్టీ మినహాయింపుపై నిపుణుల అభిప్రాయాలు
- కీలకం కానున్న ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్



న్యూఢిల్లీ: బీమా పాలసీలపై వస్తు, సేవల పన్నును (జీఎస్టీ) మినహాయించేందుకు రాష్ట్రాల మంత్రులతో కూడిన బృందం (జీవోఎం) ఆమోదం తెలపడంతో.. ఇది అమల్లోకి వస్తే ప్రధానంగా టర్మ్, హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీదారులకు ప్రయోజనం కలుగుతుందని నిపుణులు భావిస్తున్నారు. కమీషన్, రీ ఇన్సూరెన్స్‌లకు సైతం మినహాయింపు లభిస్తుందని.. దీంతో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) నిలిపివేయడం అన్న సమస్య ఎదురుకాకపోవచ్చన్న అభిప్రాయం వ్యక్తమైంది. ప్రస్తుతం వ్యక్తిగత ఆరోగ్య బీమా, జీవిత బీమా ప్లాన్లపై 18 శాతం రేటు అమలవుతోంది. దీన్ని పూర్తిగా మినహాయించాలని కేంద్రం ప్రతిపాదించింది. దీనికి జీఎస్టీ మంత్రుల బృందం సైతం ఆమోదం తెలిపి జీఎస్టీ కౌన్సిల్‌కు నివేదించింది.

18% తగ్గకపోవచ్చు..

బీమా పాలసీలపై జీఎస్టీని మినహాయించినా గానీ, తగ్గింపు అన్నది 18 శాతంగా ఉండకపోవచ్చని ఈవై ఇండియా ట్యాక్స్ పార్ట్‌నర్ సౌరభ్ అగర్వాల్ అభిప్రాయపడ్డారు. కమీషన్లు, ఆఫీస్ అద్దెలు, సాఫ్ట్‌వేర్ తదితర వాటిపై తాము చెల్లించిన జీఎస్టీని కంపెనీలు తిరిగి క్లెయిమ్ చేసుకోలేవని చెప్పారు. దీంతో కంపెనీలపై పడే ఇన్‌పుట్ ట్యాక్స్ ఆధారంగా నికర తగ్గింపు ఆధారపడి ఉంటుందని వివరించారు. జీఎస్టీ మినహాయింపు కన్నా సున్నా రేటు కింద పరిగణిస్తే, అప్పుడు కంపెనీలు తమ ఇన్‌పుట్ వ్యయాలపై చెల్లించిన జీఎస్టీని తిరిగి క్లెయిమ్ చేసుకోగలవన్నారు. అలాంటప్పుడు బీమా పాలసీలపై తగ్గింపు 18 శాతంగా ఉండొచ్చన్నారు.

3,600 డాలర్లకు బంగారం

- అంతర్జాతీయంగా ఏడాది చివరకు
- వెంచురా సెక్యూరిటీస్ అంచనా
- పెట్టుబడుల పరంగా డిమాండ్



న్యూఢిల్లీ: బంగారం ధర అంతర్జాతీయ మార్కెట్లో ఏడాది చివరికి ఔన్స్‌కు 3,600 డాలర్లకు చేరుకోవచ్చని వెంచురా సెక్యూరిటీస్ అంచనా వేసింది. అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక సమస్యలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో పెట్టుబడుల పరంగా డిమాండ్ పసిడిని నడిపించొచ్చని తెలిపింది. కామెక్స్ ఫ్యూచర్స్ ఔన్స్ ధర ఈ నెల 7న 3,534 డాలర్లను నమోదు చేయగా.. డిసెంబర్ నాటికి 3,600 డాలర్లకు చేరుకోవచ్చని పేర్కొంది. దేశీ మార్కెట్లో పరిశీలిస్తే ఎంసీఎక్స్‌లో ఈ నెల 8న అక్టోబర్ నెల గోల్డ్ కాంట్రాక్టు (10 గ్రాములు) ధర రూ.1,02,250 రికార్డు స్థాయిని నమోదు చేసింది. అమెరికాలో బలహీన వృద్ధి, యూఎస్ డాలర్ ఇండెక్స్‌పై ఒత్తిళ్లు, పెరిగిపోయిన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలను వెంచురా సెక్యూరిటీస్ తన తాజా నివేదికలో ప్రస్తావించింది. ఈ పరిస్థితుల్లో బంగారానికి డిమాండ్ బలంగా కొనసాగుతున్నట్టు తెలిపింది. ''ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో అంతర్జాతీయంగా బంగారంపై పెట్టుబడుల డిమాండ్ 3 శాతం పెరిగి రూ.1,249 టన్నులకు చేరుకుంది. విలువ పరంగా 132 బిలియన్ డాలర్లు. అంతర్జాతీయంగా గోల్డ్ ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు 16 శాతం పెరిగి జూన్ చివరికి 3,616 టన్నులుగా ఉన్నాయి'' అని వెంచురా సెక్యూరిటీస్ వివరించింది. బంగారం నిర్వహణ ఆస్తుల విలువ ఏడాది కాలంలో 64 శాతం ఎగసి 383 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్టు తెలిపింది.

దేశీయంగానూ ఇదే ధోరణి..

దేశీయంగానూ బంగారంపై పెట్టుబడుల ధోరణి బలపడుతున్నట్టు వెంచురా సెక్యూరిటీస్ గణాంకాలను ప్రస్తావించింది. గోల్డ్ ఈటీఎఫ్‌ల నిర్వహణలోని బంగారం నిల్వలు జూన్ 30 చివరికి 66.68 టన్నులకు పెరిగినట్టు తెలిపింది. ఏడాది కాలంలో 42 శాతం పెరిగాయి. గోల్డ్ ఈటీఎఫ్‌ల నిర్వహణలోని పసిడి ఆస్తుల విలువ ఇదే కాలంలో రెట్టింపై రూ.64,777 కోట్లకు చేరినట్టు పేర్కొంది. గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో ఇన్వెస్టర్ల ఖాతాలు (ఫోలియోలు) 41 శాతం పెరిగి 76.54 లక్షలకు చేరాయని.. ఏడాది కాలంలో 317 శాతం పెరిగినట్టు తెలిపింది. గోల్డ్ ఈటీఎఫ్‌లు తదితర డిజిటల్ గోల్డ్ సాధనాలపై పెట్టుబడులకు యువ ఇన్వెస్టర్లు ఆసక్తి చూపిస్తున్నట్టు వెల్లడించింది. అదే సమయంలో బంగారం ఆభరణాల డిమాండ్ స్థిరంగా కొసాగుతోందని తెలిపింది. ముఖ్యంగా భౌతిక, డిజిటల్ బంగారంపై పెట్టుబడులతో కూడిన హైబ్రిడ్ విధానాలను అనుసరిస్తున్నట్టు పేర్కొంది.

దీర్ఘకాలంలో రాబడులు..

''గత 20 ఏళ్లలో 14 సంవత్సరాల్లో బంగారం సానుకూల రాబడులు అందించింది. దీంతో విలువ పెరిగే సాధనంగా, ద్రవ్యోల్బణానికి హెడ్జింగ్ సాధనంగా బంగారానికి గుర్తింపు పెరుగుతోంది. ఇటీవలి కాలంలో బంగారం ధరల ర్యాలీ దీన్ని బలపరుస్తోంది. గత మూడేళ్లలో వార్షిక రాబడి 23 శాతంగా ఉంది. ఇదే కాలంలో నిఫ్టీ 50 సూచీ వార్షిక రాబడి 11 శాతంగానే ఉంది''అని వెంచురా సెక్యూరిటీస్ తన నివేదికలో వివరించింది. సెంట్రల్ బ్యాంక్‌లు సైతం స్థిరంగా బంగారాన్ని కొనుగోలు చేస్తుండడాన్ని ప్రస్తావించింది. సార్వభౌమ బంగారం బాండ్ల జారీని 2024 ఫిబ్రవరి నుంచి ఆర్‌బీఐ నిలిపివేయడంతో, ఈటీఎఫ్, ఇతర బంగారం డిజిటల్ సాధనాల్లోకి అధిక పెట్టుబడులు వెళ్లొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. ''ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, బలహీన యూఎస్ డాలర్‌కు తోడు యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్ల కోత అంచనాలతో బంగారం ధరలు ఈ ఏడాది మిగిలిన కాలంలో స్థిరంగా ఎగువవైపు చలించొచ్చు''అని వెంచురా సెక్యూరిటీస్ కమోడిటీస్ హెడ్ ఎన్ఎస్ రామస్వామి తెలిపారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ బంగారం ధర 3,400 డాలర్ల సమీపంలో ఉంది.

పసిడి రూ.600 ప్లస్

- ఢిల్లీలో ధర రూ.1,00,620
- రూ1,500 పెరిగిన వెండి

న్యూఢిల్లీ: స్టాకిస్టుల నుంచి కొనుగోళ్లకు డిమాండ్ నెలకొనడంతో పసిడి (99.9 శాతం స్వచ్ఛత) ధర గురువారం ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాములకు రూ.600 పెరిగి రూ.1,00,620కు (పన్నులు సహా) చేరింది. 99.5 శాతం స్వచ్ఛత పసిడి ధర రూ.500 లాభపడి రూ.1,00,200 స్థాయిని తాకింది.

మరోవైపు వెండి ధర కిలోకి రూ.1,500 పెరగడంతో రూ.1,14,000కు చేరుకుంది. ''బంగారం ధరల ర్యాలీకి సురక్షిత సాధనంగా ఉన్న డిమాండ్‌తోడైంది. క్రితం రోజు (బుధవారం) పసిడి ధర మూడు వారాల కనిష్టానికి చేరడంతో కొనుగోళ్లకు మద్దతు లభించింది. ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ రాజీనామా చేయాలంటూ అమెరికా అధ్యక్షుడు డిమాండ్ చేయడంతో సెంట్రల్ బ్యాంక్ స్వతంత్రపై నెలకొన్న ఆందోళనలు సైతం ధరల ర్యాలీకి దారితీశాయి''అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ గోల్డ్ ధర ఔన్స్‌కు 3,339 డాలర్ల వద్ద ఉంది. ''జాక్సన్ హోల్ సింపోజియంలో యూఎస్ ఫెడ్ పావెల్ చేసే ప్రసంగం కోసం ట్రేడర్లు, ఇన్వెస్టర్లు వేచి చూసే ధోరణితో ఉన్నారు. పరపతి విధానం గురించి ఏమి మాట్లాడుతారన్న ఆసక్తి నెలకొంది''అని కోటక్ సెక్యూరిటీస్ కమోడిటీ రీసెర్చ్ ఏవీపీ కేనత్ చైన్‌వాలా తెలిపారు.



సారా ఎరాని-వవసోరి జోడీదే 'మిక్స్‌డ్' టైటిల్



సింగిల్స్‌లో ఎంతటి మేటి క్రీడాకారులైనా... డబుల్స్ విభాగంలో రాణించాలంటే మాత్రం విశేష ప్రతిభ, చక్కటి సమన్వయం ఉండాలని సారా ఎరాని-ఆండ్రియా వవసోరి (ఇటలీ) నిరూపించారు. మ్యాచ్‌లను, టోర్నీని కొత్త ఫార్మాట్‌లో నిర్వహించినా... సింగిల్స్ స్టార్స్‌ను బరిలోకి దించినా... డిఫెండింగ్ చాంపియన్స్ సారా ఎరాని-వవసోరి తమ అనుభవాన్నంతా రంగరించి పోరాడారు. టెన్నిస్ సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్ 'మిక్స్‌డ్ డబుల్స్' విభాగంలో మరోసారి తమ ఆధిపత్యాన్ని చాటుకున్నారు. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన తుది పోరులో 'సూపర్ టైబ్రేక్'లో పైచేయి సాధించిన సారా ఎరాని-వవసోరి ద్వయం 'మిక్స్‌డ్ డబుల్స్' టైటిల్‌ను నిలబెట్టుకున్నారు.

న్యూయార్క్: కొత్త ఫార్మాట్‌కు ఆహ్వానం పలికి... డబుల్స్ స్పెషలిస్ట్ అవకాశాలను దెబ్బ తీశారని నిర్వాహకులను విమర్శించినా... మరోవైపు తమ సహజ నైపుణ్య ప్రదర్శనతో సారా ఎరాని-ఆండ్రియా వవసోరి జోడీ అదరగొట్టింది. యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో ఈ ఇటలీ జంట వరుసగా రెండో ఏడాది విజేతగా నిలిచింది. గురువారం ఉదయం జరిగిన ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్స్ సారా ఎరాని-వవసోరి 6-3, 5-7, 10-6తో 'సూపర్ టైబ్రేక్'లో మూడో సీడ్ ఇగా స్వియాటెక్ (పోలాండ్)-కాస్పర్ రూడ్ (నార్వే)లపై గెలుపొందారు. 92 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఎరాని-వవసోరి నాలుగు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థుల సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశారు. విజేతగా నిలిచిన ఎరాని-వవసోరిలకు 10 లక్షల డాలర్లు (రూ. 8 కోట్ల 71 లక్షలు)... రన్నరప్ స్వియాటెక్-రూడ్‌లకు 4 లక్షల డాలర్లు (రూ. 3 కోట్ల 50 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

రెండు రోజుల్లోనే ముగిసిన మిక్స్‌డ్ ఈవెంట్‌లో ఎరాని-వవసోరి తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. గురువారమే జరిగిన సెమీఫైనల్స్‌లో ఎరాని-వవసోరి 4-2, 4-2తో డానియెలా కొలిన్స్-క్రిస్టియన్ హారిసన్ (అమెరికా)లను ఓడించింది. మరో సెమీఫైనల్లో స్వియాటెక్-రూడ్ 3-5, 5-3, 10-8తో 'సూపర్ టైబ్రేక్'లో టాప్ సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా)-జాక్ డ్రేపర్ (బ్రిటన్)లపై గెలిచారు. 2018, 2019లలో బెథానీ మాటెక్ సాండ్స్ (అమెరికా)-జేమీ ముర్రే (బ్రిటన్) జోడీ వరుసగా రెండేళ్లు 'మిక్స్‌డ్ డబుల్స్' టైటిల్ నెగ్గగా... ఇప్పుడు ఎరాని-వవసోరి ఈ ఘనత సాధించారు.



సలీమా సారథ్యంలో...

- ఆసియా కప్ మహిళల హాకీ టోర్నీ బరిలో భారత జట్టు

న్యూఢిల్లీ: ఆసియా కప్ మహిళల హాకీ టోర్నమెంట్‌లో పాల్గొనే భారత జట్టును గురువారం ప్రకటించారు. 20 మంది సభ్యులతో కూడిన భారత జట్టుకు జార్ఖండ్‌కు చెందిన 23 ఏళ్ల సలీమా టెటె సారథ్యం వహిస్తుంది. సెప్టెంబర్ 5 నుంచి 14వ తేదీ వరకు జరిగే ఈ టోర్నీకి చైనాలోని హాంగ్జౌ నగరం ఆతిథ్యమిస్తుంది. గ్రూప్ 'బి'లో జపాన్, థాయ్‌లాండ్, సింగపూర్ జట్లతో కలిసి భారత్‌కు చోటు లభించింది. సెప్టెంబర్ 5న థాయ్‌లాండ్‌తో తొలి మ్యాచ్ ఆడనున్న భారత్... 6న జపాన్‌తో, 8న సింగపూర్‌తో పోటీపడుతుంది. గ్రూప్ 'ఎ'లో చైనా, చైనీస్ తైపీ, దక్షిణ కొరియా, మలేసియా జట్లున్నాయి. ఆసియా కప్‌లో విజేతగా నిలిచిన జట్టు వచ్చే ఏడాది బెల్జియం-నెదర్లాండ్స్‌లో జరిగే ప్రపంచకప్ టోర్నీకి నేరుగా అర్హత సాధిస్తుంది. నాలుగు దశాబ్దాల చరిత్ర కలిగిన ఆసియా కప్‌లో భారత జట్టు రెండుసార్లు (2004, 2017) చాంపియన్‌గా, రెండుసార్లు రన్నరప్‌గా (1999, 2009) నిలిచింది.

భారత మహిళల హాకీ జట్టు: బన్సరీ సోలంకి, బిచ్చూ దేవి ఖరీబమ్ (గోల్ కీపర్లు), మనీషా చౌహాన్, ఉదిత, జ్యోతి, సుమన్ దేవి థౌడమ్, నిక్కీ ప్రధాన్, ఇషిక చౌదరీ (డిఫెండర్లు), నేహా, వైష్ణవి విఠల్ ఫాల్కే, సలీమా టెటె, షర్మిలా దేవి, లాల్‌రెమ్‌సియామి, సునీలితా టొప్పో (మిడ్ ఫీల్డర్లు), నవ్‌నీత్ కౌర్, రుతుజా పిసాల్, బ్యూటీ డుంగ్‌డుంగ్, ముంతాజ్ ఖాన్, దీపిక, సంగీత కుమారి (ఫార్వర్డ్స్).

ముంబై కెప్టెన్సీకి రహానే గుడ్‌బై

రంజీ సారథ్యం నుంచి తప్పుకున్న బ్యాటర్ ● ఆటగాడిగా కొనసాగుతానన్న సీనియర్ ప్లేయర్

ముంబై: రంజీ ట్రోఫీలో ముంబై జట్టు కెప్టెన్సీ పదవి నుంచి తప్పుకుంటున్నట్లు సీనియర్ బ్యాటర్ అజింక్య రహానే ప్రకటించాడు. త్వరలోనే 2025-26 సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో అతను ఈ కీలక నిర్ణయం తీసుకున్నాడు. ముంబై టీమ్ కొత్త కెప్టెన్‌ను సిద్ధం చేసుకునేందుకే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు అతను వెల్లడించాడు. 'ముంబై జట్టు కెప్టెన్‌గా విజయాలు సాధించడంతో పాటు ట్రోఫీలు గెలుచుకోవడం నాకు లభించిన గొప్ప గౌరవం. త్వరలో దేశవాళీ సీజన్ మొదలు కానుంది. ఇప్పుడు టీమ్ కోసం కొత్త కెప్టెన్‌ను తీర్చి దిద్దాల్సిన సమయం ఆసన్నమైందని నేను భావిస్తున్నా. అయితే కెప్టెన్‌గా తప్పుకున్నా... ఆటగాడిగా కొనసాగుతాను. నా అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చి ముంబై మరిన్ని టైటిల్స్ గెలిచేందుకు నా వంతు పాత్ర పోషించాలని భావిస్తున్నా' అని రహానే పేర్కొన్నాడు. రహానే కెప్టెన్సీలో 2023-24 సీజన్



రంజీ ట్రోఫీని ముంబై గెలుచుకుంది. ఆ జట్టుకు ఇది 42వ టైటిల్ కాగా... ఎనిమిదేళ్ల విరామం తర్వాత దక్కిన ట్రోఫీ కావడం విశేషం. తర్వాతి ఏడాది రహానే సారథ్యంలోనే ఇరానీ కప్ గెలుచుకున్న ముంబై... 2022-23లోనే ముస్తాక్ అలీ టి20 ట్రోఫీని సొంతం చేసుకుంది. అయితే రంజీ, ఇరానీ ట్రోఫీలో బ్యాటర్‌గా రహానే ఫామ్ గొప్పగా లేదు. 27 ఇన్నింగ్స్‌లలో ఒకే ఒక సెంచరీతో అతను 467 పరుగులే చేశాడు. మరోవైపు గత ఏడాది కూడా ముంబై జట్టు శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో ముస్తాక్ అలీ ట్రోఫీ గెలవగా... ఆ టోర్నీలో రహానే 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలిచాడు. రహానే చివరిసారిగా 2025 సీజన్ ఐపీఎల్‌లో కోల్‌కతా టీమ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించగా... చెత్త ప్రదర్శనతో జట్టు ఐదు మ్యాచ్‌లే గెలిచి ఎనిమిదో స్థానంతో ముగించింది. భారత్ తరఫున 85 టెస్టులు ఆడి 5077 పరుగులు చేసిన రహానే చివరిసారిగా 2023 జులైలో బరిలోకి దిగాడు. ఆ తర్వాత జట్టులో స్థానం కోల్పోయిన అతను తన సాధనను కొనసాగిస్తూ పునరాగమనంపై ఇంకా ఆశతో ఉన్నాడు.

'క్వార్టర్స్'తో సరి...

ముగిసిన భారత క్రీడాకారుల పోరు



మాల్మో (స్వీడన్): యూరోప్ స్మాష్ వరల్డ్ టేబుల్ టెన్నిస్ (టీటీ) టోర్నీలో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. పురుషుల డబుల్స్ విభాగంలో మనుశ్ షా-మానవ్ ఠక్కర్... మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో మనుశ్ సా-దియా చిటాలె జోడీలు క్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగాయి. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో మనుశ్-మానవ్ జంట 11-13, 11-8, 8-11, 5-11తో టొమోకాజు హరిమోటో-హిరోటో షినోజుకా (జపాన్) ద్వయం చేతిలో ఓడిపోయింది. 38 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో మనుశ్-మానవ్ మొత్తం 35 పాయింట్లు గెలిచారు. ఇందులో తమ సర్వీస్‌లో 16 పాయింట్లు, ప్రత్యర్థుల సర్వీస్‌లో 19 పాయింట్లు సాధించారు. మనుశ్-మానవ్‌లకు 2,650 డాలర్ల (రూ. 2 లక్షల 31 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 350 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. 'మిక్స్‌డ్' క్వార్టర్ ఫైనల్లో మనుశ్-దియా ద్వయం 10-12, 3-11, 7-11తో ఎడువర్డ్ ఐనెస్కు-బెర్నాడ్ జాక్స్ (రొమేనియా) జోడీ చేతిలో పరాజయం పాలైంది. 20 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో మనుశ్-దియా మొత్తం 20 పాయింట్లు సంపాదించారు. ఇందులో తమ సర్వీస్‌లో 12 పాయింట్లు, ప్రత్యర్థుల సర్వీస్‌లో 8 పాయింట్లు గెలిచారు. మనుశ్-దియా ఖాతాలో 2,650 డాలర్ల (రూ. 2 లక్షల 31 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 350 ర్యాంకింగ్ పాయింట్లు చేరాయి.

భారత బాక్సింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా మళ్లీ అజయ్ సింగ్



గురుగ్రామ్: భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ) అధ్యక్షుడిగా అజయ్ సింగ్ మళ్లీ ఎన్నికయ్యారు. ఆయన వరుసగా మూడోసారి అధ్యక్ష పీఠాన్ని చేపట్టనున్నారు. ఆరు నెలల వాయిదా అనంతరం గురువారం జరిగిన ఈ ఎన్నికల్లో స్పైస్‌జెట్ ఎయిర్‌లైన్స్ మేనేజింగ్ డైరెక్టర్ అయిన అజయ్ సింగ్ 40-26 ఓట్ల తేడాతో జస్‌లాల్ ప్రధాన్‌పై గెలుపొందారు. కొత్త కార్యదర్శిగా ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ప్రమోద్ కుమార్ ఎన్నికయ్యారు. పాత కార్యదర్శి హేమంత కలిత నాలుగేళ్ల చొప్పున వరుసగా రెండు పర్యాయాలు పదవిలో కొనసాగడంతో పదవుల మధ్య విరామం నిబంధన కింద హేమంత పోటీకి దూరమయ్యారు. కోశాధికారిగా తమిళనాడుకు చెందిన పాన్ భాస్కరన్ ఎన్నికవగా... ఈ ఎన్నికలకు రాజేశ్ టాండన్ రిటర్నింగ్ అధికారిగా, బీఎఫ్ఐ మధ్యంతర కమిటీ అధ్యక్షుడు ఫైరుజ్ మొహమ్మద్ పర్యవేక్షకులుగా వ్యవహరించారు. ప్రపంచ బాక్సింగ్ సింగపూర్‌కు చెందిన ఫైరుజ్‌ను ఎన్నికల పర్యవేక్షణ కోసం పంపించింది. అయితే కేంద్ర క్రీడాశాఖ గానీ, భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) గానీ పర్యవేక్షకుల్ని పంపించలేదు. కొత్త కార్యవర్గమైతే ఎన్నికైనప్పటికీ... ఢిల్లీ హైకోర్టులో కేసు విచారణ జరుగుతున్న దృష్ట్యా తుది తీర్పునకు లోబడే ఫలితాలుంటాయి.

పాన్ ఇండియా స్థాయిలో...

జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్న క్రీడా శాఖ

న్యూఢిల్లీ: ఈసారి జాతీయ క్రీడా దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని కేంద్ర క్రీడాశాఖ నిర్ణయించింది. ఆగస్టు 29న దివంగత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని యేటా జాతీయ క్రీడాదినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఏదో నామమాత్రంగా కాకుండా ఈ ఏడాది పాన్ ఇండియాలో అట్టహాసంగా నిర్వహించాలని, ఇందులో క్రీడాకారులతో పాటు క్రీడాభిమానుల్ని, పౌరుల్ని భాగస్వాములు చేయాలని కేంద్ర క్రీడా శాఖ భావిస్తోంది. 'దేశవ్యాప్తంగా క్రీడల సంస్కృతి పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపడతాం. ఒలింపిక్స్ ఆతిథ్యం దిశగా భారత్ చేస్తున్న కసరత్తులో దేశ పౌరులందరూ ఉత్సాహంగా పాల్గొనేలా చూస్తాం. క్రీడలు, ఫిట్‌నెస్ కార్యకలాపాలతో ఒలింపిక్స్ స్ఫూర్తిని రగిలించాలి. మన దైనందిన జీవితంలో క్రీడలు అలవాటుగా మారాలి' అని కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ అన్నారు. ఈ నెల 29న అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, మహా నగరాల నుంచి మారుమూల పల్లెల దాకా ఊరు-వాడా అంతటా హాకీ దిగ్గజానికి ఘనంగా నివాళులు అర్పించే సంస్మరణ కార్యక్రమం చేపట్టాలని చెప్పారు. తర్వాతి రెండు రోజులు కూడా క్రీడోత్సవానికి సంబంధించిన కార్యక్రమాలు వరుసగా నిర్వహించాలని సూచించారు. 30న స్పోర్ట్స్ అథారిటీ కేంద్రాల్లో చర్చా కార్యక్రమాలు, పోటీలు, ఫిట్‌నెస్ అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. 31న సైకిల్ ర్యాలీతో మన క్రీడా సంస్కృతిని ప్రపంచానికి తెలియజేయాలని మాండవీయ సూచించారు.



రజత పతకాలు నెగ్గిన రీనా, ప్రియ

సమోకోవ్ (బల్గేరియా): ప్రపంచ అండర్-20 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో గురువారం భారత్‌కు రెండు రజత పతకాలు లభించాయి. మహిళల ఫ్రీస్టయిల్ విభాగంలో రీనా (55 కేజీలు), ప్రియ (76 కేజీలు) ఫైనల్లో ఓడిపోయి రజత పతకాలను గెల్చుకున్నారు. ప్రియ 0-4తో నదియా సొకోలవ్‌స్కా (ఉక్రెయిన్) చేతిలో, రీనా 2-10తో ఎవరెస్ట్ లెడెకర్ (అమెరికా) చేతిలో పరాజయం పాలయ్యారు. మరోవైపు 72 కేజీల విభాగంలో కాజల్ ఫైనల్లోకి దూసుకెళ్లి స్వర్ణ పతకం కోసం పోరాడనుంది. సెమీఫైనల్లో కాజల్ 13-6తో జాస్మిన్ (అమెరికా)పై విజయం సాధించింది. 50 కేజీల విభాగంలో శ్రుతి... 53 కేజీల విభాగంలో సారిక కాంస్య పతకాల కోసం పోటీపడనున్నారు. సెమీఫైనల్స్‌లో సారిక 0-10తో అనస్తాసియా పొలాస్కా (ఉక్రెయిన్) చేతిలో... శ్రుతి 0-11తో రింకా ఒగావా (జపాన్) చేతిలో ఓడిపోయారు.

ఎంపికైంది 35 ... హాజరైంది 25!

జాతీయ ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం



బెంగళూరు: నేషన్స్ కప్ సన్నాహాల్లో భాగంగా భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు కొత్త హెడ్ కోచ్ ఖాలిద్ జమీల్ ఆధ్వర్యంలో శిక్షణ శిబిరంలో పాల్గొంటోంది. ఈ శిబిరానికి మొత్తం 35 మంది ప్లేయర్లు ఎంపిక కాగా... 16 నుంచి బెంగళూరులో శిక్షణ ప్రారంభమైంది. అయితే ప్రస్తుతం 25 మంది ప్లేయర్లు మాత్రమే శిక్షణలో పాల్గొంటున్నారు. మరో 11 మంది ఆటగాళ్లు ఇంకా శిబిరంలో చేరాల్సి ఉంది. జాతీయ శిబిరానికి ఎంపికైన ప్లేయర్లలో ఏడుగురు ఆటగాళ్లు... డ్యూరాండ్ కప్‌లో మోహన్ బగాన్ సూపర్ జెయింట్ క్లబ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ ఏడుగురిని ఆ క్లబ్ ఇంకా విడుదల చేయకపోవడంతో... అనిరుధ్ థాపా, దీపక్, రాల్టె, లిస్టన్ కొలాకో, మన్‌వీర్ సింగ్, సహల్ అబ్దుల్ సమద్, విశాల్ జాతీయ శిబిరంలో పాల్గొనలేకపోతున్నారు. నేషన్స్ కప్‌లో భాగంగా ఈ నెల 29న భారత జట్టు తజకిస్తాన్‌తో పోటీపడాల్సి ఉంది. అయితే నేషన్స్ కప్ ఫిఫా అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో భాగం కాకపోవడంతో... నిబంధనల ప్రకారం ప్లేయర్లను విడుదల చేయాల్సిన అవసరం లేదు. డ్యూరాండ్ కప్‌లో భాగంగా ఈ నెల 17న జరిగిన క్వార్టర్ ఫైనల్లోనే మోహన్ బగాన్ పరాజయం పాలై... టోర్నీ నుంచి వైదొలిగినా ఇప్పటి వరకు ఆటగాళ్లను మాత్రం జాతీయ శిబిరానికి పంపలేదు. ఈ టోర్నీ సెమీస్‌లో ఓడిన ఈస్ట్ బెంగాల్ జట్టులోనూ శిబిరానికి ఎంపికైన ముగ్గురు ఆటగాళ్లు అన్వర్ అలీ, జాక్సన్ సింగ్, మహేశ్ సింగ్ ఉండగా... వాళ్లు కూడా ఇప్పటి వరకు క్యాంప్‌లో అడుగు



పెట్టలేదు. ఈ నేపథ్యంలో కొత్త కోచ్ జమీల్ మాట్లాడుతూ... 'ఆటగాళ్ల కోసం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. అందుబాటులో ఉన్న ఆటగాళ్లతో శిబిరం కొనసాగుతోంది. మరింత మంది ప్లేయర్లను పరీక్షిస్తాం. ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో అత్యుత్తమ ప్లేయర్లతోనే బరిలోకి దిగుతాం' అని అన్నాడు. శిబిరంలో పాల్గొంటున్న మన్‌వీర్ మాట్లాడుతూ... 'గత ఆరేళ్లుగా జాతీయ జట్టు జెర్సీ వేసుకోవాలని ఎదురుచూస్తున్నా. ఎట్టకేలకు ఇప్పుడు అవకాశం వచ్చింది. అండర్-19 స్థాయిలో 2019లో ఏఎఫ్‌సీ అండర్-19 ఆసియా చాంపియన్‌షిప్‌లో పాల్గొన్నా. భారత జట్టుకు స్ట్రయికర్ స్థానంలో ఆడటం చాలా కష్టం. కోచ్ జమీల్ ఆధ్వర్యంలో గతంలో మ్యాచ్‌లు ఆడా. నా శక్తి సామర్థ్యాలు కోచ్‌కు తెలుసు. నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు శాయశక్తులా కృషి చేస్తా' అని అన్నాడు.

ఇకపై లింగ నిర్ధారణ తర్వాతే పోటీలకు...



ప్రపంచ బాక్సింగ్ నిర్ణయం

WORLD BOXING

లాస్ ఏంజెలిస్: ఒలింపిక్ బాక్సింగ్ ఈవెంట్‌లో ఇకపై లింగ నిర్ధారణ పరీక్షలు చేయనున్నారు. గతంలో పురుషుల స్థాయి హార్మోన్లతో ఉన్న మహిళా బాక్సర్లు పోటీలకు దిగినపుడు విమర్శలు వచ్చాయి. ఇకపై ఇలాంటి విమర్శలు పునరావృతం కాకూడదనే ఉద్దేశంతో మహిళా ఈవెంట్లలో పోటీ పడే ప్రతి ఒక్కరికి పరీక్షలు తప్పనిసరి చేశారు. ఇందులో భాగంగా వచ్చే నెలలో జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే బాక్సర్లకు లింగ నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్లు ప్రపంచ బాక్సింగ్ అధ్యక్షుడు బోరిస్ వాన్ డెర్ వోర్స్ వెల్లడించారు. 'సమాఖ్య అందరిపట్ల హుందాగా వ్యవహరిస్తుంది. వ్యక్తుల వ్యక్తిత్వాన్ని గౌరవిస్తుంది' అని బోరిస్ అన్నారు. బాక్సింగ్ లాంటి పోరాట క్రీడలో భద్రత, పోటీతత్వం సమన్యాయంను పాటించాల్సి ఉంటుందని, మరింత జవాబుదారీతనం, పారదర్శకతతో వ్యవహరించాల్సిన అవసరం ఎంతో ఉందని అన్నారు. జీవ సంబంధ లింగ సూచిక అయిన 'వై' క్రోమోజోమ్ జన్యువుల ఉనికిని ఈ పరీక్షల్లో నిర్ధారిస్తారు. ఇంగ్లండ్‌లోని లివర్‌పూల్‌లో సెప్టెంబర్‌లో ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జరుగనున్నాయి. గత జూన్‌లో అల్జీరియాకు చెందిన ఇమాన్ ఖెలిఫ్‌ను నెదర్లాండ్స్‌లో జరిగిన పోటీల్లో అనుమతించలేదు. నిర్ధారిత టెస్టుల తర్వాతే అనుమతిస్తామని తెగేసి చెప్పారు. పారిస్ ఒలింపిక్స్‌లో ఆమెతో పాటు లిన్ యూ తింగ్ (చైనీస్ తైపీ) శారీరక సామర్థ్యంలో ఉన్న తేడాల వల్ల పెను విమర్శలకు దారితీసింది. వీరిని మహిళల ఈవెంట్‌లో అనుమతించడమేంటని తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఈ నేపథ్యంలో ప్రపంచ బాక్సింగ్ లింగ నిర్ధారణ పరీక్షల్ని తప్పనిసరి చేసింది.



సాక్షి ప్లస్
శుక్రవారం। 22-8-2025



నెదర్లాండ్స్ రాజధాని ఆమ్‌స్టర్‌డ్యామ్‌లో గురువారం సెయిల్ ఆమ్‌స్టర్‌డ్యామ్ ఉత్సవం జరిగింది. ఇందులో ఓ వ్యక్తి ప్లాస్టిక్ తిమింగలం బొమ్మతో ఇలా అందరినీ ఆకర్షించారు



మధ్యధరా సముద్రం నుంచి వెలికి తీసిన పురాతన కళాఖండాలను ఈజిప్టు ప్రభుత్వం గురువారం అలెగ్జాండ్రియాలోని అబూ కిర్‌లో తీరం వెంట ఇలా ప్రదర్శనకు ఉంచింది

గాజాలో ఇజ్రాయెల్ సైనిక చర్య షురూ

- వైమానిక దాడులు, ఫిరంగి కాల్పులు..
- భయంతో నగరం నుంచి జనం పలాయనం

గాజా నగరం: గాజా నగరాన్ని ఆక్రమించుకునేందుకు ఇజ్రాయెల్ బలగాలు వేగంగా ముందుకు కదులుతున్నాయి. హమాస్‌కు గట్టి పట్టున్న గాజాను ఆక్రమించుకునే ప్రణాళిక మొదటి దశలో భాగంగా గురువారం ఇజ్రాయెల్ బలగాలు నగర శివారులోకి ప్రవేశించాయి. సెప్టెంబర్ మొదటి వారం నుంచి మొదలయ్యే క్షేత్రస్థాయి సైనిక చర్యకుగాను ఇజ్రాయెల్ ప్రభుత్వం 60 వేల రిజర్వు బలగాలను రంగంలోకి దించుతోంది. ఇప్పటికే సైనిక చర్యలో పాలుపంచుకుంటున్న మెజారిటీ జవాన్ల స్థానంలో వీరు విధులు నిర్వర్తిస్తారు. అంతేకాకుండా, మరో 20వేల మంది సైనికుల విధులను ప్రభుత్వం పొడిగించనుంది. పది లక్షలకు పైగా జనాభా కలిగిన గాజా నగరంపై గత కొన్ని రోజులుగా బాంబింగ్, ఫిరంగి కాల్పులు కొనసాగుతున్నాయి. దీంతో శివారు ప్రాంతాలైన జెయిటౌన్, సబ్రాల నుంచి వందలాదిగా పాలస్తీనియన్లు నగరంలోని ఇతర ప్రాంతాలకు ప్రాణభయంతో వలసవెళ్తున్నారు. 'బాంబుల మోత, పేలుళ్లు, ఫిరంగి కాల్పులు, యుద్ధ విమానాల రొద, అంబులెన్సులు సైరన్లు, జనం ఆర్తనాదాలతో మా ప్రాంతం రాత్రంగా ప్రతిధ్వనిస్తూనే ఉంది'అని అహ్మద్ అల్-షాంటి తెలిపారు. 'బాంబుల శబ్దాలకు మా ఇళ్లు ఊగిపోతున్నాయి. కానీ, మేము ఎక్కడికి వెళ్లాలి? అని ఆయన ప్రశ్నించారు. 'గత ఒక్క రాత్రి మాత్రమే కాదు. వారం రోజులుగా ఇదే తంతు. గాజాలోని వారెవరికీ కంటిపై కనుకు లేదు. ఫిరంగి కాల్పులు, వైమానిక దాడులు ఆగలే'అని చెప్పారు. సైనిక చర్యను ప్రారంభించేందుకు వీలుగా జెయిటౌన్, జబాలియా ప్రాంతాల్లో బుధవారం నుంచే బలగాలు తమ పనిని ప్రారంభించాయని ఇజ్రాయెల్ సైనిక ప్రతినిధి ఒకరు తెలిపారు. సైన్యం ముందుగా కొన్ని ప్రాంతాలను తాత్కాలికంగా ముట్టడిస్తుందన్నారు. గాజా నగరంలోని లక్షలాది మందిని ఖాళీ చేసి దక్షిణ గాజాకు వెళ్లిపోవాలని ఇజ్రాయెల్ బలగాలు తీవ్ర ఒత్తిడి తెచ్చే అవకాశాలున్నాయని చెబుతున్నారు. గాజా నగరంలోని వారిని ఖాళీ చేయించి, ఉత్తరగాజాలో పునరావాసం కల్పించాలని ఆరోగ్య యంత్రాంగం, అంతర్జాతీయ సహాయ సంస్థలకు సైతం తాము ముందుగానే హెచ్చరికలు జారీ చేసినట్లు ఇజ్రాయెల్ ఆర్మీ అంటోంది. ఖాళీ చేసి వెళ్లే వారికి పునరావాసం కల్పించేందుకు అవసరమైన టెంట్లను సైతం సిద్ధం చేసి ఉంచామని చెబుతోంది. అయితే, ఇజ్రాయెల్ ఆర్మీ మాత్రం ఇప్పటి వరకు ఎటువంటి హెచ్చరికలను జారీ చేయలేదు.

అలసిపోయిన ఇజ్రాయెల్ ఆర్మీ

గాజాలోని హమాస్ చెరలో ఉన్న బందీలను విడిపించే లక్ష్యంతో మొదలైన యుద్ధానికి రెండేళ్లయినా ముగింపు కనుచూపు మేరలో కనిపించడం లేదు. ఇప్పటికే పలుమార్లు విధుల్లోకి పిలిపించిన సైనికుల్లో కొందరు అసంతృప్తితో ఉన్నారని ఆర్మీ చీఫ్ సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సైనికులు ఆర్మీని విడిచి వెళ్లే ప్రమాదం సైతం ఉందని చెబుతున్నారు. సైన్యంలోని కనీసం 40 శాతం మంది ఇకపై విధుల్లో పాల్గొనేందుకు అంతగా ఆసక్తి చూపించడం లేదని, కేవలం 13 శాతం మందే ఆసక్తితో ఉన్నట్లు ఓ సర్వేలో వెల్లడైంది. మెజారిటీ ప్రజలు సైతం యుద్ధాన్ని సాధ్యమైనంత త్వరగా ముగించాలనే కోరుకుంటున్నారు. అతివాదులైన యూదులు కొందరు సైన్యంలో చేరేందుకు నిరాకరిస్తున్నారు. వారిని కూడా బలవంతంగా సైన్యంలో చేర్చేందుకు చట్టాన్ని తీసుకురావడం సైతం ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగేందుకు కారణంగా మారింది.

ఖండించిన గుటెర్రస్.. మండిపడ్డ హమాస్

ఐరాస సెక్రటరీ జనరల్ గుటెర్రస్ ఇజ్రాయెల్ చర్యను తీవ్రంగా ఖండించారు. మరణాలు, విధ్వంసాన్ని ఆపేందుకు వెంటనే కాల్పుల విరమణ ప్రకటించాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ సమాజం నుంచి తీవ్ర ఒత్తిడులు ఎదురవుతున్నా ఇజ్రాయెల్ మాత్రం ముందుగా ప్రకటించిన విధంగానే గాజా నగర ముట్టడి కొనసాగుతుందని ప్రకటించింది. ఇజ్రాయెల్ సైనిక చర్యపై హమాస్ మండిపడింది. నగరంలోని అమాయకులపై క్రూరమైన యుద్ధాన్ని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ కొనసాగిస్తున్నారంటూ నిప్పులు చెరిగింది. మధ్యవర్తులు ప్రతిపాదించిన కాల్పుల విరమణ ప్రతిపాదనను సైతం ఇజ్రాయెల్ పట్టించుకోవడం లేదని ఆరోపించింది. మిలటరీ ఆపరేషన్ కారణంగా హమాస్ వద్ద సజీవంగా మిగిలి ఉన్న బందీల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందన్న భయాందోళనలు సైతం వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఇక్కడ తీవ్రమైన మానవీయ సంక్షోభం నెలకొని ఉండగా, తాజా చర్యలు పరిస్థితిని మరింతగా దిగజార్చే ప్రమాదముందంటున్నారు.

డ్రోన్లు, క్షిపణులతో రెచ్చిపోయిన రష్యా

ఉక్రెయిన్ వ్యాప్తంగా భీకర దాడులు

కీవ్: రష్యా మరోసారి భీకర గగనతల దాడులతో ఉక్రెయిన్‌ను ఉక్కిరిబిక్కిరి చేసింది. బుధవారం రాత్రి ఏకంగా 574 డ్రోన్లు, మరో 40 వరకు బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులను ప్రయోగించింది. మూడేళ్ల యుద్ధాన్ని ముగించేందుకు దౌత్య పరమైన ప్రయత్నాలు ఊపందుకున్న వేళ ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. దేశంలోని పశ్చిమ ప్రాంతాలు లక్ష్యంగా రష్యా చేపట్టిన ఈ దాడుల్లో ఎక్కువగా జనావాసాలకు నష్టం జరిగిందని ఉక్రెయిన్ ఆర్మీ తెలిపింది. ఈ ఏడాదిలో రష్యా జరిపిన మూడో అతిపెద్ద డ్రోన్ దాడి, 8వ క్షిపణి దాడి ఇదని వివరించింది. ఈ దాడుల్లో కనీసం ఒకరు చనిపోగా 15 మంది గాయపడ్డారంది. పశ్చిమ దేశాలు అందించిన ఆయుధ సామగ్రి గోదాములు, ఉక్రెయిన్ సైనిక పారిశ్రామిక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకున్నట్లు రష్యా రక్షణ శాఖ పేర్కొంది. కొన్ని క్షిపణులు హంగరీ సరిహద్దులకు సమీపంలో పడ్డాయని, అమెరికా ఎలక్ట్రానిక్స్ ప్లాంట్ ఒకటి ధ్వంసమైందని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. ఆ సమయంలో ఫ్లెక్స్ ఫ్యాక్టరీలో 600 మంది పనిచేస్తున్నారన్నారు. వీరిలో దాడి కారణంగా ఆరుగురికి గాయాలైనట్లు వెల్లడించారు. లీవ్ నగరంపై జరిగిన దాడిలో 26 నివాస భవనాలు దెబ్బతిన్నాయన్నారు.

ముస్లిం టోపీని వద్దన్న సీఎం నితీశ్

పట్నా: బిహార్ సీఎం నితీశ్ కుమార్ మదర్సాలో జరిగిన ఓ కార్యక్రమానికి వెళ్లి ముస్లిం టోపీని ధరించేందుకు నిరాకరించడం కలకలం రేపుతోంది. రాష్ట్ర మదర్సా ఎడ్యుకేషన్ బోర్డును స్థాపించి వందేళ్లయిన సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో నితీశ్ పాల్గొన్నారు. బోర్డు సభ్యుడొకరు ముస్లిం టోపీని నితీశ్ తలపై ఉంచేందుకు ప్రయత్నించడం, దానిని ఆయన తిరస్కరించి చేత్తో పట్టుకున్నారు. అనంతరం మరోసారి మైనారిటీ శాఖ మంత్రి జమా ఖాన్ టోపీని ధరింప జేసేందుకు ప్రయత్నించడం, నితీశ్ తిరిగి ఆయన తలపైనే టోపీని ఉంచుతున్నట్లుగా ఉన్న వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. బిహార్ అసెంబ్లీకి మరికొద్ది నెలల్లోనే ఎన్నికలు జరగనుండగా చోటుచేసుకున్న ఈ పరిణామం రాజకీయంగా వివాదం రేపుతోంది. రాష్ట్ర జనాభాలో ముస్లింల వాటా 18 శాతం. పలు సీట్లలో వీరి ఓట్లే నిర్ణయాత్మకంగా ఉన్నాయి. ఇఫ్తార్ విందులకు, ఇస్లాం మత సంబంధ కార్యక్రమాలకు గతంలో వెళ్లిన ప్రతిసారీ ముస్లింల టోపీతో నితీశ్ కుమార్ ఫొటోలకు ఫోజిచ్చేవారు. ఏడాది క్రితం తిరిగి ఎన్డీఏలో చేరినప్పటి నుంచి ముస్లిం టోపీ ధరించడం లేదు. కేంద్రం తీసుకువచ్చిన వివాదాస్పద వక్ఫ్ చట్టానికి సైతం ఆయన జేడీయూ మద్దతు తెలిపింది.అప్పటి నుంచి కనీసం ఐదుగురు ముస్లిం నేతలు జేడీయూను విడిచిపెట్టారు.

18 ఏళ్ల వారికి ఆధార్ ఆపేస్తున్నాం

అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ వెల్లడి

గువాహటి: అసోంలోని 18 ఏళ్లు పైబడిన వారికి మొట్టమొదటి ఆధార్ కార్డుల జారీని అక్టోబర్ నుంచి నిలిపివేస్తున్నట్లు సీఎం హిమంత బిశ్వ శర్మ తెలిపారు. రాష్ట్రంలో ఉంటున్న అక్రమ వలసదారులు భారత పౌరసత్వం పొందకుండా అడ్డుకునేందుకు ముందు జాగ్రత్త చర్యగా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన గురువారం ప్రకటించారు. ఇప్పటి వరకు ఆధార్ పొందని 18 ఏళ్లు పైబడిన వారికి నెల గడువు ఇస్తున్నామని, ఈలోగా వారు దరఖాస్తు చేసుకోవాలని సీఎం కోరారు. 18 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీలకు మాత్రం మరో ఏడాది వరకు ఆధార్ జారీ చేస్తారని వివరించారు. గత ఏడాది కాలంగా బంగ్లాదేశ్ నుంచి రాష్ట్రంలోకి అక్రమంగా ప్రవేశించిన వారికి గుర్తించి, వెనక్కి పంపించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకు మతం వంటి ప్రాతిపదికలేవీ లేవని స్పష్టం చేశారు. అయితే, ఆధార్ నమోదుకు ఎటువంటి వయోపరిమితి లేదని, అప్పుడే పుట్టిన శిశువుకు సైతం ఆధార్ నమోదు చేయించవచ్చని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) స్పష్టం చేసింది.

ఆ సినిమాను చూశాక నిర్ణయిస్తాం

'యోగి'సినిమాపై బాంబే హైకోర్టు స్పష్టీకరణ

ముంబై: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ జీవిత కథ ఆధారంగా నిర్మించిన సినిమా 'అజయ్- ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ యోగి'కి సెన్సార్ బోర్డు క్లియరెన్స్ రాకపోవడంతో నిర్మాతలు బాంబే హైకోర్టును ఆశ్రయించారు. గురువారం జస్టిస్ రేవతి మొహితె దెరె, జస్టిస్ నీలా గోఖలేల ధర్మాసనం వీరి పిటిషన్‌పై విచారణ చేపట్టింది. అజయ్ సినిమాకు సంబంధించిన నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్‌ను సీఎం ఆదిత్యనాథ్ కార్యాలయం నుంచి తీసుకు రావాలనడాన్ని పిటిషనర్లు తప్పుబట్టారు. ప్రైవేటు వ్యక్తి(ఆదిత్యనాథ్) ప్రాథమిక హక్కులకు తామెలా పరిరక్షకులమవుతామని పేర్కొన్నారు. ఇలాంటి అభ్యంతరాలు సినీ నిర్మాతల ప్రాథమిక హక్కులను కాలరాయడమేనన్నారు. వాదనలు విన్న ధర్మాసనం సినిమాను తాము చూశాక తీర్పు వెలువరిస్తామని తెలిపింది. 'ది మాంక్ హు బికేమ్ చీఫ్ మినిస్టర్'పుస్తకం ఆధారంగా తీసిన ఈ సినిమాకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికెట్(సీబీఎఫ్‌సీ) యూపీ సీఎం కార్యాలయం నుంచి నో అబ్జెక్షన్ తీసుకురాలేకపోవడం వంటి పలు అభ్యంతరాలు లేవనెత్తింది. సీబీఎఫ్‌సీ అభ్యంతరం తెలిపిన దృశ్యాలు, భాగాలను స్పష్టంగా మార్క్ చేస్తూ ఈ సినిమా కాపీని తమకు సమర్పించాలని పిటిషనర్లను ఆదేశించింది. ఈ నెల 25వ తేదీన తదుపరి విచారణ చేపడతామంది. ఇప్పటికే 'ది మాంక్ హు బికేమ్ చీఫ్ మినిస్టర్'పుస్తకం ప్రతిని పిటిషనర్లు కోర్టుకు సమర్పించారు.

లోయలో పడిన బస్సు: ఒకరు మృతి

సాంబా: జమ్మూకశ్మీర్‌లో జమ్మూ-పఠాన్‌కోట్ హైవే మీదుగా మాతా వైష్ణోదేవి ఆలయం వైపు భక్తులతో వెళ్తున్న బస్సు లోయలో జారిపడి ఒకరు చనిపోయారు. సాంబా జిల్లాలోని జట్వాల్ వద్ద గురువారం చోటుచేసుకున్న ఈ ఘటనలో మరో 39 మంది గాయాలపాలయ్యారు. వీరంతా ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహాకు చెందిన వారని పోలీసులు తెలిపారు. టైరు పగిలిపోవడంతో బస్సు అదుపుతప్పి హైవే పైనుంచి జారిపడి పోయిందన్నారు. క్షతగాత్రులందరినీ సాంబాలోని ఆస్పత్రికి తరలించామని, తీవ్రంగా గాయపడిన ఏడుగురిని అక్కడి నుంచి విజయ్‌పూర్‌లోని ఎయిమ్స్‌లో చేర్పించామని వివరించారు.

దేవేంద్ర ఫడ్నవీస్‌తో రాజ్ ఠాక్రే భేటీ

మహారాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చ

ముంబై: మహారాష్ట్ర నవ నిర్మాణ సేన(ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ ఠాక్రే గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో సమావేశమయ్యారు. దక్షిణ ముంబైలోని ఫడ్నవీస్ అధికారిక నివాసం 'వర్ష'లో ఈ భేటీ జరిగింది. రాజ్ ఠాక్రే, ఫడ్నవీస్ సమావేశం కావడం మహారాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఫడ్నవీస్‌తో భేటీ అనంతరం రాజ్ ఠాక్రే మీడియాతో మాట్లాడారు. ప్రజా సమస్యలపై చర్చించడానికే ముఖ్యమంత్రిని కలిశానని, పోలీసు అధికారుల సమక్షంలో ప్రజంటేషన్ కూడా సమర్పించానని అన్నారు. ముంబైలో పార్కింగ్ సమస్యను పరిష్కరించాలని కోరానని తెలిపారు.

రాజ్ ఠాక్రే, ఉద్ధవ్ ఠాక్రే సోదరులు చాలా ఏళ్ల తర్వాత ఇటీవల చేతులు కలిపిన సంగతి తెలిసిందే. హిందీ భాషను వ్యతిరేకిస్తూ గత నెలలో వారిద్దరూ ఒక వేదికపై దర్శనమిచ్చారు. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన(ఉద్ధవ్)కు ఎంఎన్ఎస్ సన్నిహితంగా మారుతున్న తరుణంలో రాజ్ ఠాక్రే వ్యవహార శైలిపై ఊహాగానాలు మొదలయ్యాయి. బెస్ట్ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికల్లో ఎంఎన్ఎస్, శివసేన(ఉద్ధవ్) కలిసికట్టుగా పోటీచేశాయి. పరాజయం పాలయ్యాయి. 21 సీట్లకు గాను ఒక్క సీటు కూడా రాలేదు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోన రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తాయని చర్చ జరుగుతోంది. ఫడ్నవీస్‌ను రాజ్ ఠాక్రే కలవడాన్ని శివసేన(ఉద్ధవ్) కీలక నేత సంజయ్ రౌత్ సమర్థించారు. గతంలోనూ వారిద్దరూ కలుసుకున్నారని చెప్పారు. ముఖ్యమంత్రిని కలిసి మాట్లాడడం నేరమేమీ కాదన్నారు.

జడ్జీలకు కన్ను కొట్టండి

మహిళా లాయర్లకు జస్టిస్ కట్జూ వింత సలహా

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మార్కండేయ కట్జూ ఇటీవల తన సలహా కోరిన మహిళా లాయర్‌కు వింతైన సమాధానం ఇచ్చారు. కోర్టులో జడ్జీలకు కన్ను కొట్టాలని చెప్పారు. అనుకూలమైన ఉత్తర్వులు రావాలంటే అలాంటి పని చేయక తప్పదని అన్నారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా పంచుకున్నారు. తాను సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా పని చేసిన సమయంలో ఎంతోమంది మహిళా న్యాయవాదులు తనకు కన్ను కొట్టారని గుర్తుచేసుకున్నారు. న్యాయమూర్తి నుంచి వారికి అనుకూలమైన తీర్పులు, ఉత్తర్వులు రావడానికే ఆరాటపడ్డారని వెల్లడించారు. ఈ విషయం తెలియజేస్తూ తాజాగా సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అయితే, సోషల్ మీడియా తన పోస్టుపై విమర్శలు రావడంతో దాన్ని తొలగించారు. కోర్టులో ప్రభావవంతంగా వాదనలు ఎలా చేయాలన్న దానిపై మహిళా లాయర్ కోరిన సలహాను ఆ తర్వాత పోస్టు చేశారు. జడ్జిలకు కన్ను కొట్టు అంటూ ఆయన ఇచ్చిన సమాధానం ఇందులో కనిపిస్తోంది. జస్టిస్ మార్కండేయ కట్జూ 2006 నుంచి 2011 దాకా సుప్రీంకోర్టు జడ్జిగా పని చేశారు. అంతకముందు ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ చైర్‌పర్సన్‌గా సేవలందించారు.

నేడు బెంగాల్‌లో ప్రధాని మోదీ పర్యటన

కోల్‌కతా: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం పశ్చిమబెంగాల్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన రూ.5,200 కోట్ల విలువైన మౌలిక వనరుల ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. డమ్ డమ్‌లో జరిగే బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. పలు రాష్ట్రాల్లో బెంగాలీ మాట్లాడే వలస కార్మికులపై వేధింపులు కొనసాగుతున్నాయంటూ అధికార టీఎంసీ ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో మోదీ పర్యటిస్తుండటం గమనార్హం. బిహార్‌లో పర్యటన అనంతరం ప్రధాని మోదీ కోల్‌కతాకు చేరుకుంటారు. ఇక్కడ మూడు మెట్రో ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. ఇందులో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విమానాశ్రయంతో కోల్‌కతాతో అనుసంధానించే 13.61 కిలోమీటర్ల మెట్రో నెట్‌వర్క్ ఉంది. అదేవిధంగా, రూ.1,200 కోట్లతో చేపట్టే 7.2 కిలోమీటర్ల ఆరు లేన్ల కోనా ఎక్స్‌ప్రెస్‌వేకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేస్తారు.

తీవ్రగాయాలైనా పనిలో తలమునకలైన ఢిల్లీ సీఎం

న్యూఢిల్లీ: బుధవారం జన్ సున్వాయి కార్యక్రమంలో ప్రజల విజ్ఞప్తులను ఆలకిస్తున్న సమయంలో అనూహ్యంగా జరిగిన దాడిలో ఢిల్లీ మహిళా ముఖ్యమంత్రి రేఖా గుప్తా తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది. ఘటన జరిగినప్పుడు స్వల్పస్థాయిలో గాయపడినట్లు తొలుత వార్తలొచ్చాయి. కానీ ఆమె ఇంకా దాడి షాక్ నుంచి తేరుకోలేదని, తీవ్రంగా గాయపడ్డారని అధికార వర్గాలు తెలిపాయి. అయినప్పటికీ ముఖ్యమంత్రిగా సంబంధిత శాఖల ఫైళ్లను పరిశీలిస్తూ పనిలో తలమునకలైనట్లు ఢిల్లీ మంత్రి కపిల్ మిశ్రా తెలిపారు. అధికారిక పనుల్లో భాగంగా గురువారం ఉదయం సీఎం రేఖాను మంత్రి మిశ్రా ఆమె ఇంట్లో కలిసి ఆరోగ్యపరిస్థితి వాకబుచేశారు. దాడిచేసిన నిందితుడికి నేర చరిత్ర ఉందని, పక్కా ప్రణాళికతోనే సీఎంపై దాడి చేశాడని మంత్రి వ్యాఖ్యానించారు.

సీఎంకు అదనపు భద్రత

చుట్టూ పోలీసులున్నా సీఎంపై దాడి జరగడంతో కేంద్ర ప్రభుత్వం ఈ దాడి అంశాన్ని సీరియస్‌గా తీసుకుంది. పార్టీ సీనియర్ నాయకురాలికి అత్యంత కట్టుదిట్టమైన భద్రత కల్పించే లక్ష్యంతో ఇకమీదట జెడ్ కేటగిరీ భద్రతను సమకూరుస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రకటించింది. సీఎం అధికారిక నివాసంతోపాటు సివిల్‌లైన్స్ ప్రాంతంలోని రాజ్‌నివాస్ మార్గ్‌లో ఉన్న ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద పారామిలటరీలోని వీఐపీ సెక్యూరిటీ గ్రూప్ విభాగం ఇకపై భద్రతా వ్యవహారాలు చూసుకోనుంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కాంగ్రెస్ పార్టీలోని గాంధీల కుటుంబాలకు సైతం ఇదే గ్రూప్ ప్రస్తుతం రక్షణ కల్పిస్తోంది. సీఎం రేఖాకు ఇకపై 22 నుంచి పాతికమంది సీఆర్‌పీఎఫ్ కమెండోలు అనుక్షణం రక్షణగా ఉంటారు.

ఢిల్లీ పోలీస్ కమిషనర్ మార్పు

ప్రస్తుత ఢిల్లీ పోలీస్ కమిషనర్ నిర్లక్ష్యపూరిత భద్రతా విధానాల కారణంగానే సీఎంపై దాడి జరిగిందని భావించిన కేంద్ర ప్రభుత్వం వెనువెంటనే ఆ పదవిలోకి కొత్త వ్యక్తిని తీసుకొచ్చి కూర్చోబెట్టింది. ఎస్‌బీకే సింగ్ స్థానంలో ఇకపై 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి సతీశ్ గోల్చా ఢిల్లీ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తారని ప్రభుత్వం గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుతం సతీశ్ గోల్చా ఢిల్లీలోని తిహార్ జైలుకు డైరెక్టర్ జనరల్‌గా సేవలందిస్తున్నారు.

ఉపరాష్ట్రపతి ఎన్నికకు ఇద్దరు పరిశీలకులు: ఈసీ

న్యూఢిల్లీ: సెప్టెంబర్ 9వ తేదీన జరిగే ఉపరాష్ట్రపతి ఎన్నికలకు పరిశీలకులుగా కేంద్ర మంత్రిత్వ శాఖల్లో పనిచేసే ఇద్దరు అదనపు కార్యదర్శులను నియమించినట్లు ఎన్నికల కమిషన్(ఈసీ) గురువారం తెలిపింది. పంచాయతీరాజ్ శాఖకు చెందిన సుశీల్ కుమార్ లోహానీ, ఆర్థిక శాఖలో పనిచేసే డి.ఆనందన్ పరిశీలకులుగా వ్యవహరిస్తారంది. గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన నితిన్ కుమార్‌ను రిజర్వ్‌లో ఉంచినట్లు వివరించింది.

మా మంచి జడ్జి కన్నుమూత

నవ్వుతూ, నవ్విస్తూ, ఆలోచింపజేసిన దయామయ జడ్జి ఫ్రాంక్ కాప్రియో



ప్రొవిడెన్స్(అమెరికా): కోర్టుహాల్ అనగానే ఎంతటి సీనియర్ న్యాయవాదికి అయినా జడ్జి అంటే ఒకింత భయం, అమిత గౌరవం. ఏ మాట తూలితే ఎక్కడ కోర్టు ధిక్కారం ఉత్తర్వులు, శిక్షను ఎదుర్కోవాల్సి వస్తుందోనన్న భయం. ఇక నిందితుల సంగతి చెప్పనక్కర్లేదు. వంగి వంగి దణ్ణాలు పెడుతూ మమ్మల్ని క్షమించండి జడ్జి గారూ అనే సన్నివేశాలూ ఇప్పటికీ కొన్ని జిల్లా కోర్టుల్లో కన్పిస్తాయి. ఆ ఘటనలకూ పూర్తి అతీతంగా అమెరికాలో ఎంతో ఆహ్లాదకర వాతావరణంలో, ఎంతో సరదాగా, మరెంతో హాస్యం జోడించి తీర్పులు చెప్పే న్యాయమూర్తిగా పేరుతెచ్చుకున్న కురువృద్ధుడు, జడ్జి ఫ్రాంక్ కాప్రియో తుదిశ్వాస విడిచారు. తనదైన వాక్‌చాతుర్యం, అపార న్యాయశాస్త్ర అనుభవంతో న్యాయకోవిదుడిగా, ప్రజారంజక తీర్పులకు చిరునామాగా మారిన జడ్జి ఫ్రాంక్ 88 ఏళ్ల వయసులో బుధవారం పాంక్రియాటిక్ క్యాన్సర్‌తో పోరాడుతూ కన్నుమూశారని ఆయన అధికారిక సోషల్‌మీడియా ఖాతాలో ఒక ప్రకటన ద్వారా స్పష్టమైంది.

100 కోట్ల వీక్షణలు

అమెరికాలోని రోడ్‌ఐలాండ్ రాష్ట్రంలోని ప్రొవిడెన్స్ సిటీలో చీఫ్ మున్సిపల్ జడ్జిగా దశాబ్దాలు పనిచేసి రిటైర్ అయినఫ్రాంక్ ఆ తర్వాత అచ్చం కోర్టుహాల్ సెటప్‌లో పలు కేసుల వాదోపవాదనల ఎపిసోడ్‌లు చేసి ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను సొంతం చేసుకున్నారు. ఈయన చేసిన వీడియోలు యూట్యూబ్‌లో ఏకంగా 100 కోట్ల వీక్షణలు దాటాయంటే ఆయన ఎంత హృద్యంగా, సుతిమెత్తగా, సూటిగా తీర్పులు చెప్తారో అర్థంచేసుకోవచ్చు. శిక్షను ఎదుర్కొంటున్న నిందితులతోపాటు నిందితుల కుటుంబసభ్యులతోనూ నేరుగా సహానుభూతితో మాట్లాడి కేసుకు సరైన న్యాయం చేస్తూ తీర్పు చెప్పే విధానం కోట్లాది మందిని మెప్పించింది. చిన్నచిన్న తప్పులు చేసి నిందితులుగా ముద్రపడిన వ్యక్తులను సున్నితంగా, నవ్వుతూ మందలిస్తూ కేసులు కొట్టేసిన సందర్భాలు కోకొల్లలు. ఈయన చీఫ్ మున్సిపల్‌జడ్జిగా 1985 నుంచి రిటైర్ అయ్యేదాకా అంటే 2023ఏడాదిదాకా ఏకంగా 40 ఏళ్లపాట సేవలందించారు. చిన్నపాటి తప్పిదాలు చేసిన మీ తల్లిదండ్రులకు ఎలాంటి శిక్ష విధించాలో నువ్వే చెప్పు అంటూ వాళ్ల చిన్నారులకే ధర్మాసనం వద్దకు పిలిపించి వారితోనే తీర్పులు చదివించిన సందర్భాలూ ఉన్నాయి. ఎంతో దయతో తీర్పులు చెప్పే జడ్జిగా ఆయన పేరు మార్మోగిపోయింది. 2018 నుంచి 2020 ఏడాదిదాకా 'కాట్ ఇన్ ప్రొవిడెన్స్' పేరుతో ఆయన కోర్టు సీన్లతో టీవీ సిరీస్ చేశారు. ఆ సిరీస్‌ల ఆన్‌లైన్ వీక్షణలు కోట్లు దాటేశాయి. పారదర్శకత, దయతో తీర్పులు ఇవ్వాలని జడ్జి ఎప్పుడూ చెబుతుండేవారు.

ఈ ప్రభుత్వం దొంగ ఓట్లతో ఏర్పాటైందే

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్య

న్యూఢిల్లీ: ప్రస్తుత ప్రభుత్వం దొంగ ఓట్లతో అధికారంలోకి వచ్చిందేనంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కేంద్రంపై విరుచుకుపడ్డారు. బాధ్యతతో వ్యవహరించే నిజమైన నాయకులకే ఓట్లు వేయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన ఎక్స్‌లో ఒక వీడియో షేర్ చేశారు. ఓటర్ అధికార్ యాత్ర సమయంలో బిహార్‌లోని ఔరంగాబాద్‌లో యువతతో చేసిన సంభాషణ అందులో ఉంది. భారత మాతను, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు ఓటును ఆయుధంగా వాడుకోవాలని వారిని కోరారు. స్వేచ్ఛగా ఎన్నికలు జరగాలంటే కచ్చితమైన ఓటరు జాబితాయే కీలకమన్నారు. ఓటు హక్కును మరొకరు లాక్కోకుండా చూడాలని ప్రజలను కోరారు. ఇతర హక్కులన్నిటికీ ఇదే కీలకమైందని చెప్పారు. బతికున్న వారిని సైతం చచ్చిపోయిన వారిగా తేల్చి, వారి పేర్లను ఓటరు జాబితాలో నుంచి తీసివేశారని ఆరోపించారు. జీఎస్‌టీ, నోట్ల రద్దు గురించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అదేవిధంగా, బిహార్‌లో ఏం మారాలనుకుంటున్నారని ప్రశ్నించగా వారిలో కొందరు నితీశ్ ప్రభుత్వం మారాలనుకుంటున్నామంటూ బదులిచ్చారు. 'ప్రియమైన ఓటరులారా, నేను మిమ్మల్ని నేరుగా ఒకే ఒక ప్రశ్న అడగాలనుకుంటున్నా.. దొంగ ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, ప్రజలకు సేవ చేయాలని ఎప్పుడైనా అనుకుంటుందా? లేనే లేదు.. అదేవిధంగా, వారికి మీ ఓట్లు అవసరం లేదు, మీ సమస్యలతోనూ పనిలేదు'అని రాహుల్ పేర్కొన్నారు. 'దేశంలో రికార్డు స్థాయికి నిరుద్యోగ సమస్య చేరుకుంది. ఈ సమస్య దేశ యువత భవిష్యత్తును నాశనం చేస్తోంది. ప్రభుత్వం మాత్రం వాణిజ్యవేత్తల ఖజానాను నింపుతోంది'అని రాహుల్ ఆరోపించారు. 'నీట్, ఎస్ఎస్‌సీ కుంభకోణాలు, పేపర్ లీకులు లక్షలాది మంది విద్యార్థుల కెరీర్‌ను నాశనం చేస్తున్నాయి. వాటిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఆర్థిక మాంద్యం ఆకాశాన్ని తాకుతోంది. సామాన్యుడు బతకడం కష్టసాధ్యమైన వ్యవహారంగా మారిపోయింది. అయినప్పటికీ ప్రభుత్వం పన్నులు పెంచుతూ పోతోంది'అని ఆరోపించారు. 'మీరు చచ్చినా బతికినా బాధలు పడ్డా..ప్రభుత్వానికి పట్టదు. ప్రజలు ఓటేసినా వేయకున్నా దొంగ ఓట్లతో తిరిగి అధికారంలోకి రావచ్చన్న ధీమాతో ప్రభుత్వం ఉంది'అని రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'మీ కోసం పనిచేసే, మీకు బాధ్యత వహించే, భారత మాతను కాపాడే, రాజ్యాంగాన్ని రక్షించే వారికి మీ ఓటు వేయండి' అంటూ పిలుపునిచ్చారు.



గురువారం బిహార్‌లో ఓటర్ అధికార్ యాత్రలో అభివాదం చేస్తున్న రాహుల్

కర్నాటక రోడ్లపై మళ్లీ బైక్ ట్యాక్సీలు

బెంగళూరు: కర్నాటక హైకోర్టు ఆదేశాలతో రాష్ట్రంలోని రోడ్లపైకి బైక్ ట్యాక్సీలు మళ్లీ వచ్చేశాయ్..! కోర్టు ఉత్తర్వులు వెలువడిన వెంటనే ఉబెర్, ఓలా, ర్యాపిడో ఆన్‌లైన్ వేదికల్లో బైక్ ట్యాక్సీ ఫీచర్ అందుబాటులోకి వచ్చింది. హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం తీర్పుతో జూన్ 16వ తేదీ నుంచి బైక్ ట్యాక్సీ సేవలు నిలిచిపోయాయి. అయితే, ఆగస్టు 20వ తేదీన జరిగిన విచారణ సందర్భంగా నిషేధం చట్టబద్ధం కాదంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు తప్పుబట్టింది. అధికారిక విధానం లేదనే ఆరోపణలపై లక్షలాది మంది జీవితాధారాన్ని దెబ్బతీయడం సరికాదని హితవు పలికింది. దేశంలోని 13 రాష్ట్రాల్లో ప్రస్తుతం బైక్ ట్యాక్సీ సేవలు అందుబాటులో ఉన్నాయని ప్రధాన న్యాయమూర్తి విబు బఖ్రు గురువారం తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో రవాణాకు అత్యవసరమైన, చట్టబద్ధమైన సౌకర్యంగా పేర్కొన్నారు. నిషేధం కారణంగా ఎంతోమంది వీధిన పడ్డారన్నారు. హైకోర్టు తాజా ఉత్తర్వుల ఫలితంగా రాష్ట్రంలోని 6 లక్షల మంది రైడర్లకు మేలు జరిగిందని కర్నాటక బైక్ ట్యాక్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆది నారాయణ చెప్పారు. కాగా, దీనిపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రామలింగా రెడ్డి స్పందించాల్సి ఉంది.

సిపాయిల తిరుగుబాటు ఎక్కడ ప్రారంభమైంది?



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

1857 సిపాయిల తిరుగుబాటు

దేశానికి స్వాతంత్ర్యం రావడానికి 90 ఏళ్ల ముందే సిపాయిల తిరుగుబాటు మీరట్‌లో ప్రారంభమైంది. ఆ సమయంలో లార్డ్ కానింగ్ గవర్నర్ జనరల్‌గా వ్యవహరించారు. సిపాయిల తిరుగుబాటు కాలంలో ఢిల్లీ సైనికులు మొగల్ చక్రవర్తి రెండో బహదూర్‌షాను పాదుషాగా ప్రకటించారు. సిపాయిల తిరుగుబాటు సమయంలో ఢిల్లీ ముట్టడిలో ఆంగ్లేయులు సాగించిన దారుణ హింసాకాండను గాలిబ్ అనే ఉర్దూ కవి వర్ణించాడు.

సిపాయిల తిరుగుబాటుకు అయోధ్యలో హజ్రత్ బేగం నేతృత్వం వహించగా, ఝాన్సీలో లక్ష్మీబాయి, మధ్య భారతదేశంలో తాంతియా తోపే నాయకత్వం వహించారు.

ఈ తిరుగుబాటును అణచి వేయడంలో ప్రముఖపాత్ర వహించిన బ్రిటిష్ సేనానులు సర్‌జేమ్స్, అవుట్రామ్, హూవ్‌లాక్, నికల్‌సన్, నెయిల్ లారెన్స్, కాంప్‌బెల్, సర్ రోజ్‌వుడ్.

తిరుగుబాటుకు కారణాలు

డల్హౌసీ అనుసరించిన దురాక్రమణ విధానం రాజకీయ కారణం కాగా, బ్రిటిషర్ల నూతన ఆర్థిక విధానం ఆర్థిక కారణమైంది. హైందవ సాంఘిక వ్యవస్థను ఖండించటం సాంఘిక కారణమైతే భారత్, ఐరోపా సైనికుల మధ్య ఉన్న తారతమ్యం సైనిక కారణమైంది.

రాజకీయ కారణాలు

తిరుగుబాటుకు ప్రధాన కారకుడు గవర్నర్ జనరల్ లార్డ్ డల్హౌసీ. ఈయన రాజ్య సంక్రమణ సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టి సతారా, జైపూర్, సంబాల్‌పూర్, ఝాన్సీ తదితర రాజ్యాలు ఆక్రమించుకున్నాడు. అస్తవ్యస్త పాలన సాకుతో అవధ్ (యూపీ)ను కూడా ఆక్రమించాడు.

పీష్వా రెండో బాజీరావు దత్త పుత్రుడు నానా సాహెబ్ (ధొండు పంత్). డల్హౌసీ ఇతడి పెన్షన్‌ను నిలిపివేశాడు. నానాసాహెబ్‌కు మద్దతుగా అతడి సోదరుడు రావు సాహెబ్ పోరాడాడు.

బ్రిటిషర్లు మొగల్ చక్రవర్తి బిరుదును రద్దు చేశారు. చక్రవర్తి కుటుంబీకులు ఎర్రకోటను వదలి వెళ్లాలన్న బ్రిటిష్ కంపెనీ ఆజ్ఞలు భారతీయ ముస్లింలకు బాధ కలిగించాయి. డల్హౌసీ అయోధ్యను ఆక్రమించడంతో అనేక మంది ప్రభువులు, అధికారులు, సైనికులు, నిరుద్యోగులయ్యారు. బ్రిటిషర్లు వారికి ఉపాధి కల్పించలేదు. జమీందార్లు, తాలుక్‌దార్ల భూములను బ్రిటిషర్లు ఆక్రమించారు. ఇది అయోధ్యలో అన్ని వర్గాల ప్రజలకు తీరని అసంతృప్తి కలిగించింది. సంస్థానాధీశుల కొలువు నుంచి బ్రిటిషర్లు సైనికులను తొలగించారు. దీంతో వారు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడే అవకాశం కోసం ఎదురు చూశారు.

ఆర్థిక కారణాలు

ప్రజల్లో బ్రిటిష్ పరిపాలన పట్ల వ్యతిరేకతకు వారు అనుసరించిన ఆర్థిక దోపిడీ విధానమే ప్రధాన కారణం. బ్రిటిషర్లు తమ దేశ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచుకోవడానికి భారతదేశ సంపదలను కొల్లగొట్టారు. మనదేశం నుంచి ముడి సరకులను ఇంగ్లండ్‌కు చేరవేశారు. ఇక్కడ తయారైన పట్టు, నూలు వస్త్రాలు విదేశాలకు ఎగుమతి చేయకుండా అడ్డుకున్నారు. వాటిపై సుంకాలు విధించారు. దీంతో స్వదేశీ పరిశ్రమలు మూతపడ్డాయి. పేదరికం ప్రబలి, దేశం కరవు కాటకాలకు నిలయమైంది. సాధారణ ప్రజలు తమ పరిస్థితులను మెరుగుపర్చుకొనే ఉద్దేశంతో తిరుగుబాటుదారులతో చేతులు కలిపారు. సంస్థానాలను బ్రిటిషర్లు ఆక్రమించడం అనేక అనర్థాలకు దారితీసింది. రాజుల అధికారం చేజారింది. వారి సైన్యాలు రద్దయ్యాయి. దీంతో సైనికులు జీవనాధారం కోల్పోయారు. బ్రిటిషర్లు మాత్రం ఉన్నత పదవుల్లో నియమితులయ్యారు. విద్యావంతులైన భారతీయులను కూడా ఉన్నతోద్యోగాలకు అర్హులుగా భావించలేదు. ఉన్నత పదవులకు భారతీయులు అనర్హులని బహిరంగంగా బ్రిటిషర్లు చాటి చెప్పారు. వారి ఆర్థిక విధానం భారతీయ రైతాంగాన్ని, చేతిపని వారిని, స్థానిక ప్రభువులను.. అందరినీ కుంగదీసింది.

సాంఘిక కారణాలు

బ్రిటిషర్లు భారతీయులను తక్కువ జాతివారిగా పరిగణించేవారు. సాంఘికంగా భారతీయులంటే వారికి చిన్నచూపు. భారతీయ స్త్రీలను అగౌరవ పర్చడం, భౌతిక హింసలకు గురి చేయడం, అవి కొన్నిసార్లు మరణాలకు దారి తీయడం లాంటి సంఘటనలు సర్వసాధారణం. మొదటి తరగతి రైల్వే బోగీల్లో భారతీయులు ప్రయాణించడానికి అనుమతించేవారు కాదు. సాంఘిక సమావేశాల్లో ఆంగ్లేయులతో కలవకుండా భారతీయులను దూరంగా ఉంచేవారు. యూరోపియన్లు నడిపే హోటళ్లు, క్లబ్బుల్లో భారతీయులకు ప్రవేశం లేదు. ఆగ్రాలో మెజిస్ట్రేట్ ప్రకటించిన రెగ్యులేషన్ భారతీయుల పట్ల బ్రిటిషర్ల వైఖరికి అద్దం పట్టింది. ఈ రెగ్యులేషన్ పాటించనందుకు గొప్ప సంస్కర్త అయిన రాజా రామ్మోహన్‌రాయ్ కూడా అవమానానికి గురయ్యాడు. ఈ రకమైన వేధింపులకు గురైన భారతీయులకు చాలా సందర్భాల్లో బ్రిటిష్ న్యాయమూర్తులు న్యాయం చేయలేదు.

మత కారణాలు

బ్రిటిషర్లకు హిందూమతం పట్ల ఉన్న అభిప్రాయం భారతీయుల్లో తీవ్ర అసంతృప్తిని రేకెత్తించింది. భారతీయులను క్రైస్తవంలోకి మార్చడానికి ప్రయత్నిస్తున్నారని భయాందోళనలకు గురయ్యారు. 1813 చార్టర్ చట్టానికి ముందు క్రైస్తవ మిషనరీలను దేశంలోకి అనుమతించేవారు కాదు. 1813 చార్టర్ చట్టంతో ఈ నిబంధన ఎత్తివేశారు. దీంతో అనేక మిషనరీలు భారతదేశానికి రావడం ప్రారంభమైంది. మిషనరీలు దేశంలో, ముఖ్యంగా అనేక వెనుకబడిన ప్రాంతాల్లో విద్యా సంస్థలను స్థాపించి, విద్యాబోధన చేసేవి. విద్యార్థులను క్రైస్తవ మతంలోకి మార్చడమే వీటి ధ్యేయం. మిషనరీలు స్థాపించిన పాఠశాలల్లో బైబిల్ పఠనం తప్పనిసరి. జైళ్లలో ఉన్న ఖైదీలు క్రైస్తవ మతాన్ని స్వీకరించేలా అనేక విధాలుగా ప్రలోభాలకు గురి చేసేవారు.వారికి క్రైస్తవ గ్రంథాలను బోధించేవారు. క్రైస్తవులుగా మారిన వారిని జైలు నుంచి విడుదల చేసేవారు.

సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ ప్రకారం..

1837 కరవు కాటకాల సమయంలో మిషనరీలు అనేక మంది అనాథలను క్రైస్తవ మతంలోకి మార్చాయి. మిషనరీలు క్రైస్తవాన్ని వ్యాప్తి చేయడానికి ధనాన్ని ఆశగా చూపేవి. ఆ మతంలోకి మారిన వారికి ఉద్యోగాలు ఇచ్చి, గౌరవ మర్యాదలు కల్పించారు. ప్రజల్లో అనుమానాలు సృష్టించేలా బ్రిటిష్ ప్రభుత్వం కొన్ని చట్టాలు చేసింది. ఉపయోగపడే సాంఘిక చట్టాలనూ ప్రజలు అపార్థం చేసుకున్నారు. విలియం బెంటింగ్ 1829లో సతీ సహగమనాన్ని నిషేధించాడు. దీన్ని హిందూ ఉదారవాదులు సమర్థించారు. కానీ సాధారణ ప్రజలు ప్రభుత్వ ఉద్దేశాలను అనుమానించారు. 1832-50 మధ్య కాలంలో ఆస్తి వారసత్వానికి సంబంధించిన చట్టాలను కంపెనీ ప్రవేశపెట్టింది. 1856లో రిలిజియస్ డిజేబిలిటీస్ యాక్ట్, వితంతు పునర్వివాహ చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఈ చట్టాలతో ప్రభుత్వం తమ సాంఘిక, మత విషయాల్లో జోక్యం చేసుకుంటుందని ప్రజలు భావించారు.

సైనిక కారణాలు

భారతీయ సైనికుల్లో అసంతృప్తికి హిదాయత్ అలీ కింది కారణాలను పేర్కొన్నారు.

బెంగాల్ సైన్యంలో ఎక్కువ మంది సైనికులు అయోధ్య ప్రాంతానికి చెందినవారు. బ్రిటిష్ సామ్రాజ్యంలో అయోధ్యను కలపడంతో వీరు కోపోద్రిక్తులయ్యారు.

పంజాబ్‌ను బ్రిటిష్ ఇండియాలో కలిపాక, సైన్యంలో చేరే సిక్కు, ముస్లిం సైనికులకు గడ్డం లేదా జుట్టు తీసివేసే షరతు పెట్టబోమన్నారు. కానీ తర్వాతి కాలంలో జుట్టు తొలగించాలని ఆజ్ఞాపించారు. ధిక్కరించిన వారిని ఉద్యోగాల నుంచి తొలగించారు. బ్రిటిషర్లు 1856 సెప్టెంబర్‌లో ఒక ఆజ్ఞ జారీ చేశారు. దీని ప్రకారం కొత్తగా నియమితులయ్యే సైనికులు ఏ ప్రాంతానికైనా వెళ్లి యుద్ధం చేస్తామని ప్రతిజ్ఞ చేయాలి. సముద్ర యానం చేస్తే కులభ్రష్టులవుతారనే నమ్మకం హిందువుల్లో ఉండేది. ఇది బ్రిటిషర్ల పట్ల సైనికుల అనుమానాలు బలపడేలా చేసింది.

తక్షణ కారణం

కొవ్వు పూసిన తూటాల వదంతి వ్యాపించింది. ఇది హిందూ, ముస్లిం సైనికుల మనోభావాలను దెబ్బతీసింది. దాంతో సైనిక కవాతులో పాల్గొనరాదని 1857 ఫిబ్రవరి 20న బరంపూర్‌లోని పదాతిదళం నిర్ణయించింది. 1857 మార్చి 29న 34వ దేశీయ పటాలానికి చెందిన మంగళ్‌పాండే ఆంగ్లేయాధికారిపై కాల్పులు జరిపి తిరుగుబాటుకు అంకురార్పణ చేశాడు. తర్వాత అతడిపై విచారణ జరిపి ఏప్రిల్ 8న బహిరంగంగా ఉరితీశారు. దాన్ని తిరుగుబాటుగా భావించని కంపెనీ పాలకులు అదొక చిన్న సంఘటనగా, కేవలం హైందవ మేధావి వర్గ ఉద్యమమని భావించారు. త్వరలోనే సమసిపోతుందనుకున్నారు.

తిరుగుబాటు విఫలం కావడానికి కారణాలు

సిపాయిలు తిరుగుబాటు చేసే సమయానికి కంపెనీ సైన్యంలో ఏడుగురు సిపాయిలకు ఒక ఆంగ్ల సైనికుడు మాత్రమే ఉన్నాడు. ప్రజలు కూడా సిపాయిలకు మద్దతు ఇచ్చారు. తిరుగుబాటుదారులు విప్లవ ప్రారంభ దశలో ఢిల్లీని వశపర్చుకున్నారు. తర్వాత ఆగ్రా, కలకత్తాల మధ్య ఉన్న ప్రసార సాధనాలను ధ్వంసం చేశారు. తొలి దశలో వారు బ్రిటిషర్లను ఇబ్బందులకు గురి చేసినా, తర్వాత ఆంగ్లేయులు తిరుగుబాటుదార్లను ప్రతిఘటించారు.

విప్లవం విఫలం కావడానికి అనేక కారణాలున్నాయి. తిరుగుబాటు కొద్ది ప్రాంతానికే పరిమితం కావడం, యావత్తు దక్షిణ భారతదేశం, పంజాబ్ ఉత్తర ప్రాంతం, పశ్చిమ రాజస్థాన్, గుజరాత్, మధ్యభారతం, బెంగాల్‌లో తిరుగుబాటు ప్రభావం లేదు. ఢిల్లీ, అయోధ్య, బిహార్, రోహిల్‌ఖండ్, దాని పరిసర ప్రాంతాలకే తిరుగుబాటు పరిమితమైంది. అందువల్ల విప్లవాన్ని అణచివేయడం ఆంగ్లేయులకు తేలికైంది.

తిరుగుబాటుదారుల కంటే బ్రిటిషర్లకు మెరుగైన వనరులున్నాయి. క్రమేణా బ్రిటిషర్ల సైన్యం పెరిగింది. సుమారు 1.12 లక్షల బ్రిటిష్ సైన్యాన్ని ఇండియాకు తరలించారు. సుమారు 3.10 లక్షల మంది భారతీయులను కొత్తగా సైన్యంలో చేర్చుకున్నారు. తిరుగుబాటుదారులు సంప్రదాయ ఆయుధాలతో యుద్ధం చేస్తే, బ్రిటిష్ సైన్యం కొత్తగా ప్రవేశపెట్టిన రైఫిల్స్‌ను ఉపయోగించింది. టెలిగ్రాఫ్ సదుపాయం ఆంగ్లేయులకు చాలా ఉపయోగకరంగా మారింది. దీని వల్ల సిపాయిల వ్యూహాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి వీలైంది.

అనేక మంది స్వదేశీ రాజులు బ్రిటిషర్లకు సహాయపడ్డారు. పాటియాల, సింధ్, గ్వాలియర్, హైదరాబాద్ మొదలైన సంస్థానాధీశులు ఆంగ్లేయులకు సహాయం చేశారు. నేపాల్ రాజు తన సైన్యాన్ని బ్రిటిషర్ల ఆధీనంలో ఉంచాడు.

తిరుగుబాటుదారుల్లో సమర్థవంతమైన నాయకత్వం కొరవడింది. బహదూర్‌షా వృద్ధుడు, అతడి కుమారులు నిష్ప్రయోజకులు. లక్ష్మీబాయి వీరవనిత అయినప్పటికీ, ఆంగ్లేయులతో పోరాడే శక్తియుక్తులు ఆమెకు లేవు. లారెన్స్, హ్యూరోస్, హల్‌రాక్, నికల్సన్ వంటి సుప్రసిద్ధ సేనానుల సేవలు లభించడంతో ఆంగ్లేయుల విజయం సులభమైంది. తిరుగుబాటుకు ఒక నిర్ణీత పథకం గానీ, నిర్దిష్ట కార్యక్రమం గానీ లేవు. తిరుగుబాటుదారుల ఆశయాలు వేరు, వారిలో ఐకమత్యం లేదు. పీష్వా పదవి కోసం నానాసాహెబ్, దత్తత అంగీకరించకపోవడం వల్ల లక్ష్మీబాయి తిరుగుబాటు చేశారు. తిరుగుబాటుదారుల్లో జాతీయాభిమానం, దేశాభిమానం ఉన్నా వారికి సరైన మార్గదర్శకత్వం లేదు. తిరుగుబాటుదారులంతా ఒకేసారి తిరుగుబాటు చేయలేదు. ఎవరికి వారు ఒంటరిగా పోరాడి ఓడిపోయారు. తిరుగుబాటు ఎక్కువ భాగం కొన్ని నగరాలకు మాత్రమే పరిమితమైంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు తిరుగుబాటులో పాల్గొనలేదు. కాబట్టే ఇది ప్రజల ఉద్యమంగా రూపాంతరం చెందలేదు.

బెంగాల్ సైనికులు పౌరుల పట్ల దూకుడు ప్రదర్శించేవారు. వారి ప్రవర్తన సరిగా ఉండేది కాదు. ప్రజలు వారిని ద్వేషించారు. అనేక ప్రాంతాల్లో ప్రజలే వారిని అణచివేశారు.

1857లో ఇంగ్లండ్‌కు అంతర్జాతీయంగా పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. క్రిమియా యుద్ధంలో గెలుపొందడంతో బ్రిటిషర్లకు రష్యా బెడద తొలగిపోయింది. పర్షియాతో యుద్ధం కూడా ముగిసింది. దీంతో బ్రిటన్ తన సైన్యాన్ని భారతదేశానికి మళ్లించగలిగింది. తిరుగుబాటుదారుల్లో వ్యక్తిగత అసూయలు చోటు చేసుకున్నాయి. ఈ అసూయలే తిరుగుబాటు విఫలమయ్యేందుకు దోహదం చేశాయి.

1857 తిరుగుబాటు స్వభావం

సిపాయిల తిరుగుబాటు స్వభావం మీద చరిత్రకారులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. కొంతమంది దీన్ని సిపాయిల పితూరీ అని, మరికొందరు క్రైస్తవుల మీద జరిగిన మత యుద్ధమని లేదా తెల్లవారికి, నల్లవారికి మధ్య జరిగిన యుద్ధమని, హిందూ, ముస్లింలు కలిసి బ్రిటిషర్ల మీద పన్నిన కుట్ర అని పేర్కొన్నారు. చాలా మంది ఆధునిక భారత చరిత్రకారులు దీన్ని 'భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం'గా అభివర్ణించారు.

సిపాయిల పితూరీ

సిపాయిలు తరచూ సొంత కారణాలతో తిరుగుబాటు చేయడం వల్ల సర్‌జాన్ లారెన్స్, సర్‌సీలే, స్మిత్, మార్ష్‌మన్ మొదలైన చరిత్రకారులు ఇది కేవలం సైనికుల తిరుగుబాటుగా భావించారు. అందుకే దీన్ని సిపాయిల పితూరీ లేదా సిపాయిల తిరుగుబాటుగా పిలిచారు. కానీ ఇది వాస్తవదూరం. అనేక మంది పౌరశాఖ ఉద్యోగులు, ప్రజలు కూడా తిరుగుబాటులో పాల్గొన్నారు. తిరుగుబాటుకు కేవలం సైనిక కారణాలే కాకుండా అనేక మత, సాంఘిక, ఆర్థిక కారణాలు కూడా దోహదం చేశాయి.

జాతి సంఘర్షణ

కొందరు చరిత్రకారులు ఈ తిరుగుబాటును తెల్లవారికి, నల్లవారికి మధ్య జరిగిన సంఘర్షణ అని అభిప్రాయపడ్డారు. ఈ దృక్పథం సరైంది కాదు. జె.బి.మోడ్లీ ప్రకారం ప్రతి తెల్ల జాతీయుడికి 20 మంది నల్ల జాతి సైనికులు ఉన్నారు. అనేక మంది భారతీయులు ఆంగ్లేయుల తరఫున పోరాడారు. భారతీయులంతా తిరుగుబాటులో పాల్గొనలేదు.

టి.ఆర్.హోల్‌మస్ అనే చరిత్రకారుడు సిపాయిల తిరుగుబాటును 'నాగరికతకు, అనాగరికతకు మధ్య జరిగిన సంఘర్షణ' అని పేర్కొన్నాడు. కానీ ఈ ధోరణి సరికాదని, భారత సంస్కృతి మహోన్నతమైందని విమర్శకులు దీటుగా సమాధానమిచ్చారు.

తిరుగుబాటు ఫలితాలు

1857 తిరుగుబాటు విఫలం కావడంతో భారతదేశ దాస్య శృంఖలాలు మరింత బిగిసిపోయాయి. తిరుగుబాటు ఒక శకాన్ని ముగించి, మరొక శకారంభానికి పునాది వేసిందని చెప్పొచ్చు. సామ్రాజ్య విస్తరణ స్థానంలో ఆర్థిక దోపిడీకి నాంది పలికింది. జాతీయ తత్వాన్ని అలవర్చుకున్న ప్రగతిశీల శక్తుల స్వభావాన్ని బ్రిటిష్ సామ్రాజ్యవాదులు సవాల్‌గా ఎదుర్కోవాల్సి వచ్చింది. తిరుగుబాటు ఫలితంగా కంపెనీ పాలన రద్దయింది. దాని స్థానంలో బ్రిటిష్ ప్రభుత్వ ప్రత్యక్ష పాలన ఆరంభమైంది. బ్రిటన్ రాణి విక్టోరియాను భారత సామ్రాజ్ఞిగా ప్రకటించారు. 1858 నవంబర్ 1న వెలువడిన ఈ ప్రకటనను లార్డ్ కానింగ్ అలహాబాద్‌లో చదివారు.

భారతదేశ ఆధునిక విద్యా పితామహుడు ఎవరు?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

పర్‌స్పెక్టివ్ ఇన్ ఎడ్యుకేషన్

ఉపాధ్యాయ నియామక పరీక్ష రాసే అభ్యర్థుల విజయంలో కీలక పాత్ర వహించే అంశం విద్యాదృక్పథాలు. ఈ విభాగంలో విద్య చరిత్రాత్మక అంశాలు, సమకాలిన అంశాలు, విద్యా విజ్ఞానానికి సంబంధించిన అంశాలు ఉంటాయి. విద్యా దృక్పథాలు అనే అంశాన్ని సరళంగా ఎడ్యుకేషనల్ జి.కె.గా పేర్కొంటారు. ఈ విభాగంలో అధిక భారత్వం కలిగి, లోతైన అధ్యయనానికి అవకాశం ఉన్న అంశం విద్యా చరిత్ర. విద్యా చరిత్రలో ఒక కీలక అంశం బ్రిటిష్ విద్యావిధానంలో ముఖ్య అంశాలు, మాదిరి ప్రశ్నలు గురించి తెలుసుకుందాం.

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) విద్య అనేది భారతీయులను మేధావులుగా తీర్చిదిద్దేలా ఉండాలి - మెకాలే ప్రతిపాదన
   బి) విద్య అనేది భారతీయులను గుమాస్తాలుగా తయారు చేసేదిగా ఉండాలి - వుడ్స్ ప్రతిపాదన.
   1) ఎ, బి రెండూ సరైనవే
   2) ఎ సరైంది, బి సరికాదు
   3) ఎ సరికాదు, బి సరైంది
   4) ఎ, బి రెండూ సరికావు
2. జతపరచండి.
   జాబితా - I
   i) అబ్జర్వేషన్స్
   ii) స్కూల్ అండ్ స్కూల్ బుక్ సొసైటీ
   iii) పుణె సంస్కృత కళాశాల
   iv) సెయింట్ ఆన్స్ పాఠశాల
   జాబితా - II
   a) కెప్టెన్ కెండీ
   b) ఫ్రాన్సిస్ జేవియర్
   c) ఎల్ఫిన్‌స్టన్
   d) చార్లెస్ గ్రాంట్
   1) i-b, ii-c, iii-d, iv-a
   2) i-d, ii-c, iii-b, iv-a
   3) i-d, ii-c, iii-a, iv-b
   4) i-d, ii-a, iii-c, iv-b
3. కింది వాటిలో సరికానిది ఏది?
   1) మనదేశంలో ఆంగ్ల విద్య ప్రవేశ పెట్టడానికి కారణం - మెకాలే మినట్స్
   2) యుద్ధానంతర విద్యా పథకం-శార్జర్ కమిషన్
   3) భారతీయ విద్యకు మాగ్నాకార్టా - వుడ్స్ నివేదిక
   4) తొలి భారతీయ కమిషన్ - హంటర్ కమిషన్
4. కింది వాటిలో వుడ్స్ నివేదికలోని అంశం కానిది ఏది?
   1) ప్రతి రాష్ట్రానికి ప్రజా విద్యా నిర్దేశక శాఖ ఏర్పాటు చేయాలి
   2) కలకత్తా, బొంబాయి, మద్రాస్ నగరాల్లో విశ్వవిద్యాలయాలు స్థాపించాలి
   3) అధోముఖ వడపోత సిద్ధాంతం ద్వారా ఆంగ్ల విద్యను అందించాలి
   4) గ్రాంట్ - ఇన్- ఎయిడ్ విధానాన్ని రూపొందించాలి
5. జతపరచండి.
   జాబితా - I
   i) హలక్ బంధీ పాఠశాలలు
   ii) గాంధీజీ ప్రాతిపదిక విద్య
   iii) తొలి ఉపాధ్యాయ కళాశాల
   జాబితా - II
   a) వార్ధా
   b) ఆగ్రా
   c) ట్వింక్వీ బార్
   1) i-a, ii-b, iii-c
   2) i-b, ii-a, iii-c
   3) i-b, ii-c, iii-a
   4) i-c, ii-b, iii-a
6. కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) ప్రాథమిక విద్యావ్యాప్తిని స్థానిక సంస్థలకు అప్పగించాలి - హంటర్ కమిషన్ సూచన
   బి) ప్రజ్ఞ, నైతికత అభివృద్ధి చెందేదిగా విద్య ఉండాలి - వుడ్స్ ప్రతిపాదన
   సి) భారతీయ భాషల మాధ్యమంలోనే విద్యను అందించాలి - మెకాలే మినట్స్‌లో అంశం
   1) ఎ, బి మాత్రమే
   2) ఎ, బి, సి మూడూ సరైనవే
   3) ఎ, బి, సి మూడూ సరికావు
   4) ఎ, సి మాత్రమే
7. జతపరచండి.
   జాబితా - I
   i) వుడ్స్ నివేదిక
   ii) మెకాలే మినట్స్
   iii) హంటర్ కమిషన్
   iv) తొలి విశ్వవిద్యాలయ కమిషన్
   జాబితా - II
   a) 1902 b) 1854
   c) 1835 d) 1882
   1) i-b, ii-c, iii-a, iv-d
   2) i-b, ii-c, iii-d, iv-a
   3) i-b, ii-a, iii-c, iv-d
   4) i-b, ii-d, iii-c, iv-a
8. నియామక సంవత్సరాలకు అనుగుణంగా కింది వాటిని అవరోహణ క్రమంలో అమర్చండి.
   ఎ) శార్జర్ కమిషన్ బి) సార్జంట్ కమిటీ
   సి) ఎబాట్‌వుడ్ కమిటీ
   డి) హర్టాగ్ కమిటీ
   1) బి, డి, సి, ఎ 2) బి, డి, ఎ, సి
   3) డి, బి, సి, ఎ 4) బి, సి, డి, ఎ
9. కింది వాటిలో మెకాలే మినట్స్‌తో ఏకీభవించని భావన ఏది?
   1) భారతీయులు రక్తంలో, వర్ణంలో భారతీయులై, ఆలోచనలు, అభిరుచులు, అభిప్రాయాల్లో బ్రిటిషర్లుగా ఉండే విద్యను వారికి అందించాలి
   2) ఇండియా, అరేబియా, ఆసియా దేశాల సాహిత్యం మొత్తం ఇంగ్లిష్ గ్రంథాలయంలో ఒక సొరుగు పుస్తకాలతో కూడా సరితూగదు
   3) చౌక వేతనంతో గుమస్తాలను తయారు చేసేదిగా విద్య ఉండాలి
   4) ఏదీకాదు
10. జతపరచండి.
    జాబితా - I
    i) మెకాలే మినట్స్ ii) వుడ్స్ నివేదిక
    iii) హంటర్ కమిషన్
    iv) తొలి విశ్వవిద్యాలయ కమిషన్
    జాబితా - II
    a) డల్హౌసి b) లార్డ్ రిప్పన్
    c) లార్డ్ కర్జన్ d) విలియం బెంటింక్
    1) i-d, ii-a, iii-b, iv-c
    2) i-d, ii-a, iii-c, iv-b
    3) i-d, ii-b, iii-a, iv-c
    4) i-d, ii-c, iii-b, iv-a
11. కింది అంశాలకు సంబంధించిన సంవత్సరాలకు అనుగుణంగా ఆరోహణ క్రమంలో అమర్చండి.
    ఎ) బేసిక్ విద్యావిధానం
    బి) తొలి విశ్వవిద్యాలయ కమిషన్
    సి) ప్రాథమిక విద్యకు గోఖలే తీర్మానం
    డి) స్వదేశీ విద్యా ఉద్యమం ప్రారంభం
    1) ఎ, బి, సి, డి 2) డి, సి, బి, ఎ
    3) సి, డి, బి, ఎ 4) బి, డి, సి, ఎ
12. కేంద్రీయ విద్యా సలహా బోర్డ్‌ను ఎప్పుడు స్థాపించారు?
    1) 1921 2) 1917
    3) 1927 4) 1937
13. జతపరచండి.
    జాబితా - I
    i) శార్జర్ కమిషన్ ii) సార్జెంట్ కమిటీ
    iii) హర్టాగ్ కమిటీ
    iv) ఎబాట్‌వుడ్ కమిటీ
    జాబితా - II
    a) 1929 b) 1937
    c) 1917 d) 1944
    1) i-c, ii-d, iii-b, iv-a
    2) i-c, ii-d, iii-a, iv-b
    3) i-c, ii-b, iii-d, iv-a
    4) i-c, ii-a, iii-d, iv-b
14. జాకిర్ హుస్సేన్ కమిటీ దేనికి సంబంధించింది?
    1) వృథా, స్తబ్దతల నివారణ
    2) ప్రాతిపదిక విద్య 3) బాలికా విద్య
    4) వయోజన విద్య
15. కింది వాటిలో సరైన జత ఏది?
    i) భారతీయ విద్యా విధానానికి వుడ్స్ నివేదికను 'మాగ్నాకార్టా'గా అభిప్రాయ పడిన విద్యావేత్త - హెచ్.ఆర్. జేమ్స్
    ii) 6-10 సంవత్సరాల బాలబాలికలకు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను అందించాలని పేర్కొన్న వారు - గోఖలే
    iii) భారతదేశ ఆధునిక విద్యా పితామహుడు - చార్లెస్ గ్రాంట్
    iv) ఆంగ్ల విద్య మాత్రమే నవీన విజ్ఞానానికి తాళంచెవి లాంటిది అని భావించిన వారు - మెకాలే
    1) ఎ, బి మాత్రమే 2) బి, సి మాత్రమే
    3) ఎ, బి, సి, డి 4) ఏదీకాదు
16. కింది వాటిలో సరైన అంశం ఏది?
    ఎ) కలకత్తా విశ్వవిద్యాలయ సమస్యల పరిష్కారానికి నియమించింది - హర్టాగ్ కమిటీ
    బి) స్వయం పోషకంగా పాఠశాలల అభివృద్ధి చెందాలన్నదే ప్రాతిపదిక విద్య ప్రధాన ఉద్దేశం
    సి) వృథా, స్తబ్దతల నివారణకు నియమించింది - శార్జర్ కమిషన్
    డి) వయోజన విద్యా వ్యాప్తికి బ్రిటిషర్లు నియమించింది - ఎబాట్‌వుడ్ కమిటీ
    1) ఎ, బి మాత్రమే
    2) ఎ, బి, సి మాత్రమే
    3) సి మాత్రమే 4) బి మాత్రమే
17. జతపరచండి.
    జాబితా - I
    i) బేసిక్ విద్యావిధానం
    ii) గోఖలే విద్యాతీర్మానం
    iii) విశ్వవిద్యాలయాల చట్టం
    iv) జాతీయ విద్యావిధానం
    జాబితా - II
    a) 1913 b) 1904
    c) 1911 d) 1937
    1) i-d, ii-c, iii-b, iv-a
    2) i-d, ii-c, iii-a, iv-b
    3) i-d, ii-b, iii-c, iv-a
    4) i-d, ii-a, iii-b, iv-c
18. '6-14 సంవత్సరాల బాలబాలికలకు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను అందించాలి. దానిని 40 ఏళ్లలో అంటే 1984లోగా సాధించాలి' అని సూచించింది?
    1) హర్టాగ్ కమిటీ 2) శార్జర్ కమిషన్
    3) సార్జెంట్ ప్లాన్ 4) ఎబాట్‌వుడ్ కమిటీ
19. జతపరచండి.
    జాబితా - I
    i) సార్జెంట్ కమిటీ ii) ఎబాట్‌వుడ్ కమిటీ
    iii) హర్టాగ్ కమిటీ iv) శార్జర్ కమిషన్
    జాబితా - II
    a) ఉప కమిటీ
    b) వృత్తి విద్యా కమిటీ
    c) యుద్ధానంతర విద్యా పథకం
    d) విశ్వవిద్యాలయాల సంస్కరణలను సూచించింది
    1) i-c, ii-b, iii-d, iv-a
    2) i-c, ii-d, iii-b, iv-a
    3) i-c, ii-a, iii-d, iv-b
    4) i-c, ii-b, iii-a, iv-d
20. 'ప్రాక్-పశ్చిమ వివాదం' అంటే?
    1) పాశ్చాత్య విజ్ఞానానికి, భారతీయ విజ్ఞానానికి మధ్య వివాదం
    2) భారతీయ భాషలకు, ఇంగ్లిష్‌కు మధ్య వివాదం
    3) భారతీయ సంప్రదాయాలకు, యురోపియన్ సంప్రదాయానికి మధ్య వివాదం
    4) యురోపియన్ సంస్కృతికి, భారతీయ సంస్కృతికి మధ్య వివాదం
21. వివిధ అంశాలు, వాటి సంవత్సరాలకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
    ఎ) రాష్ట్ర విద్యా నిర్దేశక శాఖలు ఏర్పాటు- 1871
    బి) విశ్వవిద్యాలయాల్లో స్త్రీలకు ప్రవేశం- 1877
    సి) మద్రాస్, కలకత్తా, బొంబాయి విశ్వవిద్యాలయాల స్థాపన - 1857
    1) ఎ, బి మాత్రమే 2) బి, సి మాత్రమే
    3) ఎ, బి, సి 4) ఎ, సి మాత్రమే
22. కింది వాటిలో సార్జెంట్ కమిటీ సూచన కానిది ఏది?
    1) ఎంప్లాయిమెంట్ బ్యూరోను స్థాపించాలి
    2) విశ్వవిద్యాలయాల విరాళాల కమిటీని ఏర్పాటు చేయాలి
    3) 6-14 సంవత్సరాల బాలబాలికలకు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను అందించాలి
    4) ఇంటర్మీడియట్‌ను రెండు సంవత్సరాలుగా నిర్వహించాలి
23. కింది వాటిలో సరైన జత ఏది?
    ఎ) రాజా రామ్మోహన్‌రాయ్ హిందూ కాలేజ్‌ని స్థాపించారు - 1817
    బి) భారతీయుల విజ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి ఈస్టిండియా కంపెనీ ఏటా రూ. ఒక లక్ష కేటాయించాలని తీర్మానం - 1813
    సి) లార్డ్ హోర్డింగ్.. ఉద్యోగావకాశాలను కేవలం ఆంగ్ల భాషను అభ్యసించిన భారతీయులకు మాత్రమే ఇవ్వాలని ఆదేశించాడు - 1844
    1) ఎ, బి మాత్రమే 2) బి, సి మాత్రమే
    3) ఎ, బి, సి 4) ఎ, సి మాత్రమే
24. కింది వారిలో విద్యాసంస్థల్లో తటస్థ మత విధానాన్ని సమర్థించిన వారు?
    ఎ) మెకాలే బి) చార్లెస్ వుడ్స్,
    సి) హంటర్
    1) బి మాత్రమే 2) బి, సి మాత్రమే
    3) ఎ మాత్రమే 4) ఎ, బి, సి
25. కింది వాటిలో హంటర్ కమిషన్ సూచన ఏది?
    1) నిత్యజీవితానికి పనికి వచ్చే భౌతికశాస్త్రం, వ్యవసాయం, క్షేత్ర గణితం లాంటి అంశాలను ప్రాథమిక విద్యాప్రణాళికలో చేర్చాలి
    2) విద్యాలయాల్లో ప్రవేశానికి అన్ని వర్గాల నుంచి ఫీజు వసూలు చేయాలి
    3) ప్రాథమిక పాఠశాలల స్థాపన బాధ్యతను ప్రజలే చేపట్టాలి
    4) ప్రాథమిక విద్యావ్యాప్తిని విశ్వవిద్యాలయాలు చేపట్టాలి
26. 'నిరక్షరాస్యులు, అమాయకులు ఉన్న జాతి సంపూర్ణమైన అభివృద్ధి సాధించ లేదు, పోటీ పడలేదు' అని వ్యాఖ్యానించిన వారు?
    1) హెచ్.ఆర్. జేమ్స్ 2) గోఖలే
    3) హాలెండ్ 4) సార్జెంట్
27. 10 + 2 + 3 విద్యా నమూనాను మొదటిసారిగా సూచించింది?
    1) హర్టాగ్ కమిటీ 2) సార్జెంట్ కమిటీ
    3) ఎబాట్‌వుడ్ కమిటీ 4) శార్జర్ కమిషన్
28. కేంద్రీయ విద్యా సలహా బోర్డ్ పునరుద్ధరణను సూచించిన కమిటీ ఏది?
    1) హర్టాగ్ కమిటీ 2) సార్జెంట్ కమిటీ
    3) ఎబాట్‌వుడ్ కమిటీ
    4) జాకీర్ హుస్సేన్ కమిటీ
29. నిర్బంధ ప్రాథమిక విద్య సిద్ధాంతాన్ని ఆమోదించిన తొలి చట్టం ఏది?
    1) పటేల్ చట్టం - 1918
    2) భారత ప్రభుత్వ చట్టం - 1919
    3) భారత ప్రభుత్వ చట్టం - 1921
    4) భారత ప్రభుత్వ చట్టం - 1935
30. స్వదేశీ విద్యా ఉద్యమ కాలంలో మన దేశంలో ఏ విద్యా విధానాన్ని అమలు చేయాలనే అభిప్రాయం వ్యక్తమైంది?
    1) చైనీస్ విద్యావిధానం
    2) అమెరికన్ విద్యావిధానం
    3) జర్మన్ విద్యావిధానం
    4) జపనీస్ విద్యావిధానం

సమాధానాలు

1) 4	2) 3	3) 2	4) 3	5) 2
6) 1	7) 2	8) 4	9) 4	10) 1
11) 4	12) 1	13) 2	14) 2	15) 3
16) 4	17) 1	18) 3	19) 4	20) 1
21) 3	22) 4	23) 3	24) 4	25) 1
26) 2	27) 4	28) 1	29) 1	30) 4

ఎసిటైల్ సాలిసిలికామ్లం అని దేన్నంటారు?

ఔషధాల వాడకానికి సంబంధించి 'సొంత వైద్యం' చాలా ప్రమాదకరమైంది. తప్పనిసరిగా వైద్యుడి సిఫారసు మేరకే మందులు వాడాలి. అంతేకాకుండా వైద్యుడు సూచించిన మోతాదు కంటే అధిక పరిమాణంలో ఔషధాలను వాడితే అవి విషతుల్యమయ్యే ప్రమాదం ఉంటుంది. 'సైడ్ ఎఫెక్ట్'లు కనిష్ట స్థాయిలో ఉండేవిధంగా ఔషధాలను రూపొందిస్తారు.



ఔషధాలు (డ్రగ్స్)

మానవులు, జంతువుల్లో జీవక్రియలను ప్రభావితం చేసి, వ్యాధులను నయం చేయడానికి ఉపయోగించే రసాయన కారకాలనే ఔషధాలు అంటారు. సాధారణ పరిభాషలో వీటిని మందులుగానూ వ్యవహరిస్తారు. వ్యాధులను గుర్తించడానికి, నయం చేయడానికే కాకుండా నిరోధించడానికి ఉపయోగించేవాటిని కూడా ఔషధాలుగా పేర్కొంటారు. వ్యాధులు లేదా రోగాల చికిత్సకు రసాయన పదార్థాలను ఉపయోగించే ప్రక్రియను 'కెమోథెరపీ (Chemotherapy)' అంటారు.

జీవిలోకి ప్రవేశించిన ఔషధాలు జీవాణువులైన కార్బోహైడ్రేట్లు, లిపిడ్‌లు, ప్రోటీన్లు, న్యూక్లియిక్ ఆమ్లాల లాంటి వాటితో చర్య జరుపుతాయి. ఈ జీవాణువులనే లక్ష్య అణువులు (Target Molecules) అంటారు. ఔషధాలు వరణాత్మకంగా (Selective).. అంటే కేవలం ఆశించిన లక్ష్య అణువులతో మాత్రమే చర్యలో పాల్గొంటాయి. ఇతర లక్ష్య అణువులను ప్రభావితం చేయవు. ఇవి ఆశించిన ప్రదేశంలోనే పనిచేస్తాయి.

వివిధ రకాల ఔషధాలు

బాధా నివారిణులు (Analgesics): ఏ విధమైన ఇతర రకాల నరాల వ్యవస్థకు సంబంధించిన రుగ్మతలను కలిగించకుండా నొప్పిని లేదా బాధను మాత్రమే తగ్గించే ఔషధాలను ఎనాల్జెసిక్‌లు అంటారు. ఇవి రెండు రకాలు. అవి:

1. నాన్-నార్కోటిక్ ఎనాల్జెసిక్‌లు: దురలవాట్లకు (Addiction) లోను చేయని ఎనాల్జెసిక్‌లు. వీటినే నాన్-నార్కోటిక్ ఎనాల్జెసిక్‌లు అంటారు.
ఉదా: ఐబూప్రోఫెన్, ఆస్పిరిన్, పారాసెటమాల్.

- ఎనాల్జెసిక్‌లకు జ్వర తీవ్రతను తగ్గించే గుణం ఉండటం వల్ల యాంటీ పైరెటిక్‌లుగా కూడా పనిచేస్తాయి.
- ఆస్పిరిన్ (ఎసిటైల్ సాలిసిలికామ్లం) ప్రోస్టాగ్లాండిన్‌లు (కణజాలాల్లో వచ్చే మంటలు, తద్వారా వచ్చే నొప్పులకు కారణమైనవి) అనే రసాయన పదార్థాల ఉత్పత్తి వేగాన్ని తగ్గించి బాధా నివారిణిగా పనిచేస్తుంది. దీనికి రక్తాన్ని పలచన చేసే గుణం (Blood thinner) కూడా ఉంది. అందువల్ల ఆస్పిరిన్ రక్తం గడ్డకట్టకుండా చూసి, గుండెపోటు నివారణకు దోహదపడుతుంది.

2. నార్కోటిక్ ఎనాల్జెసిక్‌లు: ఓపియమ్ పాపీ (నల్లమందు) నుంచి గ్రహించే మార్ఫీన్ రకానికి చెందిన రసాయనాలు దురలవాట్లకు గురి చేసేవి (Addictive)గా ఉంటాయి. సాధారణంగా వీటిని శస్త్ర చికిత్సల అనంతరం కలిగే బాధలు, గుండెకు సంబంధించిన నొప్పి, కేన్సర్‌తో అవసాన దశలో ఉండే రోగికి కలిగే బాధలు, ప్రసవ సమయంలో నొప్పిని తగ్గించడానికి ఉపయోగిస్తారు. వీటిని ఔషధ మోతాదులో సేవిస్తే బాధను తగ్గించి, నిద్రను ప్రోత్సహిస్తాయి. అధిక మొత్తంలో సేవిస్తే మైకం, అపస్మారక స్థితి, మూర్ఛకు దారితీసి చివరికి మరణం కూడా సంభవించే ప్రమాదం ఉంటుది.

యాంటీ బయాటిక్‌లు: సూక్ష్మజీవుల పెరుగుదలను నిరోధించేవి లేదా వాటిని నాశనం చేసే వాటిని యాంటీబయాటిక్‌లు అంటారు.

ఎరిత్రోమైసిన్, టెట్రాసైక్లిన్, క్లోరాంఫెనికాల్ లాంటివి సూక్ష్మజీవుల పెరుగుదలను నిరోధిస్తాయి. పెన్సిలిన్, ఆఫ్లోక్సాసిన్ మొదలైనవి సూక్ష్మజీవులను నాశనం చేస్తాయి.

ఆమ్ల విరోధులు (Antacids): హైడ్రోక్లోరికామ్లం ఉదరంలో ఆహారం జీర్ణమవడానికి తోడ్పడుతుంది. ఒక వేళ జీర్ణకోశంలో ఈ ఆమ్లం అధికంగా ఉత్పత్తి చెందితే అది ప్రకోపానికి (Irritation) లేదా నొప్పికి దారితీస్తుంది. ఇంకా తీవ్రస్థాయిలో జరిగితే జీర్ణకోశంలో పుండ్లు (అల్సర్లు) ఏర్పడతాయి. రానిటిడిన్, ఒమిప్రజోల్, పెంటాప్రజోల్ లాంటివి ఈ ఆమ్ల ఉత్పత్తిని నియంత్రిస్తాయి. ఉత్పత్తి అయిన ఆమ్లాన్ని తటస్థీకరించేవి - సోడియం బై కార్బోనేట్ (బేకింగ్ సోడా), మెగ్నీషియం హైడ్రాక్సైడ్, అల్యూమినియం హైడ్రాక్సైడ్ మొదలైనవి.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
రసాయన శాస్త్రం

యాంటీ సెప్టిక్‌లు (చీము నిరోధులు): గాయాలు, కోతలు, అల్సర్‌లు అయినప్పుడు జీవ కణాలకు పూతగా పూసే పదార్థాలే యాంటీ సెప్టిక్‌లు. యాంటీ బయాటిక్‌ల మాదిరిగా వీటిని నోటితో మింగకూడదు.

ఉదా: అయోడిన్ టింక్చర్, స్పిరిట్ (ఇథైల్ ఆల్కహాల్), ఫినాల్ ద్రావణం, డెట్టాల్ (క్లోరోక్జైలినాల్, టెర్పినియోల్‌ల మిశ్రమం), బిథియోనాల్, క్లోరిన్ జలద్రావణం, అయొడోఫాం.

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో నాడీ సంబంధమైన వ్యాధికానిది?
   1) స్పృహ కోల్పోవడం
   2) మానసిక ఆందోళన
   3) పక్షవాతం
   4) జీర్ణకోశంలో పుండ్లు (అల్సర్లు)
2. జీర్ణకోశంలో పెప్సిన్, హైడ్రోక్లోరికామ్లాల ఉత్పత్తిని ప్రేరేపించే రసాయనం?
   1) హిస్టమీన్ 2) రెనిటిడీన్
   3) ఎడ్రినలిన్ 4) మార్ఫీన్
3. అధిక ఆమ్ల వ్యాధి (Acidity) చికిత్సకు ఉపయోగించే ఔషధం?
   1) సిమెటిడిన్ 2) రెనిటిడిన్
   3) ఓమిప్రజోల్ 4) పైవన్నీ
4. కిందివాటిలో ఆమ్ల విరోధిగా పనిచేసేది ఏది?
   1) సోడియం బైకార్బోనేట్
   2) అల్యూమినియం హైడ్రాక్సైడ్
   3) మెగ్నీషియం హైడ్రాక్సైడ్
   4) పైవన్నీ
5. చిన్న పిల్లలకు ఆమ్ల విరోధిగా ఉపయోగించే మిల్క్ ఆఫ్ మెగ్నీషియా అనేది?
   1) మెగ్నీషియం హైడ్రాక్సైడ్
   2) అల్యూమినియం హైడ్రాక్సైడ్
   3) రానిటిడీన్ 4) ఓమీప్రజోల్
6. కిందివాటిలో యాంటీ హిస్టమీన్ ఏది?
   1) వేలియం 2) పారాసిటమాల్
   3) బ్రోమ్‌ఫెనిరమీన్ 4) ఆస్పిరిన్
7. నిద్ర తెప్పించే (హిప్నాటిక్) ఔషధం?
   1) సెరటోనిన్ 2) వేలియం
   3) క్లోరోడయజీపాక్సైడ్ 4) పైవన్నీ
8. కిందివాటిలో నార్కోటిక్ నొప్పి నివారిణి ఏది?
   1) మార్ఫీన్ 2) ఆస్పిరిన్
   3) పారాసెటమాల్ 4) పైవన్నీ
9. కిందివాటిలో ఎనాల్జెసిక్ ఏది?
   1) పారాసెటమాల్ 2) ఆస్పిరిన్
   3) ఐబూప్రోఫెన్ 4) పైవన్నీ
10. రక్తాన్ని పలచన చేసే గుణం ఉన్న ఔషధం (Blood thinner) ఏది?
    1) పారాసెటమాల్ 2) ఆస్పిరిన్
    3) మార్ఫీన్ 4) కొడీన్
11. కెమోథెరపీ అంటే?
    1) కీళ్లు వాచేలా కొట్టడం
    2) ఔషధాలను ఉపయోగించి వ్యాధులు నయం చేయడం
    3) ఫిజియోథెరపీ
    4) యోగా ద్వారా వ్యాధులు నయం చేయడం
12. ఎసిటైల్ సాలిసిలికామ్లం అని దేన్నంటారు?
    1) ఆస్పిరిన్ 2) పారాసెటమాల్
    3) క్లోరోక్విన్ 4) పెన్సిలిన్
13. సింకోనా చెట్టు బెరడు నుంచి సంగ్రహించే ఔషధం?
    1) క్వినైన్ 2) మార్ఫీన్
    3) నికోటిన్ 4) కెఫీన్
14. కిందివాటిలో సరైన వాక్యం ఏది?
    1) పారాసెటమాల్ అధిక మోతాదులో వాడితే కాలేయం దెబ్బతింటుంది
    2) ఆస్పిరిన్ అధికంగా వాడితే అల్సర్‌లు ఏర్పడతాయి
    3) మిథైల్ సాలిసిలేట్ మూత్రవర్ధకంగా పనిచేస్తుంది
    4) పైవన్నీ సరైనవే
15. కిందివాటిలో బాధా నివారిణిగా పనిచేస్తూ జ్వరాన్ని తగ్గించే గుణం ఉన్న ఔషధం కానిది?
    1) పారాసెటమాల్ 2) ఆస్పిరిన్
    3) కెఫీన్ 4) మార్ఫీన్
16. ఎలర్జీని తగ్గించే గుణం ఉన్న ఔషధాలను ఏమంటారు?
    1) ఎనాల్జెసిక్‌లు 2) ట్రాంక్విలైజర్‌లు
    3) యాంటీ హిస్టమీన్‌లు
    4) యాంటీ బయాటిక్‌లు
17. హెరాయిన్ అనే మత్తుమందును దేన్ని ఎసిటైలేషన్ చేసి రూపొందిస్తారు?
    1) మార్ఫీన్ 2) కెఫీన్
    3) నికోటిన్ 4) సాలిసిలికామ్లం
18. కిందివాటిలో ఆల్కలాయిడ్ కుటుంబానికి చెందని డ్రగ్ ఏది?
    1) మార్ఫీన్ 2) ఆస్పిరిన్
    3) నికోటిన్ 4) కెఫీన్
19. కిందివాటిలో సరికాని జత?
    1) టీ - కెఫీన్
    2) పొగాకు - నికోటిన్
    3) సింకోనా - క్వినైన్
    4) పెన్సిలియం బూజు - క్లోరాంఫెనికాల్
20. కిందివాటిలో సరికాని జత?
    1) పెన్సిలిన్: యాంటీ బయాటిక్
    2) డెట్టాల్: యాంటీ సెప్టిక్
    3) వేలియం: ట్రాంక్విలైజర్
    4) క్లోరోక్విన్: ఎనాల్జెసిక్
21. క్షయ వ్యాధి నివారణకు ఉపయోగించే ఔషధం?
    1) టెట్రాసైక్లిన్ 2) పెన్సిలిన్
    3) క్లోరోక్విన్ 4) స్ట్రెప్టోమైసిన్
22. మలేరియా నివారణకు వాడే ఔషధం?
    1) క్లోరోక్విన్ 2) పెన్సిలిన్
    3) ఆస్పిరిన్ 4) వేలియం
23. మత్తు మందులకు అలవాటు పడిన వారు అవి దొరకకపోతే సేవించేది ఏది?
    1) డెట్టాల్ 2) పురుగులమందు
    3) దగ్గు మందు 4) ఎండ్రిన్
24. కిందివాటిలో గర్భ నిరోధక ఔషధం (యాంటీ ఫెర్టిలిటీ డ్రగ్) ఏది?
    ఎ. నారిథింద్రోన్
    బి. ఇథైనైల్ ఈస్ట్రాడయోల్
    సి. క్లోరామ్‌ఫెనికాల్
    1) ఎ, బి 2) బి, సి
    3) ఎ, సి 4) ఎ, బి, సి
25. కిందివాటిలో దోమల నియంత్రణకారి?
    1) డెట్టాల్ 2) పైరిథ్రిన్
    3) ఈథర్ 4) ఆలిటీమ్
26. కిందివాటిలో సరికాని జత ఏది?
    1) కనుపాప విస్ఫారణం: అట్రోపిన్
    2) స్థానిక మత్తు మందు: ఈథర్
    3) గుండె జబ్బు: నైట్రో గ్లిజరిన్
    4) మలేరియా: నికోటిన్
27. పెన్సిలిన్‌ను కనుగొన్న శాస్త్రవేత్త?
    1) అలెగ్జాండర్ ఫ్లెమింగ్
    2) ఖొరానా 3) సాల్వర్‌సన్
    4) సి.వి. రామన్

సమాధానాలు

1) 4; 2) 1; 3) 4; 4) 4;
5) 1; 6) 3; 7) 4; 8) 1;
9) 4; 10) 2; 11) 2; 12) 1;
13) 1; 14) 4; 15) 3; 16) 3;
17) 1; 18) 2; 19) 4; 20) 4;
21) 1; 22) 1; 23) 3; 24) 1;
25) 2; 26) 4; 27) 1.

Who is second to the left of A?



MODEL QUESTIONS


Following topics are some of the areas which are expected in the forthcoming SBI POs prelims examination.

1. SYLLOGISMS
2. SEATING ARRANGEMENT
3. PUZZLE TEST

Let us see some examples with solutions:

SYLLOGISMS


1. Statements:
All balls are round.
Some round are plates.
All plates are utensils.
Conclusions:
I. Some utensils being balls is a possibility.
II. Some plates being balls is a possibility.
Solution:




Both the possible conclusions follow as an alternate diagram can be drawn.

SHORT CUT: If all the given statements are affirmative (positive), then every positive possible conclusion is VALID on the given terms. Hence, both the conclusions follow.

2. Statements:
All fans are small.
All small are rats.
All rats are cows.
Conclusions:
I. Some cows are not small.
II. Some cows are not fans.
Solution:






As all the given statements are affirmative, there is a possibility of 'All cows are small' as well as "All cows are fans". Hence, both the conclusions do not follow.

SHORT CUT: If the given statements are positive then every negative definite conclusion is NOT VALID.

3. Statements:
No wall is roof.
All pens are walls.
All doors are roofs.
Conclusions:
I. No any door is wall.
II. No any roof is pen.
Solution:



'No any door is wall' means 'No door is wall'. Similarly, 'No any roof is pen' means 'No roof is pen'. Clearly, both the conclusions are valid as alternate diagram cannot be drawn.

SEATING ARRANGEMENT

A. Study the following information carefully and answer the questions:

A, B, C, D, E, F and G are sitting in straight line facing North.
B sits fourth to the left of A who is second to the left of C. D, who is not an immediate neighbor of A, sits to the immediate right of E. F sits second to the left of G.

4. Which of the following pairs sit at the extreme corners of the line?
   1) BC 2) EC 3) BG
   4) ED 5) None of these
5. How many persons sit between D and G?
   1) One 2) Two 3) Three
   4) None 5) None of these
6. Four of the following five are alike in a certain way based on their seating positions in the above arrangement and so form a group. Which is the one that does not belong to that group?
   1) BD 2) EF 3) AC
   4) AD 5) FG

Solution: While solving seating arrangement questions we have to first of all focus on the definite information given. Step wise explanation is given below.

Step1: B sits fourth to the left of A who is second to the left of C.
B _ _ _ A _ C

Step2: D is not an immediate neighbour of A and D sits to the immediate right of E.
B E D _ A _ C

Step3: Now, the process can be completed in the following way
B E D F A G C

Answers: 4) 1 5) 2 6) 4

Explanation: In every option first person is second to the left of second person where as in the fourth option, first person is second to the right of second person (A is second to the right of D)


BANK EXAMS
REASONING

B. Study the following information carefully and answer the following questions:

There are eight friends A, B, C, D, E, F, G and H are seated in a circle facing the centre but not necessarily in the same order.
D is as far away from A as C is away from E.
AC, DG, HE and FB are seated adjacent to each other. A is also seated adjacent to H. B is second to the right of H and E is third to the right of C.

7. Who is second to the left of A?
   1) B 2) E 3) G
   4) D 5) None of these
8. If B and G interchange their places, who sits to the immediate right of E?
   1) B 2) C 3) G
   4) D 5) None of these
9. If all the persons are made to sit in alphabetical order starting from A in clockwise manner, the positions of how many will remain unchanged, other than A, as compared to the original seating positions
   1) One 2) Two 3) Three
   4) Four 5) None of these

Solution:
Firstly, focus on the definite information.
1. B is second to the right of H.
2. A is adjacent to H as well as C.
3. E is third to the right of C.
As C is third to the left of E, D must be third to the left of A. So, the arrangement can be properly constructed in the following way.



Answers:
7) 3 8) 3 9) 2

Explanation: 'D' and 'H' positions remain unchanged

PUZZLE TEST

Study the following information carefully and answer the following questions:

A, B, C, D, E and F are six persons in an organization who are of different heights. Each one has different colour of pens - black, white, blue, green, red and yellow.

The tallest person does not like blue or white.

The youngest person does not like black or red.

'C' likes yellow and only one person is taller than him.

'A' likes white colour and is taller than E but shorter than F. B likes black and is shorter than A but taller than E. D likes blue and E likes red.

10. How many persons are taller than D?
    1) One 2) Two 3) Three
    4) Four 5) None of these
11. The tallest among them prefers the pen of
    1) Red colour 2) Green colour
    3) White colour
    4) Cannot be determined
    5) None of these
12. Who is taller than only the shortest?
    1) B 2) E 3) D
    4) A 5) None of these

Solution: Let us focus on the definite points first

1. Only one person is taller than C. So, C is 2nd tallest.
2. A is taller than E but shorter than F ® **F > A > E.**
3. B is shorter than A but taller than E. ® **A > B > E**
4. Considering 2 & 3
   ® **F > A > B > E**
5. By considering 1 & 4
   ® **F > C > A > B > E**

PERSON	COLOUR OF PEN	HEIGHT
A	WHITE	3rd tallest
B	BLACK	4th tallest
C	YELLOW	2nd tallest
D	BLUE	Shortest
E	RED	5th tallest
F	GREEN	Tallest

Order of heights:
F > C > A > B > E > D

Answers:
10) 5 (Total 5 persons are taller than D)
11) 2
12) 2 (Taller than only the shortest means 'the person who is 2nd shortest. i.e. E')

విద్య, ఉద్యోగ సమాచారం

యూపీఎస్సీలో 15 పోస్టులు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) గ్రూప్-బి, గెజిటెడ్, నాన్-మినిస్టీరియల్ కేటగిరీకి చెందిన నేషనల్ ఫైర్ సర్వీస్ కాలేజ్(మహారాష్ట్ర), యూనియన్ టెరిటరీ ఆఫ్ లడాఖ్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో లెక్చరర్(ఇంగ్లిష్, మ్యాథ్స్) పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 15.
- » **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ డైరెక్టర్-03, లెక్చరర్(ఇంగ్లిష్)-05, లెక్చరర్(మ్యాథమేటిక్స్)-07.
- » **అర్హత:** అసిస్టెంట్ డైరెక్టర్‌కు సైన్స్‌లో డిగ్రీ లేదా ఇంజనీరింగ్/టెక్నాలజీలో డిప్లొమా+స్టేషన్ ఆఫీసర్ అండ్ ఇన్‌స్ట్రక్టర్స్ కోర్సు+మూడేళ్ల అనుభవం లేదా ఫైర్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఫిజికల్ స్టాండర్డ్స్ తప్పనిసరిగా ఉండాలి. లెక్చరర్ పోస్టులకు ఎంఏ(ఇంగ్లిష్)+బీఎడ్, ఎంఎస్సీ(మ్యాథమేటిక్స్)+బీఎడ్ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** అసిస్టెంట్ డైరెక్టర్‌కు 30 ఏళ్లు, లెక్చరర్ పోస్టులకు 45 ఏళ్లు మించకూడదు.
- » **ఎంపిక విధానం:** రిక్రూట్‌మెంట్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.08.2025
- » **వెబ్‌సైట్:** https://upsc.gov.in

ఇస్రో-ఎల్‌పీఎస్‌సీ, తిరువనంతపురంలో 23 పోస్టులు

తిరువనంతపురంలోని ఇస్రోకి చెందిన లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్స్ సెంటర్(ఎల్‌పీఎస్‌సీ) వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 23.
- » **పోస్టుల వివరాలు:** టెక్నికల్ అసిస్టెంట్-12, సబ్ ఆఫీసర్-01, టెక్నీషియన్ బి-06, హెవీ వెహికల్ డ్రైవర్ ఏ-02, లైట్ వెహికల్ డ్రైవర్ ఏ-02.
- » **విభాగాలు:** మెకానికల్, ఎలక్ట్రానిక్స్, సబ్ ఆఫీసర్, ఫిట్టర్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ మెకానిక్, హెవీ వెహికల్ డ్రైవర్.
- » **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగాల్లో ఐటీఐ, డిప్లొమా(మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్) డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. **వయసు:** 18 ఏళ్లు నిండి ఉండాలి.
- » **వేతనం:** నెలకు టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.44,900 నుంచి రూ.1,42,400, సబ్ ఆఫీసర్‌కు రూ.35,400 నుంచి రూ.1,12,400, టెక్నీషియన్‌కు రూ.21,700 నుంచి రూ.69,100, హెవీ వెహికల్ డ్రైవర్‌కు రూ.19,900 నుంచి రూ.63,200.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 26.08.2025
- » **వెబ్‌సైట్:** www.isro.gov.in